శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక

క్రోధి
మార్గశిర -
ఫాల్గుణములు

సంపుటము ౫౩
సంచికలు ౪-౬



Journal of the Telugu Academy
KAKINADA

Vol. 53 Part 4-6

ఆంధ్ర సాహిత్య పరిషత్తు

వ్యవస్థాపకులు :

శ్రీ జయంతి రామయ్యగారు

ప్రతిష్ఠాపకులు :

శ్రీ శ్రీ శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యరావు బహద్దరువారు సి. బి. ఇ., డి. లిట్, పిఠాపురము మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజావారు

శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజావారు

ఉద్ధారకులు :

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు, జమీందారు, ఉయ్యూరు ఎస్టేటు

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

సంపుటము 58. క్రోధి మార్గశిర-ఫాల్గుణములు సంచిక 4-6.

సంపాదకుఁడు : శ్రీ కుందూరి ఈశ్వరదత్తు.

విషయసూచిక.

మా నూతన రచయితలు.

శ్రీ ముదిగొండ వీరభద్రశాస్త్రి: వీరు M. A. Phd. పట్టభద్రులు. హైదరాబాదు నగరములోని వివేకవర్ధనీ కళాశాలలో నాంధ్రశాఖాధ్యక్షులు. పానుగంటివారి రచనలనుగూర్చి పరిశోధన గావించి, Phd. పట్టమునొందిరి.

శ్రీమతి వేదుల మీనాక్షీదేవి :- ఈ విదుషి శ్రీ వేదుల రామచంద్రకీర్తిగారి గృహిణి. ఉభయ పండితవంశకులకాంత.

శ్రీ జటావల్లభుల పురుషోత్తము :- వీరు M.A. పట్టభద్రులు. వీరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠమున కధ్యక్షులుగా నుండిరి. ప్రాచీన హైందవమత, ధర్మ, విజ్ఞానవిషయములఁగూర్చి కూలంకషముగా పరిశోధనను గావించినవారు. 'హైందవమతము', 'భగవద్గీతాసారము', 'భారతీయవైభవము' మొదలగు గ్రంథములను రచించిరి. ఇప్పుడు పిఠాపుర కళాశాలలో సంస్కృతభాషోపన్యాసకులుగా నున్నారు.

శ్రీ ఓలేటి సుబ్బరాయశాస్త్రి :- వీరు B. A. సాహిత్యప్రవీణ, ఉభయభాషాప్రవీణ పట్టభద్రులు. స్థానిక రమణోదయ సెకండరీ ట్రయినింగు పాఠశాలలో ఆంధ్రోపాధ్యాయులు. మా కార్యవర్గ సభ్యులు.

శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి :- వీరు సూర్యారాయాంధ్రనిఘంటు నిర్మాణ పండితవర్గములో నొకరు. 'శంకరవిజయా'ది గ్రంథకర్తలు. సూరన ప్రభావతీప్రద్యుమ్న కావ్యమునకు వ్యాఖ్యానము రచించి వెలయించిన ఆంధ్రభాషావేత్త. ఇప్పుడు మోడేకుర్రు సంస్కృతపాఠశాలలో నధ్యాపకులుగా నున్నారు.

ఆంధ్రత్వ మాంధ్రభాషా చ
ప్రాభాకర పరిశ్రమః
తత్రాపి యాజుషీ శాఖా
నాల్పస్య తపసః ఫలమ్.

అప్పయ్యదీక్షితులు.



కీ॥ శే॥ పానుగంటి లక్ష్మీనరసింహరావుగారు

1865–1940.

సంపాదకీయము

స్మృతులు–స్తుతులు

క్రోధి సంవత్సర మాంధ్రసాహిత్యపరిషత్తు చరిత్రలో నొక చరితార్థ వత్సరము ఆంధ్రసాహిత్య పరిషద్వార్షిక సభాధ్యక్షులును, దివంగతులు, నైన యిరువురకు ప్రభుత్వము వారి సహాయమున శత జయంత్యుత్సవములు జరుపఁబడినవి. ఆంధ్రసాహిత్య పరిషద్వార్షిక సభాధ్యక్షులును,సంస్కృత సాహిత్యసముద్ర సాంయాత్రికులును, ఆంధ్ర ప్రదేశాస్థాన కవులు నైన యొక పండితసింహునకు ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారు 'కళాప్రపూర్ణ' బిరుదమునొసఁగిరి.

శ్రీ ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మగారు

శ్రీ ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మగారు క్రీ॥ శ. 1924 నందు తణుకు గ్రామములో జరిగిన ఆంధ్రసాహిత్య పరిషత్త్రయోదశ వార్షిక సభకధ్యక్షులు వీరి శతజయంత్యుత్సవము 19-10-64 దినమున, ప్రభుత్వము వారి యాధ్వర్యవమున నిర్వహింపఁబడినది. వీరు రక్తాక్షినామ సంవత్సరాశ్వయుజబహుళ పంచమీ బుధవారమనఁగా క్రీ. శ. 19-10-1864 దినమున జన్మించిరి. వీరార్వేల నియోగిశాఖా బ్రాహ్మణులు. ఆపస్తంబ సూత్రులు. సాంఖ్యాయన గోత్రులు నరసమాంబా బాపిరాజుల తనూజులు. విశాఖమండలమున పార్వతీపురము వీరి కాణాచి.

వీరు బాల్యమునుండియు నఖండప్రతిభా సంపన్నులై, సంస్కృతాంధ్రాంగ్ల భాషలలోఁ బాండిత్యమును స్వయంకృషిచే సంపాదించి, కవిత్వమును జెప్పనారంభించిరి. శతఘంటకవనమును జెప్ప నేర్చిన వారిలో వీరొకరు.

పద్యకావ్యగ్రంథరచన

వీరు 'సుధానిధి' యను పద్యకావ్యమును రచించిరి.

'ఆంధ్రపద్యావళి' యను పేర తమ ఖండరచనలనొక సంపుట

ముగా ప్రచురించిరి. ఈఖండకావ్యసంపుటియే నేఁటి నవ్యకవిత్వయుగ ప్రారంభ మహోత్సవమునకు వైజయంతి

నాటకరచన-నాటక కళోద్ధరణము

వీరు విక్రమోర్వశీయము, ఉత్తరరామచరిత్రము (వచనము) ఆంధ్రీకరించిరి. పాదుకాపట్టాభిషేకమను...

వీరు విక్రమోర్వశీయము, ఉత్తరరామచరిత్రము (వచనము) ఆంధ్రీకరించిరి. పార్థపరాజయమను స్వతంత్రనాటకమును వ్రాసిరి. మనోరమయను సాంఘికనాటకమును వ్రాసి దానిని ప్రదర్శింపఁజేసిరి. వీరు క్రీ॥ శ. 1929 సంవత్సరములోఁ దెనాలియందు జరిపిన ప్రథమాంధ్రనాటకకళా పరిషత్తున కధ్యక్షులై యమూల్యమైన యుపన్యాసమును గావించిరి. వీరు రచించిన 'నాటకసర్వస్వము' నాటకరచనను గూర్చిన యుద్గ్రంథము. అముద్రితము.

పత్రికాసంపాదకత్వము

వీరు పదునేడేండ్ల ప్రాయముననే క్రీ॥ శ. (1881 సం॥లో) సుజనప్రమోదిని' యను మాసపత్రికకు సంపాదకులై రెండేండ్లు నడిపిరి. తర్వాత క్రీ॥ శ. 1903 లో కల్పలత యను విజ్ఞాన విషయిక మాసపత్రిక నెలకొల్పి మఱి రెండేండ్లునడిపిరి. ఆ పత్రికనే మరల క్రీ॥ శ. 1919 లో పునరుద్ధరించి, కొంతకాలము కొనసాగించిరి. ఈ పత్రికయంతయుఁ బంతులుగారి స్వీయరచనలలో నొప్పారెడి.

విజ్ఞానవేత్త

వీరు పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రములగు పదార్థ విజ్ఞాన రసాయన శాస్త్రములు, భూవృక్ష ఖనిజ కీటక తత్త్వములు, ప్రాచీనాధునాతన హైందవరాజ్యాంగ విశేషములు పఠించి తమ పత్రికాముఖమున వెల్వరించిన మహనీయులు. వీరు రచించిన 'రహస్యదర్పణము" వీరి వైజ్ఞానిక పాండితికి దర్పణము.

సభాధ్యక్షత-మహోపధ్యాయ బిరుదాంకితము

వీరు క్రీ॥ శ. 1923 లో గుంటూరు మండలము నందలి సం

దూరు గ్రామమున జరిగిన యాఱవ యాంధ్రసారస్వత మహాసభ కధ్యక్షులు. ఈ సభయందే వీరికి మహోపధ్యాయ బిరుదము సంగ్రహింపబడెను. క్రీ॥ శ. 1924 లో తణుకు గ్రామములో సమావేశమైన ఆంధ్రసాహిత్యపరిషత్త్రయోదశ వార్షిక మహాసభకు వీరు సభాపతులు. క్రీ॥ శ. 1924. లో తెనాలియందు జరిగిన ప్రథమాంధ్రనాటక కళాపరిషత్సభ కాధిపత్యము వహించిరి. నిడుదవోలులో జరిగిన నియోగి మహాజన సభాధ్యక్షత నెలయించిరి. విజయనగర కవిమండలి పంచమ వార్షికోత్సవమునకు సభాపతులైరి.

మహావక్త

సమయస్ఫురణము, సరసము, సభారంజకత్వము, సంప్రదాయ విజ్ఞానము మేళవించి, మహోపన్యాసములు గావించిన మహావక్తలలో శర్మగారొకరు. వీరిది పండితపామరజనైక రంజకమును, హాస్యరస భరితమునైన వక్తృత్వము.

ఈ మహనీయుఁడు క్రీ॥ శ. 3-8-1933. దినమున దివంగతులైరి.

(శ్రీ) పానుగంటి లక్ష్మీనరసింహరావుగారు

శ్రీ నరసింహరావుగారు రక్తాక్షినామ సంవత్సర మాఘ బహుళ పాడ్యమి శనివారము మధ్యాహ్నము పండ్రెండు గంటలకు రాజమహేంద్రవరము తాలూకా సీతానగర గ్రామము నందు జన్మించిరి. తండ్రి రమణయ్యపంతులు; తల్లి రత్నమాంబ వీరి జన్మకాలమున జాతకకుండలి యిట్లుండెను. జ్యోతిషశాస్త్ర విదులకును కవి జీవితకారులకు నుపయోగము కాఁగలదని, రాశి, అంశ చక్రము లిందు చూపఁబడినవి.

శు	ల కే	కు	
ర / బు	రాశి		
			చం
గు		శ రా	

బు		చం గు	కు
శ / రా	అంశ		కే
	శు	ర	

మఖానక్షత్రము-ద్వితీయపాదము. కేతు మహాదశా శేషము-మూఁడు సంవత్సరములు. ఈ జాతకమునందలి కొన్ని యోగములు గమనింపనగును.

(1) పంచమస్థానములోఁ బూర్ణచంద్రుఁడుండి, గురుదృష్టి కలుగుట చేతను, అంశలో నుచ్ఛస్థితినొంది గురుసంబంధము కలిగి, శుక్రదృష్టి యుండుటవలన మహామేధావియై, సంతానబాహుళ్యము కలిగియుండెను. వీరి కైదుగురు కుమారులు ఇద్దఱు కుమార్తెలు.

2. చతుర్థ స్థానాధిపతియైన చంద్రుఁడు పంచమందుండుట చేత, చతుర్థస్థానమును శని, బుధులు చూచుట వలన నాంధ్ర సంస్కృత భాషలలోఁ బండితుఁడై, ఆంగ్లభాషలోఁ బట్టభద్రుఁడౌటయు సంభవించెను.

3. రాజ్యలాభాధిపతియై యుచ్ఛస్థితి నొందిన శనితో రాహువు కలిసి యుండుటచేత, రాహు మహాదశలో నఖండయోగము ప్రాప్తమయ్యెను. అనఁగా వీరి జీవితములో క్రీ॥ శ. 1911 మొదలు క్రీ॥ శ. 1930 వఱకు నిరువది యేండ్లు ప్రబల యోగకాలము.

4. భాగ్య, వ్యయాధిపతియైన గురుఁడు భాగ్యస్థానమునందు రాశిలో స్వస్థానమునందుండినను భావములో సప్తమమునందె యుండుట చేతను, గురుమహాదశలోఁ గ్రమక్రమముగా యోగము క్షీణించి ధనసప్తమాధిపతి, ఉభయమారక స్థానాధిపతి, యైన శుక్రునకు

వ్యయస్థితి కలుగుటచే, గురుమహాదశ శుక్రాంతరములోనే మారకము సంభవించెను. కష్టనష్టములకుఁ బాలయ్యెను.

౫. శుభులకు పాపసంబంధము, పాపులకు శుభసంబంధము లేక, రవికిరుపార్శ్వముల శుభులుండి, ఉభయచరీ యోగము పట్టుట చేతను, రాజ్యమందు బుధుఁడుండుట చేతను, కీర్తి సాంద్రుఁడాయెను.

6. లగ్నధనసప్తమములలోఁ బాపులుండి ధనాధిపతికి వ్యయస్థితి, కలుగుట చేత నిర్ధనుఁడు.

శ్లో॥ గజ భుజంగ విహంగమ బంధనం
శశి దివాకర యోర్గ్రహ పీడనం
మతిమతాం చ విలోక్య దరిద్రతాం
విధిరహో! బలవా నితి మే మతిః

అనుసూక్తికి లక్ష్మీనరసింహారావు గారొక దృష్టాంతము. మహదాశ్రయము లభించినను, మనోవాక్కాయకర్మల కనుగుణముగు జీవితమును గడిపి, ఆత్మవంచన యెఱుఁగక, ఆత్మగౌరవమే ప్రధానముగ నెంచి, దృష్టాంతయోగ్యమగు నడవడియే యొరవడిగాఁ గడిపిన ధన్యజీవి శ్రీ లక్ష్మీనరసింహారావు గారు.

శ్రీ లక్ష్మీనరసింహారావుగారు వ్రాసిన నాటకములు

(1) నర్మదాపురుకుత్సీయము (2) సారంగధర (3) ప్రచండచాణక్యము (4) రాధాకృష్ణ (5) పట్టభంగరాఘవము (6) కోకిల (7) విజయరాఘవము (8) వనవాసరాఘవము (9) విప్రనారాయణ (10) బుద్ధబోధసుధ (11) వృద్ధవివాహము (12) కల్యాణరాఘవము (13) కంఠాభరణము (14) ముద్రిక (15) పూర్ణిమ (16) సరస్వతి (17) వీరమతి (18) చూడామణి (19) పద్మిని (20) మాలతీమాల (21) గుణవతి (22) మణిమాల (23) సరో

జని (24) కాత్యాయని (25) జాతిస్తంభము (26) విచిత్రవివాహము (27) రామరాజు (28) పరపేరిమ (29) చిన్న నాటకము (30) మనోమహిమము.

పంతులుగారి వచన గ్రంథములు

శ్రీ లక్ష్మీనరసింహారావుగారు బహునాటక గ్రంథకర్తలని యే ఆంధ్రలోకము మెఱుఁగును. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ప్రకటించిన ఆంధ్రవాఙ్మయ సూచిక యను గ్రంథమునందలి 297 పుటలో లక్ష్మీనరసింహారావుగారు రచించిన కొన్ని వచన గ్రంథములు పేర్కొనఁబడి ముద్రితమైన వత్సరము లొసఁగబడినవి. వాని నిందుదాహరించుచున్నాము.

(1) పతకము (1913)
(2) మంజువాణి 1913)
(3) జగన్నాథమూర్తి (1915)
(4) మోసము (1913)
(5) జలజ (1913)
(6) దొంగ పెలిగ్రాము (1913)
(7) దుష్టప్రతాని (1914)
(8) ఆనందసాధు (1913)
(9) దుర్న్యయాధికారి
(10) తురాపాలెము (1913)
(11) విచిత్రసమావేశము (1913)
(12) విచిత్రమరణము
(13) బుడబుడక్కలవాడు (1913)
(14) కొత్తరాణి (1913)

ఆంధ్రసారస్వత పరిశోధకులీ గ్రంథములను సేకరించి, కవిగారి వచనరచనా పరిణామమును గూర్చి కృషిసలుపవలసియున్నది. నేటి వఱకు లక్ష్మీనరసింహారావుగారి రచనల గూర్చి వ్రాసిన వ్యాసకర్తలు వారి నాటక రచనా విధానమును గూర్చియే పరిశోధించినట్లు తోఁచుచున్నది. ఈ గ్రంథములు మదరాసునందలి లిఖితపుస్తక స్థానాధికారి (Registrar of Books) నివేశనమునందు లభ్యము కాఁగలవు. ఈ విషయము పరిశీలనార్హము. చిరకాలము క్రిందట ముద్రింపఁబడిన గ్రంథము లొటనే సులభముగ లభ్యముకావు. అట్టి గ్రంథ

ములు సేకరించి, వాని వివరములు ప్రకటించినఁ గాని కవి గ్రంథనిబంధన వృత్తాంతము పూర్తి కాదు. ఇప్పటికే కాలాతీతమైనది. పై గ్రంథములె కాక అముద్రితములు సహితము లభింపవచ్చును. పీఠాపుర వాసులు పై విషయములందు శ్రద్ధవహించి, కవిగారి జీవిత చరిత్రము నందు నూతనాధ్యాయమును గూర్పవలసియున్నది.

కళాప్రపూర్ణ బిరుదాంకితులు

శ్రీ కాశీకృష్ణమాచార్యులుగారు

ఈ సంవత్సరమున జరిగిన ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారి పట్టప్రదాన వార్షికోత్సవమున, శ్రీముఖ సంవత్సరమున అమలాపురములో జరిగిన ఆంధ్రసాహిత్యపరిషద్వార్షిక సభాధ్యక్షులును, అవధానిశిరోమణియు నిప్పటి ఆంధ్రప్రదేశాస్థాన కవులు నైన శ్రీ కాశీకృష్ణమాచార్యులుగారికి, విశ్వకళాపరిషత్తువారు 'కళాప్రపూర్ణ' బిరుదము నొసఁగిరి. వారికి మా యభినందనములు.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు

కవిసామ్రాట్టు బిరుదాంకితులును, ఆంధ్ర మహాకవులు, శతాధిక గ్రంథకర్తలు నైన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి విశ్వకళాపరిషత్తువారు 'కళాప్రపూర్ణ' బిరుదమా సమయముననే యొసంగిరి. వారికిని మా ధన్యవాదములు.

భారత ప్రభుత్వము వారి వార్షిక

ద్రవ్య ప్రదానము

శ్రీ గుఱ్ఱము జాషువా కవి

ప్రతి సంవత్సరము భారతదేశ భాషలలో నొక్కొక్క భాషలో రచింపఁబడిన యుత్తమగ్రంథ రచన కొసంగఁబడు అయిదువేల రూపాయిల బహుమానము, ఈ సంవత్సరము ప్రఖ్యాతాంధ్రకవులగు శ్రీ గుఱ్ఱము జాషువా కవిగారు, వ్రాసిన 'క్రైస్తవ జీవిత' గ్రంథ

ముత్తమముగా గణించి యీ బహుమానము వారికొసంగఁబడినది. వారికి మా శ్లాఘ్య సందేశములు.

కృతజ్ఞత

శ్రీ లక్ష్మీనరసింహారావుగారి సంగ్రహ జీవితము, ప్రతికృతి నిచ్చిన వారి కుమారులలో నొకరగు శ్రీ రమణారావుగారికి మా కృతజ్ఞత.

పత్రికా పరిచరణము - విలంబనము

క్రోధి సంవత్సర మార్గశిర, పుష్య; మాఘ, ఫాల్గుణ; సంచికల రెంటిని కలిపి, శ్రీ పానుగంటి వారిని గూర్చి స్మారక సంచికగ ప్రకటించుటకుఁ బరిషత్తువారు తీర్మానించుట చేత, వ్యాసములు సేకరించుట యందును, పత్రికా ముద్రణమునందు ననివార్యమైన ఆలస్యమైనది. విశ్వావసు సంవత్సర చైత్ర వైశాఖమాస జ్యేష్ఠాషాఢ సంచికలు త్వరలో వెలువడనున్నవి. ముద్రిత పత్రము లామూలాగ్ర ముగఁ బరిశీలించుట కెంతె శ్రమించినను, దోషములటనట దొరలక మానలేదు. పాఠకుల క్షమకయి వేడికోలు.

—•—

ఆంధ్రసాహిత్య పరిషద్భవనమున జరిగిన
కీ. శే. పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారి
శతవార్షిక జయంతి మహోత్సవము.

— :: —

ఆంధ్రసాహిత్య పరిషత్కార్యనిర్వాహక వర్గమువారు 11-2-65 తేదిని సమావేశమై ఆంధ్రసాహిత్యపరిషదభ్యుదయమున కమూల్యమైన సహాయొనర్చిన శ్రీ పంతులుగారి శతవార్షిక జయంతిని ప్రథల సుందరరామభవనము - ఆంధ్రసాహిత్యపరిషత్కార్యాలయమున జరుపుటకు నిశ్చయముచేసిరి. కాకినాడపురమునందున్న భాషాభిమానులను, పీఠికాపుర వాస్తవ్యులై శ్రీ పానుగంటివారితోఁ బరిచయముగల పెద్దలను, సమకాలికులను, పంతులుగారి కుమారుని, కూతురు కోడలు మనుమలు మనుమరాండ్రు మున్నగు వారిబంధువుల నందరిను ఆహ్వానించి, 16-2-65 న తేదిని; అనఁగా శ్రీ క్రోధినామ మాఘ బహుళ ప్రతిపత్తిథి మంగళవారము సాయంకాలము 5 గంటలకు పరిషద్భవనములో శ్రీ పంతులుగారి శతవార్షిక జయంతిమహోత్సవము జరిగించినారు.

శ్రీ జటావల్లభుల పురుషోత్తము ఎమ్. ఏ. గారు అధ్యక్షపీఠము నందుండి సభను జయప్రదముగ నిర్వహించినారు. వారు తమ యుపన్యాసములో శ్రీ పంతులుగారి సాహిత్యసేవ నిట్లు గణించినారు. తెలుఁగు సాహిత్యమునకుం గల కొరఁతను లోపములను పంతులుగారు తీర్చినారు. తెలుఁగులో నత్యుత్తమమైన గద్యరచన లేదను నపవాదమును వీరు ప్రతిష్ఠితమైన గద్యరచనచేఁ బాఱద్రోలినారు. మఱియు నాంధ్రసాహిత్యములో నల్పాల్పముగానుండిన హాస్యరస నిర్వహణము నకు వారు నిరుపమమైన యభివృద్ధిని సాధించినారు. వా రాంగ్ల సాహిత్య కోవిదులైనందులకు గద్యలో నారితేరిన యాంగ్లరచయితల పోకడల ననుకరణదోషము పట్టకుండునట్లుగనే తన ప్రతిభావిశేషముచే నాంధ్రసాహిత్యములో వెలయఁజేసిరి. ప్రాచీన నవీన సంప్రదాయముల

విమర్శనములో వారు గావించిన కౌశలము సమన్వయము చాల విశిష్టములైనవి. కాలములుగా వృత్తవ్య శ్రేణికిఁ జెందిన యథార్థసిద్ధ గవేషణలు ఎవ్వరికిని వారికి శ్రీపంతులవారు గారు. అట్టివారికి శతవార్షిక జయంత్యుత్సవము జరుపుట సారస్వతుల కెల్లరకు మోదావహము.

గ్రాంథిక గ్రాంథిభాషాసముద్ధారమునకై నెలకొల్పఁబడిన యీ పరిషత్పక్షమున జరుగఁబడు నీ శతవార్షిక జయంతి సభలో, శ్రీ పంతులుగారితోపాటు పీఠికాపుర వాస్తవ్యులై వారితో విశేష పరిచయము గలవారు, వారి ఉద్యమములకుఁ జెందినవారు నివటి యువ న్యాసములలోఁ బ్రాజ్ఞులు, వారికి జోడుగానున్నట్లుండుట భావ్యమని పరిషత్కార్యనిర్వాహకవర్గము వారు భావించఁగా వటులనే కోరిరివారు ప్రధాన వక్తలుగా పంతులుగారి విశిష్టతను గూర్చి ప్రసంగించి యున్నారు.

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యాలయము పీఠాపురములో నిఘంటు కార్యమును సాగించునపుడు ఆ కార్యనిర్మాణమునఁ బ్రాజ్ఞులును శ్రీ పంతులుగారితో విశేషపరిచితిగల బ్రహ్మశ్రీ పంచరాల సూర్యనారాయణశాస్త్రిగారు పంతులుగారి సర్వతోముఖ పాండిత్యమునుగూర్చి ముచ్చటించుచు, విస్తారమైన యుదాహరణములతో వారి సాహిత్యవ్యాసంగత్వమును, అందలి ప్రయోజనములను, ఆ కాలపు సాంఘిక వాతావరణమును దాసిని సంస్కరించఁబూనిన విధానమునుగూర్చి వివరించుచు సభ్యులనందఱ నానందపరవశులను జేసినారు. మఱియుఁ బంతులుగారు సాక్షీ భూతులగు శ్రీ కాలాచార్యులు మున్నగు పాత్రల ద్వారమున చేతిపుగ విమర్శించిరో యా విషయమును వివరించిరి. ఆంధ్రభాషాపరిణామావశ్యకత జేసియు సంస్కృతాదుల పరిరక్షణము మున్నగు విషయములను వారు ప్రస్తావించిన విధమును వారి మాటలతో వివరించినారు. పంతులుగారి గ్రంథములన్నియు

మనలను దలఁచినప్పుడనే వారియెడల మనము చూపించెడి గౌరవము శోభగునని నాను. పానుగంటివారి సాహిత్యోపన్యాసములలో నేదేని యొకటి-వ్యాసము పాఠ్యగ్రంథములలోఁ జేర్పఁబడియుండునట్లు చూచుట యుక్తమని తెలిపిరి.

శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారుఁ కూడ నరసింహము పానుగంటి లక్ష్మీనరసింహారావుల స్నేహమును గూర్చియుఁ సాహిత్యోపన్యాసములలోని హాస్యఘట్టములలోఁ గొన్ని యేయే సమయములలో నెవ్వరి నుద్దేశించి కూర్పఁబడినవో తెలిపిరి. దురాచారములను హాస్యరసావలంబనమున ఖండించుటలో పంతులుగారు నిర్భయముగా నెట్టివారినైన నెగతాళి చేసినారనిరి. ఆంగ్లభాషలోనుండిన అంతఃపురోపన్యాసములు (curtain lectures) ఆంధ్రభాషలో ముందుగఁ బ్రవేశపెట్టినవారు పంతులుగారే యనియుఁ పానుగంటివారు జీవించియున్నరోజులలో వారిస్థాయికి సరిపడినట్లు గుర్తించుట జరుగలేదనియుఁ వారు గడించిన పాఠకవేంగ్లకయున నాంధ్రలోకము కన్నులు తెఱచుట ముదావహమనియు వివరించిరి.

పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి కుమారుఁడు శ్రీ వెంకటరమణారావుగారు ప్రసంగించుచు తన తండ్రిగారు మూఁడు సంస్థానములలో-ఉర్లాము ఆనెగొంది లక్ష్మీనరసాపురములలో- దివానుగాఁ బనిచేసి అటు ప్రభువులనుండి యిటు ప్రజలనుండి గౌరవాభిమానములు చూఱఁగొన్నను స్వార్థరహితస్వభావముచేఁ దమ కుటుంబము వారి యార్థికోన్నతి కెప్పుడును బ్రయత్నింపలేదనిరి. వారు రామభక్తాగ్రేసరులనియుఁ దీనికి వారు రచించిన రామాయణనాటకములే సాక్షులనిరి. రామభక్తులెవ్వరికి నైహికసంపదలు సమకూడ లేదనియు రామదాసువలెనే పంతులుగారును జరమావస్థలో నార్థికమైన యిబ్బందులకు లోనయినవారనియుఁ దెలిపిరి. పంతులుగారికిఁ దామ

తనయులై జన్మించినను వారి పాండిత్య మబ్బలేదనుచు వారి శైలిలోనే కొంతవఱకు తమ యుపన్యాసమును సాగించిరి.

శ్రీ వేదము రామచంద్రకీర్తి గారు వారి సతీమణి మీనాక్షమ్మ గారు వీరిరువురును పానుగంటివారితో పరిచయముగలవారే. కీర్తి గారు పంతులుగారి శిష్యులు. వారు రచించిన నాటకములలో పాత్రధారణము గావించినవారు. వీరు పంతులుగారు పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రములందలి విషయములను తమ యుపన్యాసములం దెట్లు వివిదము చేసిరో తెలుపుచు వారికిగల యాంగ్లభాషాపాండిత్యమును గూర్చి వివరించినారు. శ్రీమతి మీనాక్షీదేవిగారును, వారు రచించిన నాటకములలోని పాత్రలను ధరించి వానిని వర్ణించి యున్నారు. ఈమె పంతులుగారి రచనలలో, Grate victorians లోని ప్రధాన లక్షణములైన సర్వజ్ఞత సమర్థత భాషాపాటవము మొదలగు సత్తమ లక్షణములు గలవని సోదాహరణముగ వివరించియున్నారు. మఱియు షేక్స్పియర్ నాటకములవలె పానుగంటివారి నాటకములన్నియు నొక్క సంపుటములో లభించునట్లు చేయుటకై, సాహిత్య పరిషత్తు వంటి సంస్థలు పూనుకొనుట భాగ్యమని తెలిపినారు.

పంతులుగారి కుమార్తె శ్రీమతి రమణమ్మగారు తమ తండ్రిగారి, సాహిత్యోపన్యాసములలోని వైవిధ్యమును గూర్చియు, సంఘసంస్కరణాభిలాషమును గూర్చియు, వారి రామభక్తిని గూర్చియు, పంతులుగారిని దలంచి చెప్పి శైలిలో ముచ్చటించి, గ్రాంథిక భాషోద్ధారకుని పేర జయంత్యుత్సవమును, గ్రాంథిక భాషాసంస్థయయిన పరిషత్తునందు సుప్రసిద్ధపండితుల సమక్షమున జరుపుచున్నందులకు పంతులుగారి, కుటుంబములోని వారియందఱి పక్షమున తమ కృతజ్ఞతను వెల్లడించిరి.

శ్రీ కాముర్తి సత్యనారాయణవర్మగారు పీఠాపురసంస్థానముగా నుండి పంతులుగారితో విశేష పరిచయముగలవారు, పంతులుగారి

నాటకములలోని సుప్రసిద్ధఘట్టములను జదివి వినిపించి, యందలి ప్రశస్త్యకతను నిరూపించిరి. కపిలవాయి రామనాథశాస్త్రిగారు గ్రీష్మోను దగ్గరలిచ్చిన 'స్థిరమైన నడువడి జనుల కందుకొనవలయు' ఇత్యాది పద్యములు, పంతులుగారు రచించినవియే యనియు. వారి పాదుకాపట్టాభిషేకము రాధాకృష్ణ కంఠాభరణము ఆంధ్రప్రదేశ మంతటను బ్రదర్శింపఁబడినవనియుఁ దెలిపిరి.

మఱియు శ్రీపానుగంటి లక్ష్మీనరసింహారావు గారి భాషా చిత్రమును ఆంధ్ర సాహిత్యపరిషద్భవనమున నలంకరింపఁదగుననియు, అందులకు వలయు ధనము సేకరించుటకు పిఠాపుర వాస్తవ్యులయిన శ్రీ వెలమకన్ని సుబ్బరాయశాస్త్రి ప్రభృతులు సిద్ధముగుండిరని తెలుపఁగా సభ్యులందఱు హర్షధ్వానములతో నావిషయ మామోదింపఁబడినది. మఱియు లభించినంతవఱకు నాంధ్రభాషాసేవకమహారథుల వర్ణచిత్రములన్నియుఁ బరిషద్భవనమున నుండఁదగుననియుఁ వారు సూచించిరి.

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు, పానుగంటి వారి రచనలు వారు కావించిన గ్రామ్యభాషావాద నిరసనమును, ఆంధ్రసాహిత్య పరిషత్తున కమూల్యమైన సేవయనియు, కీ. శే. జయంతి రామయ్యగారు మున్నగువారు గ్రాంథిక, భాషోద్ధరణమునకై చేసిన నియమాతి నిర్మాణముకంటెను, గ్రాంథిక భాషలో సాహిత్య విషయములన్నిటిని, శాస్త్రీయ విషయము లేనియునను, సులభవిషయమైనను కఠినాతి కఠిన విషయమైనను వలయునట్లు నిరూపింపవచ్చునని తమ రచనచేఁ గ్రియాత్మకముగ నిరూపించి ఆంధ్రసాహిత్య పరిషత్తునకు మూలస్తంభమైన వారు పంతులుగారని తెలిపిరి.

పంతులుగారి సాక్ష్యవ్యాసముల రచనా ప్రయోజనము లన్నియు వారి వాక్యములందే చూపట్టునని, కంఠగళోన్న చిత్రి

కట్టావిష్కరణవిషయముకాదు వారి మాటలలో వినవచ్చుననియుఁ దెలిపి కొన్నిపట్టులను సదస్యులకుఁ జదివి వినిపించినారు. పంతులుగారి సమయములో వారి వ్రాఁతలచేతను పరిషత్తు వారి చేఁతలచేతను వ్యావహారిక భాషావాదము పరాస్తమయినదనియు ఇట్టివాదము వాని గంటివారి గ్రంథములు భాషలో నిలిచియున్నంతవఱకు, ఆంధ్ర సాహిత్యపరిషత్తు నిలిచియున్నంతవఱకు మరలఁ దల యెత్తుట సంభావ్యము కాదనిరి. మఱియు నాంధ్రసాహిత్యపరిషత్పక్షమున షష్టి వార్షిక జయంత్యుత్సవమును జయప్రదముగ నిర్వహించుటకు సహకరించిన యధ్యక్షులకు నుపన్యాసకులకు సభ్యులకు ఆంధ్రసాహిత్యపరిషత్పక్షమున శాస్త్రిగారు వందన సమర్పణము చేసిరి.

పరిషదధ్యక్షులయినట్టి శ్రీ బండారు తమ్మయ్యగారి కృతజ్ఞతా సమర్పణముతో సభ విజయమును సాధించినది.

గ్రాంథిక భాషాసముద్ధారమునకు
పానుగంటివారుచేసిన సేవ

చిలుకూరి పాపయ్యశాస్త్రి.

ఆంధ్రసాహిత్యపరిషత్ స్థాపనకు ప్రధానప్రయోజనము గ్రాంథిక భాషాసముద్ధారము. ఈ పరిషత్తును స్థాపించునాటి కాంధ్రదేశములో వ్యావహారిక భాషావాదము చెలరేగినది. జనులవ్యవహారమం దున్న భాషలోనే గ్రంథములను వ్రాసి, వానినే పాఠశాలలందును, కళాశాలలందును బాఠ్యములుగాఁ జేసిన తెలుఁగుభాష యందఱకు సుబోధమై వ్యాప్తిఁ జెందు నని వ్యావహారికవాదుల యభిప్రాయము. ఈయభిప్రాయమును బలపఱుచుటకై యప్పటివఱకు గ్రంథరచన యం దుపయోగించుభాష కృతకమనియు, వ్యాకరణాదినియమనిబద్ధమైనదిగాన నట్టిభాష మృతభాష యనియు, కాలానుసారముగా స్వేచ్ఛగ ముందునకు సాగిపోవుచు జనులవ్యవహారమం దున్నభాషయే సజీవభాష యనియు వ్యావహారికవాదులు వాదింపఁజొచ్చిరి. ఈతరుణమునందే గ్రాంథికభాషాసముద్ధారమునకై కీ. శే. జయంతి రామయ్యగా రానాఁడు ఆంధ్రదేశములో భాషోద్ధారకప్రభువులుగా నుండిన పిఠాపురము బొబ్బిలి వెంకటగిరి మున్నగుసంస్థానాధీశ్వరుల సహకారముతో మదరాసులో 'ఆంధ్రసాహిత్యపరిషత్తు' అనుపేర నీసంస్థను స్థాపించి, తూర్పునాఁటినుండి బయలుదేరిన యీవ్యావహారిక భాషావాదమును ప్రతిఘటించినారు.

ఆనాఁడు పానుగంటిలక్ష్మీనరసింహారావుపంతులుగారు శ్రీ పీఠపురాధీశ్వరులయాస్థానిలో కవులుగను నాటకరచయితలుగను, ఆప్రభువున కాంతరంగికమిత్త్రులుగ నుండి, గ్రాంథికభాషలో హాస్యరసప్రధానమైన రచన సాగించుచు, సాక్షిసంఘోపన్యాసము లనుపేర సాంఘిక దురాచారముల నున్మూలించుచు, అక్షరాస్యులైన యాంధ్రులందఱకు

సమితానందదాయకమైన రచన సాగించుచుండెడివారు. ఆనాటి వారిరచనలను వినిగాని చదివిగాని యానందింపనివారు, ఆనాఁడుగాని నేఁడుగాని మాతృభాషాభిమానముగలవారిలో నేయొక్కరు నుండి యుండరనుట నిర్వివాదమయిన సత్యము. శ్రీపంతులుఁగారి రచనలన్నియు వ్యావహారికవాదుల దృష్టిలో మృతభాష కృతకభాష యనఁబడెడి గ్రాంథికాంధ్రభాషలోనే సాగినది. వారు రచించిన నాటకములన్నియు గ్రాంథికాంధ్రభాషలోనే యున్నవి. వానిని ప్రదర్శించువారుగాని, ప్రేక్షకులుగాని, యందలి నాభాషను మృతభాష యనిగాని కృతకభాష యనిగాని యనుకొనువారానాఁడును నేఁడును గూడ లేరు. తమరచనలచే గ్రాంథికభాషయే సజీవభాషయనియు, లక్షణవిరుద్ధమైన గ్రామ్యభాష గ్రంథస్థముచేయుట సరికాదనియు వేనోళ్లఁ జాటిచెప్పి, గ్రాంథికభాషాసముద్ధారమునకు మూలస్తంభమై నిలచినవారు శ్రీపానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారు; వారిరచనలును.

గ్రాంథికాంధ్రభాష మృతభాషయనుటకు మూలము. ఆంగ్లేయులు మన దేశమునకు వచ్చి, యిచటిగీర్వాణభాష అమరభాషయై సర్వతోముఖముగ వెల్లవిరియుచుండఁగా, దానిని మృతభాషయని వాకొనినారు. వ్యాకరణనియమనిబద్ధమై ప్రాకృతజన వ్యవహారములో నప్పటికది లేకపోవుటచే నది Dead Language యని వారి యభిప్రాయము. ఆంగ్లభాషచదువుకొని గీర్వాణభాషలో సముచిత ప్రవేశములేని మనవారు కొందఱు సంస్కృతపదభూయిష్ఠమై ఛందోవ్యాకరణాదినియమనిబద్ధమై యసంస్కృతులైనవారి కందరానిదై, యుండిన ప్రాచీనగ్రాంథికాంధ్రభాషను గూడ, వారిపాటలలో మాట కలిపి Dead Language అని యనుటకు సాహసించినారు. సంస్కృతభాష నట్లనుటయే యనుచితము. ఆమాట పరిశీలించిన నిలుచునది గాదు. ఏభాషయైన నేకాలముననైన మృతయైనచో నిఁక నాభాషలో

నుత్తమగ్రంథములు బయలుదేరుట కల్ల. అమర భాషయైన సంస్కృత
వాణి, పాశ్చాత్యుల లెక్కప్రకారము ఇప్పటికి రెండువేలయేండ్ల క్రిం
దటికి, అనఁగా పాళీభాషలో రచన లారంభమైనప్పటికి మృతస్థితి
నందినది. అట్లయిన నట్టిభాషలో భాస కాళిదాస భవభూత్యాదిమహా
కవుల కావ్యము లెట్లు బయలుదేరి గీర్వాణవాణికి సకలభాషాసా
మ్రాజ్యమూర్ధాభిషేకము చేయఁగలిగినవి? సుబంధు దండి బాణ
భట్టాది మహాకవులరచన లీనాఁటికి నమరములై యుండెడిస్థితి వచ్చె
డిదా? ఆంధ్రభాషను మృతభాష యనుటయు నట్టిదియే. సంస్కృత
భాషలోనియందము లన్నియు సంతరించుకొని సకలసౌభాగ్యములతో
విరాజిల్లుచు, అమరవాణితోఁ దుల్యప్రతిపత్తిని సంతరించుకొన్న
గ్రాంథికభాషను మృతభాష యనుట యెట్లు? ఈవిషయమును పాను
గంటివా రెట్లు ప్రతిపాదించినారో పరికింతము.

'గ్రామ్యవాదుల భాషాపవాదము' అనుశీర్షకముతో ఆంధ్ర
సాహిత్యపరిషత్తులో ప్రకటించిన వ్యాసములోనివాక్యము లీక్రిందివి.
" హరిహరీ! మనగ్రాంథికాంధ్రభాష మరణించినదా? ఎప్పుడు? ఎవ్వ
రును వినలేదే? ఈయాకస్మికోపద్రవ మేల కలిగినది? ఈమధ్య భాష
కస్వస్థత యనికూడ వినలేదే. ఆరోగ్యముగనే యున్నదని యందఱుఁ
జెప్పుకొనుచుండిరిగాదా? అందులో నలువది యేఁబది సంవత్సరముల
నుండి మఱింత నీరోగస్థితిచే విరాజిల్లుచున్నదే! దేహదార్ఢ్యము కలిగి
హృదయోల్లాసము కలిగి చకచకలాడుచు నెక్కడఁ జూచినఁ దానయై
ప్రకాశించుచున్నదికదా! మునుపటి తట్టరాగిడులతో బుట్టకొప్పులతో
వెఱ్ఱిగ సింగారించుకొనుట మాని నూతననాగరకత కర్హములైన
యొకటి రెండు భూషణములుమాత్రమే ధరించి ముసిముసినగవుల
మిసమిసలతో బుగ్గగులాబుల బుగబుగలతోఁ గన్నులపండువ సేయు
చున్నదే. ప్రస్తుతకాలానుసారముగఁ బ్రస్తుత జనచిత్తరంజకముగఁ

బ్రాచీనబడబడాయమానశబ్దాడంబరములు, సందిగ్ధభాషణములు వివిధాభిప్రాయప్రకాశకవచోవైఖరులు నాంతరంగకాఠిన్యము వదలుకొని పువ్వులవలె నవ్వులవలె మృదులములైన లలితములైన, ముద్దుపలుకులతో స్పష్టములై స్వచ్ఛములై దాపరికములేని విడివిడిపలుకులతో నేకాభిప్రాయబోధకములగు టక్కుటక్కుమను సూటిపలుకులతో నరఁటిపం డొలిచి చేతఁ బెట్టినట్లు కులుకుచుఁ గులుకుచుఁ బలుకుచున్నదిగదా! కొందఱను దనచుట్టు కూర్పుండఁబెట్టుకొని పరభాషాకథలను సరసముగ సమంజసముగ సందర్భముగఁ జెప్పి హృదయరంజన మొనర్చుచున్నదే? మునుపటిబెట్టు మునుపటిబిగింపు మునుపటి 'నన్నుముట్టుకొనకుఁడనము' విడిచి యాంగ్లేయభాషలోనున్న ప్రకృత్యాదిశాస్త్రములలోని విలువగలపదార్థముల నొడిలో నైచికొని తెచ్చి మనకుఁ గాసంతకాసంతగ గోరుముద్దలక్రిందఁ బెట్టి నోరూరఁ జేయుచున్నదే! ఎక్కడఁ జూచినఁ దానయై సభాముఖముల నీతినిగూర్చి రాజభక్తినిగూర్చి తనసేవనుగూర్చి సింహఘోషమున నుపన్యసించుచున్నదే! లోకవార్తాబోధమున జనులకు లౌకికజ్ఞానసంపద నీయఁదలఁచి యిటు బ్రహ్మపురము మొదలుకొని యటు బొంబాయివఱకు నొక్కటే మ్రోఁతగ బ్రతిధ్వను లిచ్చునట్లుగఁ బలుకుచున్నదిగదా! తననివాసమునకుఁ బట్టణమనక పల్లెయనక యవకాశమున్నంతవఱకుఁ గొన్ని స్థలములందు మందిరములను గట్టినదే. కొన్నిచోటులఁ గట్టుచున్నదే. మఱికొన్నిచోటుల శంకుస్థాపనమునకు యత్నించుచున్నదే. బ్రదుకఁ దలఁచి-శాశ్వతముగ బ్రదుకఁదలఁచి, బ్రదుకనఁగ నింతపామరత్వమునఁ బ్రాఁకులాడుభాష మరణించినదని గ్రామ్యవాదులు కఠోరముగఁ బలికిరా! పాపము శాంతించుఁగాక !!"

పంతులుగా రీవాక్యములలోఁ బ్రతిపాదించిన విషయములు చాలవఱకు వారిరచనలలో సమన్వితమగును. వారిరచనలో వారు

సాంఘిక రాజకీయ నైతిక భాషావిషయకసమస్యలను గూర్చినపరి ష్కారములను లలితమృదులతరగంభీరశైలులలో వివరించి ఆంధ్రపాఠక లోకమునకు గ్రాంథికాంధ్రభాషా రసాయనమును గోరుముద్దలవలె నందిచ్చినారు. ఆంగ్లభాషలో నుండినసూత్రనాంశముల నెన్నిటినో సుబోధముగఁ దెలిపియున్నారు. పాఠకహృదయములకు హత్తునట్లు సమంజసముగ వెలార్చియున్నారు. ఆనాఁటివిజ్ఞానచంద్రికాగ్రంథ మండలివారు భౌతికరాసాయనికాదిశాస్త్రవిషయములను గ్రంథము లుగా ప్రకటించి ఆంధ్రభాషకుఁ జేసినసేవను, ఆంధ్రసాహిత్యపరిషత్తు గ్రాంథికాంధ్రభాషాసేవకుఁజేసిన చేయుచున్న కృషిని బంతులుగా రీవాక్యములలో నుద్ఘాటించినారు.

మఱియు నేఁబదియేండ్లనుండి మనభాష వెనుకటి మోటుఁదన మును వదలిన దని నిరూపించినారు. ఈమాట సర్వథా సత్యము. 18, 19 శతాబ్దులలో బయలుదేరిన వచనవాఙ్మయము ప్రబంధశైలిలో విశేషాడంబరముతోను మోటుదనముతోను వెలసినదనుటయుసత్యమే. ఆనాఁటిపద్యగద్యకావ్యరచనలలో వ్యత్యాస మంతగ లేదు. కాని 19వ శతాబ్ది యుత్తరార్ధములో పరవస్తు చిన్నయ్యసూరి, పాఠశాల విద్యార్థుల యుపయోగార్థమై నీతిచంద్రిక నొకసలక్షణమయిన శైలిలో విలక్షణముగ రచించి యాంధ్రపాఠకలోకమున కందిచ్చిన దాదిగ ఆంధ్రవచనరచనకు మోటుఁదనము వదలి నూతననాగరకత యలవడినది. సంస్కృతాంధ్రపదముల సమ్మేళనముతో శ్రుతిమధు రమై యుదాత్తమైన శైలి తెలుఁగువచనరచన కేర్పడినది. తెలుఁగు వచనరచనపరిణామముమగూర్చి నిష్పాక్షికముగ విచారణమొనర్చు వారుండిన దీనిని గాదనఁజాలరు.

ఆంధ్రభాష నిర్జీవమైనదని పాశ్చాత్యనిర్వచనసంస్కార సం స్కృతచిత్తు లనుకొనుటకును చిన్నయసూరి రచించిన బాలవ్యా

కరణమే మూలము. సంస్కృతపండితులు బాలవ్యాకరణము చదివి, తాము రచియించురచనల నన్నిటిని ఆవ్యాకరణనియమములకు లోఁబడునట్లు చేసి, భాషను ముందునకుఁ బెరుగనీయకుండుటయే తెలుఁగు భాషకు మరణావస్థ యని వ్యావహారికవాదుల వాదవిషయము. ఇది వట్టిభ్రాంతి. వ్యాకరణ మనునది భాషకుఁ గలిగెడిపెరుగుదల నరికట్టునది గాదు. లోకవ్యవహారమునందును కవిప్రయోగములందును గానవచ్చెడి శబ్దజాలము నందలి సాధుత్వాసాధుత్వములను నిర్ణయించి, భాషాప్రవాహము కట్టలు తెంచుకొని ప్రవహింపకుండ, సీమలలోని మర్యాదకు లోఁబడి లోకాభ్యుదయమునకు సాధకమగువిధానమును బోధించును. అంతియగాని భాషాభివృద్ధికి విరోధక మెన్నఁడును గాఁజాలదు. నదులలోనినీటిని విచ్చలవిడిగాఁ బ్రవహింపనిచ్చిన నది యేపనికిఁ గొఱగాకుండఁబోవుచు నుప్పఁబడును. ఆప్రవాహమున కానకట్టలుగట్టి, ప్రక్కనుండి కాల్వలు త్రవ్వి, వానిగుండ నీటిని బ్రవహింపఁజేసిన తోఁటలు పైరులు పెరిగి, దేశాభ్యుదయమునకు సాధకమగుట సర్వానుభవసిద్ధము. భాషావిషయముకూడ నట్టిదియే.

అదియుగాక చిన్నయ్యసూరి తెలుఁగుభాష పెరుగకుండ బాలవ్యాకరణనిర్మాణముచే వారధిని గట్టివేసినాఁడని వ్యావహారికభాషావాదులయూహ. ఇదియు వట్టిభ్రాంతియే. చిన్నయ్యసూరికిఁ బూర్వము తెలుఁగుభాషకు వ్యాకరణములేనేలేదా? అంతకుముందువారు ఛందోవ్యాకరణాది నియమముల నెఱుఁగకుండఁగనే భాష యున్నంతకాలముండఁదగిన రచనలనునిర్మింపఁగలిగిరా! చిన్నయ్యసూరి భాషకుఁ జేసిన యపచార మేమున్నది? నన్నయ్యభట్టారకుఁడు మొదలుకొని, తననాఁటివఱకు నుండెడి తెలుఁగుభాషకు సంబంధించిన లక్షణగ్రంథములన్నిటిని జూచి తెలిసికొని, మఱియు నన్నయ్య మొదలుగఁ దననాఁటివఱకుఁ గలమహాకవుల రచనలలోని ప్రామాణిక ప్రయోగముల

నన్నిటిని గుర్తించి, యనుగతమైన శబ్దజాలమును గూర్చుకొని, సూత్ర వృత్తులను రెండింటిని, పాణినిసూత్రములకు భట్టోజీదీక్షితునివృత్తికి నీడయిన శైలిలో నన్యూనాతిరిక్తముగ నీవ్యాకరణగ్రంథమును సంతరించిపెట్టినాఁడు. సూరి పాణినీయవ్యాకరణమును బాగుగఁ జదివి యవగతముచేసికొనినపండితుఁడుగావున నే యట్టిక్రమములోనే తెలుఁగు వ్యాకరణమును గూర్పఁగలిగినాఁడు. పాఠకులాగ్రహింపకున్న నొక్కమాట యనుకొనవచ్చును. తెలుఁగు భాషలో బయలు దేరిన వ్యాకరణ గ్రంథములన్నిటికంటెను విచారసహమైనవ్యాకరణ రచన యీతనిదే యనవచ్చును.

అదేవిధముగ నన్నయ్య మొదలు తననాఁటివఱకు నుండెడి కవులరచనలలో నుండెడి మేలిరకపురచనఖండముల నెన్నుకొని, వానిని పంచతంత్రకథలను గూర్చుటలో సంతరించి తనప్రతిభచే ముద్దులుమూటఁగట్టుశైలిలో నీతిచంద్రికను రచించి బాలుర కందిచ్చినాఁ డలనాఁ డాసూరి. తదనుకరణము నాఁటికి నేఁటికి నెవ్వరికి సాధ్యమగుట లేదుగదా! సంస్కృతవ్యాకరణ పరిపాటి తెలియనివారికి బాల వ్యాకరణమును, సంస్కృతసాహిత్యమార్గ రహస్యముల నెఱుఁగని వారికి నీతిచంద్రికయును, మొఱటుగఁ దోఁచునేగాని, విజ్ఞులయినవారి కవి యట్టివి గావు. అనుగతమైన శబ్దములుండి ఒక్కలక్షణవాక్యముచే బహులక్ష్యసిద్ధి సంభవించినచోట, లక్షణవిస్తృతికి నిరోధమనునది యెవ్వరును జేయఁజాలరు. పాణినివిరచితసూత్రములకు సాధ్యములు కాని లక్ష్యములను వార్త్తికారభాష్యకారులు సాధింపలేదా? కనుకఁ జిన్నయ్యసూరి వ్యాకరణమును రచించి భాషాప్రవాహమున నరికట్టి వైచినాఁ డనుట వట్టిభ్రాంతి.

ఇంకొక్కమాట. ఆనాఁడుగాని యీనాఁడుగాని లోకవ్యవహార మందుండెడిభాషకును గ్రంథస్థమై శాశ్వతత్వము నందవలసిన భాష

కును విషయగౌరవమునుబట్టి వ్యత్యాస ముండకతప్పదు. లోకవ్యవహారముకంటె వేఱయి, బుద్ధిపరిశ్రమకు సాధ్యమైన విషయముండినప్పుడే రచన యని యనుకొందురు. అట్టివిషయము లేని రచన సారస్వతమునందు స్థానమునే యార్జింపదు. అందును లోకములో నాలుగు కాలములపాటు నిలుచునట్టిరచన సలక్షణమై యుండవలయు ననుట సారస్వతులందఱకు ననుభవసిద్ధమైనవిషయమే. లోకవ్యవహారమందుండెడి భాషనే గ్రంథములయందు నుపయోగింపవలయు నని వాదించెడి వా రయినను, వారు మాటాడుభాషలో గ్రంథముల నెన్నఁడును వ్రాయరు. అనుకొనకుండఁగనే కొన్నియలంకారములు కొంతవ్యంగ్యము, కొన్నివ్యాకరణశుద్ధమైన పదములు, ఉదాత్తానుదాత్తమధ్యస్థితులం దుండెడిశైలి, కల్పనచమత్కారము మొదలయిన లక్షణములు పట్టకమానవు. ఇఁక వ్యావహారికవాదులు చేయుమార్పు విభక్తిప్రత్యయములలోను, క్రియలమీఁదవచ్చు ప్రత్యయములలోను లక్షణానుగతమైన రూపముల నుపయోగింపక లక్షణవిరుద్ధరూపములను బాటించుటలో సంధినియమములను సడలించుటయును.

అనుగతమైన లక్షణములను బాటింపకున్నను భావము బోధపడునని వారిభావము. ప్రాచీనకవు లుపయోగించిన శబ్దములను, తత్తదర్థావబోధకములుగ సలక్షణమైన శబ్దముల నుపయోగించిన, నాభాష పండితులకేగాని పామరులకు దుర్బోధముగ నుండునని వారివాదము. సులక్షణమైనభాషలో పండితపామరామోదకరముగ రచన సాగించుట సుసాధ్యము సులభసాధ్యము అనువిషయమునకుఁ బంతులుగారి రచనయే ప్రబలమైన తార్కాణము.

గ్రాంథికభాష కఠినమని, అది పండితులకేకాని పామరులకు బోధపడునది కాదని, దానిలో కృత్రిమత్వము హెచ్చని, ఆడంబరమధికమని వ్యావహారికవాదులు చేయుప్రవాదమునకు పంతులుగారి

భాష నెఱిఁగియున్నను ప్రాచీనసంప్రదాయమును త్రెంచివేయుట కిచ్ఛగింపక, గ్రాంథికాంధ్రమునే సమాశ్రయించుచువచ్చిరి. ఆవిధముగ నెంచిచూచినప్పుడు గ్రాంథికాంధ్రభాషా సముద్ధారమునకు మూల స్తంభభూతులైన పానుగంటివారు జయంతి రామయ్యగారును అంఖడ రామభక్తులై యుండుటయే యిందులకు నిదర్శనము. ప్రాచీనకాలము నందలి తెలుఁగుఁ గవులందఱుఁ భగవద్భక్తు లనుమాటలో విప్రతిపత్తి లేనే లేదు. వారివలె రచన సాగింపలేకున్నను, వారియెడల సద్భావము గలిగి వారియడుగుజాడలలో మెలఁగుచు రచన సాగింపవలెనన్న కవులు రచయితలు నందఱును భగవద్భక్తిసమన్వితులైన యాస్తికులేగాని, నాస్తికులుగా నుండినవారు సాధారణముగఁ గానరారు.

శ్రీజయంతి రామయ్యపంతులుగా రొకప్పుడు నాతో నిట్లనినారు. వారు వేదపండితులందఱకు వార్షికముగా ఘనపాఠులకు రెండేసి రూపాయిలు, క్రమపాఠుల కొక్కొక్క-రూపాయి యాదినములలో నిచ్చుచుండెడివారు. మనప్రాచీనవాఙ్మయమైన సంస్కృతభాష భారతీయవిజ్ఞానము వేదములమీఁదనే నిర్భరమైయున్నది. అవి భారతీయవాఙ్మయమునకు భీజభూతములు. బీజముసంరక్షింపఁబడిన సమయమువచ్చినపుడు మరల సస్యము నుత్పత్తి చేసికొనవచ్చును. ఆబీజములను రక్షించువా రీవేదపండితులుగాన, సంస్కృతభాషాపరిరక్షణమునకై యీ వేదపండితులను రక్షింపవలయును. ఇటులనే గ్రాంథిక భాషాబీజములు రక్షింపఁబడిన మనప్రాచీనాంధ్రసారస్వతము నిలిచి యుండఁ గలదు. లేకున్న నది నశించుపోవును. భాషాబీజసంరక్షణము నపేక్షించియే ఆంధ్రసాహిత్యపరిత్సంస్థ స్థాపింపఁబడినది. దీనియుద్దేశ్యములను ఫలింపఁజేయుట మనప్రాచీనాంధ్ర సారస్వత బీజములు నశింపకుండ నిలువఁబెట్టుటకే యని వారనినారు.

ఇట్టియభిప్రాయములను వేనోళ్లఁ జాటిచెప్పినవారు పానుగంటి వారు. మాతృభాషను పరదేవతనుగా భావించి, తదుపాస్తికై తన ప్రతిభనంతను వినియోగించినవారు పానుగంటివారు. వారికి మాతృభాష, అందును మనపూర్వకవులచే గ్రంథములం దుపయోగింపఁబడిన తెలుఁగుభాష నారాధించుటయే పరమధ్యేయముగా వెలసినది. ప్రకీర్ణోపన్యాసములు అనుపేర వారు ప్రకటించిన వ్యాససంపుటిలో వారు మాతృభాషాసమారాధన మైహికాముష్మిక సుఖసంపాదక మనువిషయమును బహుముఖముల వివరించియున్నారు. 'పురాణపఠనము' అనువిషయమును, తదావశ్యకతనుగూర్చి తెలుపుచు, భారతీయుఁ డైనవాఁడు రామాయణభారతభాగవతములను వినియో చదివియో సుఖశాంతులను బడయుట భావ్యమని తెలిపినారు. ఈ క్రమ మింతకుముందుండినది. మనమన స్తత్త్వమునకు సరిపడిన; దింతకు ముందుండి యిప్పుడు పాశ్చాత్య భాషాసంస్కారముచే రూపుమాసి పోవుట, దేశసౌభాగ్యమున కెంతయేని లోప మని నిరూపించి యున్నారు.

పంతులుగారి రచనలన్నియునించుమించుగఁ బ్రతివిషయము ఆస్తికమ్యువైపునకే ములుచూపుచుండును. మానవజీవితము నుదాత్తము గావించుకొనుటకై యక్కఱకువచ్చు భక్తిజ్ఞానవైరాగ్యాదివిషయములతో వారిరచన లుపనిబద్ధము లగుచుండును. అట్టివిషయములన్నియు నేకాలమునకైన సరిపడియుండును. ఈపురాణపఠనమును గూర్చిన నిరూపణములోని కొన్నివాక్యముల నుదాహరించెదను.

'' ఉదయము మొదలు సాయంకాలమువఱకుఁ బ్రతిజనమున కేదో కాంక్ష. ఏదో దేవులాట. చిక్కెకద. ఒక్కగడియసేపైన నిశ్చలముగ నీశ్వరధ్యానము చేసికొనుట కవకాశము లేదుగద. కుండలో బియ్యము నిండుకున్నవనియో, నగలులేక భార్యమూతిముడుచుకొని

పండుకొన్నదనియో, పరిపాలకుఁడగు ప్రభువు మొగమెత్తఁబడిన దనియో, కన్నపుత్రుని యొడలువెచ్చఁబడినదనియో, పరశురామ కటాక్ష మింటిపైకి వచ్చినదనియో, విడిఖైదుకై యప్పులవారు తన పైకి వారంటు దెచ్చిరనియో, యెందులకో మరెందులకో" జాగ్రద వస్థలో నందఱు పాదుషా మొదలు ఫకీరువఱకు-లోలోపలనో, కూను రాగముతోనో 'బారుమని పైస్థాయిలోనో, యేడువవలసిన వారేకద. వారిని గొట్టియో వీరిని దిట్టియో, హస్తలాఘవముచేతనో కనుకట్టు చేతనో దౌర్జన్యముచేతనో దైన్యముతోనో యేలాగునో యొకలాగునఁ బగలెల్లఁ గాలక్షేపమగుచున్నది. బ్రదుకునకై ప్రాకులాడు టిట్లంద ఱకు సహజముగా నున్న దేకద.

ప్రాణయాత్రకొఱకై పడుచున్న యీపాటులతోఁ బగలు వ్యర్థమైనట్లే రాత్రికూడ వ్యర్థమైనయెడల బ్రతుకంతయు వ్యర్థమగు నని యెంచి మనపూర్వులు పవిత్రమైన యీపురాణ పఠనమర్యాదను స్థాపించిరి. అసంతుష్టమగు మనస్సునకు-కష్టపరంపరలందు గడగడలాడు మనస్సునకు పుణ్యకార్యములందు దీక్షలేనిమనస్సునకు-దుర్నీతిపైఁ గప్పదాఁటులు వేయు మనస్సునకు- ఒక గడియసేపైన పురాణకాల క్షేపము జరుగు రవ్వంతసేపైన- సంతుష్టి శాంతి ధైర్యము సత్కా ర్యాచరణాభిలాష దుష్కార్యచింతాదూరత కలుగుటకై యిట్టిసదా చారము పూర్వులచే నియమింపఁబడి యుండవచ్చును. పురాణపఠన శ్రవణములవలన స్త్రీపురుషుల కందఱకు చిత్తశాంతి కలుగునని తెలు పుచు, ఇదిగాక రాజనీతులు సేవకనీతులు- వ్యవహారనీతులు- పతివ్ర తాధర్మములు. వైరాగ్యపద్ధతులు మత సంప్రదాయములు కర్మ భక్తి జ్ఞానరహస్యములు మోక్షమార్గములు నెన్నో వారిహృదయ ములఁ బ్రవేశించునుగదా!" ఈవిధమయిన పానుగంటివారి మాటలను మననముచేసికొని, పురాణపఠణముచేసిన భారతీయులభాగ్య మెంతగ

ఫలించియుండెడిదో? మనప్రాచీన సంప్రదాయములను దెలియనందులకుఁ దెలిసియున్నను నాంగ్లభాషా పఠనసంజనిత సంస్కారముచే వానిని విడనాడుచున్నందులకు పంతులుగారెంతయు వంతజెంది సాక్ష్యోపన్యాసములలో తమయార్తిని బహుముఖముల వెల్లడించుచునే వచ్చినారు. పాశ్చాత్యసంప్రదాయము లేవిషయమునను మన కను కార్యములు కావని హాస్యరసభరితమైన శైలిలో నిశితముగ విమర్శించియున్నారు. సాంఘికదోషముల నెత్తిచూపించి మొత్తిపొడుచుటలో పంతులుగారికి వారే సాటి.

పురాణపఠనముగావించెడి మఱ్ఱిచెట్టుక్రింది రచ్చపట్టులే రాత్రిపాఠశాల లని నిరూపించుచు- ఏ. బీ. సీలే చెప్పవలె నన్నమాటయేమి? అవి చెప్పిననే కాని విద్యకాదా? మన దేశస్థితి కనువైన విద్యను మనవారు బోధించిరి. మనతత్త్వముల కెక్కవలసిన విద్యను మనకు బోధించిరి. మనజాతీయవీరుల చరిత్రములు మనకు బోధించిరి. మనజాతీయ మహాపతివ్రతలకథలను మనకుబోధించిరి. ఇంతకంటె నేమి యుపదేశింపవలెను. సంతుష్టికంటె సౌఖ్యము లేదని చెప్పిరి. ధర్మమే జయించునని యుపదేశించిరి. సత్యవ్రతముకంటె వ్రతము లేదని యుద్ఘాటించిరి. వ్యసనసప్తకము విసర్జింపుమని చెప్పిరి. అంతరశత్రువులనుదర్శింపుమని శాసించిరి. ప్రపంచము మిథ్యయనిసూచించిరి. ఇంద్రియనిగ్రహమునకు సాధనముల నుపన్యసించిరి. భక్తివలనఁగాని జ్ఞానమువలనఁగాని మోక్షము ప్రాప్తించునని యానతిచ్చిరి. ఇంతకంటె గావలసినబోధ మేమున్నది ? ప్రపంచమున సద్గుణగరిష్ఠుఁడైయుండవలసిన వారికిఁగాని ప్రపంచమును వద యోగనిష్ఠుఁడైయుండవలసిన వానికిఁగాని యింతకంటె బోధన మేమి కావలసియున్నది? ఇఁక నాంగ్లేయభాష రానిలోప మేమున్నది?... రుక్మాంగదుని వంటి మహాపురుషుఁ డుద్భవించుటకు మనయార్యావర్తదేశమే

తగునుగాదా? అట్టిదేశమునఁ బుట్టిన మనము- అట్టిజాతిలోఁ బుట్టిన మనము ఇప్పు డేమి చేయుచున్నాము. పురాణపురుషులు వట్టి Fools అనుచున్నాము. తత్పవిత్రచరిత్రములు తలతోఁకలేని తప్పుడు కథ లనుచున్నాము. పురాణములు కట్టఁగట్టి మూలఁబాఱవైచినాము. వానిని జదువఁదగదు. విశ్వసింపఁదగదు. స్పృశింపఁదగదు. ఇంతలో స్వదేశాభిమానము స్వభాషాభిమానము స్వజాత్యభిమానము సంపూర్ణదశకు వచ్చినవి.”

గ్రాంథిక భాషయనిన వెగటుపుట్టుటకు మూలము ఆస్తిక్యము దూరమై, మనపురాణములను పఠించుటగాని, అందలి విషయములను దెలిసికొనుటగాని, పౌరాణికధర్మములను బాటించుటగాని లేకపోవుటయే. వ్యావహారికభాషావాదము రాజకీయశాసనానుసారముగ విజయమును సాధింపలేకపోయినను, ఈనాఁటికి రచయితలుగా రూపొందుచున్నవారిలో నూటికి 90 వంతుల జనులు గ్రామ్యభాషలోనే రచనసాగించుచున్నారు. తెలుఁగుభాష తెలియునని చెప్పువారిలో నిప్పటితరమువారిలో నూటికి 90 వంతువారు మన తెలుఁగులో పురాణములు చదువవలె ననువారుగాని, చదివి అర్థముచేసికొనఁగలుగువారుగాని లేరు. కావ్యగతచమత్కారభరితములైన ప్రబంధములను జదివి, అందలి యర్థము నవగతముచేసికొనెడివారు చాల పలుచనైపోయినారు. గంటలోనో అరగంటలోనో చదివి యావల విసరివైచుట కనువైన నవలలు నాటికలు కథానికలు (పంతులుగారి పరిభాషలో కుక్కగొడుగులవలె) బయలు దేరి, బుద్ధి కేపాటియు పరిశ్రమము నీయనక్కఱ లేకుండ బోధపడుచుకొనుటకు వీలయినవి బయలుదేరి, అక్షరాస్యులయిన స్త్రీపురుషులందఱు వానికై మొగఁబడుచుండుట వ్యావహారికవాద ప్రభావమే. గ్రాంథికభాషలోనే సలక్షణముగ రచనలు సాగుచుండిన, కవిత్రయము వారి భారతభాగములు, రామా

యణ భాగవతములు పఠనపాఠనములలో నుండిన, మనప్రాచీనసంప్ర
దాయములు, వెనుకటి యాచారములు, ధార్మికదృష్టి చెడకుండ నుం
డిన, నింతటి విపరీతస్థితి యేర్పడి యుండెడిది కా దనిపించుచున్నది.
ఈనాఁడు పంతులుగారు తెలిపినట్టులు ఆంధ్రులలో చాలమందికి
స్వదేశభాషాజాత్యభిమానములు పూర్ణానుస్వారములైనవి.

పంతులుగారి యీక్రింది వాక్యములు పరికింపుఁడు.

"ఆంగ్లేయ భాషాసారస్వతములోఁ బాండిత్యము సంపాదించు
కొనఁగూడదని నాయభిప్రాయముగాదు. సంపాదించుకొనవలసినదే.
శక్తివంచనము లేకుండ సంపాదించుకొనవలసినదే. ఎప్పుడు ? మనజా
తీయ మహాపురుషుల చరిత్రములు మనము దెలిసికొనిన పిమ్మట.
మనజాతీయమహాకాంతామణులమహోత్కృష్టచారిత్రములనుమనము
దెలిసికొనినపిమ్మట. ఐహికాముష్మిక సౌఖ్యప్రదములైన మన యితి
హాసములలోని పురాణములలోని కావ్యములలోని జ్ఞానామృతమును
గ్రోలినతరువాత. అంతేకాని అరుంధతినిమన మెఱుఁగకపోయినతరువాత
'హెన్రీది యైత్' కెందఱుభార్యలో దెలిసికొననేల? చిత్రకూట పర్వ
తమున జాబాలి చేసినబోధమునకు శ్రీరామచంద్రమూర్తి యెట్లు
ప్రత్యుత్తరమిచ్చినాఁడో మనకుఁ దెలియకపోయినపుడు Platos
Dialogues తలక్రిందుగ నప్పఁజెప్పిన నేమి వినియోగము? శ్రీకృష్ణుఁడు
ధృతరాష్ట్రసభలో రాయభారపుఁబలుకు నెంతసందర్భముగా నెంత
సమీచీనముగా నెంతమధురముగా నెంత యుక్తియుక్తముగాఁ బలి
కెనో యెఱుఁగని మనకు పార్లమెంటులో Gladstone గారి Budget
Speach వచోవిధేయమైయున్న మన కేమి? మనపూర్వదేశస్థితిని
గూర్చిన గ్రంథములు మనకు మొదటఁ గావలయును. మనపూర్వ
నాగరకస్థితిని గూర్చినగ్రంథములు మనకు మొదటఁ గావలయును.
మనజాతీయతత్త్వములోఁ జేరినగ్రంథములు మనకు మొదటఁ గావల

యును. సహనము సౌభ్రాత్రము సత్యము శాంతి శమము మొదలగు నవి బోధించు మనజాతీయ సారస్వతమును వదలినపిమ్మట జాతిలో నైకమత్యముండుట కవకాశముండునా? ఆత్మగౌరవము తగ్గినపుడు పర గౌరవము తగ్గుట యాశ్చర్యమేమి ? జాత్యైక్యమునకు జాత్యభివృద్ధికి దేశాభిమానమునకు పురోభివృద్ధికిఁ గావలసినది పురాణపఠనము''

పంతులుగారు తెలిపిన యీవిషయములు సర్వథా తథ్యములు. ఈనాఁడు పురాణపఠనము క్రమముగా సడలిపోయిన కారణముననే మానవచిత్తవృత్తికి దార్ఢ్యము నిచ్చెడి సారస్వతముగాని శాంతిసౌఖ్యముల నిచ్చెడిసదుపదేశముగాని దుర్లభమైపోయినది. కాల ప్రవాహములబట్టి అనుక్షణము మాఱిపోయెడి ఆదర్శాభాసములను బోధించెడి వాఙ్మయము దేశభాషలన్నిటిలోను,ప్రధానముగ మన తెలుఁగు భాషలో బయలుదేరి స్వదేశాభిమానము స్వభాషాభిమానము నాఁటికినాఁడు సన్నగిల్లిపోవుచున్నది. పంతులుగారి రచన విశుద్ధమైన గ్రాంథిక భాషలో బయలు దేరి యిప్పటికి ఏఁబదిసంవత్సరములయినది. వారి భాష కఠినమైన దనికాని, దుర్బోధ మని కాని, పాఠ్యేతర మని కాని, యనుకొనువా రెవ్వరును లేరు. ఈపురాణపఠనావశ్యకతను గూర్చి వారివాక్యములు పండితులకుఁ బామరులకు సమితానంద దాయకము లే. ఇట్టిశైలి నలవఱచుకొని గ్రాంథికమునకు సరిపడునట్లు రచనసాగించునాఁ డెవ్వరికి విరోధముండఁబోవదే. ఈవిషయమును వ్యావహారికవాదు లేల స్వీకరింపరో ? వారిరచనల నన్నిటిని జదివి యానందించి తన్మయత్వము చెంది, పంతులుగారి ప్రతిభనుగూర్చి వేనోళ్లతో మెచ్చుకొను వ్యావహారికవాదులను నేను చూచినాను; చూచుచున్నాను. ఆంధ్రసాహిత్యపరిషత్తును స్థాపించి గ్రాంథికాంధ్ర భాషయందే రచన సాగింపవలెనని, గద్యపద్యముల రచన సలక్షణముగ సాగవలెనని లోకమునకుఁ దెలుపుటకై తమరాక్షసగాంసములు

ధారవోసిన రామయ్యపంతులుగారి మీఁదనే వ్యావహారిక వాదులు ధ్వజమెత్తినారుగాని, గ్రాంథికాంధ్రభాషలో నేవిషయమునైన నెట్టి శైలిలోనయిన రచన సాగింపవచ్చు ననువిషయమును బహుముఖముల సాక్ష్యపన్యాసములలో, బహిరంగసభలలోను, ఇతరగ్రంథములలోను, నాటక రచన ప్రదర్శనముల మూలమునను ఘంటారావములోఁ జాటిచెప్పిన పానుగంటివారిని పల్లెత్తుమాట యనువా రీనాఁటికి నెవ్వరును గానరారే. దీనికిఁ గారణము లేకపోలేదు. సాధారణముగా వ్యావహారికవాదులకుఁ దదనుయాయులకు ఆంగ్లేయభాషలో నాయా విమర్శకులు వ్రాసిన సిద్ధాంతములను తమయూహముల కనుగుణముగ మలచిపెట్టుట యొక ప్రధానవిషయము. పాశ్చాత్యవిమర్శక సిద్ధాంతములను క్షుణ్ణముగాఁ దెలిసి, మన సారస్వతమునందలి విశిష్టతను దలస్పర్శిగా నెఱిఁగి రచనసాగించినవారు పానుగంటివారు. అట్టి స్థితిలో సంస్కృతము చదివినపండితులకు నవ్యదృష్టి యుండదని, ఏవిధమయిన క్రొత్తసంస్కారమును వా రంగీకరింపరని యెత్తిపొడుచుటయే వ్యావహారికవాద మని భావించువీరు, సంస్కృతాంగ్లాంధ్ర సాహిత్యపథములను క్షోదక్షమముగ నెఱిఁగి, పదునైన కత్తితో శస్త్ర చికిత్స చేయు పానుగంటివారి మాటలకు బదులుచెప్పుట గాని, వారన్న విషయమును గాదనుటగాని యెవ్వరికి నేనాఁడును సాధ్యము కాలేదు. కాదనియు ననవచ్చును. గ్రామ్యవాదుల భాషాపవాదము అనువ్యాసములో పంతులుగారి మాటల యుపపత్తి యెట్టిదో పరికింతము.

ఆంధ్రభాషారచనకు మాటాడుభాషనే యుపయోగింపవలయు నని వాదించువారు సెట్టి లక్ష్మీనరసింహంగారు గ్రాంథికభాష Living language యనఁగా, గిడుగు రామమూర్తిపంతులుగారు Dead language అనినారు ఈ విషయమును కాదను ప్రకరణములో

"అన్యోన్యవిరుద్ధముగఁ బల్కునీగ్రామ్య వాదులలో మనకు సూత్రికారు లెవ్వరు?" శ్రీకుమిత్తున్, బొప్పుడుపా' ఇత్యాద్య లౌకిక గ్రంథసంధానధురంధరులగు లక్ష్మీనరసింహంగారా? వారికంటె వయోవృద్ధులు ప్రాపించిక జ్ఞానవృద్ధులు నగు రామమూర్తి పంతులుగారా? వీరిమాటలు నమ్మి భాష కుత్తరక్రియలారంభింపవలసినదా? వారి మాటలు నమ్మి యుపచారక్రియ లారంభింపవలయునా? గ్రాంథిక భాష మృతభాష కాదని నా యభిప్రాయము. ఏలయన గ్రాంథిక భాషాపదములనే కొన్ని కొన్ని మనమాటలం దుపయోగించుకొనుచున్నాము, మాటలలోని యీ మార్పులనునవి వ్యాకరణజ్ఞానశూన్యత్వము చేతను, బలుకుబడిలోని తొందరచేతను, నిజమైన యుచ్చారణము తెలియకపోవుటచేతను మఱికొన్ని యితరకారణములచేతను గలుగుచున్నవి. శబ్దములలోని యీదోషములు మనదోషములవలననే గలిగినవి. ఇట్టిదోషములు లుత్తమవచనగ్రంథములలో వర్జింపవలసిన దని యూనివర్సిటీవారు ద్రావిడభాషాసందర్భమున నిట్లు తీర్మానించిరి. That slang and other similar irregular forms of expression which are either the result of violation of accepted rules of grammar or are produced by means of Contractions or other Modifications due to hurry, indifference and ignorance be declared to be unacceptable in dignified prose Composition. ఇట్టి దుష్టరూపములు పదములకుఁ బూర్వోత్తరోదాహృత కారణములవలన వచ్చియున్నంత మాత్రముచేత నీశబ్దములు పూర్వశబ్దములకంటె భిన్నము లని చెప్పఁదగదు. అట్లు చెప్పుట మిక్కిలి యప్రాజ్ఞత. పంతులుగారి యీమాటలను ప్రాజ్ఞు లెవ్వరు కాదనఁజాలరు.

"కావున సంభాషణములోని శబ్దములన్నియు గ్రాంథికశబ్దములే యని యొప్పుకొనకతీరదు. కాని యవి కొందఱ మనుజుల

దంతముల క్రిందఁబడి నలఁగినవి; తెగినవి; సాగినవి; చప్పఁబడినవి. కానిండు; ఎట్లైన గ్రాంథికశబ్దములే. ఇట్టి దుర్దశనందినట్టి గ్రాంథిక భాషనే మనము సంభాషణములో నుపయోగించుచున్నాము. ఏదీ ఒక్క తెలుఁగుపదము గ్రాంథికభాషలో లేనిది, గ్రామ్యభాషలో నున్నది, మీరు చెప్పఁగలరేమో యోజించుకొనుఁడు. అట్లుండుటకు సాధ్యమెట్లున్నది? కావున సంభాషణములో నుపయోగించుకొను చున్న భాష గ్రాంథికభాష. చెడిన గ్రాంథికభాష-దురవస్థనందిన గ్రాంథిక భాషయైయున్నది.

గ్రాంథికభాషలోని పదములే మాఱి వ్యవహారములోనికి వచ్చిన వనుటకు భారత భాగవత రామాయణములనుండి పద్యముల నుదహరించుచు వారిక్రింది వాక్యములను సైత ముదాహరించి యున్నారు.

"బొబ్బిలిపాట బజారులో విని మాయింటి పక్కనుండి వారి యిండ్లకుఁ బోవుచు నిద్దఱిట్లనుకొనుండిరి. 'ఇజానగరం రాజు మా మోసం చేసాడా్రి. బూసీతో యేకమై పండంటి బొబ్బిలోరిని పాడుచేసాడా్రి' యని యొక్కఁడనఁగ 'బొబ్బిలోరు బొబ్బిలోరంటే నాకు బోదపడ్లే దెవరా్రి? యని యింకొకఁడనెను. అంత మొదటి వాఁడు 'రామేణమంతా యినీ రావుఁడికి చీత యేవన్నాడన్నట్టుందిరా? బొబ్బిలోరనగ మఱిగత్తే మనవోరెలమోరేరా? వెన్నపట్టమాయన్ని మనపెద్దరాజుగారు దత్తుచేసుకొన్నట్టే బొబ్బిలిరాజుగారు మనరాజు గారి తాతగారిని గబోలా్రి" దత్తుచేసికొన్నారు. ఇది తాతల్నాటి కత' యని పలికెను. ఈసంభాషణములోని పదములు గ్రాంథిక పదములు కావా? పరమమూఢులు సహితము గ్రాంథికభాషాపదములనే యుప యోగపఱచుకొనుచున్నారు. తప్పుగ నుపయోగపఱచుటకు వారి మౌఢ్యమే కారణము. తప్పుగనో యొప్పుగనో పండితులు పామరులు

నందఱు కూడ గ్రాంథిక భాషా పదములనే యుపయోగించుకొనక తప్పదు.''

పంతులుగారు గ్రాంథికభాషలోనే రచన సాగింపవలయునని తెలుపుటకు మఱికొన్ని వాక్యములు పలికినారు. అవి పరికింపలసినవి. “మనసులోని గంభీరాభిప్రాయములను వెల్లడింపవలయు ననిన గ్రాంథికభాషకంటె మఱియొకదారి లేదు. మాటాడుకొను భాషలో ననఁగ గ్రామ్యభాషలో నేమంత పదజాల మున్నది ? ఆహారనిద్రా సంగమ విషయకాభిప్రాయముల వెల్లడించుటకుఁ దగినకొన్ని మాటలే కాని యంతకంటె నెక్కువమాట లెక్కడివి ? రాజసేవార్హములైన మాటలేవి? సభానర్హములైనమాట లేవి? దేవప్రార్థనాదికార్యార్హములైన మాటలేవి? మతవిషయకము లగు మాటలేవి? నీతి ప్రతిపాదకము లగుమాటలేవి? బహిఃప్రపంచిక భోధకము లగుమాట లేవి? అంతరప్రపంచక జ్ఞానభోధకము లగుమాటలేవి? కూటిగుడ్డ మాటలతోనే గుడుగుడుగుంచము లాడఁదగిన గ్రామ్యభాషలో వేల కొలఁది గ్రాంథికభాషాపదములను వాడుకొనుచు, గ్రాంథికభాష వాడుకలో లేదనుట వింతగనున్నది.'' ఇది సర్వథా తథ్యమే. సభ్యమైన యుదాత్తమైన విషయమును వ్యక్తముచేయుటకు, గ్రాంథిక భాష నుపయోగింపక తప్పదు. ఆధ్యాత్మికవిషయములను ప్రబోధింపవలయుననిన దానికి సరిపడినపదజాలము లోకులు మాటాడుకొను భాషలో లభించు టెట్లు? కేవలము ఆహారనిద్రాభయసంగమములకు మాత్రమే సంబంధించిన విషయములను మించి, యితరవిషయములకు సంబంధించిన చమత్కారజనకమైన రచన సాగింపవలయునన్నను, వైజ్ఞానిక విషయములను నిరూపింపవలయునని నను గ్రాంథికభాషా పదజాలము నాశ్రయింపకతప్పదు.

Natural laws వలనఁ గలిగిన శాస్త్రీయ స్వరూపములు

లోకవ్యవహారములోని పదములు అని గ్రాహ్యవాకులు చెప్పునవేవో యది యజ్ఞశాది దోషములవలనఁ గలిగినతప్పులని మేము చెప్పెదము. "Natural laws" అను పదము మిక్కిలిస్థూలమైనది. అవి రెండు విధములు. బాహ్య ప్రపంచములోఁ జేరినవి అంతర ప్రపంచములోఁ జేరినవి. గ్రహాదుల యాకర్షణశక్తి మొదలగునవి బాహ్యప్రపంచములోఁ జేరినవి. సర్వరక్షణశక్తి మొదలగునవి యాంతర ప్రపంచములోఁ జేరినవి. మొదటివానినిగూర్చి విచారణము మనకిప్పు డక్కఱ లేదు. అంతర ప్రపంచతత్త్వమును బాగుగఁ బరిశీలించినయెడలఁ గేవల మన్యోన్యవిరోధముగల రెండువిధములగు శక్తులు దానిలోఁ గనఁబడుచున్నవి. ' Emotion ' (హృదయానుభవము) సంబంధమగు శక్తి యొకటి; Intallact (జ్ఞాన) సంబంధమగు శక్తి యొకటి. మొదటి దానికి సంబంధించిన Natural laws (స్వాభావిక శాసనములు) కొన్నియున్నవి. రెండవదానికిసంబంధించినవి కొన్నియున్నవి. Emotion తో సంబంధించిన శాసనములు మనుజుని యాముష్మిక సుఖమున కెగలాగుచుండును. రూపవతి యగుకాంతను జూచినపుడు మనుజునకు దానిపై నపేక్ష పుట్టించునది. Emotionతో సంబంధించిన శాసనమై యున్నది. పరస్త్రీవాంఛ పాపమనియు నింద్రియనిరోధ మొనర్పఁగాని యాత్మకుత్తమగతి గలుగదనియు బోధించి, మన మనసున కైహికవైరాగ్య మిచ్చునది Intellect తోఁజేరిన శాసనమై యున్నది. మొదటిది మనపూర్వతత్త్వమగు పశుత్వమునకై పడలాగుచుండఁగ, రెండవది మనపరతత్త్వమగు దైవత్వమున కెగఁద్రోయుచుండును. రెండును స్వాభావిక శాసనములే. Natural laws మను జుడు వేశ్యాదాసాధముఁడగుటయు వేదాంత శిఖామణి యగుటయు Natural laws ప్రకారమే. న్యాయాధిపతియగుటయు Natural !aws ప్రకారమే; వానిచే మారణదండనము నొందు మనుజఘాతకుఁడగుటయు

Natural laws ప్రకారమే తస్కరాధముఁడగుటయు Natural laws ప్రకారమే. పరబ్రహ్మమగుటయు Natural laws ప్రకారమే. పరహంతయగుటయు Natural laws ప్రకారమే. కాని వేశ్యాదాసుని జనులు తిట్టుచున్నారు. వేదాంతిని స్తుతించుచున్నారు. త్యాగిని గౌరవించుచున్నారు. తస్కరుని శిక్షించుచున్నారు. న్యాయకర్తను మన్నించుచున్నారు. పరహంతను బూతులు తిట్టుచున్నారు. అటులనే Natural laws వలనఁ గలిగిన శబ్దములలో నుత్తమములగు వానిని గ్రంథార్హములని గ్రంథకర్తలు గ్రహించుచున్నారు. కొన్నిటిని నింద్యార్హములని పరిత్యజించుచున్నారు. కావున Natural laws వలనఁ గలిగిన వనుకారణముచే నన్నిశబ్దములు శాస్త్రీయములని దోషరహితములని గ్రాంథికభాషాపరిగ్రహణ యోగ్యములని వాదించు గ్రామ్యవాదులవాదము హాస్యాస్పదము.

ఈ తీరుగ పానుగంటివారు 'గ్రామ్యవాదుల భాషావాదము' అను వ్యాసములో వ్యావహారికవాదులు తెలిపెడియుక్తులను ఉపపత్తులను సహేతుకముగ విమర్శించియున్నారు. గ్రాంథికభాషకు వికృతిరూపములే వ్యావహారికపదములను విషయము పాతంజల మహాభాష్యమునందలి యీ క్రింది వాక్యములనుబట్టి కూడ సమన్వితమగును. వ్యాకరణాధ్యయమునకు ప్రయోజనములు నిరూపించునపుడు క్రిందిశ్రుతివాక్య ముదాహృతమైనది.

యస్తు ప్రయుఙ్క్తే కుశలో విశేషే
శబ్దాన్యథావద్వ్యవహారకాలే,
సోఽనన్తమాప్నోతి జయం పరత్ర
వాగ్యోగవిద్దుష్యతి చాపశబ్దైః.

ఈ వాక్యములను కర్థమును పతంజలి మహర్షి యిట్లు వివరించియున్నాఁడు. "యోహి శబ్దాన్ జానాత్యపశబ్దానప్యసౌ జానాతి,

యథైవహి శబ్దజ్ఞానే ధర్మః, ఏవమపశబ్దజ్ఞానేఽప్యధర్మః. అథవా భూయానధర్మః ప్రాప్నోతి. భూయాంసోఽపశబ్దాః అల్పీయాంసః శబ్దా ఇతి. ఏకైకస్యహి శబ్దస్య బహవోఽపభ్రంశాః.తద్యథా గౌరిత్యస్య శబ్దస్య గావీ గోగోతా గోపోతలికేత్యాదయో బహవోఽపభ్రంశాః. అథయోఽవాగ్యోగవిత్,అజ్ఞానం తస్య శరణమ్".

ఎవ్వనికి సాధుశబ్దములు తెలియునో, వాని కపశబ్దములును తెలియును. సాధుశబ్దజ్ఞానమువలన ధర్మము లభించినట్లే, అపశబ్దజ్ఞానము వలన నధర్మమును లభించును. లేదా, అధర్మమే యెక్కువ ప్రాప్తించు ననవలెను. లోకవ్యవహారములో నపశబ్దములే హెచ్చుగను, సాధు శబ్దములు తక్కువగను నుండును. ఒక్కొక్క సాధుశబ్దమునకు అపభ్రంశరూపము లనేకము లుండును. 'గౌః' అను సాధుశబ్దమునకు గావీ,గోణీ గోతా,గోపోతలికా మొదలయిన వెన్నియోరూపశబ్దమునకుఁ గల యపభ్రంశ శబ్దములు. వ్యాకరణశాస్త్రపరిజ్ఞానము లేక, ప్రకృతి ప్రత్యయ విభాగజ్ఞాన పూర్వకమయిన యర్థవిశేషపరత్వము నెఱుఁగని వానికజ్ఞానమే శరణము ఈ విషయమున హరి యిట్లనియున్నాఁడు:

అర్థప్రవృత్తి తత్త్వానాం శబ్దాఏవ నిబన్ధనమ్,
తత్త్వావబోధశ్శబ్దానాం నాస్తి వ్యాకరణాదృతే.

శబ్దమునుండి అర్థము తెలియవచ్చుటకు హేతుభూతములయిన జాత్యాదితత్త్వములకు శబ్దములే యాలంబనములు. వ్యాకరణజ్ఞానము లేనిదే శబ్దములతత్త్వము తెలియదు అని యీకారిక భావము. అర్థావబోధ పురస్కృతమైన సాధుశబ్దజ్ఞానమునకు వ్యాకరణశాస్త్రాధ్యయన మత్యావశ్యకమని యీ వాక్యముల తాత్పర్యము.

నేఁటి కేఁబదిసంవత్సరముల క్రిందటివఱకు ధర్మాధర్మపరిజ్ఞానము, ధర్మాచరణతత్పరత భారతదేశీయులలోఁ జాలమంది కుండెడిది. మనోవాక్కాయకర్మలచే ధర్మాచరణముగావింపవలె నని

అధర్మము నాచరింపరాదని నిశ్చయజ్ఞాన ముండెడిది. అది సకల సంతతులకు విద్యాబుద్ధులు నేర్చు చారందఱు ప్రాచీనార్ష సంప్రదాయ పరిశుద్ధమైన మార్గమునే యవలంబించెడివారు. ధార్మికకృత్యములలో వ్యాకరణశుద్ధములైన సాధుశబ్దములనేగాని, సంస్కృతశబ్దముల కప భ్రంశరూపములయిన ప్రాకృతాదిలోక వ్యవహారోపయోగిపదముల నుపయోగించు పరిపాటి లేదు. దేవతాప్రార్థనాదికమునకై వేదోక్త మంత్రముల న్నే యుపయోగించుచుండెడివారు.

పురాణోక్తవిషయములు వేదతుల్యములేగావున, వానిని, వానితో సమకక్ష్యమైన వానిని దేవతారాధనాదికార్యములం దుపయోగించెడివారు. ప్రాచీనకాలమందలి ఋషులు తమతపశ్శక్తిచే యోగమును సాధించి, తన్మూలమున వివిధవిజ్ఞానములను సముపార్జించి వివిధ శాస్త్రసిద్ధాంతములను ధర్మానుగతముగసుసంస్కృతమై వైదికశబ్దసమ కక్ష్యమైన శబ్దములతో నిరూపించియున్నారు. పురాణానువాదముతో ఆంధ్రభాషాస్వరూపమును దీర్చిదిద్దుటకుఁ దలపెట్టిన నన్నయభట్టారకుఁడు, సంస్కృతవ్యాకరణానుసారియైన ప్రాకృతాపభ్రంశ భాషానియమములకు సరిపడునట్టి పద్ధతిలో ధర్మానుగతముగనే భారతానువాదమును సాగించినాఁడు. అట్టి ధర్మానుసంధానయోగ్యమైన భాషానిబంధనములను దెలియవలయు ననిన, ప్రాచీనులై ఋషితుల్యులైన నన్నయాదుల ధార్మికదృష్టి నవగతము చేసికొన వలయునుగదా! అది లేకుండ నేది సాధుశబ్దమో, యేది యసాధుశబ్దమో తెలియుటయే కష్టము. ఋషితుల్యులయిన నన్నయాదులు గ్రంథములం దుపయోగించిన శబ్దములు సాధుశబ్దములనుట నెవ్వరును గాదనఁజాలరు. ఆ శబ్దముల నట్టులే యుచ్చరింపలేనివారు, ఆయాశబ్దములకే యనేకములయిన యపభ్రంశరూపములను గల్పించి వ్యవహారములో నుపయోగింతురు.

ఇట్టి యపభ్రంశరూపములు సాధుశబ్దములు కాఁజాలవు గనుక,

వానిని గ్రంథములం దుపయోగింపరా దనుట, పతంజలి భాష్యోపదిష్ట మార్గమున నధర్మము నాచరించుటయే యగును. అందుమూలముననే సంస్కృతభాషా సంప్రదాయములను బాగుగ నెఱిగినవా రెవ్వరును, సంస్కృతభాషావ్యాకరణ విరుద్ధము లయిన పదములనుగాని, ఆంధ్ర భాషావ్యాకరణవిరుద్ధ మయినపదములనుగాని యుపయోగించుటకు బుద్ధిపూర్వకముగఁ బాల్పడరు. ఏ భాషలోనయిన లక్షణము నుల్లంఘించుట అధర్మసంపాదక మని, వారినిశ్చయము. భ్రమప్రమాదములచేత నే చోటనయిన లక్షణవిరుద్ధములయిన పదప్రయోగములు దొరలిన నవి బుద్ధిపూర్వకములు గావు. లక్షణవిరుద్ధముగ రచనము సాగించుట నైహికముగను నాముష్మికముగను ననర్థదాయక మని యాస్తికులనిశ్చయము.

మీఁదఁ దెలిపినపతంజలి మహర్షివాక్యములను బర్యాలోచనము చేసిన, లోక వేదప్రయుక్తమయిన సాధుశబ్దముల కపభ్రంశరూపము లనేకములు పుట్టినట్టులు, సంస్కృతాపభ్రంశరూపములై దేశ్యశబ్దముల నేకములు పుట్టినపుడు, ప్రాచీనకవులు లక్షణయుక్తముగ గ్రంథములం దుపయోగించినసాధుశబ్దములను రచనలయం దుపయోగించుట భావ్యమగును గాని, గ్రాంథికశబ్దముల కపభ్రంశరూపములై అననుగతమైన వ్యావహారికశబ్దములను రచనలం దుపయోగించుట సంభావ్యము కాదని తెలియవచ్చుచున్నది. పంతులుగా రీవిషయమును గ్రామ్యభాషాపవాదము అను వ్యాసమున ప్రతిపక్షులు చేయు శంకలను సైత ముద్ధరించి సమాధానములను విపులముగ నిచ్చియున్నారు. గ్రంథవిస్తరభీతిచే విరమించుచున్నాను. పాశ్చాత్యులు భారతదేశపాలకులుగా వచ్చి, మనదేశభాషలను గొంతగ నభ్యసించి, వారి భాషాప్రభావము, వారి సంస్కారములు భారతీయులలోఁ బ్రవేశించుటకు, వారి చెప్పుచేతలలో మన ముండుటకు ఆర్యద్రావిడ

విభాగమును ముందుగఁ బ్రవేశపెట్టి, యా వెనుక భాషావిషయమునఁ గూడ నా విభేదమును బ్రవేశపెట్టి, వారి నిర్ణయముల నుత్తమములని మనము భావించునట్లు చేసినారు. రాజకీయవ్యవహారములందుపయోగించిన భేదోపాయమే భాషావిషయములందును బ్రవేశించినది. మనప్రాచీనార్ష సంప్రదాయానుగతమైననిర్ణయమునుబట్టి చూచిన దేశభాష లన్నియు సంస్కృత ప్రాకృతాపభ్రంశరూపములే. ఆయా భాషావిపరిణామములనుగూర్చి మనవారు తెలిపిన సిద్ధాంతములను సమన్వయింపవలె నను దృష్టి దూరముచేయుటయే వారిరచనలన్నిటికి ప్రధానలక్ష్యము. మతవిషయమునను చారిత్రక విషయములందును, భాషావిషయములందును వా రేర్పఱిచిన సిద్ధాంతములకు మనము గట్టుబడియుండునట్లును, వారినిర్ణయము లుత్తమములని మనము భావించునట్లు ప్రతివిషయమును వారు మలచిపెట్టినారు. తత్ఫలితమే మన కీనాఁడు ప్రతివిషయమునను మనప్రాచీనులు చేసిన నిర్ణయములు సరిగాలే వనుకొనుట; వాని సేవగించుకొనుటయును. మన ప్రాచీన సంప్రదాయములను ముందుగ క్షుణ్ణముగాఁ దెలిసికొని, పాశ్చాత్యులు ప్రవేశపెట్టిన విమర్శనమార్గమును మలచుకొని, క్రొత్తవిషయములను మనవారి కందఁజేయుట భావ్యమని పానుగంటివా రడుగడుగునఁ దెలుపుచునే వచ్చినారు. మనప్రాచీనవ్యాకరణకర్తలందఱు తెలుఁగు భాష సంస్కృత ప్రాకృతజన్య మని చెప్పుచుండఁగా, వారిమాటలెంతవఱకు సరిపడునో చూడకయే, కాల్డ్వెలు దొరగారు తెలిపిన క్రమమున తెలుఁగు ద్రావిడభాషాజన్యమని మన మేల యంగీకరింపవలయును ? కాల్డ్వెలుగారి సిద్ధాంతము నొకప్రక్కకుఁ బెట్టి సంస్కృత ప్రాకృత వ్యాకరణములను క్షుణ్ణముగాఁ దెలిసికొని, యీనాఁడు ప్రాచీనమార్గానుసారముగ భాషాచరిత్రమును వ్రాయఁబూనినవా రేరి ? నన్నయాది వ్యాకర్తల సిద్ధాంతములు నమ్మువారు మూఢనమ్మకముగలవా రనుకొనునప్పుడు, కాల్డ్వెలు దొరగారి సిద్ధాంతములు నమ్మువారు నట్టివారే యగుదురు. ఆధునిక సంప్రదాయములు ప్రాచీనులకుఁ దెలియ వనుకొనిన, ప్రాచీన సంప్రదా

యము లాధునికులకు నట్లే తెలియవు. రెండింటిని దెలియఁ గలిగినవా రుండిన వారు తెలిసికొనుటకు యత్నించుట లేదు. ఆస్తిక్యము దూరమై యార్థికమైన యారాట మెక్కువగుట కూడ నిట్టి సద్వి మర్శనము సాగకుండుటకు మూలముగఁ దోఁచుచున్నది. పంతులు గారి కాలములో నర్థార్జనమున కింతటి యారాటము లేదు గావున నిట్టి భాషావాదములు సాగినవి. ఆనాఁటి వారు కొంతవఱకైన శ్రమించి విషయ మెఱిఁగి విమర్శనములు సాగించినారు. ఈనాఁటివా రేపాటియు పరిశ్రమము సాగింపకుండఁగనే, ప్రతివిషయమునను నియమపరిత్యా గమునకుఁ బాల్పడు వారైనారు. అట్టివారు పంతులుగారి రచనల నన్నిటిని సౌహార్దముతోఁ జదివిన గ్రాంథిక మార్గము నే యవలంబింపఁ గల రని చెప్పవచ్చును. చదివియు నట్లు చేయనివా రుండిన నది వారి యదృష్టము.

ఆంధ్రసాహిత్యపరిషదేకాదశ వార్షికోత్సవసభ కధ్యక్షులుగా నుండి పంతులు గారు గావించిన యుపన్యాసము ఆంధ్రసరస్వతీ సమా రాధన రూపమైనది. వారి రచనలన్నిటిలో నది యమూల్యమైనది. ఆంధ్రభాషాసముద్ధారమున కత్యావశ్యకములయిన మార్గములనన్ని టిని వారందు నిర్దేశించియున్నారు. మాతృభాషాభిమానము గల యాంధ్రుల కందఱకు సర్వదా మననముచేసి యాచరణమునం దుంచు కొనఁదగినవందలి వాక్యములు తెలుపఁబడిన మార్గములన్నియు ఆంధ్ర భాషాభివృద్ధి నాకాంక్షించు వారి హృదయములలోఁ బదిలపఱుపఁ దగిన యమూల్య భావరత్నములందుఁ బ్రతిఫలించును. ఈ యుప న్యాసములోఁ నెన్నియో సాంకేతిక విషయములు సైతమున్నవి. ఆహ్వానించువారెట్టి వారెట్టివారు ఆంధ్రభాషాపోషకులు, నాంధ్రభా షాకోవిదులు, నాంధ్రభోజ బిరుదాఙ్కులు నగు నీ మహారాజుగారు ఆహ్వానింపఁబడినదేది ? అన్ని దేశభాషలలో నమృతాధిక మాధురీధురీణ యని యేభాష యాచంద్రార్కఖ్యాతిగాంచినదో, యేభాషామతల్లి ని సేవించుటచే రాజరాజనరేంద్రుఁడు మనయందఱియిండ్లలో దేవతా ర్చన వేదికలపై దివ్యమూర్తులతో పాటు పూజనందుచున్నాఁడో, యే

భాషాద్రోహ నభ్యర్చించుటచే గృష్ణ దేవరాయల యశస్సింహాసన మష్టదిగ్గజములు వహించుచున్నవో యట్టి యాంధ్రభాషాదేవిని సేవించుట కేర్పాటుకాఁబడిన సాహిత్యపరిషత్తు." ఇత్యాదికమైన ప్రారంభ వాక్యములందే పీఠికాపురాధీశ్వరుల భాషాసేవానిరతిని ఆంధ్రసాహిత్య పరిషత్తు కావించు భాషోద్ధార విషయమును ప్రతిపాదించినారు. పీఠాపురప్రశస్తిని గూర్చి తెలుపుచు. దగ్గఅగనుండిన కందరాడలో పావులూరి మల్లన చంద్రం పాలెములో కూచిమంచి తిమ్మనయుండుటయే పీఠికాపురము పాదగయాక్షేత్రమై శివకేశవ సన్నిధానమునఁ బవిత్రమైనది. అష్టాదశమహాపీఠములలో నిదియొకటి. మహాకవి నిలయమగుటచే రక్తికి, మహారాజాస్థానమగుటచే భుక్తికి, మాధవ మహాక్షేత్రమగుటచే ముక్తికి నిదానమైన యీపుర మాంధ్ర దేశ మహిళామతల్లి కంఠచూలానాయికమణియై ప్రకాశించుచున్నదని నిరూపించియున్నారు.

మహారాజమందిరమును గూర్చి వివరించుచు-"సంగీత సాహిత్య సుప్రసిద్ధుఁడగు కవివర్యుని యనేకచిత్ర విచిత్రార్థ ప్రతిపాదనయుక్తమయిన వసుచరిత్ర సంగీత పురాణపఠనము జరిగినదీ సభయందే. సర్వకామదకుఁ బరిణయ మెందుకోయి యని రామభక్తుఁడైన లక్ష్మణుఁడు కృష్ణమూర్తిని పరిహసించినదీ సభయందే." యనినారు. శిష్టు కృష్ణమూర్తి కవిగారు వసుచరిత్రలోని పద్యములు వీణవాయించి బలికించి పురాణపఠనము చేయుట, శిష్టు కృష్ణమూర్తి పిండిప్రోలు లక్ష్మణ కవుల వివాదము జరుగుట యందు సూచితములయినవి. ఈ పనులు జరిగినది గంగాధర రామారావుగారి యాస్థానిలో బులుసు వారింటఁ బుట్టిన విద్యారణ్యుఁడు (వేదార్థప్రతిపాదకులయిన బులుసు పాపయ్యశాస్త్రిగారు) ముప్పది రెండు పుట్ల రత్నగర్భను రామార్పణముగ గ్రహించిన దీసభయందే నవీన గౌతములు నర్వాచీన పాణినులు నూతన బాదరాయణులు విజయదశమినాఁడు మామహారాజేంద్రుని పై వారిపుత్ర పుత్రికాసంతతిపై నాశీః ప్రవృష్టిగురియించుచున్నది సభయందే. పిఠాపురాస్థానమున తర్క-వ్యాకరణ వేదాంతశాస్త్రముల

ఏటేటను. బరీక్షార్థులు వచ్చుట, విజయదశమి నాఁడు. వారిని సత్కరించి యాశీర్వదించుట యిచట సూచితము.

ఆస్థాన వైణికాగ్రగణ్య(తూము రాడ సంగమేశ్వరశాస్త్రి)గారి వీణారవామృతాస్వాదనావశములైన చిలుకలు కూడ స్తంభోపరి విటంకంబులనుండి సహావైఖరిని 'రామా' యని యనఁబోయి, సంగీత వైఖరిని 'రీమా' యని యనుచున్నదీ సభయందే. సంగమేశ్వరశాస్త్రి గారి వీణావాదన ప్రాభవమట్టిదియేయని యానాఁటి వారి నిశ్చయము.

ఆంధ్రశారదాదేవి దర్శనము నీ క్రింది విధముగఁ జేయించి యున్నారు. అనేక సహస్ర చంద్రమండల సన్నిభమైన యాస్యమండపము వీణాదండమువంక రవంత యొఱగియున్నది. ... ఆహా! అదిగో కుడివైపున రాజరాజనరేంద్రుఁడు, ఎడమవైపునఁ గృష్ణదేవరాయలు వింజామరములు చేతఁబుచ్చుకొని యెట్లు వీచోపులిడుచున్నారో! అదిగో! ఆ పీఠము మొదటఁ బీతాంబరము నడికట్టుతో నిలువఁబడి దేవికిఁ బారిజాతపుష్పములతోఁ బూజలొనర్చుచున్న యా పౌరోహిత్య బ్రాహ్మణుఁడెవరో తెలియఁగుదురా? నన్నయ భట్టారకుఁడు. అదిగో! ఒక్క చింతాకంత వాసి క్రిందుగ నిలువఁబడిన యాకుండలాలంకృతసోమయాజి కప్పురపుటారతి పళ్లెరము చేతఁ బుచ్చుకొని వహావ్వా: నీరజాసననీరజపత్రాక్షికి నివాళులిచ్చుచున్నాఁడే. (తిక్కన సోమయాజి) మఱియొక బెత్తెడు క్రింద పురోహితుని యంత పొట్టియుఁ గాక, సోమయాజియంత పొగయుఁగాక మట్టసపు మాదిరిగ నున్న మంత్రిశిఖామణి మహాలక్ష్మిదేవి కోడలని మందాకినీ సలిలపు గిండి దోసిటఁ బట్టుకొని సేవించుచున్నాఁడే! ఆర్యులారా! చూచుచున్నారా? (ఎఱ్ఱాప్రెగడ.) ఈవిధముగ నాంధ్రసరస్వతీ సమారాధనముగావించిన ధన్యమూర్తులు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు.

పానుగంటివారి నర్మదా పురుకుత్సీయము

శ్రీ బండారు తమ్మయ్య.

సుప్రసిద్ధ నాటకకర్తలగు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు ఆంధ్రమున రచించిన నాటకములు ముద్రితాముద్రితములు రమారమి ముప్పదికిఁ బయిగనున్నవని తెలియుచున్నది. వీనిలో వీరు ప్రప్రథమమున 1900 సంవత్సరములోఁ దమ ముప్పదియైదవయేట రచించినది నర్మదాపురుకుత్సీయము. శ్రీనాథకవి సార్వభౌముఁడు "సంతరించితి నిండుజవ్వనంబునయందుఁ హర్షనైషధ కావ్యమాంధ్రభాష" యని చెప్పినట్లు వీరు దీనిని నిండు జవ్వనముననే రచించిరి. 1900 సంవత్సరము ఏప్రియలు 27 తేదిని ప్రారంభించి మెయి 26 తేదికి దీనిని ముగించితిమని వీరు పీఠికలో వ్రాసికొనిరి. "నాటకాంతం కవిత్వమ్" అని మన పెద్దలయాభాణకము కాని తమ యప్రతిమ ప్రతిభావ్యుత్పత్తులచేఁ బంతులుగారు "నాటకారంభం కవిత్వమ్"అనునట్లు మునుముందేయీప్రౌఢ నాటకరచనమునకుఁబూనుకొనియతిసమర్థముగ నిర్వహించిరి. ఇది శృంగారరసప్రధానమయిన నాటకము. దీనికిముందు వీరురచించినగద్యపద్యకృతులేమయిననున్నవో లేదో తెలియదు. పంతులుగారి రచనలో సాధారణముగ నప్రయత్నముగ ననుస్యూతముగ హాస్యరసముగూడ సరసముగ వెల్లివిరియుట సహజము. కాఁగా నీప్రాథమిక నాటకమునందుఁ బ్రధానరసమయిన శృంగారమునకుఁ దోడుగా హాస్యాద్భుతకరుణరసములుగూడ సంగములుగఁ జేరినవి. పురుకుత్సుఁడు భరతఖండమును బరిపాలించిన ప్రాచీన చక్రవర్తులలో నొకఁడు. అతఁడు సుమతియను పట్టమహిషివలన సంతానమును బడయక సంతానార్థమై నర్మదయను నురగకన్యను వివాహమగుట యిందలి యితివృత్తము. ఆంధ్రభాగవతములో పురుకుత్సచక్రవర్తినిగూర్చి రెండువంక్తులకంటె నెక్కువగ వ్రాయఁబడియుండకపోవుటచేఁ గొంతకథ కల్పింపవలసివచ్చినదని పంతులుగారి

నాటకముయొక్క పీఠికలోఁ దెలిపియున్నారు. భాగవతము నవమస్కంధములో ఇక్ష్వాకువంశానుక్రమములో మాంధాతృ చరిత్రమునందం తర్గతముగ... "మాంధాత రెండవకొమరుఁడు పురుకుత్సుఁడు. అతని నురగలోకమునకుఁ గొనిపోయి భుజంగకుమారులు తమచెల్లెలగు నర్మదయను కన్యకను వివాహము చేసిరి. పురుకుత్సుఁడును నక్కడ ననేక గంధర్వనాయకులవధించి తన నాగలోకసంచరణంబు దలంచువారికి నురగభయంబు లేకుండ వరంబువడసి తిరిగివచ్చెను" అను వాక్యములు నాకుఁ గానవచ్చినవి. పంతులుగారుదాహరించిన యీ స్వల్ప చరిత్రమిదియే యని తలంతును. ఏదిమెట్లున్నను అయిదు అంకములలో రచితమైన యీనాటకమందలి కథ చాలవఱకుఁ బంతులుగారు స్వయముగఁ గల్పించినదనియే మనము తలంపవగును.

పాత్రసంభాషణములను చాకచక్యముతోఁ గూడిన వాక్యోప వాక్యరచనములతో సముచితముగఁ గూర్చి సాగించుటలో వీరు చాల నిపుణులు. షేక్స్పియరు ప్రతిభ నీవిషయమున వీరు చాలవఱకుఁ బడికిపుచ్చుకొన్నట్లు గోచరించును. ఆంగ్లమున నాటకరచనమునకు ముఖ్యముగా Blank verse అనుకూలముగ నుండునని తలంచి షేక్స్పియరు మహాకవి దానినే యెక్కువగఁ దననాటకములలోఁ గయికొనినాఁడు. అట్లే యాంధ్రభాషలో తేటగీతి,ఆటవెలఁది,సీసము, కందమునను జాతిచ్ఛందములే నాటకరచనమునం దుపయోగకరములనియెంచి యీప్రప్రథమ నాటకమునందే పంతులుగారాఫక్కినామోదించి యాలంబించినారు. "ఉపమా కాళిదాసస్య" అనుసూక్తి గీర్వాణ వాఙ్మయమున సుప్రసిద్ధము. ఉపమాలంకారము కాళిదాసునకువలెనే (శ్రీ) లక్ష్మీనరసింహరావు పంతులుగారికిని గడంగనుఁ బ్రియమయినది. అందుచే నీప్రాథమిక నాటకమునందే వారు నూటికిఁ దొంబదిపద్యములలో దానిని గీతపద్యములందలి మొదటి రెండు

పాదములందుఁ జేర్కొనఁబడిన విషయములకు దృష్టాంతపూర్వకముగఁ దక్కిన మూఁడుపాన్గు పాదములలోఁ జక్కఁగ సరిపడునట్టి యుక్తులను బ్రయోగించియున్నారు. పైనిజెప్పిన కారణములచే వీరి యీ మొదటినాటకమే పండితమండలి హృదయముల బాగుగ నాకర్షించి వీరికి "ఆంధ్రషేక్స్పియరు" "అభినవకాళిదాస" అను బిరుదములను ఘటింపఁజేసినది. కాళిదాసు అభిజ్ఞానశాకుంతల నాటకమందలి ఛాయలు కొన్ని స్థలములుగ నీనాటకమందును గోచరింపఁగలవు. జర్మనుదేశ తాత్త్విక కవిశిరోమణి గటి (Goethe) మహాశయుఁడు శాకుంతలము నాంగ్లానువాదముననే చదివిన యంతమాత్రముననే హర్షోద్రేకమున నాట్యమొనర్చుచు నీ క్రింది గీతమును వెలార్చెనని చెప్పుదురు.

"Art thou the young years' blossoms and the fruits of its decline
Art thou the charm by which the soul is enraptured, feasted and fed,
Art thou the earth and heaven in one sole name combine,
I name thee O! Sakuntala! and all at once is said"

శాకుంతలములోఁ బ్రథమాంకముననే దుష్యంతుఁడు కణ్వమహర్షి యాశ్రమపరిసరారణ్యమున వేఁటాడుట కేఁగినసందర్భముననే యాతనికిఁ గథానాయిక శకుంతలతోడి సమాగమము. అతఁడు వెడలిన యనంతర మాతనిగూర్చిన ధ్యానములోఁ బరవశ యైయున్నతఱి దూర్వాస మహర్షి శాపమున కామెలోను కాఁగా, పంతులుగారి నాటకములో పురుకుత్సుఁడు విశ్వామిత్రమహర్షి యాశ్రమ సమీపారణ్యములో వేఁటకువచ్చి యచ్చట నొక యశోకవృక్షచ్ఛాయ నధివసిం

చిన యామునీశ్వరుని దుష్పుని చిఱుతపులియని భ్రమించి బాణమునఁ గూల్పఁగా విశ్వామిత్రుఁడు కోపోద్దీపితుఁడయి యధోలోకగతి నొందుమని యాతని శపించినట్లున్నది. శకుంతల వృత్తాంతములో స్వర్గభూలోకములకలయిక యామె జననకారణముననే ఘటిల్లినది. విశ్వామిత్రుని తపోభంగమునకయి మహేంద్రుఁడు స్వర్గమునుండి మేనకాప్సరసను బంపఁగా నామెవలలోఁజిక్కి విశ్వామిత్రుఁడామెకు వశుఁడయి యామెతోఁ గొంతకాలము కాఁపురముచేసి శకుంతలను బడయుట సుప్రసిద్ధమే. గాంధర్వ వివాహానంతరము దుష్యంతుఁడు దూర్వాస శాపకారణమున శకుంతలా వృత్తాంతము విస్మరించి యెప్పటికి నామెను రాజధానికిఁ దీసికొనిపోవుటకు రానందున కణ్వుఁడే శిష్యులవెంట నామెను దుష్యంతునొద్దకుఁ బంపఁగా నాతఁడామెను దిరస్కరించుట. ఆమె యనాథయై విలపించుచుండ స్వర్గమునుండి యామె జనని మేనక యేతెంచి గగనమార్గమున నామెనుగొనిపోయి స్వర్గపరిసరములనున్న మరీచాశ్రమమునఁ జేర్చుట, యచ్చటనే యామె భరతుని బ్రసవించుట, దూర్వాస శాపఫలము తీఱిన తరువాతఁ దాను వివాహసమయమున శకుంతలకొసంగిన యంగుళీయకము జాలరులకుఁ జిక్కినమత్స్యముయొక్క గర్భమున దొరకినప్పుడు దానిని జూడఁగనే కలిగిన యభిజ్ఞానమువలన దుష్యంతుఁడు గతవృత్తాంతమునకెంతయు వగచి శకుంతలకయి విరహవేదననొందుట, స్వర్గమున మహేంద్రుని సేవించి తిరిగివచ్చునపుడాతనికి శకుంతలాభరతుల సమాగమము లభించుట శాకుంతల నాటకమందలి యద్భుతసన్నివేశములు. నర్మదాపురుకుత్సీయమున విశ్వామిత్రశాపానంతరము శాపముయొక్క సద్యఃఫలముగనో యనునట్లు ఉరగలోకమునుండి వచ్చిన యంశుమంతునిచే మోహనవిద్యాప్రభావమున వెనువెంటనే

యురగలోకమునకుఁ గొనిపోఁబడి నర్మదోద్యానమున నొక చంద్రకాంత శిలావేదికపయి శయనింపఁ జేయఁబడుట, అప్పుడు నాయికతో నాతనికి సమాగమము కలిగిన తరువాతఁ గొలఁదికాలమునకే మరల నంశుమంతుఁ డాతనిని భూలోకమునఁ జేర్చుట, పురుకుత్సునిఁ దన చెంతఁగానక నర్మద విరహభరమునోర్వక చెలియగు నవమాలికతో భూలోకమునకే తెంచి పురుకుత్సుని యుద్యానమున విదూషక సహితుఁడయియున్న యాతనినిగనుంగొని మరల నానందించుచుండఁగా నింద్రునిచే నంపఁబడిన చిత్రకేతుఁడను గంధర్వుఁ డాకెను స్వర్గమునకుఁగొనిపోవుట, అనంతరము నింద్రుడు పురుకుత్సుని గూడఁ దన లోకమునకు నారదమునీంద్రునిఁ బంపి తీసికొనిపోయి, నర్మదా పురుకుత్సుల పరస్పరానురాగము పరీక్షింప విచిత్ర నాటకమాడించుట, ఆపిమ్మట భూలోకమునకు శచీపురందరు లరుదెంచి, నర్మదను వెదకికొనుచువచ్చి పురుకుత్సునితో సమరమునకుఁ దలపడిన యామె తండ్రి మందారుని సమాధానపఱిచి నర్మదాపురుకుత్సుల వివాహము నెఱవేర్చుటయుఁ గలవు. శాకుంతలమున స్వర్గభూలోకముల రెంటింటి కలయికనే ఘటిల్లఁగా నర్మదా పురుకుత్సీయమునఁ బంతులుగారు పయివిధముగా స్వర్గమర్త్యపాతాళముల మూఁడింటికలయికను ఘటిల్లఁ జేసిరి. ఇఁక నీ యుపోద్ఘాతము నింతటితోఁ జాలించి నాటకములోని ప్రతియంకమునందలి కథను సంగ్రహముగ వివరించి సమీక్షించి పంతులుగారి రచనా విశేషములఁ గూర్చికొంత ముచ్చటించెదను.

<u>ప్రథమాంకము</u> :— ఉరగలోకపాలకుఁడు మందారుఁడు పెండ్లియీడువచ్చిన తన కుమారి, సౌందర్యవతియగు నర్మద కనురూపుఁడగు వరునిఁ గూర్చి పరిణయ మొనరింప నారాటమొందియుండెను. ఈ సంగతి నెఱింగిన యాతని ప్రధాని అంశుమంతుఁడు తన ప్రభువుతోఁ జెప్పకయే నర్మదావరాన్వేషణముకొఱకురగలోకము

మంత్రియు, మహేంద్రుని కొలువుకూటమునకుఁ జెందిన చిత్రకేతుఁడను గంధర్వుఁడు మర్త్యలోక వార్తలను మహేంద్రునకుఁ దెలిపెడికార్యము మీఁద స్వర్గలోకమునుండియు నించుమించుగా నేకకాలముననే భూలోకమున విశ్వామిత్రాశ్రమ పరిసరారణ్య భూమియం దవతరించిరి అడవి యుసిరికాయ యంబుధిలవణములకు వలె నిట్లు వీరిరువుర కాకస్మిక సమావేశము సంఘటిల్లెను. పరస్పర సంభాషణమున "సంబంధమాభాషణ పూర్వమాహుః" అను కాళిదాసుచెప్పినట్లు స్నేహబాంధవ మేర్పడి వారు తామువచ్చిన ప్రయోజనముల నన్యోన్యమెఱుకపఱచికొనిరి. చిత్రకేతుఁడు తానంతకుమున్నె పర్మదా సౌందర్యమును గుఱించి విని యానందించుచుంటినని యామెకు మర్త్యలోక చక్రవర్తి పురుకుత్సుఁడు తగినవరుఁడు కానగునని యాసుమంతునకు వచించెను. "నే నెప్పుడాతనిని జూచియుండలేదు. మీ రెన్నఁడైనఁ జూచితిరా"? యని యాసుమంతుఁడు ప్రశ్నించెను. అతఁడొకనాఁడు వేటకువచ్చి కరిసంఘముల భంగపఱచినప్పుడు స్వయముగాఁ జూచితినని చిత్రకేతుఁడనెను. ఇంతలోఁ దరిలోఁ బెద్ద కలకలము వినవచ్చెను. పురుకుత్స చక్రవర్తియే యాయరణ్యమున వేఁటాడుటకు మరల వచ్చుచున్నట్లు తెలియవచ్చెను. ఆకస్మికముగ నాచక్రవర్తిని గాంచుభాగ్యము కలుగనున్నందుకు ఆసుమంతుఁ డానందించెను. తిరస్కరిణీవిద్యాప్రభావమున నొరులకుఁ గనఁబడకుండఁగ నచ్చటివిశేషములను గనుచు వినుచుండుటకు వారిరువురు తలంచిరి. విదూషక సహితుఁడయి పురుకుత్సుఁడచ్చటి విశ్వామిత్రాశ్రమ పరిసరముల వేఁటకేతెంచెను. అచ్చట అశోక వృక్షచ్ఛాయ నధివసించియున్న తపస్విని గాంచి చిఱుతపులియని భ్రమించి దానిని గూల్పఁ ధనుస్సున బాణము సంధించెను. ఎందుచేతనో మనస్సు కలతనొందుచున్న దనియుఁ గన్పించునది చిఱుతపులి కాదేమోయనియుఁ బురుకుత్సుఁడు శంకించి బాణ

కాఁడేఁగా విదూషకుఁడు సంధించిన బాణమును వెనుకకులాగుచు ఇక్ష్వాకువంశరాజుల లక్షణముగాదని రాజును హెచ్చరింపఁగా నాతఁడు తొట్రుపాటుతోనే బాణమును విడిచెను. ఆశ్రమ మృగము నెవ్వఁడో కూల్చెనని విని కోపముచే మండిపడుచు విశ్వామిత్రుఁడు "గాధినందను పృథుతపఃకలితశక్తి! కన్నుగానక మదమున నన్ను కనఁడు కుసుమసుకుమారయగుదీని వధియించె నతఁడధోలోకగతుఁడగునుగాక" యనియొసంగిన శాపము చెరలోన వినవచ్చెను. మృగమును కూల్చినది తనశిష్యసఖుఁడయిన మాంధాత చక్రవర్తి పుత్రుఁడయిన పురుకుత్స చక్రవర్తియే యని తెలిసి విశ్వామిత్రుఁడును మిగులఁ బరితపించెను. పురుకుత్సుని యనునయ వాక్యములకు మనసు కరఁగి విశ్వామిత్రుఁడు "వదలిన బాణమును నీవు వెనుకకు నాకర్షింప లేనియట్లు నేనును నాశాపమును మరలింపలేను. కాని నధోలోకగతి స్వల్పమయినను దప్పదు ... అధోలోకగతి స్వల్పకాలమయినను దప్పదు. తరువాత సూర్యలోకమునకుఁ బోయియచ్చట నింద్రాది దేవతలను దర్శించి భూలోకమునకువచ్చి పారిజాతికమను దేవివలన సూర్యసమానుఁడగు పుత్రునిఁగాంచి సుఖింతువు" అని యాశీర్వదించి విశ్వామిత్రుఁడు తరలిపోయెను. మునివరుని తిట్టు దీవనగాఁ బరిణమించి పురుకుత్సుని నరకలోకమునఁ జేర్చి నర్మదాసమాగమము గలిగించుట కనువు సేర్పఱిచెనని సంతసించి యశోమంతుఁడు మిత్రుఁడగు చిత్రకేతునతో "నీవిపుడే యీరాజును గొనిపోయి నర్మదోద్యానవనమునఁ జలువతాలి తిన్నెపయిఁ బరుండఁబెట్టెదను. నర్మదా పురుకుత్సు లన్యోన్య వీక్షణమున మోహావిష్టులయి దంపతు లగుదురుగాక" అని పలికెను "తథాస్తు అట్టులైన విశ్వామిత్రుని శాపమిప్పుడే ఫలింపనున్నది కాఁబోలును. మోహనవిద్య నీవు నేర్చిన యెడల తత్ప్రభావమున నీ రాజునకు విదూషకునకు నిద్రగావించు

రాజునుమాత్రము తీసికొనిపొమ్ము" అని చిత్రకేతుఁ డందుకనుమ
తించెను. అంశుమంతుఁడు మోహనవిద్యఁ బ్రయోగించి పురుకుత్సుని
విదూషకుని సమ్మోహితులఁ జేసి రాజునెత్తికొనుచుండఁగా "భూభా
రంబు నోయి పురుకుత్స నీకని! నొకనిచేత నెత్తి యుంటివీవు! భూమి
మోయు శేషుఁ బోలువాఁడగదరకంత! [illegible] రమఁగఁ జేయు భూతనాథు కర
ణి" ఇప్పుడు నీ బాహుబంధమునఁ జిక్కిన యీమహారాజునర్మదా
బాహుబంధములయందుముందునుస్థిరముగఁ జిక్కుఁగాక! "స్నేహబంధ
మునను నే నీవు వేర్వేఱు! తుదలనైతి మీవు పొదలుబర్వు! తోడఁ
గ్రిదికేఁగ తోడనేపైఁబోను! నేది నీకుతోడు నేనమువలె" అని
చిత్రకేతుఁడు నచించును "విప్రవర్య లెమ్ము లెమ్ము" అని విదూష
కుఁ దట్టి అంశుమంతుఁడు చిత్రకేతుఁడు నిరువురు తమలోకములకు
నిష్క్రమింతురు. నిద్రనుండి లేచిన విదూషకుఁడు తనతోడనే నిద్రిం
చిన చక్రవర్తిని నచ్చటఁగాంచక పరిపరివిధములఁ బరితపించుచుఁ బుర
మునకు మరలిపోవును.

ద్వితీయాంకము :- ఉరగలోకమున నుద్యానవనమున నర్మ
దయు నామెచెలి నవమాలికయు విహరించుటకువచ్చిరి. వారిపరస్పర
సంభాషణములలో నర్మద వివాహప్రశంస మువచ్చెను. ఏలోకము
వానినైనను దానుమఱనే యుపేక్షింతునని నర్మద వచించెను. భూలో
కమునందు రాజేంద్రు నెవనినైన వరింతువాయని నవమాలికయనఁ
జూచి చెప్పవలసినదిగాయనినర్మదయనెను. భగవంతుఁ డనుగ్రహిం
చినశీఘ్రముగాఁ జూతు నేమోయని నవమాలిక బదులుచెప్పి, మైరా
వతముపయి సంచారివలె సమీపమందలి చలువజాతి తిన్నెపయి
నేదియో కనవచ్చుచున్నది చూడుమనెను. అదేదియో చూచెదమ్మని
నర్మదయును నిరువురముఁ బోవుదము రమ్మని నవమాలిక యనెను.
ఎడమలోడ మిక్కిలి యదురుటచే వడఁకుఁ గొంకుచుంటిని. నీవే

పొమ్మని నర్మద నవమాలికతో ననఁ నాపె యాశ్చర్యముతో నటఁ జని చూచుచుండెను. ఇంతలో నర్మద తనలో "మహాసుందర పురుషుఁడును అమూల్యమణి గణఖచితభూషణుండును, మహారాజలక్షణలక్షితుండునగు నొక మహానుభావుఁడు నిన్నరాత్రి నాకు స్వప్నమున సాక్షాత్కరించి వచ్చెదను నాకరమున నుంగరమును బెట్టి, ఈ మణికాంతకుసుమా! యీలోకమునకు వచ్చితినని చెప్ప తంబురతీఁగ నొకకోన వీణాల ధ్వనియుఁ గంఠమును తీఁగయాతయు వ్యాపించునటు లొడలాపాదమస్తకము ఝల్లుఝల్లుమనఁ గన్నులువిచ్చితిని. శుభస్వప్నమయిన వెంటనే రానియ్యఁగూడని నిదురతనయంతఁ దానెమాయమయ్యెను. హృదయమా! అట్టిమహానుభావు నెన్నఁ డైనఁ జూచి—"అని వితర్కించుచుండెను. నవమాలిక సంభ్రమముతో వచ్చి "ఎండదగిలిన మృగరాజము చెట్టునీడనున్న పాలరాతిపలక పైఁబడి నిదురపోవునట్లు వరో కిరీటాంగభూషణుండగు నొక మహాతేజశ్శాలి యాచంద్రకాంత శిలావేదికపయిఁ బరుండి నిదురించుచున్నాఁడు". అని చెప్పెను. ఇరువురును బోయి యాతనిని విలోకించుచుండిరి. అంతలో అంశుమంతుఁడటఁ బ్రవేశించి "మహారాజుపైఁ బ్రవేశపెట్టిన మోహనవిద్య నుపసంహరించుట మఱచితినే వెళ్లితిని. ఈసరికి నర్మద యాతనిని జూచి సఖీ! లేచినాఁడా!"అని తటపట పరిశీలించి "ఆహా! మంచిసమయమునకే వచ్చితిని. తిరస్కరిణిచే కప్పియున్నవాఁడనై యీచిత్రమును జూచెదనుగాక" యని నిలిచియుండెను. నిద్రావస్థలోనున్న రాజునుజూచి నర్మదయు నవమాలికయుఁ బరిపరివిధముల నాలోచించుచుండిరి. తాను స్వప్నమునఁ గాంచిన మహాపురుషుఁ డచ్చముగ నీతఁడే కానగునని నర్మద వితర్కించి "సఖీ! నీమోము చిన్నవోయినట్లున్నదిసుమా" యని నవమాలికతో ననెను. "నిన్నుఁజూచువఱకాలాగే యుండు"నని నవమాలిక యనెను. అంశుమంతుఁడు "ఆహా! శాపము చేఁగల నా హృద

యభేదము నిదురంబోవుచున్న వీని దేహమునందాతని యెటులుకనిపెట్టి నదో! ఆహా! మోహముయొక్క సామర్థ్య మింతింతయని యనలేము గదా" యని తలంచును. నర్మద నవమాలిక పురుకుత్సుని పాదముల దరిం గూర్చుండిరి. నవమాలిక నర్మదచిత్రపటమువ్రాసి రాజ సమ్ముఖము పైనుంచెను. దానిని దీసి వైచు నెపముతో నర్మద రాజును బాగుగా స్పృశించి చిత్రపటము నచ్చటనే పారవేయును. అంతనమాంత్రికుఁడు రాజుపైఁ బ్రవేశపెట్టిన మోహనవిద్య నుపసంహరించును. రాజు మేల్కొనుటఁగాంచి నర్మదా నవమాలికలు తటాలునఁ బూలచెట్ల మాటునడాఁగికొనిరి. అంతఁ బురుకుత్సుఁడు కన్నులు నులుముకొనుచుఁ జెంత విదూషకునిఁ గాంచక పలువిధములఁ దలపోయుచు విశ్వామిత్రాశ్రమ ప్రదేశముగాఁ దోఁచని యీ క్రొత్తప్రదేశమునకుఁ దానెట్లు వచ్చితినో యని చింతించుచుండెను. భూర్జరపత్రమేమోయని చిత్రఫలకమును గాంచి యది చిత్రపటమేయని నిశ్చయించి యందలి విగ్రహమును గాంచి "కన్నులుండిన ఫలమును గాంచినాఁడనో యనోవ్వఁగ స్తుతిసేయ నోచినాఁడ పులకలెత్తఁగఁ గౌఁగిటఁ బొదువువాఁడ! ప్రియమ నాచింతఁ బాపఁగ వచ్చినావు" అని పదేపదే దానిని జూచి సమ్మోహితుఁ డగుచుఁజొచ్చెను. క్రమముగా నాతనిమాటలు హెచ్చెను. అది యేలో కదా! చిత్రఫలకమందలి కాంత యెవతయో నిశ్చయింపలేక

"చిఱుతపులిని బెట్టిచేయి జాఁచనిచ్చి
దుష్పిఁ జేసినాలఁ ద్రోచినావు
వనముమార్చి స్త్రీలనునిచి నోరునుజాఱ
నిచ్చి యేమి చేయ నెంచినావు"

అని విశ్వామిత్రునిగూర్చి విచారించుచుండును. "ఇంకను నుపేక్షించిన నాజీవనాపేక్షకు లేదు. ఆముకాఁ రాజు నిచ్చటికెట్లు తెచ్చెనో" యని నర్మద నిజసఖిని హెచ్చరించును. అవశ్యమిప్పుడే తోఁటనివత్తునని

నవమాలిక రాజునొద్ద కేఁగి యామిని ధర్మములనెల్ల నివారించి వాస్తవ సంగతుల నివేదించి నర్మదాస్నానార్థమునకాలని గొంపోయి యురుపుర సౌధచంద్రకాంత శిలావేదికపయి నధివసింపఁజేయును. తరువాత మన్మథుఁడు తరువాతి పనుల నెఱవేర్చును. ఇరువురుఁ బరస్పర సమ్మోహితులయిరి. పురుకుత్సుఁడు సమీపమున నున్న యొకప్రాఁకారరంటి శోభను గొని చూచుచు నందుఁజేరి నర్మదతోఁ గలియు నాకాంక్ష సూచింప నర్మద యామిని గద్దెమువట్టుకొని తొందరపడకుము. నా తండ్రిచాటుదానను. అతఁడు నాకు శీఘ్రముగ వివాహముచేయఁదలఁచి యున్నవాఁడు. నీవును నేనును రేపు కలిసి యామిని దర్శించి అక్కడ శుభముహూర్తమున వివాహమాడుదము అని నివారించెను. ఇంత రులు తమ మణియుంగరముల నొకరొకరంగుళుల నయిధరించిరి. తన యభీష్టానుసారము వారు పరస్పర మోహావిష్టులయినందు కెంతయు సంతసించి యంశుమంతుఁడు తన రాజు నెటుల కేక రాపించిన పనివినిన వాతనివలన నేమియుము వచ్చునోయని శంకించి పురుకుత్సుని మరల నరలోకముఁ జేర్చువాఁడయి మోహావిష్టనునర్మదాపురుకుత్సుల నయిఁబ్రయోగించెను నిద్రవచ్చుచున్నదని వారిరువురు నొకరితోఁ జెలపయి నొకరొరగి నిద్రించుచుండఁగా నంశుమంతుఁడు రాజు నెత్తికొని "నర్మదా! లెమ్ము లెమ్ము" అని చెప్పుచుఁ జైకినిమఱ్ఱీంచెను. నిద్రనుండి మేల్కాంచి నర్మద పురుకుత్సునిఁ గాంచనేరక పరిపరివిధములవిరహా సంతప్తయై విశ్వామిత్రుని మాయచే నరకలోకమునకు వచ్చిన యా రాజేంద్రుఁడు మరల నామునిమాయవలననే భూలోకమునకుఁ జేరి యుండునని నిశ్చయించికొని యామినికిఁ జేర్చుకున్నఁ బ్రాణములనిలుపఁ గలనని సఖి నవమాలిక నతిదీనముగఁ బలికాలెను. "ఆ మహారాజు నన్ను బుద్ధిపూర్వకముగ విడిచియుండఁడు కామగమనమున నిరుపురము భూలోకమున కేఁగి యామిని కలిసి కొనెదము లే" యని నవమాలిక

దూరా మెను సమాధానపఱిచి "ఈ యుద్యానమందలి మందమారుతము, చిలుకలు, కోకిలలు నిన్నిచ్చట మఱింత బాధింపఁ గలవు. భూలోకమునకిపుడే పోవుదము రమ్ము" అనెను.

తృతీయాంకము :— భూలోకమున పురుకుత్సుని రాజమందిర సమీపోద్యానవనమున నాతఁడు, నాతనిసఖుఁడు విదూషకుఁడును సమావేశమయి ముచ్చటించుచుందురు. నిద్రలోనుండఁగాఁ దన్నెవ్వరో విశ్వామిత్రాశ్రమారణ్యమునుండి యురగలోకమునకుఁ గొనిపోయి రనియు నచ్చట నురగరాజకన్యక నర్మదతో సమాగమము గలిగ ననియు నిరువురుమణియుంగరముల కొకరికొకరి కిచ్చుకొంటిమనియు నామెతో నానందించుచుండఁగా మరల నెవ్వరో తన్ను భూలోకమునకుఁ జేర్చి రనియు పురుకుత్సుఁ డాడినమాటలకు, నిద్రాపిశాచమునకుఁ దోడు మాహాపిశాచముగూడ నాతని నావహించినదనియు నదియెల్లభ్రమ యేయనియు విదూషకుఁ డాతనిని గేలిసేయును. తానేమియు భ్రమితుఁడు గాలేదని చెప్పుచు

"ఈ మణికి నా మణికి భేదమెంత కలదో
యింతులకుఁ గూడ నిక్కెరయా యింతి పొడటి
దన్నులఁ దలంచుదాని రూపెన్న నేల
మిన్ను చేనంటు నరుపాడ వెన్న నేల"

యనిపలికి నర్మద నుద్దేశించియే కాబోలు "ఓ యురగలోకవాస్తవ్యా" అని సంబోధించునంతలో అంసుమంతుఁ డచ్చటఁ బ్రవేశించి తన్నచ్చటికివచ్చి కలిసికొందుమని చెప్పిన మిత్రుఁడు చిత్రకేతుఁడింకను రాలేదేమని విచారించుచుండెను. విదూషకుఁడు పురుకుత్సుఁడు దీక్షవిచారముతో వాగ్వాదము లొనర్చుకొనిరి. తనగౌరవము రక్షించుకొనఁ దలఁచినవాఁడు కాంతల వలలోఁ బడరాదని హెచ్చరించి విదూషకుఁ డెన్నిరూ విమ్మరోక్తులాడ, పురుకుత్సుఁడు "చావు లొచ్చుకొని పోయి

కొంచెము హోరుకలిగి శ్రవణశక్తి తగ్గుచున్నది. నీవు విశేషించి మాటలాడిన ప్రయోజన మేమియు లేదు. ఓ యురగలోకవాసినీ! నర్మదా! నాకనులకు దృష్టిశక్తి గూడ మందముగాకముందే యొక్క-సారి యిటువచ్చి నన్నుఁ గౌఁగిలించికొనుము" అని వాపోవును. అప్పుడు భూలోకమునకయి ప్రయాణమై వచ్చిన నర్మదయు నవమాలికయు వచ్చుటఁ బ్రవేశింతురు. అంశుమంతుఁడు నర్మదను గాంచి "అహా! నర్మదా! వచ్చితివా? ఎంతసాహసముగలదానవు. (తలపంకించి)

"పిల్లి శావుగు మన నుల్కు వెలఁదులైన
మోహ మహావేశమైన నంబుధులు దాఁటఁ
గలరు లోకముల్ గావిలోకముల నైనఁ
బతయుదురు గాలివడి గాలిపడగఁ బోలి."

"ఓ చిత్రకేతుఁడా! పురుషుల్పునే చూచితివిగాని నర్మదను జూచియుండవు కదా! అహా! యింతయపూర్వదర్శనముగూడ నీకు క్షేమముగాఁ గలుగుఁగాక" అనునంతలో చిత్రకేతుఁడు వచ్చుటఁ బ్రవేశించును. అతనినిజూచి యంశుమంతుఁడు "పూజ్యుఁడైన చిత్రకేతుఁడా! నమస్కారము. మంచిసమయమునకు వచ్చితివి. అదుగో మహారాజు విరహభారవశుఁడై విచారించుచున్నాఁడు. వెనుకనుండు జలయంత్రమున గానుకొని సుపమేఘము నర్మద ప్రకాశించుచున్నది. తిరస్కరిణిచేఁ బ్రచ్ఛన్నుఁడవు కమ్ము" అని హెచ్చరించును. "అల్లి మిత్రమా! నమస్కారము. ఆలస్యముగ వచ్చినందుకు క్షమింపుము" అని చిత్రకేతుఁడు పలుకును. విరహవేదనతోఁ బురుకుత్సుఁడు

"చేతి చివ్వలకును చెక్కు లొత్తుకఁ జేసి
నన్నుఁ జూచి చిన్న నవ్వు నవ్వి
దానిమోము గ్రాలుఁ బరఫిత చంద్రికా
ఫలితఫలమునఁ జా్రమునర్ని వోలె."

అని పలుకఁగా నర్మద యామహాద్భుతవంతుఁరా లెవరో గదా యని పలుకును. "నీవే నిన్ను దెచ్చినదానను నేనే" అని నవమాలిక ప్రత్యుత్తర మొసంగును. చిత్రకేతుఁడు అంశుమంతునిఁ జూచి "పెండ్లి అను బాగుగ సంఘటించుటయందు నీవు తుంటవిల్లులేని మన్మథుఁడ వైతివి గదా! అహా! నర్మదయొక్క సౌందర్య మత్యాశ్చర్యకరముగ నున్నది. ఇంద్రలోకమునసైన నిట్టిసౌందర్యవతు లొకరిద్దఱుందు రేమో! ఈదినమున నింద్రునియాజ్ఞచే నొకచిత్రము జరుగవలసి యున్నది" యని చెప్పను. ఆ దేది? నేను వినఁదగినదేనా యని యంశుమంతుఁ డన "వినఁదగుదువు. చూడఁదగుదువు. అందుకు నాకు సాహాయ్యముగూడఁ జేయఁదగుదువు" అని చిత్రకేతుఁ డనెను. ఇంతలో నర్మదావిరహాతురమున దిలువోయి పురుకుత్సుఁడు

"మెదను తల నిల్వకున్న దీమెదను నాకు
చెవులు గడియలువడియెను జింతఁ జేర
రమ్ము నర్మద! నర్మదా! రమ్ము రమ్ము
నర్మదా! లేవ యొందుఁ బ్రాణములు నాకు."

అని మూర్ఛిల్లును. అంత నర్మద "నాథా! నాథా! ఇదిగో వచ్చితిని" అని యాతనిఁ గవుఁగిలించి "అయ్యో! ప్రాణవల్లభుని కెటులుందునోగదా" యని వాపోవును. విదూషకుఁ డాశ్చర్యపడుచు, "అయ్యో! రాజు మూర్ఛాగతుఁడయ్యెను. ఎంతయిక్కట్టు తటస్థించి నది. ఈమె నర్మదయే కాఁబోలును!" అని విచారించును. నర్మదయు నామెసఖి నవమాలికయు రాజున కుపచారములు చేయుచుందురు.

ఈలోపున అంశుమంతుఁడు ఇంద్రునియానతిచే జరుగవలసిన రహస్య మేదియో చెప్పుమని చిత్రకేతు నడుగఁగా నాతఁడు, "చిన్న నీవును నేనును సమావేశమైనయప్పుడు జరిగినసంగతు లన్నియుఁ బురం దరునితో విన్నవించితిని. అతఁడు మిక్కిలి సంతసించి మాంధాత

తనకుఁ బుత్రసమానుఁ డనియు, అతనికుమారుఁడు పురుకుత్సుఁడు తనకు మనుమఁ డగుననియు, తనకు మనుమరాలు కాఁబోవు నర్మదను దాను జూడకయే వారివివాహమున కంగీకరింపననియు, నాగలోకమునకుఁ బోయి నర్మదను దనలోకమునకు దీసికొనిరావలసినదని సెలవిచ్చెను. నర్మద నాగలోకమునఁ గనరాక యిటకు వచ్చితిని. రాజును నర్మదయు సమావేశ మయినవెంటనే నర్మద నింద్రలోకమునకుఁ గొనిపోదును" అని చెప్పెను. పురుకుత్సుఁడు మూర్ఛాగతుఁడయినవు డాతనిఁ గవుఁగిలించి నర్మద నిజసఖతో నాతని కుపచారములు చేయుచుండ, దాంపత్యభంగకృత్యముగా వారి నెట్లువిడఁదీయుదునని చిత్రకేతుఁడు విచారించుచు,

"వ్రతమాజ్ఞ దీర్ప వచ్చుట పాపంబు
దీర్పకున్న గొంతు దెగుట నిజము
ముందు, వెనుకఁ గూడఁ బోవుచున్నది మది
రెండుతలలపాము రీతిగాను."

అని పఠింప సంతసమంతుఁడు

"దంపతులు మీకు సుఖయించుదారి యట్టి
వ్రతకంటకును దెలియంగ వశమె నీకు !
మావులను మల్లె లోలయించు మాధవుండు
తోఁటఁ గాచెడికాపరివాటి గాఁడె !"

అని యనునయించెను. ఇంతలో పురుకుత్సుఁ డించుక లేచి కన్నులు మూసికొని "ఓహో ! నర్మదా !

"ఉడుకు నామోము చల్లగ నొత్తి యురము
రమ్ము చేరిచి విపులసౌఖ్యమ్ము నిచ్చి
కౌఁగిలించితి వని కలఁ గాంచినాఁడఁ
గద యభాగ్యునకుఁ గలల కలిమిగాఁడె !"

అని వాపోవుచుండ విదూషకుఁడు

"రాజా! మహాభాగ్యవంతుడవు! ప్రత్యక్షమైన నర్మదనే చూచుచు, కనులు విప్పుము" అని యుద్బోధించెను. పురుకుత్సుఁడు కనులు తెఱచి తొందరగ నర్మదను కౌఁగిలింప నామె "నాథా! నీ విప్పుడు దేహమున సుఖముగ నున్నవా" యని ప్రశ్నించెను.

"నాసుఖంబున కేమిలే నాతి! నీవు
సత్యముగ నర్మదవో లేక స్వప్నదృష్ట
నర్మదవొ ముందు చెప్పుము నాదు శిరము
నిలిచినక్షణ సర్వంబు నిలుచుఁగాదె!"

యని పురుకుత్సుఁడు మాఱుపలుక నామె "యథార్థముగా నర్మదనే. నీముద్రయుంగరమును జూడుము" అని యుంగరమును జూపింప దానిని జూచుచు నానందపారవశ్యమునఁ గన్నులు మూసికొనిపోవుచున్న వని యాతఁ డనెను.

ఇది యేసమయ మని యెంచి—

చిత్రకేతుఁడు అంగుమంతుసిదెన నవలోకించి "వయస్యా! తిరస్కరిణి నుపసంహరించి యప్రచ్ఛన్నరూపముతో నీమను పైకిఁ దీసికొనిపోదును. నీమోహనవిద్యాప్రభావము నొక్కచెప్పపాటులో నాసమయమునఁ గనబఱుపవలెను. ఓహో భాను వహోదరసుమా! నాకు సెలవిమ్ము" అని వెనుకనుండి వచ్చి గబాలున నర్మదను పైకెత్తుకొనిపోవును. పైకిఁ బోవుచు నర్మద "నాథా! పురుకుత్సా! శివశివా! నాథా! రక్షింపుము" అని యుంగలార్చును. ఇట్టులు నర్మద యాకస్మికముగ నదృశ్యయై యూర్ధ్వమార్గమున నెవరిచేతనో కొని పోఁబడుటకు రాజు, విదూషకుఁడు, నవమాలిక, సంభ్రమాశ్చర్యములచే నెంతయు సంతాపించిరి. పురుకుత్సుఁడు ధనుస్సున బాణము సంధించి చేయువిడిచేఁ బాణమును దనపయినే వేసికొనయత్నింపఁగా

విదూషకుఁడు వారించి దానిని నాపైఁ బ్రయోగింపవలదని హెచ్చరించును. బ్రహ్మహత్య నొనర్పుమందువా ? యని రాజు చెప్ప నాస్త్రీహత్య యంతకన్న మహాదోషమని యెఱుఁగవా ? యని విదూషకుఁడు బదులుపలుకును. పురుకుత్సుఁడు నర్మదసభ వనమాలిక నాజ్ఞాపించి నాగలోకమునకు నామెను బంపివేయును. అంత ఏదియోపనియున్నది తొందరగా రమ్మని దేవిగారి ముసలదాయి యనది రమ్మని పట్టమహిషి సుమతి చెలికత్తె కల్యాణివచ్చి నివేదించెను. రాజకార్యము నేదియో సభ్యుఁడును దానను బరిశీలించుచుండిరని చెప్పుమని రాజామెను బంపివేయును.

అసలు పెండ్లము యొక్క వార్త యిటువంటి కష్టసుఖములకన్నిటికి నుచ్చాటనమంత్రము సుమా ! వయస్యా, అన్నివిధముల దేవిగారు నిన్ను సుఖపెట్టుచుండ నీ వన్యకాంత నపేక్షించుట యుచితమా ?" అని విదూషకుఁడు రాజును మందలించును.

"సుమతితో నిరువదిసంవత్సరములనుండి సంసారము చేయుచున్నను నొక పుత్రుఁడయినను లభింపలేదు. సంతానకాంక్షచే నన్యకాంతాసక్తుఁడనైతిని గాని వేఱొండు కాదు. ఇట్టిచో అత్యంత సౌందర్యవతి యగునర్మద నా కాసఁగొలిపి గుండె కొల్లచేసిపోయినది. ఆమెను గాంచునాశ మానలేను. సంతానాపేక్ష విడలేను. ఏమి చేయుటకుఁ దోఁచకున్నది" అని పురుకుత్సుఁడు సమాధానమొసంగెను.

"ఆశలన్నియు నడుగంటినప్పుడు హరినామస్మరణముకంటెఁ జేయునది లేదు" అని విదూషకుఁడు హరినారాయణ, హరినారాయణ అని పాడును. తెరలో నట్టిధ్వనియే వినవచ్చెను. వీణ వాయించుచు నారదమహాముని వారి యెదుటఁ బ్రత్యక్షమయి "ఇంద్రలోకమున నింద్రునిసన్నిధి నొకభూలోకరాజన్యునిచరిత్ర మొకచిత్రనాటకముగ నాడఁబడుచున్నది. దానిని జూడ మనుమఁడవగు నిన్నుఁ దీసి

గొనిరమ్మని మహేంద్రుఁడు పనుపఁ బంపియున్నాఁడు. త్వరగ బయలు దేఱుము" అని యాదేశించెను. పురుకుత్సుఁ డామహేంద్రుని గారవించి శివచరిత్రమే యొకనాటకముగ నున్నదని శివగోష్ఠినెల్ల నేకరువువెట్టి

"ముద్దుటుంగరములు మురిపెముగాఁగిచ్చి
మురులు మార్చుకొంటి మరియు నేను
త్రాడుగట్టినట్టి యాలోటు లేకుండ
గొంతుత్రాడు వేసి యుంటి నేఁడు."

అని మనవిచేయును. ఇంద్రుని యాజ్ఞ నెఱవేర్చుటచే నారదుఁడు సంతసించును. అతని యనుమతిమేరకు నిన్నుఁ గొనిపోవుటచే హరి నామస్మరణపరాయణుఁ డగు నేను సంతసింతును. ఇందుచే నీమనోరథ సిద్ధియగును తెమ్ము" అని త్వరపెట్టి నారదుఁ డాకాశగమనమున నాతనిఁ గొనిపోవును. ఈసంగతుల నంతఃపురమునఁ దెలియఁజేయు మని విదూషకునికి రాజు ముదల యొసఁగును.

చతుర్థాంకము.

ఇంద్రుఁడు నర్మదాపురుకుత్సుల నాకలోకమునకు రప్పించుటకుఁగల ముఖ్యకారణము: చిత్రకేతునివలన వారి పరస్పరానురాగ వార్త వినినతరువాత శచీపురందరులకు నర్మదాపురుకుత్సుల యన్యోన్యానురాగములలో నెవరిది బలీయ మను విషయమున వివాదము ఘటిల్లెను. నర్మదయనురాగము నిర్వ్యాజము నిర్భరము నని, పరమగంభీరమైన ప్రేమ యెవ్వరును మాటలచే వెల్లడింపఁబడునది కాదని శచీదేవివాదము. పురుకుత్సుని ప్రేమయే బలిష్ఠమని మహేంద్రుని వాదము. దీనిని ప్రత్యక్షముగఁ బరీక్షించుటకే యాయంకమందలి చిత్రనాటకము కల్పితమయినది. ప్రేక్షకులయెదుట దేవాలయమునఁ నుండునట్లు త్రిపురసుందరిప్రతిమ నిలిపి సూత్రధారునిచే నియముకుఁడైన చిత్రవర్ణుఁడను సేవకునిచే దేవీస్తుతి నొనరింపఁజేయుట

కన్న మహాంకువిశేషము లిందుఁ గానరావు. వర్ణకమే త్రిపురసుందరిగఁ బ్రదర్శితమయినది. అద్భుతముగఁ ద్రిపురసుందరివలెనె మిక్కిలి సంయమనముతో ఆపాత్రము నభినయింపనిచో దీవ్రముగ శిక్షింతునని యింద్రుఁడు వర్ణదను ముదల నొసంగి సూత్రధారునిచేఁగూడఁ జెప్పించును. ఇంద్రుఁడు, శచీదేవి, సూర్యుఁడు, చంద్రుఁడు, బృహస్పతి, నారదుఁడు, పురుషుస్సుఁడు నాటకమందలి ప్రేక్షకులుగ నాసీనులగుదురు.

అహల్యావృత్తాంతము మనమున నిడికొని శచీదేవి పురందరుని, తారాగమనసంగతి నుద్దేశించి బృహస్పతి చంద్రుని వ్యంగ్యముగ దెప్పిపొడుచుమాటలుఁగూడ నిందు మనోహరముగఁ జిత్రింపఁబడినవి. సూత్రధారుఁడు నాటకము నారంభించుటకు మునుముందు ఇంద్రుని యాజ్ఞ నర్థించును. అది యిదివఱకే యియ్యఁబడినదని యింద్రుఁ డనునంతలో నారదుఁడు తుమ్మును. ఇంద్రుఁ డాతనిఁగని "ఋషిసత్తమా! తాము తుమ్మితిరే. నాటకప్రయోగము బాగుగ నుండక పోవునో లేక మనము నాటకమును సాంతముగఁ జూచుట సంభవింపదేమో" యని వచించును.

"ఎవ్వఁడు నిర్గుణుం డగు నహీనశుభోన్నతసద్గుణాఢ్యుఁడై
యెవ్వఁడు దృశ్యమూర్తి యగు సృష్టిచరాచరవస్తువాసియై
యెవ్వఁ డధోక్షజుండునగు నెవ్వఁడు యోమ్మునఁ గాంతఁగట్టినాఁ
డవ్విభుఁ డాశ్రితార్తిపరిహర్త యొసంగును మీకు మోక్షముల్.

అని నాందిపద్యముఁ జదివి సూత్రధారుఁడు నాటక ముపక్రమించును.

త్రిపురసుందరీప్రార్థనము మునుముందు గావించుట యావశ్యకమని నటీసూత్రధారులు

"దుర్గ! సంరక్షితాశ్రితవర్గ! విష్ణు
నామసంకీర్తనవిసర్గ! నవవిలాస
చాతుర్యచలితభర్గ! చరణసేవ
ఫలము వందనములను గైకొనుము తల్లి!"

అని పాడుచుఁ దేవమత్స్యాంగ నాలయములో నర్మద ప్రతిమవలె నధిష్ఠితమై కానవచ్చెను. అంతట బుధకుమారుఁడు (తనలో) ఏమిది, ఏమిది, ఏమిది! నా ప్రాణవల్లభయైన నర్మదాయేమి! హా! నర్మద వలెనే కాన్పించుచున్నది. (లేచి తొట్రుపాటుతో) అయ్యయో నర్మదయే కాఁబోలును! అహో యిచట కెట్లువచ్చెనో కదా! ఛీ! నర్మద కాదేమో!

"మృత్యువాతను బడినట్టి మొగిడిపోవు
నర్మదను నేను తిరిగి కాంచంగఁగలనె?
అగ్నిదేవుఁడు గ్రహియించు నాహుతితతి
తిరిగి గ్రహియింపలేనట్టితీరు గాఁగ."

అని కడుంగడు తొట్రుపాటు నొందును. సూత్రధారుఁడు మరల

"మాతా! శీతాద్రిసుసం
జాతా! స్వీకాంబుకజలజాతా! పూత
ధ్యాతసుగుణసంఘాతా!
నాతాపముదీర్పుము ధృతినతజనజాతా!"

అని దేవిస్తుతి గావించును. ప్రతిమకేసి చూచుచున్నకొలఁదిఁ బుధకుమారుని సందియములు, ఆరాటములు ప్రవృద్ధములు కాఁజొచ్చెను. అంత నాతఁడు "ఈమె నాకు సుఖప్రదాయిని గనుక నా కిప్పింపు మని యింద్రుని నడిగిన దైన్య మగునుగాని యీమె యెవ్వరని యడిగిన బాధ లేదనుకొనెదను" అని విహ్వలత నొందసాగెను. అతని సంభ్రమమును గాంచి యింద్రుఁడు "పురుహూతా! గాలిచేఁ గొట్టు

గొను కేతనమువలె నేల యిట్లు సంభ్రమించుచుంటివి ?" అని ప్రశ్నిం చును. (చేతులు జోడించుకొని) "అయ్యా ! ఈ త్రిపురసుందరీవేష మభినయించెడువార లెవరో నేనడిగిన మన్నింతురుగాక" యని పురు కుత్సుఁ డనెను. ఇంద్రుఁడు నవ్వుచు "సూత్రధారు నడుగవలసిన మాట నన్నడిగెదవేమి ?" అని ముదలకించును. "దేవా ! క్షమింపుము. సూత్రధారు నడుగవచ్చునా ?" యని పురుకుత్సుఁ డన "ఎందులకు నీ కింతతొందర" యని యింద్రుఁడు చెప్పి (అపవారించి) "దేవీ ! చూచితివా పురుకుత్సునివికారము" అని శచీదేవితో ననును.

అంత నారదుఁడు (తనలో) "ఆహా ! అంతతొందర మోహముల కవి సహ్యసాహసుఁ డాక్షేపించుచున్నాఁడే ! రెండుజాముల రాత్రి యుండఁగనే నదివడిగఁ బోయి మునికొంపఁదీసినవ్వు దీశాంత మితని కెక్కుడగుఁబోవునో" అని గొణిగికొనును.

పురుకుత్సుఁడు కాలిమి లేక సూత్రధారునికడ కేఁగి యుండలు నవ్వుచుండ "ఓయీ ! పర్వ్యదావేష మభినయించువా రెవరు ?" అని ప్రశ్నించును. "రాజేంద్రా ! ఇచట పర్వ్యదావేషము లేదే" అని సూత్రధారుఁ డన నాతనిచేతులను బట్టుకొని "పర్వ్యదావేషము గాక యథార్థపర్వ్యదయే కద !" అని తొట్రుపాటుతోఁ బురుకుత్సుఁ డనును.

"రాజా ! మీయభిప్రాయము నాకు తెలియకున్న" దని సూత్ర ధారుఁ డనును. అంతే పురుకుత్సుఁడు (తనలో) "ఇదలు తెలియక నాయభిప్రాయమే నే నెఱుఁగనప్పుడు నాయభిప్రాయము వీనికిఁ దెలి యకపోవుట వింతకాదు." (ప్రకాశముగా) "అయ్యా ! త్రిపురసుందరీ వేష మభినయించువా రెవరు ?" అని యడుగును. "అయ్యా ! క్షమిం చుఁడు. అట్లు చెప్పుట సామాజికశాసనమునకు విరుద్ధము. అయినను తాము రాజేంద్రు లాజ్ఞాపించితిరి కావ..." అని సూత్రధారుఁ డను నంతలో నింద్రుఁడు "ఏమీ సూత్రధారా ! విశ్వకర్మచే నిర్మింపఁ

బడిన బంగరుబొమ్మ కాదా ?" అని యుండివ్వఁగా, సూత్రధారుఁడు "చిత్తము, ఆసంగతియే మనవిచేసికొనఁబోవుచున్నాను" అని పలిం చును. పురూరవుఁడు "విశ్వకర్మచే నిర్మింపఁబడిన బంగరుబొమ్మయా యిది ? (తనలో) నాదియు బంగారుబొమ్మయే కదా ! అయిన నది విశ్వకర్మచేఁగాక విశ్వకర్తచే నిర్మింపఁబడినది. ఓహో విశ్వకర్మా ! సృష్టికర్తసామర్థ్యముకన్న నీసామర్థ్యమే యెక్కువగనున్నది."

"అన్నివిధముల సారూప్య మందుపట్టి
ఘటములను జేయఁజాలఁ డాకంజభవుఁడు
నాతి పద్మిని ప్రతిబింబమై తనర్చు
ప్రతిమ నిర్మించు నీ కివే వందనములు."

అని కొనియాడును. "అయ్యో ! పద్మిని యని యెంతగా భ్రమ సితిని; కట్టకడపటికి బొమ్మను జూచి పద్మినియని సంతసింపవలసివచ్చెను. నిజమైనపద్మినను గాంచి సుఖించుమహాభాగ్యము నా కీజన్మమందు లేదుకదా !

"బొమ్మ వీక్షించి నాముద్దుగుమ్మ యందు
నెంచి చివరకుఁ గౌఁగిలించినాఁడ
నెండమావుల నీరంచు నెంచి యుఱికి
పతికిలంబడు దాహపీడితునికరణి."

అహో ! ఆప్రతిమ యెంతదివ్యదర్శనమిచ్చుచున్నది. సృష్టిం చిన విశ్వకర్మయైనను నిది ప్రతిమగాక యప్రతిమకళాకలితయైన కాంతి యని భ్రమపడవలసినట్లున్నది" అని పలువిధముల భ్రమయుఁ దగుచున్ననాతనియవస్థను గని, బృహస్పతి "రాజేంద్రా ! మఱచి పోయినవిద్యను తిరిగి యాకర్షించువానివలె సంతుష్టచిత్తముగ నుంటివేమి ?" యని ప్రశ్నించును. "తరలిపోయిన భార్యను తిరిగి తెచ్చు కొన్న నీకన్నుల కట్లయుండును" అని చంద్రుఁడు తనలో గొణిగి

గోనను. "మఱచిపోలేదు ; మఱచిపోవుట కవకాశము లేదు. తిరిగి తెచ్చుకొనుట కసలే లేదు" అని పురుకుత్సుఁడు వచింపఁగా ఇంద్రుఁడు నవ్వుచు "రాజేంద్రా! ఏదైనా కథ పాడుచుచుంటివా ?" అని పరిహాసించెను. "నేను కథ పాడుచుట లేదు గాని యీ ప్రతిమ నా కనులను పొడుచుచున్నదని చెప్పిన మీకందఱకుఁ గథగ నుండును గద! మహేంద్రా! ఇది యథార్థమయిన ప్రతిమయేనా ?" అని పురుకుత్సుఁ డడుగును "నీ వాలోచించుకొనరాదా! మాటలుగాని యభినయముగాని దేనియొక్క ప్రయోజనము నవసరములేని పాత్రము గనఁబడుచుటకు ప్రతిమ చాలదా? యథార్థమేనా యని యిన్ని మాటలడిగెదవేమి ?" యని యింద్రుఁడు సమాధానమీయ—

"మహేంద్రా! నే నింద్రజాలమునఁ బడియుంటినిగదా! ఇఁక సిగ్గువిడిచి చెప్పెదను. ఉరగలోకమందు వసించి, భూలోకమునఁ బరిరంభసౌఖ్య మనుభవించుచుండఁగఁ గోలుపోయిన నాకాంతాశిరోరత్న మనునర్మదయే యని భ్రమింపఁజేయుచున్న యీబంగరు బొమ్మను సమీపించి కనులారఁ జూచుటకు సెలవొసంగుఁడు" అని పురుకుత్సుఁడు ప్రార్థించెను.

"అంగీకరింపవచ్చునా" యని యింద్రుఁడు శచితోఁ బలుకఁ "గానిమ్ము" అని యామె పలుకఁ బురుకుత్సుఁడు ఆత్రుపాటుతోఁ బ్రతిమను సమీపించెను.

"దేవీకటాక్షమును గోరి త్రిపురసుందరి నే నిచ్చటఁ బ్రార్థించుచుండ మీ రేలవచ్చితిరి ?" అని సూత్రధారుఁడన "నేనును దేవీకటాక్షమును బ్రార్థింపవచ్చితిని" అని పురుకుత్సుఁ డనెను.

"నాటకరంగస్థలమున కితరులు రాఁగూడదు. రాజేంద్రా! మానాటకమున కభ్యంతర మేల కలిగించెదరు" అని సూత్రధారుఁడు వారింపఁబోవ, "అభ్యంతర మేమియు లేదు. ఈత్రిపురసుందరి కాదు

స్వర్లోకసుందరిని ప్రార్థించుటకు వచ్చిన నన్ను మీనాటకములోని మఱియొకవేషధారిగా భావింపుము" అని పురూరవుండు వచించును.

శచీదేవి (నవ్వుచు) "మహేంద్రా! కాంతలను స్వాధీనపఱచు కొనుటకుం బురుషు లెన్నియో సందర్భవేషములనైన వేయుదురు సుమా!" యని పలుక నింద్రుండు తలవంకించి యున్నరనుచు (లోలో) "ఆహా! శచి యహల్యావృత్తాంతమునే తిరిగి యుద్ఘాటించుచున్నది" అని విచారించును.

"శచిచుఱుకుమాటచే నొచ్చి జంభవైరి
కనులం గొలుకులం గెంపులు గ్రమ్మ క్రాలు
ఖరకరోజ్జ్వలకిరణవికాసమ్మునుల
తరుణకోకనదప్రపత్త్రములకరణి."

అని బృహస్పతి తనలో భావించును.

కార్యము ప్రతికూలముచున్నదని విసుగుచెంది యింద్రుండు "నాటక మారంభింపకుండనే ప్రయత్నమునకు విఘ్నము కలిగినది. కావున సూత్రధారా! మీరు పొండు" అని యాజ్ఞాపించును. పురూరవుండు "ఆర్యా! వద్దు, వద్దు. ఈబంగరుబొమ్మకూడ నీనాటకపాత్రలలో నొకటిగనుక దీనిని వారు తీసుకొనిపోవుదురేమో! కటాక్షింపుము" అని ప్రార్థించును.

"ఇది యిక్కడనే యుండును. మీరు పొండు" అని యింద్రుండు పలుక నటీసూత్రధారులు వెడలిపోదురు.

పలువిధములం బ్రతిమాలి తబ్బిబ్బులుపడుచున్న పురూరవు నుద్దేశించి మహేంద్రుం డంత "పురూరవా! అనవసరముగ నాటకమునకు విఘ్నము నొనరించుటయేగాక మాకుంగూడ సంతాపము కలుగంజేయుచుంటివి. ఇటు రమ్ము. చాలు. ఆహా! విచిత్రచరిత్రుండవు" అని వచింపంగా పురూరవుండను "మహేంద్రా! క్షమింపుము. నేను విచిత్రచరిత్రుండనే.

"ఎట్టులో సర్వలోకమున కేఁగి వెలందుక వెళ్లి మాఁచి నే
నెట్టులో ధాత్రి కేఁగి మఱి యెట్టులో దానినిఁ గౌఁగిలింపఁ దా
నెట్టులో పోదు నెచ్చెలితో యెట్టులు భామ్యకు జాడనయ్యెనో
యెట్టులు ముందు కాఁగలదొ యిన్నిటికంట విచిత్ర మేమగు."

అని తిరిగి ప్రతిమచుట్టు రెండుమూఁడుసారులు తిరిగి, "ఆహా! ఏమిది ?"

"ఎదుట నున్నదైన నిటు ప్రక్క నటు ప్రక్క
నున్న నన్ను మాఁచుచున్నయట్లు
కానఁబడుచుండు నే నిది ప్రతిమ గా
దంచు నెంచెదను యథార్థముగను."

అని కొంచెము సమీపించి

"ఆ ముఖంబునుండి యంభోజవాసన
వచ్చుచుండ నిద్ది ప్రతిమ గాదు
చేతఁ జేయఁబడిన మాతఫలంబున
కెటులు సౌరభంబు గలుగఁగలదు !"

అని నిశ్చయించును. ఇంద్రుఁడు దీని కని పెట్టి (తనలో) "ఆహా! యితఁడు ప్రతిమ కాదని నిశ్చయించుకొనుచున్నాఁడుగదా !" అని తలంచి (ప్రకాశముగా) "పురుషోత్తమా ! మనోవ్యధవలన భ్రమను తిరిగి గ్రహించుచుంటివా ! శిరోజములందలి కమలములయొక్క గంధమును ఆస్యాంభోజగంధమని భ్రమపడుచుంటివా ?" అని ముదలకించెను. పురుషోత్తముఁడు మరల

"తొంగలించెడు కెంపులమోవియందు
స్వేదకణములు నిలిచెను ప్రతిమ గాదు
మించు తామర రేకుల మీఁదఁ జేరి
మంచుకణములు భాసించువాడ్కి గాఁగ."

అని వచింప "పురుషుల్లా! ఎంత వెఱ్ఱివాఁడవు. దానికనులు ప్రశస్తమైన మణులచే నిర్మింపఁబడినవి. అమూల్యమణులు నీవు భ్రమపడుట సహజమే. అదిగాక సమీపమందు చంద్రుఁ డుండుటచేఁ జంద్రకాంతమణులచేఁ జేయఁబడిన తెల్లగ్రుడ్లు ప్రకాశించుచున్నవి. చంద్రా! యీరాజచంద్రుని భ్రమకు నీవు కారణమైతివి గనుక నీపాటికి నీలోకమున కేఁగి సుఖింపుము" అని యింద్రుఁ డాదేశించెను. అంత రాజు నాశీర్వదించి చంద్రుఁడు, నల్ల సూర్యుఁడు, బృహస్పతి వెడలి పోయిరి. ఎప్పటికిఁ దన భ్రమలు తీఱకున్నందునఁ బురుకుత్సుఁడు తుదకు "ప్రతిమ యగునో కాదో యను సంశయమును బాపుకొనుట కును, సుఖమొందుటకును నా కొకయుపాయము తోఁచుచున్నది.

"దానిచరణాంబుజంబులపైని శిరము
భల్లు మని కొట్టుకొన్నచోఁ బ్రతిమ యైన
తల పగులును, బాధలు తీఱు లలి సుఖింతుఁ
బ్రతిమ గాకున్న సుఖము చెప్పంగవశమె!"

అని తన కిరీటము దీసి చేతఁ బట్టుకొని "హా! వర్తనా!

"రతిని గలిగినబడతిక బ్రాలి నీవు
చనులఁ దలఁ గ్రుచ్చి నిద్రించి సౌఖ్యమొందఁ
దగిన నేను నీప్రతిమపాదముల నాదు
తలనుగల రక్తమున పరియ్యె! తడుపవలసె."

హరహరా! యని తలఁ గొట్టుకొనఁ బ్రయత్నించునంతలో ఇంద్రుఁ డాతనిచేతిని బట్టుకొని నారదునిఁ జూచి "మునీంద్రా! తాము నాయం దనుగ్రహించి యీతని వెంటనే భూలోకమునకుఁ దీసికొనిపొం" డని ప్రార్థించెను. నారదుఁడు రాజుచేతిని బట్టుకొని తీసి కొనిపోవుచుండ "మునీశ్వరా! ప్రతిమ నింకొకసారి చూడనిమ్ము శివ శివా!" అని క్రిందికిఁ బోవును. అంతఁ దటాలున దేవసభనుండి బయ

టికి వచ్చి నర్మద మహేంద్రునిపాదములపయిఁ బడి, కొండంతయా శలు పెట్టుకొన్నఁ దన్నుఁగూడఁ దనవాథునితో భూలోకమునకుఁ బంపకపోతిరే" అని యుంగలార్చెను. ఇంద్రుఁడు "నర్మదా! ఆశ్చర్య పడకు. నీకుఁ బురుషునియెడలఁ గల్గుప్రేమ యెంతయో యదిమట కెఱుంగుదుముగాని పురుషునికి నీయందుఁ గల్గుప్రేమ యెంతయో మాకుఁ దెలియకపోవుటచే నీచిత్రచరిత్రను నటింపవలసివచ్చినది. నీ వదృష్టవంతురాలవు. తగుపాయ మాలోచించి నిన్ను భూలోకమునకుఁ బంపెదను. విచారపడవలదు. యథార్థముగ నీవు సుఖపడఁ గలవు. ప్రొద్దుపోయినది. శ్రమపడితివి, లోనికి పొమ్ము" అని చెప్పెను.

"నర్మదా! జడువకుము. నీమనోభీష్టము నెఱవేఱును" అని శచీదేవి మఱింత ధైర్యము చెప్పెను.

"నేను నిశ్చయముగ ధైర్యమున నుండవచ్చునా" యని నర్మద పలుక "అవశ్య ముండుము" అని శచీపురందరు లభయ మొసంగ నర్మద సెలవు తీసికొని నిష్క్రమించెను.

ఇంద్రుఁడు శచీదేవిని జూచి "దేవీ! పురుషునిప్రేమ యెట్టిదో కనిపెట్టితివా! నర్మదప్రేమయే యెక్కువ యని నాతోఁ బంతమువైచితివికదా! ఇంకను నీపంతమే నెగ్గినదని వాదింతువేమో! కానిమ్ము నీపంతము నెగ్గుటయే నాకును బరమసంతోషము. మిక్కిలి ప్రొద్దుపోయినది. లోని కేఁగి శయనింతము" అని యామెను కౌఁగిలించికొని

"నీమనస్సౌందర్యవిభవంబు నిశ్చలముగఁ
గాంచఁ గనులు సహస్రంబు కలిగినట్లు
గాఢపరిరంభసౌఖ్యంబు గాంచుటకును
బాహువులుఁగూడ వేయి కావలెను నాకు."

అని చెప్పెను. "అదియెంతపని! మీరు తలంచుకొనినయెడల మహర్షియొక యేమునినైనను కటాక్షింపఁగలఁడు" అని శచి మాటలు పలుక నిద్దఱు నిష్క్రమింతురు.

పంచమాంకము

నారదుఁడు భూలోకమున దిగి పోయినతరువాతఁ బురుకుత్సుని పరిస్థితి మఱింత పాడయ్యెను. అతఁడు తాపజ్వరమునకు లోనయి మంచముపట్టెను. ఎవ రెన్ని చికిత్సలు చేసినను ఉపకరింపవయ్యెను. తన కౌషధమే యక్కఱలేదని యాతఁడు మందులఁ గొన నిరాకరించెను. రాజుగారి యనారోగ్యస్థితికి వాస్తవకారణ మెఱుంగ నేరక పట్టమహిషి సుమతి తనసఖి కల్యాణిద్వారా రాజుగారిప్రియసఖుఁడు విదూషకుని నుండి కొంతసమాచారమును వెలికిఁ దీయఁ బ్రయత్నించెను. రాజు గారిభయముచే నాతఁడు రహస్యమును బయటఁబెట్టుట కిష్టపడఁ డయ్యెను. పురుకుత్సుని రాజమందిరమునందే విదూషకుఁడు రాజు గారిని విడిచి దూరముగా నున్నప్పుడు కల్యాణి ప్రయత్నించియు పరిగతుల నెఱుంగఁజాలక రాణియొద్ద కేఁగి అమ్మా! "పర్ణదా, మణియుంగరము" అను రెండుమాటలు తప్ప మఱేమియు నాతనినోటి నుండి బయటికి రాలేదు. దిట్టతనము ముందుపెట్టి ములపగిదెను పాలు పోసుకువిధమునఁ దినుట కేమైన పీడనిముగదుఁ బడ్డైదినయెడల నీ రహస్యము మనము గ్రహింపవచ్చు ననుకొనెదరు. నేను పోయి ఫలములను తెచ్చెదను" అని వెడలిపోయెను.

అంత సుమతియే విదూషకునితో స్వయముగ సంభాషింప మొదలిడి "విప్రశేఖరా! నీ వెప్పుడైనఁ గాశికిఁ బోయియుంటివా! ఆకాశగంగ యెచ్చటఁ బుట్టి, యెచ్చటకు వచ్చి, యెక్కడకుఁ బోయెనో యెఱుఁగుదువా?" అని ప్రశ్నించెను. ఇంతలోఁ గల్యాణి వచ్చి "అయ్యా! ఈఫలములను తీసికొనుఁడు" అని యాతనియెదుటఁ

చెప్పెను. ఆతఁడును "కల్యాణీ! నాకువస్సువంటిఫలములనే యిచ్చితివి" అని ప్రశంసించుచు రాణితో "అమ్మా! ఆకాశగంగ స్వర్గమునఁ బుట్టి రాజశేఖరునిచేఁ దలపైఁ బెట్టుకొనఁబడి యంతట భూలోకమునకు వచ్చి, తరువాతఁ బాతాళలోకమునకుఁ బోయెను" అని వాక్రుచ్చెను.

"పర్మ్నదయో ?" అని సుమతి మరలఁ బ్రశ్నించెను.

విదూషకుఁడు (తల వంచుకొని పరధ్యానముగా) ఉరగలోకమునఁ బుట్టి, భూలోకమునకు వచ్చి మనరాజశేఖరునిచేఁ గౌఁగిలించుకొనఁబడి తరువాత రాక్షసునిచే మూర్ధ్వలోకమున కెత్తుకొనిపోఁబడెను" అని చెప్పి, వ్రేలు కఱచుకొని తనయజాగ్రత్తవలన నీరహస్యము బయటఁబడినందుకుఁ బరితపించి, యిక్కడ నుండఁగూడదని (ప్రకాశముగా) అమ్మా! నేను రాజుగారియొద్దకుఁ బోవలెను. సెలవిమ్మ" అని వేఁడికొనెను.

"రాజుగారిప్పుడే పథ్యము పుచ్చుకొన్నా" రని యామె చెప్పునంతలో కల్యాణి వచ్చి "అమ్మా! భోజనముకూడ సైనది. నేను చూచివచ్చినాను" అని చెప్పెను.

"నీవు పోయి యామునను జాగ్రత్తగఁ బట్టుకొని తీసికొనిరమ్ము" అని సుమతి యామెను బంపి విదూషకునితో "విప్రవర్యా! తన యిష్టమున్న కాంతతోఁ బానుభవింపక యనవసరముగ నీమనఃఖేదమును, నీదేహవ్యాధియును రాజుగా రెందుకుపెట్టుకోవలెను ?" అని పలికెను.

అంత నాతఁడు "అమ్మా! ఇఁక దాపఱిక మెందుకు! అతనిలోపెంతమాత్రము లేదు. ఆకాంత యాభూలోకములోనే లేదు. మఱి యెచ్చటఁగూడ నున్నట్లులేదు. అమాదిరిప్రతిమ యొక్కటి యింద్రునికచ్చేరిలో నున్నదని రాజుగారు నాతో నీమధ్యనే చెప్పి

నారు. ఆప్రతిమను జూచుకొలదియే, శృంగారరసమందు విరక్తి గలిగించుచున్నది. రాజుగారు కల్యాణి నామకొని వచ్చుచున్నారు. అహా! ఏమి గొప్పబడినది కదా!" అనెను.

పురుకుత్సుండు వచ్చినంతనే సుమతి "నాథా! నమస్కారము. మీకు భోజన మేమయిన హితవుగ నున్నదా?" అని ప్రశ్నించెను.

"దుష్టజనులకు నీతివాక్యోరణివలె
కటినమానసున కనూనగానమువలె
విరసజనులకుఁ గవితానివేదనంబుఁ
బోలె జ్వరితున కరుచిగాదె భోజనంబు."

అని పురుకుత్సుండు వచింప, విదూషకుండు "అమ్మా! పరస్త్రీని వలచి దానిలోటకుఁ దపించువానికి భార్యయొక్క పుండలింపుమాటల వలెనే తాపజ్వరపీడితుఁ డయిన మహారాజుకు భోజన మహితముగానే యుండునుగదా!" యని పలికెను.

సుమతి రాజును జూచి "నాథా! మనయిద్దఱ దొక్కశరీరమే కదా! ఒకేదేహ మయినచో మనస్సు నొక్కటిగనే యుండవలెను గదా!" ఇత్యాదిగా సంభాషింప మొదలిడ "దేవీ! వ న్ననుమానించుచుంటి నేమి! మన సొకటియుండుటచేతనే దేహములు రెండైన నొక్కటియే యనిపించుకొనుచున్నది" అని రాజు బదులుచెప్పెను.

విదూషకుండు "దేవీ! మహారాజుగారి వ్రేలి యుంగరమును జూడుము. బంగారమును మణియును గలిగియున్నను నుంగర మొక్కటియే యని యనిపించుకొనుట లేదా!" అని చప్పున వ్రేలు కఱచుకొనెను.

రాజు తత్తరముతో ఉంగరమును దాఁచుకొనుచు "ఛీ, బ్రాహ్మణుఁడా! అనవసరమైనమాటలు నీకేల! దేవీ! దేవీ! అలసితి నేమి!" అని యూఱడించెను,

నర్మద యొసంగిన మణియుంగర మదియే యని కల్యాణియు, సుమతియు నిశ్చయించుకొనిరి. సుమతి (అపవారించి) "విప్రవర్యా! నా కాంతునివ్రేల నుండవలసిన యాతనియుంగరము కనఁబడుటలేదేమి! అది నర్మద కేమహానుభావుఁ డిచ్చెనా?" యని వచించెను. "చెట్టు కదిపినమాత్రముననే నేరేడుపండ్లు ఝల్లున క్రిందకు రాలునట్లు నే మాత్రము కదిపినను, కట్టులేని నామనస్సునందలి రహస్యము లన్నియు జారిపోవునుగాన" అని విదూషకుఁ డనునంతలో, రాజు "ఛీ మూర్ఖా! రహస్యము అని ప్రేలుచుంటివి. రహస్య మేమున్నది" అని మండి పడును. "నాథా! రహస్య మేమియును లేదుకద! రహస్య మేమో యని సంకోచించుచుంటివి సుమా!" అని బలాత్కారముగ రాజు నొద్దనున్న యుంగరము లాగికొనెను.

"నాదు పరభామినీవాంఛ నాతి కిపుడు
బయలుపడియె నిదర్శనప్రకట మగుచు
నాదుతప్పుఁక నొప్పుకొనంగవలెను
దొంగిలినసొత్తుతోఁ జిక్కు దొంగవలెను."

అని తనలోఁ బురుకుత్సుఁడు పరితపించును.

సుమతి: "నాథా! ఎంతప్రశస్తమైనమణిని సంపాదించితివి?" అని దెప్పిపొడుచును.

రాజు: "నూరుకొని త్రాగుటకుఁదప్ప నా కిఁక దీనితోఁ బ్రయోజన మేమున్నది? అహా! చిత్రమా! ఎన్ని బాధలకు లోనయితివి.

"నర్మదాక్రోధ మొకవైపు నాతి మాట
నేమొ యనుచింత యొకవైపు నీచరాత్రి
యొక్కదిశ నుండ నడికెడ నుష్ణకాల
మందు త్రేతాగ్నిమధ్యస్థయాజివలెను."

అని తనలో మజ్జంత కుమిలిపోవును. విదూషకుఁ డపవారించి

యీమణి యింద్రుఁడిచ్చెనని బొంకుమని రాజునకు బోధించెను.

పురుహూతుఁ డపహరించి, "ఇంద్రుఁడీ మణిని నాకిచ్చె నని బొంకుమనెదవా! నే నింద్రలోకమునకుఁ బోవునపుడు "నర్మ్మద నీ కిచ్చినమణియుంగర మిచ్చెదవేమో సుమా!" అని కల్యాణి విను వల్ల నీ వానాఁడు నాకు చేసినహితబోధనచేతఁ గదా యిది మునిఁగి నది! అయినను

"ఎప్పటికైనను నర్మ్మద నేను గెలియు
నాకె నాకున్న బొంకంగ వగును లేవి
శాకమే లేని ప్రబలరోగార్తునకును
మందుమూఁకలతోఁ బని యెందుఁ గలదు!"

అని విదూషకునితోఁ బలికెను. అంత సుమతి "నాథా! ఈయుంగరమును స్పృశింప నే నర్హురాలను గాను. నీవే తీసికొనుము. (ఇచ్చును) నే నొక్కమాట చెప్పుచున్నాను వినుము. తాము స్వతంత్రులు. తమ కెవ్వరిపైనయిన మక్కువ యున్నచో నాకాంతను మీరు స్వేచ్ఛగా ననుభవింపవచ్చునుగాని నే నేమందునో యనుభయము లేశముగాని మీ కవసరము లేదు. అట్టి లభ్యంతరము పెట్టుదానను గాను. నామాట విని చింత పెట్టుకొనక, వ్యాధిని వృద్ధిపఱచుకొనక నీమనోభీష్టమును దీర్చుకొనుము" అని స్పష్టముగాఁ జెప్పివైచెను.

దానికి రాజు "దేవీ! నీ వెంతమాత్రము సంకోచింపఁ బనిలేదు. నీసవతి భూదేవియేతప్ప మఱెవ్వరు లేరు. కావున నీవు పరితపింపవలసిన పని లేదు" అని చెప్పి (ఉస్సురనుచు,) జ్వరముతిరిగెడువేళ యైనది కాఁబోలు. ముక్కు, చెవులు, నోరు, ఒడలంతయుఁగూడ నాదుచ్చుకొని పోవుచున్నవి. ఆహాహా! తాప మధిక మగుచున్నది" అని విలపింప సుమతి, కల్యాణియు నాతని కుపచారములు చేయఁదొడంగిరి.

సుమతి విదూషకునితో "నీవు పోయి వైద్యునిఁ బిలువుము"

అని చెప్పఁ బురుకుత్సుఁడు వలదని చేయి యూఁపెను.

విదూషకుఁ డాతనివాఁడి చూచి "అమ్మా! యీదినము జ్వరము నిన్నటికంటె మఱింత హెచ్చుగా వచ్చినది" అని చెప్పె.

"ఏమిచేయుదును. ఔషధము సేవింపుమన్న వలదనును. ఈ సమయమున నేమహానుభావుఁడయిన వచ్చి నాకాంతుని జ్వరబాధ నివర్తింపఁజేసిన నేను సుఖింతునుగదా!" అని సుమతి చింతించెను.

ఇట్లుండ స్వర్గమున బృహస్పతి దివ్యదృష్టివలనఁ బురుకుత్సుని పరిస్థితి చాల ప్రమాదకరముగ నున్నదని తెలిసికొని యింద్రుని హెచ్చరింప నాతఁడు పద్మదను బిలిచి అమృతహస్తనామమునఁ దగు దేవవైద్యుఁడవని భూసురవేషమున భూలోకమున కేఁగి పురుకుత్సునకు వైద్యముచేయు నెపమున నుపచరింపుము. అతఁడు నిన్ను గుర్తుపట్టువఱకు, నీ వతనిమనస్సున కేమాత్ర మనుమానము కలుగునట్లు నడచినను శక్తుఁడు" అని కట్టడిచేసి, మందుమాకు లేమియు నొసంగకయే యాతని బంపివైచెను.

ఆతఁడును బరిపరివిధముల విచారించి యాదుర్ఘరకార్యమును ధైర్యముతో నెట్లు నిర్వహింపఁగలుగుదు ననుకొని సంకోచము తోఁప భూసురరూపధారియై రాజమందిరముహజారమువద్ద నిలిచి "ఇంద్రుని యొద్దనుండి దేవవైద్యుఁడు వచ్చెనని మీరాజుగారితోఁ జెప్పు"మని సేవకునిచే లోనికిఁ గబురుచేసెను.

సుమతి రాజున కుపచారములు చేయుసమయమున నాపురుషుఁడు లోని కేఁగి తనవచ్చినప్రయోజనము నివేదించెను.

"నే నెవరివద్ద నౌషధము పుచ్చుకొనఁదలఁచుకొనలేదు. మీ రింద్రునియాజ్ఞచే వచ్చితిరి గాన నాలోచింతు" మని పురుకుత్సుఁ డనెను.

సుమతి యాత్రముతో వైద్యునిఁ జూచి "సోదరా! నామంగళ

సూత్రమునకు భద్రము కలుగఁజేసెదరుగద! అట్లయిన నీ కేదికావ లయుననిన నది యియ్యఁగలదానను, నామంగళసూత్రముతో ప్రమాణము చేయుచున్నాను" అని వచించెను.

విదూషకుఁడు "అమ్మా! తొందరపడకుము. ఈవైద్యుని నమ్మవలసినపని లేదు. వీనివలన ముప్పు కలుగును. వయసుతక్కువ వైద్యుని, వయసుమీరిన వారకాంతను నూతినుండి వెడలఁగొట్టవలె నని పెద్దలు చెప్పెదరు. ఈవైద్యుఁడు వయస్సునఁ జిన్నవాఁడుగ, బక్కపలచనితనువుగలిగిన పేదమొగమువానిగ నున్నాఁడు. ఇట్టివారలను నమ్మఁగూడదు." ఇత్యాదిగా నెన్నెన్నియో పుల్లవిఱుపుమాటలను రాజు, రాణియు నెదుటఁ జెప్పెను. ఇతఁడు తన్ను గుర్తించె నేమో! వీనివలన నేమియగునున్నదో యని నర్మద యనుమానము చెందును.

"అక్కా! ఔషధ మారంభింపవచ్చునా?" అని నర్మద సుమతివైపు చూచి యడుగును.

"అవశ్యము. నాథా! ఈమహానుభావుఁడు మీ కారోగ్యమును గలిగించుటకు భగవంతునివలె వచ్చినాఁడు. కావున నాతనివైద్యమున కంగీకరింపుము" అని సుమతి రాజును బతిమాలును.

"ఇతఁడు నావ్యాధి కుదుర్పఁగలఁడనియే తోఁచుచున్నది. ఇతనియొద్ద నౌషధము పుచ్చుకొనెదను. నీవు ధైర్యముగ నుండుము. లోనికేఁగి భోజనముచేయుము" అని రాజు హెచ్చరింప సుమతియుఁ గల్యాణియు లోనికిం జనిరి.

వారు వెళ్లినంత "అక్కా! వాగ్దాన మెట్లు చెల్లించుకొందువో!" అని సుమతినిగూర్చి నర్మద పలికెను.

అనంతరము విదూషకునకు వైద్యునకు నీక్రిందిసంభాషణము జరిగెను.

విదూ:- అయ్యా! తమ పేరేమి?

వైద్యుఁడు:- అమృతహస్తుఁడు.

(తనలో) "తెలివితేట లెటులున్నవో కాని పేరుమాత్రము విన్న కడుపు చెక్కలగుచున్నది" (ప్రకాశముగా) "అయ్యా! తా మెప్పుడయిన పెరుగుతోఁటకూరపులుసు పుచ్చుకున్నారా?"

"ఇప్పుడు దాని ప్రశంస యెందుకు?"

"వైద్యులు గాన యడిగితిని. పెరుగుతోఁటకూరలోని పెరుగు ఆవుపెరుగా, గేదెపెరుగా! దాని గుణ మేమి? ఈరెంటిసంగతులు తెలియవలెను."

"వెఱ్ఱివాఁడా! పెరుగుతోఁటకూర యని పేరున్నమాత్రముననే యందులో పెరుగు గలదని యెంచితివా?"

"అలాగునవా! అయ్యా! తమ యమృతహస్తనామము నట్టిదే కాదుకద!"

(తనలో) "వీఁడు నన్ను వంచింప మొదలుపెట్టినాఁడు. నాకార్య మెట్లు నిర్వహింపఁగలనో?"

అంత రాజు "అమృతహస్తా! ఆహావమాకునితో నీకు సంభాషణ మెందుకు? ఇట్లు వచ్చి నాయొద్దఁ గూర్చుండుము" అని చెప్ప వైద్యవేషమునమున్న పర్ణాద యాతనియొద్దఁ గూర్చుండెను.

మరల విదూషకుఁడు కొంత కొంత వక్రభాషణము గావించి "రోగములు పుట్టురోగములు, పెట్టురోగములు అని రెండురకములు. ఈరెంటిలో నీరాజుగారి రోగమేదియో బాగుగఁ బరీక్షించుట కర్తవ్యము" అని వచించెను.

పురుకుత్సుఁడు "వయస్యా! బాగుగఁ జెప్పితివి. అమృతహస్తా! మాటలాడుటకు శక్తి లేదు. నాప్రారబ్ధ మేమని చెప్పఁగలను.

వైద్యులు మీయొద్ద దాఁచిన వినియోగము లేదు. (ఉస్సురనుచు) అయ్యో! నర్మదా!" అని పలవించును.

అతనిస్థితి కెంతయు వగచి నర్మద (ప్రకాశముగా) "రాజేంద్రా! ఏదో చెప్పఁబోయి యూరకుంటివి గదా!" అనెను.

రాజు మరల (ఉస్సు రనుచు) "ఏమున్నది! నర్మద యారీతిగా నాగొంతు కోసినది" అనెను.

ఇట్లు లేనేవియో కొన్ని వాక్యోపవాక్యములు జరిగినతర్వాతఁ బురుకుత్సుఁడు "వైద్యశిఖామణీ! ఇంద్రసభామంటపమున నుండు నర్మదారూపమగు బంగారపుబొమ్మ యిప్పుడుగూడ నచ్చటనే యున్నదిగదా!" యని యడిగెను.

అందుకు నర్మద (తనలో) "ఒడలు జలదరించుచున్నదే! ఏమని చెప్పుదును" అని యనుకొని (ప్రకాశముగా) "నీవొకట నా ప్రతిమ యేలాగున నుండెనో ఇప్పుడుగూడ నాలాగుననే యున్నదను కొనుము" అనెను.

అంత నామెముఖమును బరిశీలించుటకు ద్వారమునను న్న దీపమును దనదగ్గఱకుఁ దెచ్చిన విమానకుఁడు దానిని రాజసమీపమున నుంచును. రాజు పరిశీలించి

"మోముపైఁ గురి యల్లదే ముదితవ్రేళ్ల
తీరు నయ్యదె మాటలసోకు నదియె
మగతనము వచ్చి యున్నంటి నగచుచేసె
మంచు పడి మోటుదేరు పద్మములమాడ్కి."

అని పురుకుత్సుఁడు తలపోసి "నీవు నర్మదకు సోదరుఁడవు కావుగద" అని వైద్యునిఁ బ్రశ్నించెను.

"నర్మద యెవరో దానిసోదరుఁ డెవరో అది యెచటనున్నదో కూడ నే నెఱుఁగకున్నవాఁడను. కానిమ్ము. ఈయనవసరసంభాషణ

ములకోఁ బనియేమి ? నీచేతి నిట్లు తెమ్ము" అని వైద్యుఁ డనెను. చేతి నిచ్చుచు రాజు

"నాదుదక్షిణహస్తంబు నర్మదాన
ఘాంగి కొసఁగంగఁబడియె నోయమృతవైద్య!
నీవు నర్మదరూపున నివ్వటిల్లుట
నీకు నిచ్చెద నొకసారి నెమ్మి నిదిగో."

అనియెను. అప్పుడే ప్రాయమును నాయమృతహస్తుని హస్తస్పర్శమున రాజునకుఁ గొంత తాపజ్వరము తగ్గెను. కొంతసేపటి కా వైద్యుఁడు "రాజేంద్రా! నీయిష్టసఖుఁడు చెప్పినట్టు లిది పిట్టరోగమే. దీని కౌషధములు లేవు. మంత్రమువల్లనే యీవ్యాధి సాధింపవలసి యున్నది. నేను నీతొడపైఁ గూర్చుండి నీమెడపైఁ జేయివైచి యొకపావుగడియసేపు జపము చేయవలసియున్నది. అది నీ కంగీకారమేనా?" అని యడిగెను.

(పెద్దనవ్వునవ్వుచు) "ఎంతవెఱ్ఱివాఁడవు. అందుకు నే నంగీకరింపకపోదునా! పదీ, ఇట్లు శీఘ్రముగ రమ్ము" అని యాతనిని తొడపైఁ గూర్చుండఁబెట్టుకొనెను. వైద్యుఁడు జపముసేయ నభినయించెను.

రాజు (తనలో)

"ఉరగలోకమందు నుదిత నాతొడపైని
నెనసియున్నయప్పు డిట్టిసుఖము
పొందినాఁడఁ గాన పురుషుఁ డితఁడు గాఁడు
కోర్కె లిచ్చు నాదుకొమ్మ యేమొ!"

అని తలంచెను.

మఱికొంతసేపటికి వైద్యుఁడు లేచి "రాజేంద్ర! నా జపమైనది. నీ కెట్లులున్నది?" అని యడిగెను.

"నా కేమియు జబ్బు లేదు. అత్యంతసుఖవంతుఁడనై

యున్నాను" అని యూతఁడు బదులుపలికెను.

"నీకు సుఖముగ నున్నది కావున నే నిఁకఁ బోయెదను" అని వైద్యుఁ డనెను.

రా జాతని రెండుచేతులు పట్టుకొని "అయ్యో! అయ్యో! నన్ను విడిచి పోయెదవా!

"నర్మదను గాంచుభాగ్యంబు నాకు లేదు
నాదుపాలిటి కీవైతి నర్మదగను
రాష్ట్రమిఁక నీది నీవె నారాజవైతి
వుండు మిచ్చట నిన్గొల్చుచుండు నేను."

అని హెచ్చరించెను.

విదూషకుఁడు "అయ్యో! ఎవఁడో యంత్రగాఁడి కీ పూర్వార్జితమైన రాజ్య మిచ్చెదవా! ఎంతమతిమాలినవాఁడవయితివి. రాజ్యమును ధారవోయుటకు నీ వెవఁడవు? నీ కేమియధికార మున్నది? మే మెవరము సమ్మతింపము. మోహావేశితుఁడవు. తత్కాలమున జ్ఞానహీనుఁడవు. అందుపైని జ్వరార్తుఁడవు. వీఁడు కుటిలుఁడు. యీతని మంత్రములు నీతల కెక్కినవి. ఇట్టిసమయమునఁ జేసినవాగ్దానము వాగ్దానము గాదు. ఇచ్చినది యీవి కాదు. జాగ్రత్త! జాగ్రత్త!" అని వారించెను.

ఇట్లు రాజునకు విదూషకునకు వాదోపవాదములు జరుగుచుండ వైద్యుఁడు "నాకు నీరాజ్యముతోఁ బనియేమి? నీతోఁ బని యుండియే వచ్చితిని. నీవే సర్వమును పాలించుకొనుము" అని వచించెను.

"అట్లుకాదు. నారాజ్యమును నీవు స్వీకరింపక తప్పదు. నీకు నేను సేవకుఁడ నగుదును" అని చెప్పుచు రాజు, వైద్యునితలపైనున్న పాగఁ దీసి తనకిరీటమును బెట్టఁబోవును. "అహా! ఏమిది! ఏమి

నర్మదా ! హా నర్మద !

"మున్న మహార్ఘము ముద్రిక నన్ను నీవు
ముద్దుగొనినట్లు కనఁబడె ముదిత ! యేమి
యనిన మాజాతివారికి మణి కిరంబు
నందు వెలుఁగొందు నని చెప్పి తప్పుకు నీవు."
"అదిగో మణి నేను ముద్దుగొన్నదిదె యిచట
పాపటకుఁ జుట్టుదివరను బ్రతిభ గాంచు
గాఢమోహంబునను దారి గాంచి యొక్క-
దరిని జేరిన నాదుచిత్తంబుకరణి."

అని యామెను గాఢముగఁ గౌఁగిలించుకొని మున్ను తానొసంగిన మణియుంగరమును నామెచేతిపైఁ గాంచి యామెయొసంగిన యుంగరమును తనచేతిపైని జూపి యిరువుర దిటికెనవ్రేళ్ళను నొక్కటిగఁ దగ్గఱఁ జేర్చి బలవంతముగ నర్మదపై నంగీ దీసివైచెను. సిగ్గుపడి యామె యట్లే నిలిచిపోయెను. తనకు భయము వేయుచున్నదని చెప్పెను. "తిరిగి యెవ్వఁడైన గ్రహించుకొనిపోవునని భయపడెదవా?" అని రాజనెను. "మున్ను నిన్నాకాశమునకుఁ దీసికొనిపోయినయాతఁ డెవఁ"డని విదూషకుఁడు ప్రశ్నించెను. "ఇంద్రునియాజ్ఞచేఁ జిత్రకేతుఁడను నాసోదరసమానుఁడు" అని యామె యుత్తరమిచ్చెను. ఆకస్మికముగ సంఘటిల్లిన యీపునస్సమాగమమున రాజు నిర్భరానందమగ్నుఁడై యుండ విదూషకుఁడు "రాజా ! నాసంతోషమును బట్టఁజాలకున్నాను. ఓరాజా ! ఓదేవా ! ఓదేవా !" అని గంతులు వైచుచు నవ్వఁజొచ్చెను.

అంత సుమతి లోననుండి తొట్రుపాటుతో వచ్చి రాజును కౌఁగిలించికొని "ఎందుల కెందులకు రాజా ! యెటులుంటివి" అని ప్రశ్నించెను. రాజును విదూషకుఁడు సంభ్రమమును జెందిరి. నర్మద

సుమతిని జూచి "అక్కా! పురుకుత్సుని కారోగ్యమును గలుగఁ జేసినయెడల నేనుకోరినదంతియు నిచ్చెదనని మంగళసూత్రముతో వాగ్దానము చేసితివి. నీకాంతునకు సంపూర్ణమైన యారోగ్య మిచ్చితిని. నేను గోరునదేమనఁగా, నీకాంతుని నాకీయుము" అనెను.

"దేవి! చక్కపలచనివానికి పైకి నొక్కమోస్తరు లోపల నొక మోస్తరు నని నేఁ జెప్పినమాట వినకపోతివి" అని విదూషకుఁడు వాక్రుచ్చెను.

"సుమతి (వర్మదవంక నిట్టూర్చి జూచి) ఛీ! అవతలకుఁ బొమ్ము. నీ వెవతెవు? అమృతహస్తున కిచ్చెదఁ గాని నీ కిచ్చెద నంటినా?" అని ముదలకించెను. అంత రాజు

"అమృతహస్తుఁ డితఁడె యమృతాధరయు నిదె
నేను వలచినట్లు నీకు నితఁడు
చెప్పఁబోలఁడె యిదియె యిప్పు డివిచ్చిన
నియ్యకొనవె దీనికే నిజంబు."

అని వెల్లడించెను. "నీకు నిశ్చయముగ నారోగ్యముగ నున్నదా" అని సుమతి రాజును మరలఁ బ్రశ్నించెను.

"నే నబద్ధ మెట్లాడఁగలను? ఇంతయారోగ్యస్థితి నాజన్మములోనే యెఱుఁగ" నని యాతఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

అంత సుమతి "రాజా! నిన్ను నే నిమ్మనుటకు నా కేమియధికారమున్నది. వర్మదా! ఈరాజు నాచేత నొకరి కీయఁబడునంత యస్వాతంత్ర్యము గలవాఁడని యాతఁడు చెప్పినచో నీ వతనిని దీసికొనవచ్చును" అనెను.

పురుకుత్సుఁడు తల వంచుకొని నవ్వుచు మాటలాడ కూరకుండెను. "ఏమి దీర్ఘాలోచనను చేయుచున్నావు. మాటాడవేమి" అని వర్మద పలుక సుమతి "మహాచక్రవర్తివి. సర్వస్వతంత్రుఁడవు.

ఆలోచించి మఱి మాట్లాడుము'' అనెను.

''ఏకకాంత యుండ నే నస్వతంత్రుండ
నిద్ద ఉండ వేఱ యెన్న నేల ?
నొక్క-చిలుక వ్రాల నొగి జోగు జొన్నవె
న్నునను జోకు వ్రాలు ననువు గాఁగ''

అని ప్రకటించెను.

''ఇంతియస్వతంత్రుఁడ వైవసీముగమ చూడరాదు. ఈమెను బురుష వేషమున నీవే తీసికొనివచ్చి నన్ను వంచించితివి'' అని సుమతి కోపముతో పెదలనుంకించెను. పురుషుస్సుఁ డామెచేతులు పట్టుకొని ''అయ్యో! నే నేకర్మ మెఱుఁగను. దేవీ! నన్ను కటాక్షింపుము'' అని బతిమాలెను.

నర్మద ''నాథా! నీభార్య నిన్ను నాకిచ్చినది. ఇఁక నీ వటు పోవలదు. ఇటు రమ్ము'' అని యాతనిచేయి పట్టుకొని లాగును. రాజామె గడ్డము పట్టుకొని ''నర్మదా! ఒక్క-నిమిషము క్షమింపుము. సుమతీ! నేను నిర్దోషిని. నన్ను కటాక్షింపుము'' అని ప్రార్థించెను.

ఆతనిగతి గురుపురహిండ్లములమఁగఁ దీయుకునఁబడి నన్నట్టు లయ్యెను.

వినూపకుఁ డిది చూచి (తనలో) ''జాగిలపునోటిమధ్య నడవి పంది చిక్క-నట్లున్నదికదా'' యనిచింతించి, (ప్రకాశముగా) ''సుమతీ! ధర్మశాస్త్రనిపుణుఁడ నయిన నే నొకసంగతి చెప్పఁబోవుచున్నాను విను. అజ్ఞానిచేఁ జేయఁబడినవాగ్దానము నెఱవేర్పఁదగినది కాదు. ఈవైద్యుని నర్మదగా నెఱుంగక నీవు చేసిన ఖరారు చెల్లఁదగినది కాదు. ఈవ్యవహారము న్యాయసభ కెక్క-వలసినదై యున్నది. కాని న్యాయాధిపతియైన రాజు ప్రతివాదికి పాక్షికుఁడు. ఉతగవు నా యొద్దకు మార్చినయెడల...''

అనుపంతిలో "ఛీ! ఊరకొమ్మ్మ" అని రాజు ముదలకించెను. తుద కారేఁడు సుమతీపద్మ్మదల నిరుపురనుగూడ క్షమించి కటాక్షింపుఁడని బతిమాలి

"ఇంతి! నీపాత్ర కేవల మేను గాను
సుమతి! కేవలమును నీవు సామ్మ గాను
వరుస మీరిద్దఱును నన్నుఁ బడయుకొనుఁడు
లలిని బ్రాక్పశ్చిమార్ధలోకములు వరుస
తిరిగి కాంతిని గ్రహియించుకరణి గాఁగ."

సుమతీ! నీకిష్టమేనా? ఓ యురగలోకవాస్తవ్యా! ఇటు రమ్ము. ఇటు రమ్ము. నీకును సమ్మతమే కదా!" అని వచించెను.

ఇంతిలో పద్మదతండ్రి యురగలోకాధిపతి మందారుఁ డామెకొఱకయి వెదకివెదకి తిరుగుచున్నవాఁడు రంగమునఁ బ్రవేశించును.

"ఒక్కగానొక్కకూఁతురు ముక్కపచ్చ
దైన నారసికన్యక నేను కనుల
కఱవుదీఱఁగఁ గాంచి సుఖంబుఁ బడయ
మాయమైపోయె నేమందు మాయవిధిని."

"ఉరగలోక మెల్లఁ బోరిపోరి గాలించి
దానిఁ జూడలేక ధరణిఁ జేరి
యుంటి నిటను లేకయున్న స్వర్గమె నాకు
దిక్కు గాని యేమి దిక్కు గలదు?"

కాని యొక్కగాలికబురు నా చెవిఁబడె
చక్రవర్తియింటఁ జాన కలద
టంచు వానిభార్య యనుటకు వచ్చెనో
కాకయున్న నేమి కారణంబు?"

"కంకువంటిపులము భస్మమై పోవఁగ
పిల్ల విడిచి మగనిఁ జెందఁగోరి
యూరినూరఁ గాక తిరిగి లోకములనెల్లఁ
దిమ్మరిల్లుచుండె బమ్మ వ్రాఁత."

ఇత్యాదిగాఁ బలుపరివిధములఁ బరితపించుచు రోషావేశముతో నాతఁడు వచ్చెను.

"అతఁడు నేను సములమైన నాతవియుంటి
నేను పిలువకుండ నేఁగుచుంటి
పిల్లఁగొలకుఁ గాదె వెత లిన్ని పడవలెన్యేఁ
గడుపువంటితీపి కలదె యొకటి!"

అని వాపోవుచు రాజమందిరద్వారముకడ నిలిచి "మీ రాజును జూడ మఱియొక రాజు వచ్చె" నని ద్వారరక్షకునితోఁ జెప్పెను. అతఁడు లోనికిఁ బోయి చెప్పఁ బురుకుత్సుఁ డాతఁ డెవరయియుండు నని యాలోచించి లోనికి రండని కబురుచేయును. మందారుఁడు లోని కేఁగఁగనే నర్మద పరుగెత్తుకొనివచ్చి కాళ్లపైఁ బడి "తండ్రీ! క్షమింపుము, కటాక్షింపుము" అని వేఁడికొనును.

"ఛీ! దురాత్మురాలా!

"తండ్రి చచ్చె ననుచుఁ దలఁచితివే నీవు
భయము లేక పిల్లఁ బాఱఁద్రోలి
మగనికొఱకు నీవు మహినెల్లఁ దిరిగెదు
కాలుగాలుపిల్లికరణిఁ గాఁగ."

ఛీ! దుష్టవర్తనురాలా! నావెంట రమ్ము" అని బలాత్కారముగ నర్మదను చేయిపట్టుకొని తీసికొనిపోవ నాయత్తమయ్యెను.

పురుకుత్సుఁ డదరిపడి కత్తి చేతఁబూని "ఓహో! ఇతఁడు నా మామగారు బోలు; నయిన నేమి? ప్రాణము పోయినను తోఁడు

మానము దక్కించుకొనునను చు, ఛీ! మూర్ఖుఁడా!

"శక్తి! వేటు దినెదొ కాంతను విడిచెదొ
మానువగుట రెండుమార్గములను
జూపినాఁడఁ గాని చూపులో నాశక్తి
యెట్టిదౌఆవలయు నెట్టిశక్తి."

అని విజృంభించెను.

"ఛీ చోరుఁడా! మాంత్రికుఁడా! మాయమంత్రములను నా బిడ్డను నరగలోకమునుండి లాగి తెచ్చితివిరా! వంచకన్నల సిగ్గు హరించుటకేనా బ్రహ్మ యీభూలోకరాజ్యమును నీపాలు చేసినది! నాకూఁతును నీవు హరింప నామెను నేను గొనిపోవుట తప్పుగాఁ దోఁచెనా! దొరను వంచినయధికారి దొంగఁ జేసి యిట్టులే ప్రసిద్ధిగా రాజ్య మేలుచుంటివా" అని నిష్ఠురోక్తు లాడి మందారుఁడు "నాకూఁతును నేను విడువను. చేతనైనయెడల యుద్ధమునకు రమ్ము" అని పురుకుత్సునికి బదులు చెప్పెను. అవశ్య మిదిగో వచ్చెద నని వయస్యునితో ధనుర్బాణముల సిద్ధపఱుపుమని పురుకుత్సుఁ డనెను.

"ఇదిగో నేనును సిద్ధమగుచున్నాను. అవశ్యము రణస్థలము చూచి యిప్పుడే యుద్ధ మారంభించెదము" అని మందారుఁడు పలికెను.

ఇటు తండ్రి, అటు తానువలచిన నాథుఁడు తనకయి యొకరి నొకరు సంహరించుకొనయత్నించుట చూచి నర్మద వలవల యేడ్చుచు వారిని వారింప నెంతయో యత్నించెను. కాని తండ్రిచీవాట్లుతప్ప ఫల మేమియు లేదయ్యెను. దూరమున కేఁగి యిప్పట్టున నామె కరుణ రసము కురియుచుఁ దనలోఁ గావించికొనిన ప్రలాపములు వర్ణనాతీతములు. అప్పు డామె శచీపురందరులు తను వంచించిరని వారు వృషా వాదులనికూడ నిందించెను. తుద కామె యాత్మహత్య చేసికొన

కొంచి "ప్రియత్యక్తప్రాణ మదెంతసేపు పోవలెను. నా నాథుని కరస్పర్శచే బరమపూజ్యమయిన నైటలొంగణము నొందుదన మరిపోసికొనదను. అయ్యో, నాకు గళసూత్రమే కాని మంగళసూత్రయోగము లేదయ్యెనా?" అని గొంతుక కన్నుల కద్దికొని "తండ్రీ! నమస్కారము. నాథా! నమస్కారపూర్వకముగా దూరమునుండి కన్నుల చేతనే కౌఁగిలించుకొనుచున్నాను. హా! ఇంద్రా! మాయకాఁడా! నీవలనఁ జెడితిని" అని గొంతుక మరి పోసికొని హరహరా! యని నేలపైఁ బ్రాలెను.

అంత నాకాశమార్గమున శచీపురందరు లవతరించిరి.

"నర్మదా! నర్మదా! ఆఁగు మాఁగుము. ఇంద్రుఁడు మృషావాది కాఁడు. లెమ్ము లెమ్ము" అని యామెను లేవనెత్తెను. అదరిపడి లేచి నర్మద "మహేంద్రా! నమస్కారము. నా పెనిమిటిని నాకు దయచేయుము" అని ప్రార్థించెను.

"అందుకొఱకే గద వచ్చితిని" అని ఇంద్రుఁడు నవ్వుచుఁ బలికెను.

శచియు నవ్వుచు "నర్మదా! ఇల్లాలిమాట యసత్యము కాలేదుగదా" అని ముదలకించెను.

నర్మద యామెకు నమస్కరించి "తల్లీ! క్షమింపు" మనెను.

ఇంద్రుఁడు పురుకుత్సునివంకఁ జూచి "పురుకుత్సా! ఏమి యీవింత? అతివమాఁటకు నీ ప్రశ్నను, కీర్తి యుతనిగ్రహా! చాలు, చాలు. మామగారిని శిక్షించుటంతటి మహాగుణ మీశ్వరభక్తివలనఁ గలిగినదికాఁబోలు నేఁడు? చాలు; క్షమింపుము" అని మందలించెను.

ఇంద్రునకు నమస్కరించి "తమయుత్తరానుసారమే నడుచువాఁడను" అని పురుకుత్సుఁ డనెను.

అంత మందారుఁడు నమస్కరింపఁ బురందరుఁడు "కల్యాణ మస్తు. మందారా! నీవు నాకు స్నేహితుఁడవు. నేను చెప్పినట్లు విన వాఁడవేకద" అని వచించెను.

"తులసీదళమువలెఁ దమయానతిని శిరసా వహింతు" నని మందారుఁ డనెను.

ఇంద్రుఁ డాతనిఁ జూచి "అట్లైన వినుము. నాకు పుత్రసముఁ డగు మాంధాత పరలోకగతుఁ డగుటచే అతనికుమారుఁడైన పురుకుత్సునకు నేనే తండ్రివంటివాఁడను. నర్మదకుఁ దగినవరుఁడు పురుకుత్సుఁడే. వారిదాంపత్యమునకయి మనమిద్దఱము వియ్య మందవలసి యున్నది. వీరిద్దఱను సంఘటనసేయుటయందు నీ ప్రధానియగు నంశుమంతుఁడు, నాసఖుఁడగు చిత్రకేతుఁడు, నేనునుగూడ మిక్కిలి శ్రమ చేసితిమి. అంశుమంతుఁ డాకస్మికముగ మరణించుటచేఁ బాప మీ సంగతి నీకుఁ దెలియనందుకు విచారించుచున్నాను" అని వచించెను.

"మహానుభావా! తమయుత్తరప్రకారమే నడువవలసినవాఁడను. సెలవైనమొదల నురగలోకమున వివాహ మొనరింతును" అని మందారుఁ డనెను.

ఇంద్రుఁడు (నవ్వుచు) "మిత్రమా! నే నిచ్చట నుండ నిది యైంద్రలోకము. నీ వచ్చటనుండ నది యురగలోకము. పురుకుత్సునిది భూలోకమేకద! మూఁడులోకము లిచ్చట సమావేశమైనవి. వివాహమున కింతకన్నఁ దగినస్థల మేది?" అని బదులుపలికెను.

"ఆలస్య మెందుకు! నేను బ్రహ్మనై వివాహము చేయించెదను" అని పురుకుత్సునివయస్యుఁడు విదూషకుఁడు ముందుకు వచ్చెను.

అంత విశ్వామిత్రమహర్షి ప్రవేశించి "ఆఁగుమాఁగుము. పురుకుత్సుఁడు చెప్పినట్లు వ్యతిరేకబ్రహ్మనైన నేను వచ్చుచుంటిని.

పురుకుత్సా! ఇప్పుడు నా శాపమునకు విమోచనము కలిగినది.

"బ్రహ్మ సృష్టించు నిక్ష్వాకువంశజులకు
సురలలోకమె గతి యింతివటకు నీవు
భళిర! తద్వ్యతిరేకపు బ్రహ్మ వగుట
నా కధోలోకగతి యిచ్చినావు కాదె!"

అని సన్నుతించితివి జ్ఞాపక మున్నదా!" అని హెచ్చరించెను.

అతనికి నమస్కరించి "ఆర్యా! క్షమింపుము" అని పురుకుత్సుం డనెను. పురందరమందారు లిరువురుం గూడ నామహర్షికి నమస్కరింపం గల్యాణమస్తు అని వారి నాశీర్వదించి "వివాహముహూర్తము సమీపించుచున్నది. సూర్యోదయ మైనవెంటనే సుముహూర్తము. అదిగో భాస్కరుం డుదయించుచున్నాండు.

సీ. అల్లదె నీదు పాదాబ్జంబు లీతండు
కడుగం దెచ్చినరత్నకలశ మనంగ
కన్యాప్రదానసత్కారమునకు నీకుం
గట్టును మేల్బాసికం బనంగ
వియ్యాలు లోకరిపై వేడ్క నొక్కరు జల్లం
బట్టిన బర్హిండపల్లి మనంగ

(నర్మదవంకం దిరిగి)

ప్రాక్సతి నీదుసౌభాగ్యవృద్ధి కొసంగు
బంగారుకుంకుమబరిణె యనంగ

(పురుకుత్సునివంకం జూచి)

గీ. పరిధివిల్లును భవదీయువంశనాథుం
డైన రవి పెండ్లిపెద్దయై యలరుకతన
నచ్చం జూడంగ నన నిదే ప్రాగ్ధరమునం
బొలుచు నత్యుత్తమప్రభాపూర్ణుం డగుచు."

అని యుద్బోధించెను.

అంత విశ్వామిత్రమహర్షి తన యాధ్వర్యమున నర్మదాపురుకుత్సుల వివాహము మంగళప్రదముగ నెఱవేర్చెను. మాంధాతృండు పురం దరుండు నిరువురు దంపతుల నాశీర్వదించిరి. వధువు లోపలంగని "గంధర్వ నందనా! కామగాయని కొరకు నీ వరము నంగడవా" యని యింద్రుండు దేవ నాయకుండు (నవ్వుచు) "నాగమాత్రభవమున చెప్పిన విధమున నేడే యాతనికి వరం బిచ్చితి. వినుము నర్మదా!

"మమ సప్తగగలోకమంతయు, భువిని విడువ
దివిని తిరువాతి నటమింపఁ గువిని దిగి
యిటని నైదువపరి పతి నినయము నీకు
నైదువతనంబు శాశ్వతం బగును గాక!"

అని యాశీర్వదించెను. పురుకుత్సుండు "అయ్యా, ముఖ్యకర్తయా! ఇంద్రాది దేవతల దర్శించియు తిరిగి భూలోకమునకు వచ్చి సూర్య సమానుడగు పుత్రుని గాంచి సుఖింతు మని తాము నాకు సెలవొసం గిరి. అంతయు నెఱవేరినది కాని..." అనుచుండగా విశ్వామిత్రుండు (నవ్వుచు) "నీ తాత యువనాశ్వుండు పుత్రకామేష్టి యింద్రయాగ మును జేసి నీ తండ్రియగు మాంధాతను గాంచెను. అతని కింద్రయాగ మునఁగాని ప్రత్యక్షముకాని దేవేంద్రుడు సమానోత్సవముగ నిచ్చెనే శచీసహితుండై ప్రత్యక్ష మాయెను. నీవేల నిప్పు డింద్రయా గమును చేయించుకొనుటకే వచ్చియుంటివి. యాగదీక్షనుండవు గమ్ము. నీకు సంతానము కలిగినదనే భావింపుము" అని చెప్పెను.

పురుకుత్సుండు "మహేంద్రా! తమరు సెలవుగూడ దయచేయఁ బడునుగాక" అని విన్నవించెను.

"అవశ్యము చేయుదము. ఇంక నిక్కడ నవకాశము లేదనుకొన్నది" అని యింద్రుఁడనెను. విధూస్తుండు ముంగిటకు వచ్చి "ఓకయువ

శిష్టము దున్న" యనియు "ఏడవ, జూదములుకూడ జరుగవలెను. సప్త గ్రహశాంతికై యది యావశ్యక" మని హెచ్చరించెను.

"ధరణి యీతిబాధలు లేక తనరుఁగాక
ప్రజలు యన్యోన్యవైరముల్ వాయుఁగాక
కవిత రాజపోషణమునఁ గ్రాలుఁగాక
సిరి పాలనమున ధాత్రి నెగడుఁగాక!"

అను భరతవాక్యముతో నాటకము ముగియును. శుభరత వాక్యపద్యముతో ఇతర పంతులుగారి యితరనాటకములును ముగియు చుండును. ప్రదర్శనానుకూలముగనే యీనాటకమునఁ జెప్పఁబడలేదు, కాని భాగవతమువలెఁ బై యాచారమునకు ప్రదర్శనసమయమున కిలికివల్ల తెలియనగును.

1900 సంవత్సరములో రచింపఁబడిన యీనాటకము 1900–1909 సంవత్సరములమధ్య మూఁడుమూఁడు ప్రదర్శనముల నందినది. తరువాత మరల ముద్రింపఁబడినది లేనిది తెలియదు. గ్రంథ లభ్యము కొంచెము పట్టులేదు. కథయు నంత ప్రచారమున లేదు. కాన సంగ్రహముగ దలఁచియీ కథను కొంత విస్తరించితి నేనిగా యని చింతిలుచున్నాను. పంతులుగారి రచనావిశేషములను కొంతవఱకుఁ బూర్వోదాహృత భాగములవలననే గ్రహింపవచ్చును. అయినను వానినిగూర్చి మఱియుఁ గొంత వివరింతును. పాత్రములసంభాషణములలో నెచటి వారి చరితములందలి లోపములను దోషములను వ్యంగ్యముగనో ప్రకటముగనో హాస్యరూపముగనో దెప్పిపొడిపించుట వీరిరచనలందలి యొక విశిష్టవిశేషము.

ఇందుకుఁ గొన్ని యుదాహరణములు:—

ప్రథమాంకమున విశ్వామిత్రుఁడు పురుకుత్సుని అథోగతుఁడవు కమ్మని శపించినప్పుడు పురుకుత్సుఁడు వగచుచు

"చిలుకపలికి యని దుష్పని కెండినాఁడ
మునిమృగం బయ్యె నది;..."

అనుపద్యమున "మునిమృగం బయ్యె" నందలివ్యంగ్యమును గుర్తించి చిత్రకేతుఁడు "అహో! యీమాటలు యాదృచ్ఛికముగఁ బలుకఁబడినవయినను, చక్రవర్తి మొదల నిర్దాక్షిణ్యమును గనఁబఱచిన యీమునిమొదల యథార్థ మగుచున్నవిగదా!" యని వచించును. మఱియు విశ్వామిత్రుఁడు తనశాపమును మఱలింపఁజాలను గాన యధోలోకగతి స్వల్పకాలమయినను దప్పదని చెప్పినప్పుడు పురుకుత్సుఁడు "తప్పదా! మునిసార్వభౌమా! బ్రహ్మ యిక్ష్వాకువంశజులకు సురలోకగతి యింతవఱకు విధించియుండఁ దద్వ్యతిరేకముగ బ్రహ్మ వగుట నీవు నా కధోలోకగతి విధించితివిగదా!" యని వాపోవును. ఇది విని అంశుమంతుఁడు "రాజా! బాగుగా నెత్తిపొడిచితివి" అనును. చిత్రకేతుఁడు "నెత్తిపొడిచిన బాగుగనేయుండును" అనును. ద్రుతసంశ్లేషముచే "ఎత్తిపొడుచు" శబ్దము అంశుమంతునినోట "నెత్తిపొడుచు" కాఁగా చిత్రకేతుఁడు దానినే "నెత్తిపొడిచిన" అనఁగా విశ్వామిత్రునిశిరస్సునే పగులఁగొట్టిన అనునర్థములో నుపయోగించుటలోని శబ్దచిత్రములు గమనింపఁదగినవి. "శాపమునకు గడువైనను సెలవిండు" అని పురుకుత్సునిపక్షుఁడు విమానపతుఁడు విశ్వామిత్రునిఁ బ్రార్థింపఁగాఁ బురుకుత్సుఁడు "మిత్రమా! గడువులోఁ బనియేమి!

"ద్యుమణికులజుఁడ నగు నా కధోగతి యొక
ఘటిక గానేమి వేయేండ్లు గాఁగ నేమి!
యతి వ్యభిచరించువాఁడైన నాకేఁ డెంత
కాల మొందఁగలో నను గడువు లేల!"

అని వచించును,

ఈ పద్యమున రెండుమూఁడుపాదములు కపాల మెఱుటువల్లె మేనకాసాంగత్యము నుద్దేశించి పురుకుత్సుఁడు తన్నెత్తిపొడుచుటకే ప్రయోగించె నని గుర్తించి విశ్వామిత్రుఁడు "ఈమాటలు నాశాపము కంటెను తీక్ష్ణతరములై మేనకాసంగమమును నాకు జ్ఞాపకముచేయుచు మర్మముల నాట పొడుచుచున్నవిగదా" యని లోలోన వాపోవును.

ఇట్టిచమత్కారములను పాత్రములసంభాషణములలో యాదృచ్ఛికముగనే దొరలినట్లు పాఠకులకు స్ఫురింపఁజేయుటలోఁ బంధులుగారు చాల నిపుణులు.

ద్వితీయాంకమందు నిద్రలోనున్న పురుకుత్సునిఁ జంద్రకాంత శిలావేదికపైఁ జూచినసందర్భమున నర్మదసఖి నవమాలిక యాతని చిత్రపటము వ్రాసి రాజప్రక్కను బెట్టును. అంత నర్మద "నాపటము నారాజుప్రక్క నెందుల కుంచితివి?" అని నవమాలికను గద్దించును.

"నీరాజు కనుకనే యుంచితిని. ప్రక్క నెందుల కుంచితి వని యాక్షేపించుచుంటివా! పోనిమ్ము భావిభర్తృభావసూచనగాఁ బైనే పెట్టెదనులెమ్ము" అని యాచిత్రపటము తీసి యాతనివక్షముపైఁ బెట్టును.

"ఛీ! యేమిచేసితివి" అని తటాలునఁ బోయి నర్మద యాపటమును రాజునురముపైనుండి తీసి మరలఁ బ్రక్కనే పాఱవేయును. "నాపటమున్ + ఆరాజు" ఇచ్చటఁగూడ ద్రుతసంశ్లేషముచే "నారాజు" కాఁగా, "నీరాజు" కనుకనే యని నవమాలిక యెత్తిపొడుచుటలోని చిత్రము గమనింపఁదగినది.

పాత్రములసంభాషణములలో పూవుమొగ్గలువోలెఁ దామే విఱు శబ్దశ్లేషలు చేమకూరవేంకటకవి విజయవిలాసమునవలెఁ దఱచుగ వీరి రచనములోఁ గనవచ్చును.

నిద్రనుండి లేచి కనులు నులుముకొనుచుఁ బురుకుత్సుఁడు మునుముందు "ఓహో! గాధినందనా!" అని స్మరించి,

"వినుత విప్ర శేమ వెంటనే శివశివా!
యుండదు దలఁచు విప్ర కంద "గాధి
నందన" యని చిత్తమందు మురుగ నుండు
కొట్టువానికంటెఁ దిట్టువాఁడు."

అంత నలరుమంత్రుఁడు,

"పరమభాగ్యశాలి ప్రసూనుల కెలనోవఁ
దిట్టు దీవ నగుట నట్టిమాట
కాదు; వేరెఁ బలుకనేమి కల్గునువాని
కవని మట్టి బంగ రైనదీవి."

అని ప్రశంసించును.

ఇందు "కొట్టువానికంటెఁ దిట్టువాఁడు; తిట్టు దీవ నగుట నట్టిమాట కాదు; మట్టి బంగ రగును" అనుమాటలందలి జాతీయత, చమత్కృతి గమనింపఁదగును. పద్మాక్ష పురుషద్వయిఁ గని సిగ్గుచేఁ దల వంచఁగా, వారతఁడు "ముఖము వంచితిరేల? నీముఖచంద్రకాంతిచేఁ గుముద ప్రకాశములు వికసించును సుమా" అని పరిహసించును.

"ఔరా! ఇపుడు జరుగుట చెల్లదంత. నట్టిల్లోపలు తలక్రింపదని నీవు చెప్పరాదా" అని పద్మాక్ష పదమాలికతో నని మొగమెత్తి, రాజును గనులారఁ గాంచును.

ఇందలి పరిసమయసంకేతములు, ఇతరభ్యంగభంగిమలు తిలకింప దగును.

పరస్పరసంభాషణములలో పద్మాక్ష పురుషద్వయి "మీ కెందఱు భార్యలు" అని ప్రశ్నించును.

"ఇదివఱకు ఒకభార్యయే సుమతి యనునది యున్న" దని యాతఁడు చెప్పెను.

"ఆమె మీకర్ధాంగలక్ష్మిగదా" యని పద్మాక్ష పలుకును.

"ఆమె యర్ధాంగలక్ష్మియే యైన నిన్ను
వెలఁది! నా వత్తిమీఁదను బెట్టుకొందు
నర్ధనారీశ్వరుండైన యతఁడు పరము
దయను తలమీఁద గంగను దాల్చుకరణి!"

అని తా నుత్తర మిచ్చును.

"యథార్థమేనా?" యని నర్మద మరల ననును.

"ఉరగకాంతలవలె రెండునాలుక లుండునా?" అని తా నెగతాళి చేయును.

"మీరు దానికిఁ బ్రభులే యయితిరే, అయినను నాచేతి యందు నీచేతిని బెట్టుము" అని ప్రగల్భముగ బదులుచెప్పును.

పురుకుత్సుఁ డామెచేతిని బట్టుకొని "యిదియే పాణిగ్రహణముసుమా!" యని నర్మదను గాఁగిలించికొనును. ఇందలి చమత్కృతులుగూడఁ బరిగణింపఁదగినవి.

తృతీయాంకమున పురుకుత్సుఁడు నర్మదగురించి విరహవేదనచే డీలుపడి విచారించునప్పుడు విదూషకునకు నతనికి జరిగినసంభాషణములలో నొకపరి పురుకుత్సుఁడు "మిత్రమా! దీర్ఘాలోచనము సేయువానివలె మాటలాడకుంటివేమి" యని ప్రశ్నించును.

"అవశ్యక వయ్యెను యథార్థమును గనిపెట్టితివి. సృష్టిసంబంధమయిన యొకరహస్యము నాలోచించుచుంటిని. సముద్రమునకు క్షారోదకము కలుగుటకుఁ గారణముగురించి" అని విదూషకుఁ డనును.

"ఎట్లాలోచించితి" వని పురుకుత్సుఁ డనుగ,

"మోహావశ లయినస్త్రీలు స్త్రీలకొఱకుఁ బరస్పరము నేడ్చుట

చేత" అని విదూషకుఁడు చెప్పెను.

"సృష్టిరహస్యములోఁ గూడ మదనరహస్యము వేఱొకటియా ! స్త్రీలు స్త్రీలకొఱకు చేయుటయేమి !" యని పురుకుత్సుఁడు ప్రశ్నింప,

"కంటఁ దడిపెట్టుకొనుటయేకదా పురుషలక్షణములలో నగ్రగణ్యమైనది" అని "యట్లు స్త్రీయగు నర్మదకయి యేడ్చువాఁడు స్త్రీయే యగు" నని వ్యంగ్యముగ గేలిసేయును.

"ఆకాంతారత్నమును నీవు చూడియుండకపోవుటచేతను, మన్మథనారాచతీక్ష్ణత్వ మెఱుఁగకపోవుటచేతను నీ వట్లనుచుంటివి" అని విదూషకుని పురుకుత్సుఁ డాక్షేపించును.

"ఆహా ! మదననాయకవ్యధ నే నెఱుంగననుచుంటివా ! పూర్వము నే నొకపిల్లని వలచి ధైర్యమును గోలుపోయి ..." అను నంతలో

"ఛీ ! తిర్యగ్జంతువునుగూడ వలచితివా" అని పురుకుత్సుఁడు గేలిసేయును.

"కీటకమును (పురుగయిన పాము) వలచుటకంటె గౌరవహానియుఁ బ్రాణహానియుఁ గాదుకదా !" యని విదూషకుఁ డనును.

"నా నర్మద కేవల సర్పరూపమున నున్నదని భ్రమించుచుంటివా !"

"పామురూపంబు వేసినే నరగు నాశ్ర
యమును పెనవైచు తత్స్వభావము మఱియు
గాఢపరిరంభణమునందె కానిపించు
మానినులకెల్ల నది తలమానికంబు."

"నేను గూర్చుండ నాతొడపైని శిరముఁ
బెట్టి తెగబారెఁ దగుబడక వెనుకఁ బ్రాల

సుంత వంకగ కేయునించె కంతుఁ డలసి
రతిలోఁదను జేర్చెను నసజ్యధనువుభంగి."

అని పురుకుత్సుఁడు సమాధాన మొసంగును.

"రాజేంద్రా ! నీ వధోలోకమునకుఁ బోయితి వని చెప్పితివి కదా ! రాజకార్యముల మఱచి కేవలము రాగపరవశులై కాలముఁ బుచ్చువారి నెవరినైన నాలోకమునఁ గాంచితివా !" అని విదూషకుఁడు ప్రశ్నింప,

"ఏమి నన్నే మఱచితి" వని పురుకుత్సుఁ డనును.

"ఓహో ! ఏలినవా రుండఁదగినంతయధోలోకమే లేదుగదా" అని విదూషకుఁడు పరిహసింప "నిందుచేత" అని పురుకుత్సుఁ డనును. "భూలోకమునను౦డి కేవలకాంతాపరాయణు లైనవారికొఱకే యీయధోలోకము బ్రహ్మచే సృష్టింపఁబడినది. ఆయధోలోకమునకుఁ బోయి యచ్చటఁగూడఁ గాంతాలోలురైనవా రుండురను ముందు దృష్టి లేక వారికిఁ దగినలోకమును సృజింపకపోవుటచే బ్రహ్మ యజ్ఞుఁడు నపూర్ణుఁ డయ్యెనుజుమా !" అని విదూషకుఁడు మఱింత తీవ్రముగ నాక్షేపింప,

"మరుని బాణములకంటెను నీమాటలవాడి యెక్కువగనున్న" దని పురుకుత్సుఁ డనును.

"రాజా ! గౌరవమును రక్షింపఁదలఁచినవాఁడు కాంతల వలలలో నెప్పుడును బడఁగూడదు. మోహము గౌరవలతకు వేరు పురుగు సుమా ! మర్మభేదకరములగు మాటలచే మానసమును బ్రజ్వలింపఁజేసిన దాని విరోధియగు మోహము శీఘ్రముగా బలహీన మగును గదా ! ముల్లు నూడఁదీయ సూది కావలెనని యెఱుఁగవా !" అని విదూషకుఁడు మాఱుపలుకును.

ఇట్టి సరసతరసంభాషణము లీనాటకరచనమం దెక్కువగఁ గాన నగును.

చతుర్థాంకము వక్రసంభాషణలకుఁ బాత్రము లొకరొకరి యెడఁ గావించు దెప్పిళ్ళకు నిలయమని మున్నే చెప్పియుంటిని. వాని నిక్రిందఁ గొంత యుదాహరింతును. నారదుని వెంటవచ్చు పురుకుత్సుని దూరమునఁ గాంచి సూర్యుఁడు,

"అదుగో నారదమునివర్యు నెనమ్ముప్రక-
తనుమహాతనుదీధితుల్ దనరుచుండఁ
గ్రాలుపురుకుత్సుఁ డురుకరకాళమేను
సన్నిధిని జెంది వెలిఁగెడు నన్నుఁ బోలి."

అని ప్రశంసింప బృహస్పతి,

"ఉన్నతోదారకులభవుఁ డొక్కఁ డేవఁడో
దుష్కళంకి యూఁగాని సమ్మూర్తు లగుదు
రందఱును, నారికేళాగమంబు నేడి
తూ రొయుదవినట్టి దయ్యభ్రకాయరీతి."

అని చంద్రు నుద్దేశించి పలుకును.

చంద్రుఁడు (తనలో) "దుష్కళంకి యని యీముసలిముని న న్నాక్షేపించుచున్నాఁడు. ప్రత్యుత్తరమున కిది సమయము గాదు" అని కుములును.

ఇంద్రుఁడు (తనలో) "ఈమహానుభావుని హృదయఫలకమం దీశారాపతి చేసిన యుత్రకము శిలాశాసనమైనదికదా! అదిశ్యా! పురుకుత్సుఁ డింక నెంతదూరమున నున్నాఁడో చూడుము" అనఁగా,

"దేహమంతయును కన్నులుగల మీరు చూడక యూతనిఁ జూపుమనెద రేమి?" అని శచి పలుకును.

ఇంద్రుఁడు (తనలో) ఆహా! ఈమె వాక్పూర్వాపర్యమును చెప్పిపోవుచున్నది," అని వగచును.

బృహస్పతి పురుకుత్సునిం గాంచి నిజవంశకర్తయగు ప్రభాకరుని నమస్కరింపుమని యుద్బోధించును. అతఁ డట్లు ప్రణమిల్ల సూర్యుఁడు (లేచి కౌఁగిలించికొని) "వత్సా! చిరాయురస్తు!"

"పెద్దవాఁడవు వయసునఁ బెద్దవాఁడఁ
దేజమున నస్మదాధసందీప్తి నిన్ను
నాకులంబునఁ గాంచి యనాకులతను
గంటి నది స్వభావము కులకర్తలకును."

అని యభినందించును.

నారదుఁడు (తనలో) "వయసునఁ బెద్దవాఁడ ననుచున్నాఁడు. ఆదిత్యు లందఱును ద్రిదశులే కదా! దంతము లూడుటచేఁ గాదు, ఊడఁగొట్టఁబడుటచేఁగాఁబోలును పెద్దవాఁడ నని చెప్పుచున్నాఁడు" అని దక్షయజ్ఞమున సూర్యునకు వీరభద్రునివలనఁ గలిగిన భంగపాటు నుద్దేశించి పరిహసించును. పైని గీతకీదిన "తనుమహోతనుదీధితుల్, నాకులంబునఁ గాంచి యనాకులతను" అను వాక్యములందలి శబ్దచిత్రములు గమనార్హములు.

అనంతర మింద్రుఁడు "నీవలెనే కువలయపాలకుఁ డయిన యీ చంద్రునకు నమస్కరింపు" మని పురుకుత్సుని హెచ్చరించును. అతని దర్శనమునఁ దనసర్మదావిరహము వృద్ధి యగు ననుశంకతోఁ గాఁబోలు పురుకుత్సుఁడు భయపడి వెనుకకుఁ బోవును.

ఇది గాంచి బృహస్పతి (తనలో) "భళీ! రాజా! చండాలునిఁ జూచి దూరమునకుఁ దొలఁగినట్లు తొలఁగుచుంటివి" అని సంతసించును. పురుకుత్సుఁడు చంద్రునిఁ జేరి (తనలో) "ఓరాజా! నీవు విచిత్రచరిత్రుఁడవు

"సఖియుఁ బతియుఁ గూడినఁ జాల సౌఖ్య మొసఁగి
విప్రలంభమునను దీర్చి విచ్చఁ జేయు
చెలిమి పరిరంభసౌఖ్యంబు నిచ్చి విరహ
మునను వేధించు హేమంత మనుకరించి."

"మింట నినుఁగాంచుమాత్రనే మంట లొదవె
మన్మనోగాత్రములయందు మునుట యెటులు ?
నేను నీవనిఁ జేరితి నిపుడు సింహ
గహ్వరముఁ జేరు హస్తీంద్రుకరణి గాఁగ."

అని భావించి (ప్రకాశముగ) "ఓ కువలయబాంధవా! నమస్కారము" అని నమస్కరించును. "ఇష్టార్థసిద్ధిరస్తు" అని చంద్రుఁడు దీవించును. నర్మదాప్రతిమను దేవళమునఁ గాంచి పురుకుత్సుఁ డొందు సంభ్రమవిలోకనసందర్భమున, ఇంద్రుఁడు "సుఖదుఃఖముల యొక్క త్రైకాలికసమావేశము పురుకుత్సునియం దెంతవింతగ శోభించుచున్నది!" అని భావించి,

"కనులు వర్షించు మోము వికాస మొందు
నొడలు స్తంభించు గాత్రమం దొదవుఁ జెమట
అశ్రుగతనీరవాహిని యైనయంత్ర
జనితరత్నప్రతిమ కట్లు సముదితముగ."

యని యతనియందుఁ గూడఁ బ్రతిమసామ్యము నాపాదించును.

అంతఁ బురుకుత్సుఁడు "మహేంద్రా! జీవనవంతుఁడనైన నన్ను బొమ్మగఁ జెప్పుచుంటివి. నాజీవనమునకు జీవనమైన నర్మదను గూడ నీవే బొమ్మగఁ జేసితివా!

"అంత కింతయ్యె నను దైన్యంబు కొంత
దుఃఖశాంతికి నేఁడెమో దారికెనను చు

ధైర్య మొకకొంత గ్రమ్మఁగాఁ దనరుఁ జిత్త
మర్ధసంగ్రస్తచంద్రగ్రహణముభంగి."

అని వచించును.

ఇది చూచి బృహస్పతి (శివలో) "అమూర్ఖునే తిరిగి తలంచు చుంటివా" అని విసిగికొనును.

పంచమాంకమున పురుకుత్సుఁడు పురువరూధినికిని తనకు వైద్యమొనరిచ్చిన పర్ణాదవలన సంపూర్ణారోగ్య మొందిన యామెను పర్ణాదగా గ్రహించి యన్యోన్యాంగుళీయకధారణసమయమునఁ దన చిటికెనవ్రేలితో నామెచిటికెనవ్రేలిని చేర్చినపుడు,

"కరము కరమునఁ జేర్ప నంగరము లిచటఁ
దనరు కర్కటలగ్నజాతకుఁడ నైన
నాకు గురుశుక్రు లిద్ద ఱనారతంబు
భాగ్యయోగంబునను జేకుభంగి గాఁగ."

అని వచించును. అంత విదూషకుఁడు "గురుఁడు షష్ఠాధిపతి గనుకఁ గొంచెముకలహము కలుగునని తలంచెదను" అని చెప్పును. ఇది త్వరలోనే మామ మంధాతునితోఁ బురుకుత్సునకుఁ గలుగుకలహమును సూచించును. వీనిలోఁ బంతులుగారి జ్యోతిషశాస్త్రవిజ్ఞానముఁ గూడఁ గొంత గోచరింపఁగలదు.

ఇంద్రుఁడు పురుకుత్సమంధాతులసమరమును వారించు సందర్భములోఁ బురుకుత్సునిఁ జూచి "మామగారిని శిక్షించునంతటి మహోగుణ విశ్వేశ్వరభక్తి వలనఁ గలిగినదికాఁబోలు" నని దక్షయజ్ఞధ్వంసనందర్భమున వీరభద్రునిచే మహేశ్వరుఁడు దక్షునకుఁ గలిగించిన శిక్ష నుద్దేశించియే యాక్షేపించును.

ఇట్లు సవిమర్శముగఁ బరిశీలించిన నన్నన్నియూ గుణవిశేష

ములు పంతులుగారి యీతొలుదొలుతటి దృశ్యకావ్యమునందు దృష్టములు కాఁగలవు.

విమర్శకులకు గుణదోషముల రెంటింటివిమర్శనముగూడ విశిష్టధర్మము. ప్రథమరచన యగుటచేతఁగాఁబోలుఁ బంతులుగారి యీనాటకమున నాదృష్టికిఁ గొన్నిలోపములుగూడఁ దోఁచుచున్నవి. వానినిగూర్చి యించుక ముచ్చటించెద.

తృతీయాంకమున రాజమందిరసమీపోద్యానమునఁ బురుకుత్సుఁడు నర్మదావిరహభరముగూర్చి విదూషకునకుఁ బంగలార్చుచున్నప్పు డురగలోకమునుండి నర్మదయు నవమాలికయు వచ్చి పూలచెట్లచాటున దాఁగియుండుట, అనంతరము అంశుమంతుఁడు గూడ వచ్చి నర్మద నచ్చటఁ జూచుట, అచ్చటికి వచ్చెదనన్న తన మిత్రుఁడు చిత్రకేతుఁ డింకను రాఁడయ్యెనే యని యంశుమంతుఁడు విచారించుచుండుట చదువరులకు విదితములే కదా!"

ఇంతలోఁ జిత్రకేతుఁడు రాఁగా అంశుమంతుఁ డాతనితో "మిత్రమా! మంచిసమయమునకు వచ్చితివి. ఇంతకుముందు పురుకుత్సుని చూచితివి గాని నర్మదను జూచియుండవుగదా! అదుగో మహారాజు విరహబాధవశుఁడయి విచారించుచున్నాఁడు. వెనుక నుండు జలయంత్రమున కానుకొని సఖీసమేతయై నర్మద ప్రకాశించుచున్నది. తిరస్కరిణిచేఁ బ్రచ్ఛన్నుఁడవు కమ్ము" అని యుద్బోధించును. తరువాతఁ జిత్రకేతునకు నంశుమంతునకు జరిగిన సంభాషణములలో "నిన్న నీవును నేను సమావేశమయినప్పుడు జరిగినసమాచారములన్నియుఁ బురందరునితో విన్నవించితిని. అతఁడు నర్మదను తాను చూడకయే పురుకుత్సున కామెను సతిగాఁ గూర్చుట కంగీకరింప"నని చెప్పి నర్మదను దీసికొనిరమ్మని తన్ను నియోగించె ననియు, అందుచేఁ దా నురగలోకమునకుఁ బోయి వెదుకఁగా నర్మద కనిపింపనందున

నిచ్చుటకు వచ్చితి ననియు నంతకుచేతనే తాను వచ్చుట కాలస్యమయినదని చిత్రకేతుఁ డనును.

అంశుమంత చిత్రకేతుల ప్రథమసమాగమము విశ్వామిత్రాశ్రమసమీపారణ్యమునఁ బ్రథమాంకముననే జరిగినది. పురుకుత్సుని పయి మోహనవిద్యను బ్రయోగించి యంశుమంతుఁ డాతని నరకలోకమునకుఁ గొనిపోయినప్పుడే చిత్రకేతుఁడు స్వర్గమునకు నిష్క్రమించును.

తరువాత వీరిరువురకుఁ గలిగినసమావేశము పైనిచెప్పినట్లు తృతీయాంకమునందలిదే గాని వేఱొండు గనరాదు. ద్వితీయాంకమున నెచ్చటను జిత్రకేతుప్రవేశమే కనరాదు. నర్మదనాతఁడు మొదటిసారి చూచినది తృతీయాంకమునఁ జెల్లెలగు నామె చెలితో దాఁగియుండఁగా నంశుమంతుఁడు చూపినప్పుడేగదా! ఇట్టిసందర్భములలోఁ జిత్రకేతుఁడు అంశుమంతునితో "నిన్న నీవు నేను సమావేశ మయినప్పుడు జరిగినసమాచారముల నింద్రునికి విన్నవించితి" ననుట నా కంత సంగతముగాఁ దోఁచుటలేదు. ఈయంకమున నంశుమంతునెదుట నతఁడు కనిపించుటయే వారిరువురకుఁ గలిగిన రెండవ సమావేశము. నర్మదనాతఁడు చూచినదియు నప్పుడే. ఈయంకము నందలి కథ పాత్రములయెదుట జరుగుచుండఁగనే పరోక్షముగ నాతఁ డెవనికిఁ దెలియకుండ నాకస్మికముగ స్వర్గమునకుఁ బోయి యింద్రునితో మాట్లాడి మరల వెనువెంటనే వచ్చె నని సమర్థింపఁదగునా!

నర్మదనాతఁడు మొట్టమొదటఁ జూచినది యిచ్చటనే యైనప్పుడు ఉరగలోకమున నామెను వెదకి యచటఁ గానక యిటు వచ్చె ననుట సంగత మగునా? నర్మదాపురుకుత్సులను సంఘటించుట యందు "నీవు నంటవిల్లులేని మన్మథుఁడ" వయితి వని యీద్వితీయ సమావేశముననే చిత్రకేతుఁ డంశుమంతుని నభినందించినాఁడు.

నర్మదాపురుకుత్సుల పరిణయమహోత్సవసమయమున నానందించుటకు అంశుమంత చిత్రకేతుల నిరువురను లేకుండఁజేయుట నాటకమండలి యొక్క లోపమనియే నేను తలంతును. పురందరుఁడు మందారునితో భాషించునపుడు "అంశుమంతుఁ డాకస్మికముగ మరణించుటచేఁ బాప మీ సంగతి నీకుఁ దెలియజేయుటకు విచారించుచున్నాను." అని యాకస్మికముగఁ జెప్పినట్లు మందారునకేగాక లోకమునకుఁ గూడ నంశుమంతుని మరణవార్త తెలియనే తెలియదు. అతఁడు కథసమయమునం దుండినచో నాటకము మఱింత మోదాంతముగ నుండెడిది. పండితులుగా రెందు కిట్లు వ్రాసిరో తెలియఁజాలకున్నాను.

*

పానుగంటి వారి నాటక రచనా శిల్పము.

శ్రీ డా॥ ముదిగొండ వీరభద్రశాస్త్రి

కీ. శే. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు రచనలు చేసిన కాలము ఒకదృష్టితో చూచిన యెడల తెలుగుసాహిత్య చరిత్రమున నాటకయుగమని అనవచ్చును. ఈ కాలమున అనేక నాటక కర్తలు బయలుదేరిరి. వారిలో పెక్కునాటకములు వ్రాసినవారును ఉన్నారు. తెలుగునాటకరచనము రంగస్థలాభ్యుదయమును ననుసరించి సాగినది.

తెలుగులోని బహుసంఖ్యాక నాటకములు నాటి ప్రేక్షక జనుల యభిరుచినిబట్టి సాగినవి. ప్రఖ్యాతులైన నాటక కర్తలుకూడ సామాజికుల అభిరుచులకు కట్టుపడియుండక తప్పలేదు. ప్రజలకు పాటలపై మక్కువయుండిన పాటల నాటకములే వ్రాసిరి. పద్యము లేనిదే నాటకములు ప్రదర్శనసమయమున రక్తికట్టి ప్రజల నలరింపలేవనుకొనినచో, పద్య బాహుళ్యముగా వ్రాసిరి. అంతియే గాని ప్రేక్షకుల యభిరుచిని సంస్కరించి, క్రొత్తపద్ధతులలో నాటకము వ్రాయుటకు సాహసించిన వారిసంఖ్య స్వల్పము. అట్టికాలమున పానుగంటివారు స్వతంత్ర వ్యక్త్యనుసారము నాటకములు వ్రాయుటకు పూనుకొనిరి.

నాటకములు ప్రదర్శనానుకూలములుకానిచో వాని ప్రయోజనమేమి యని వాదించవచ్చును. నాటకముల ప్రయోజనము రంగస్థలముపై ప్రదర్శన ప్రాముఖ్యము పొందుటమాత్రమే యను నూహ యున్నవారితో వాదింపలేము. శిష్టసాహిత్యాంగము కాని నాటకములకు ఉత్తమత్వమున్నటికిని సిద్ధింపదు. సాహిత్యచరిత్రకారుల కట్టి నాటకములతో ఎక్కువ పనికలుగ నేరదుగదా!

ప్రేక్షక జన చిత్తాకర్షణము నిమిత్తము తెలుగునాటక కర్తలు పడినపాట్లు చూచినచో నవ్వువచ్చును. ధర్మవరము కృష్ణమాచార్యుల వంటివారు సైతము ఆంగ్లాంధ్రసమ్మిశ్రితమగుభాషను, హిందూస్థానీ పదబాహుళ్యమగు భాషనుకూడను పాత్రలను పౌరాణిక నాటకముల

యందు ప్రవేశపెట్టినారు. తెలుగునాటకము లనేకములలో కన్పట్టు మఱియొక లోపము కవి కాలము నాఁటి సమస్యలెన్నో బలవంతముగా వానిలో నిఱికింపబడి యుండుట. మఱికొన్ని నాటకములు దోషములు లేకపోయినను, చూచుటకు చదువుటకు నొకమాదిరిగా నున్నవని పించునవి. ఉపక్రమ నిర్వాహణైక్యముగాని భావభరితత్వముగాని, కథాంశమునకు రసమునకు పోషణంబు కలిగించు పాత్రప్రవేశ సంభాషణానికములుగాని సుందరమగు పాత్ర స్వభావోన్మీలనముగాని లేకుండునట్టివి. ఇవి సంభాషణ రూపమున నున్న కథలనఁ జెల్లును.

ఇట్టిదినములలో పానుగంటివారు నాటకరచనమునకు దొరకని నూతన శిల్పపద్ధతులు వెలయించుచు విశిష్టనాటక సృష్టిచేసిరనిన వారి ప్రతిభ వెల్లడియగుచుండుట లేదా? వారిట్లు ప్రశంసార్హము లగు నాటకములు వ్రాసిరన్నచో వానికి వారి ప్రతిభ, శక్తియు మాత్రమే కారణములు కావు, పంతులుగారికి తాముకృషిచేయుచున్న కళారంగముపై గౌరవము ఎక్కువ. అదిగౌరవము మాత్రమే కాదు. అహంకారము కాని ఆత్మవిశ్వాసముతో, ప్రదర్శనానుకూల్యము చెడకుండ, సామాజికుల దుష్టాభిరుచుల ప్రాబల్యమునకు లొంగి పోకుండ, షేక్స్పియర్ మున్నగు రచయితల నాటకములవలె శిష్టసాహిత్యాంగములై పఠనపాఠనయోగ్యతాయుక్తములై తమకు తెలుగు సాహిత్యచరిత్రమున నొకయున్నత స్థానమును సమకూర్చు నాటకములను వ్రాయవలెనని వారినిశ్చయము సతతప్రయత్నము చేసి వారు కృతకృత్యులైనారు.

ప్రబంధయుగము తుదిదశలో ఎల్లకవుల రచనాపాటవము నొక వృత్తపు టెల్లలు దాటకుండ లోలోపల ఎట్లిమిడిపోయినవో, అట్లే ఈనాటకయుగమున గూడ కవుల శక్తియుక్తులు పరిమిత స్వాతంత్ర్యముతో సంకుచిత పరిధులనడుమ నిఱుకుకొని పోయినవి.

పానుగంటివారీవలయమున చిక్కుకొనలేదు. పాశ్చాత్యసాహిత్యము చేత ప్రభావితమైన మనస్సుతో, ఆర్షసంప్రదాయ విజ్ఞానయుక్తమైన సంస్కారముతో, స్వదేశభాషాభిమాన సంపూర్ణమైన హృదయముతో వారు సాహిత్యసృష్టి చేసినారు. కనుక వారి రచనలయందు పరభాషాసాహిత్య ప్రభావమేకాని అనుకరణము కనరాదు. అనుకరణము నసహించని వారి తత్త్వము ఎప్పటికప్పుడు క్రొంగ్రొత్త దారుల వెంట వారిని నడిపించి వారిసృష్టిని వైవిధ్యశోభతో నింపినది.

కథాకథనరీతిని సాగుచుండిన తెలుగునాటకమందు పానుగంటివారు పాత్రస్వభావోన్మీలనము ప్రధానమగు, బుద్ధిగమ్యమగు సంవాదపద్ధతితో గూడిన శైలిని ప్రవేశపెట్టినారు. నాటక కథలో దృశ్య, సూచ్యకథా విభాగములను నేర్పుతో చేసికొని, ఆద్యంతములను దృష్టి యందుంచుకొని రూపకవస్తువును చక్కని ప్రణాళికపై నడిపి, ఉత్కంఠను పోషించుచు వారు తమనాటకములను రచించినారు.

పానుగంటివారి నాటకములలో సుప్రసిద్ధములైన కథగలవి రామాయణ నాటకములు నాలుగు, సారంగధర విప్రనారాయణనాటకములుమాత్రమే. తక్కిన వానిలో నర్మదా పురుకుత్సీయము, రాధాకృష్ణ, బుద్ధబోధసుధ, ప్రచండచాణక్యములలో కొన్ని పాత్రలు ప్రసిద్ధములేయైనను కథాంశములను విపులీకరించుకొనుట వారేచేసికొనిరి. వారి నాటకములలో కల్పితేతివృత్తములే ఎక్కువ. ప్రసిద్ధకథానాటకములందు సైతము వీరు కొన్నికల్పిత పాత్రముల మూలమున నూతనాంకములను చేర్చియున్నారు. అవి సామాజికుల నాకర్షించి క్రొత్త చవులూరించుచుండును. ఇక కల్పిత వృత్తములు గల రూపకములలో వారు సామాజికుల నాకట్టుకొనుటలో అబ్బురమేమున్నది ?

లక్ష్మీనరసింహారావుగారి నాటక కృతులయందు వైవిధ్య మెక్కువ. పౌరాణిక, చారిత్రికాది వృత్త విభాగము ననుసరించి, శృంగార, వీరాదిరస భేదమున ననుసరించి, సుఖాంత, దుఃఖాంతములనను సరించి యే కాక ఇంకను వారెన్ని ప్రయోగములు చేసి తమ నాటకములయందు వైవిధ్యమును ప్రకాశింపఁ జేసిరి. పాత్రలసంఖ్య విష యమున, నాటకదైర్ఘ్యమునందు వారు రకరకములుగా వ్రాసి చూపిరి. పంతులుగారు బహునాటక కర్తలగుటయే కాక తెలుగున బహుముఖ నాటకశిల్పపాటవమునకు రాజపథములు తీర్చిరి.

పానుగంటివారి నాటకములందలి ప్రత్యేకలక్షణములను చెప్ప వలసివచ్చినచో, వారు మనస్తత్త్వ నిరూపణమునకు ఎక్కువ ప్రాముఖ్యము నిచ్చిరనియు, కథాగమనముకన్న లోకవృత్తనిరూపణ మునకు, తాత్త్వికచింతనమునకు ప్రాధాన్యమిచ్చిరనియు, పూర్తిగా సంప్రదాయ నిరసనము చేయకుండఁగనే తమనాటకములలో వారు నవ్యత చూపియున్నారనియు మున్ముందు పేర్కొనవలెను.

భవభూతి నాటకమునుగూర్చి సాక్షిలో వ్యాసము వ్రాయునెడ నరసింహారావుగారు భావికథాసూచనమును గూర్చి ఎక్కువగా ప్రశం సించియున్నారు. వారును ఉపశ్రుతిమూలకమైన భావికథాసూచ నమునట్ల ఎంతయు మక్కువ చూపించియున్నారు.

పంతులుగారి నాటకకృతులయందు ఆకర్షకమగు మఱియొక యంశము వారిసంభాషణ నిర్వహణకౌశలము. పాత్రనిర్మాణవ్యవస్థ, సంభాషణములు- ఇవి నాటకేతివృత్తమును నడుపుచున్నట్లు అగపడు విధముగా వ్రాయుట నాటకరచన యందత్యంతము కష్టమగు పద్ధతి. దానియందు వారు సిద్ధహస్తులు.

పానుగంటివారి నాటకరచనా పాటవమును విపులీకరించుటకు ఈగ్రంథియవకాశము చాలదు. కొంచెము ఇంతవఱకు వివరింపఁబడిన వారి

పద్ధతులను కొన్నింటినైన స్పష్టము చేయజాలిన ఉదాహృతులను పరిశీలింతము.

రాధాకృష్ణ నాటకమునందలి ద్వితీయాంకము మిక్కిలి ప్రౌఢమైనది. రాధసందేశమును గొని శారదుడు మధురానగరమున కరిగెను. కృష్ణుని అతడు కలియుటకుముందు సత్యభామ కనులంబడెను. ఆమె సిగ్గవీసి రాధనుగూర్చి ప్రశ్నముల వర్షము కురిపించెను. నిలువెల్ల రాధపై నీర్ష్యముగా ఉన్న సత్యభామ ఎట్టికను సంభాషణమునకు వెనుదీయ లేదు. నోటికివచ్చినట్లెల్ల మాటాడుట అలవాటున్నవాడును, పరిహాస ప్రియుడును అగు శారదుడు సత్యభామ రాధనుగూర్చి పలుకు కటు వాక్యములను వినఁజాలకపోయెను కాని సత్యభామ నేమనుటకు వీలు లేదు మాటకుమాట పెంచుటకు ఇష్టములేక, ఎక్కడికక్కడ తుంచివేయుటకు ప్రయత్నించి, ఆమెసాగనీయక పోగా తప్పనిసరియై పైకి చిఱునవ్వులు నవ్వుచు చమత్కారముగా మాటాడును. కాని అతని అంతరంగమందలి గాఢమైన అసంతృప్తిని గూఢముగా అతని మాటలలో గోచరించును చిట్టచివరకు సత్యభామ ప్రశ్నలకు విసిగి పోయి "అయ్యా! నీవొకసారి బృందావనమువచ్చి రాధను చూడ రాదా?" అనెను ఆమాటయే అనంతర కథాసంవిధానమునకు దారి తీసినది. ఈసన్నివేశమునందలి పాత్రపోషణము పాత్రచిత్రణములే కథాగమనమును నిర్దేశించినవి. తూచిమాట్లాడఁదగిన మహారాజ కుమారి సత్యభామ నోటికివచ్చినట్లెల్ల ప్రసంగించుట, సామాన్యముగా నోటికివచ్చినట్లెల్ల మాటాడు శారదుఁడు తూచి మాటాడుట- ఇక్కడ అంకమునందు తాఱుమాఱైనవి. ఈవైషమ్యము చమత్కారహేతువై ఈసన్నివేశమును రక్తికట్టించినవి ఇట్టి శిల్పమే ఈనాటకమునందితర స్థలముల కానవగును.

రాధాకృష్ణ నాటకమున రాధకు లలిత, మధురయును సఖు

లను పంతులుగారు ప్రవేశపెట్టినారు. అయిదంకముల యీనాటకములో మొదటియంకమున రాధప్రక్కన లలితయున్నది. మూఁడవయంకమున లలిత మధుర యిద్దఱును; చతుర్థాంకమున మధుర యొక్కతె, రాధ భక్తి మొదట లలితమై, పిమ్మట లలితమధురమై తుదకు మాధుర్యమయ మయ్యెనని పంతులుగారెంత చక్కఁగా నిర్దేశించినారో ?

నాటకములయందు ముఖ్యముగా నుండవలసినది నాటకీయత నాటకీయములగు సన్నివేశములను సృష్టించుకొనుటలో, తీర్పుటలో పంతులుగారు అందెవేసినచేయి.

దశరథునకు చిరకాలమునకు కుమారుడుకలిగెను. దశరథుని ఆనందమునకు మితిలేదు. ఆసన్నివేశమును పానుగంటివారు తమ కల్యాణరాఘవమున తీర్చినారు. పురిటికందు, నెత్తికొనివచ్చి దశరథ మహారాజు తనకుమాత్తమునకు వసిష్ఠునికి చూపించి, తన ఆనందము, తనకౌతుకము ప్రకటించును. ఆఁ కనుమూసినప్పుడె యింతలేసికన్నులు-నిండుగా తెఱచినప్పుడెంతయుండునో, పుట్టినప్పుడే యింతయున్నాఁడు, ఎదిగినప్పుడు ఎంతస్ఫురద్రూపియగునో! ఇది దశరథుని మనోభావ ప్రవాహము. వసిష్ఠుఁడెట్టివాఁడు ? అంతకుముందే వ్రాసిన పాదుకా పట్టాభిషేకమున పంతులుగారా పాత్రముచే పలికించియున్నారు. “అనేకహాయనముల” నుండి తలంచి, మననముచేసి, భక్తి వహించి, పూజించి బహువిధములసేవచేయుచు నితని సచ్చిదమల స్వరూప చరణ సందర్శన సాధనమతిని గిర్త్యమును పురోహితతనుగాంచి రఘుకులమును గనిపెట్టుకొని” యున్నవాఁడు అంతె ఎదురుచూచినసమయము దే ఆసన్నమైనది. ఆసచ్చిదమల స్వరూపమిప్పుడు అవతరించినది. దశరథుడు చూపించిన కన్నుల ముక్కు చెవి ఆయనకు కనిపించునా? అన్నాఁడు ?

ఇది కన్ను; ఇది ముక్కు; ఇది చెవి యని నాటకము విస్పష్టముగఁ గానఁబడుటలేదు.

కనులు మిఱుమిట్లుగొల్పు పుల్కల నొసంగి
మోద బాష్పములను వెల్వు పూర్ణ విమల
కాంతి గంభీర తేజము స్వల్పపూర్వ
పరిచయముగల యదియె మాపట్టినాకు''

ఒకే సన్నివేశము- ఇరు తెఱఁగుల పాత్రములు; ఒకే రంగము- రెండువిధముల చిత్తవృత్తులు; ఒకే అలంబనము- రెండు పద్ధతుల అనుభావములు- రెండు రసప్రవాహములు వీని పరస్పరసంఘర్షణము ఇంతకన్న నాటకీయత ఎట్లుండును?

ఇదే నాటకమున చెప్పఁదగిన మఱియొక చక్కని ఘట్టము తృతీయాంకము. తాటకను చంపినందులకు శ్రీరాముని తీసికొని పోవ తెనని విశ్వామిత్రమహర్షి వచ్చి దశరథుని గలిసికొనెను. రాముని పం పుమని అడుగ, పంపఁజాలనని దశరథుడు వాదించుకొనుటకంటె వింత కథ లేదుగదా; కాని పామకంటెనారి దశరథుడు పరమ లాఘ్యము చమత్కారి, ఘర్షణపడలేదు. "మీరు లేకదశరథుఁడనుకొనుఁడు. నేనె విశ్వామిత్రుఁడను, నేనె మీరాముఁడనడిగితిని. ఎఱుఁగక యిచ్చెదనని మీరుపలికితిరి. ఇట్టిస్థితిలో మీరిట్లు మనసులో గుబ్బటలు పడుచున్నారా లేదా?'' అని ప్రశ్నించి తన మనసులోనున్న సందేహముల నన్నిటిని వెడలబోసెను, విశ్వామిత్రుఁడును తానే అస్థితిలో దశరథుఁడైయుండిన ఎట్లు తలఁచునో చెప్పుచు ఆసందేహములన్నింటికి నొక్కసారి సమాధానము చెప్పెను. ఇది నాటకీయతకు పరమావధిగ తీర్చిన ఘట్టము.

పాత్రచిత్రణము విషయమున పంతులుగారి కౌశలము సుప్రసిద్ధము కాని వారిసృష్టిలో ప్రతిప్రకృతిగల పాత్ర ఎక్కువ కీర్తిగన్నను సుఖదుఃఖములకు లొంగిపోయి తెగిపడి బయటపడు విద్యానుద్వేగము

గలపాత్రలు, సుఖదుఃఖములచే అవధిభూతమైన స్వభావముగల పాత్రలు - ఈ రెండును ఒకవిధముగా శిల్పనిర్మితములే. పంతులుగారి నాటకములలో సుమారు మున్నూట యేబది పాత్రములున్నవి. ఇవి యన్నియు వైవిధ్యము, వ్యక్తిత్వముగల పాత్రలే. ఎవనికున్న కష్టసుఖములు వానికుండును; ఆకష్టసుఖముల ననుభవించుటయందు అందఱను నొక్కటే మనస్సు కాదు. వారివారి అనుభవములనుబట్టి వారికొన్ని స్థిరాభిప్రాయములు; వానిని బట్టి యొక్కొక్కరి కొక్కొక్కమార్గము ఈ పాత్రములు కేవలమానవ విగ్రహములు కావు.

నాటకకర్త మానవకృత్యములను నిర్వర్తించు బొమ్మలను సృష్టించుటకాదు. ఆకృత్యములను చేయుచు మనస్సును జీవమును గూడ ప్రదర్శింపవలసియుండును ఆజీవకళాదాన మహాకార్యమే పాత్ర సృష్టిని, పాత్రచిత్రణముకన్న విశిష్టము చేయును. వాస్తవిక వ్యక్తులకు నాటకపాత్రములకు నడుమ నొకసన్నని పొరవంటి అంతరమైన లేకుండునట్లుచేయుట గొప్పకళ. అది పానుగంటివారికి కరతలామలకము.

పాత్రసృష్టిచేయుటలో పంతులుగారికొక ఆవేశమున్నట్లు తోచును. అందుమూలకముగా అతి వైలక్షణ్యవంతములయిన పాత్రలు అవతరించినవి. భయాశ్చర్యక్రోధశోకాదులను వరుసక్రమములో అభినయించునవి కాక జీవితములో వలెనే సమగ్రమును, అసమగ్రమునై వివిధభావ సంఘర్షణము కలిగిన మనస్సుగల పాత్రములను ఏకీభూతవిస్తృవర్ణమైన సూర్యరశ్మివలె ప్రకాశమానమైన స్వభావముగ, పాత్రలను పంతులుగారు సృష్టించినారు. మఱియు, అప్రధానపాత్రలని యెంచబడు నిష్కించన పాత్రములను సైతము వారు అంత విస్పష్టమనోహరముగ పోషించినారు.

పంతులుగారి పాత్రలను తేలికగా రెండు వర్గములు చేయవచ్చును. శాంతగంభీరోదాత్తమై, సాత్త్వికతానిబద్ధమైన నొకవర్గము, ఔజ్జ్వల్య ప్రధానమై, పరిహాస ప్రియమై, తర్కనిపుణమై తుళ్లిపడునది మరియొకవర్గము వారి సంశ్లిష్ట మనస్తత్త్వము రెండంచుల నీరసి వచ్చిన వర్గములివి.

పర్యవసానముగా, పంతులుగారు తెలుగునాటక సరస్వతి కిచ్చినన్ని మణిమయోజ్జ్వల భూషలు మరెవ్వరును ఇచ్చియుండలేదని స్థిరముగా చెప్పవచ్చును.

— • —

శ్రీపానుగంటివారి పరిచయచారుత్వము

శ్రీ వేదుల రామచంద్రమూర్తి, B.A (Hons) B. Ed.

కవికి నలయు సమగ్రలక్షణములలో లోకజ్ఞత, పరిచయ చారుత్వము ననునవి ముఖ్యతమములని క్షేమేంద్రుని యను శాసనము. తర్క, వ్యాకరణ, భరత, చాణక్య, వాత్స్యాయన, భారత, రామాయణ, భాగవతాత్మజ్ఞాన, వైద్యక, జ్యోతిష, గజ, తురగ, పురుష లక్షణ, ద్యూత ప్రకీర్ణములయందు పరిచయము కవి సామ్రాజ్య సూచకమని క్షేమేంద్రుని కవి కంఠాభరణమున చెప్పబడినది. బహు గ్రంథ పరిచయమువలన అనేక శాస్త్రములయందలి మూలమూలల మూలిక విషయములను కవిబ్రహ్మ శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహ రావుగారు తమ రచనములను పొందుపఱచి యున్నారు. ఇందు సంస్కృతాంధ్రముల నెఱుంగదగు శాస్త్రవిషయములే గాక ఆంగ్ల భాషామహోదధిం దఱచిన లభ్యమగు సూక్తిరత్నములు కూడ నెఱయుచుండును. దిఙ్మాత్రముగా నా యా విషయముల నుదహరించుటయే ప్రకృత వ్యాసమున నుద్దిష్టము.

గురు కుల క్లేశమున లభ్యమగు భౌతిక, రాసాయనిక శాస్త్ర సంబంధములగు యుపమలే గాక, భాషా వాఙ్మయ శాస్త్రముల యందు నిబిడీకృతములైన సంగతులు కూడ వీరి కావ్య గానమున వినబడుచుండును.

జ్యోతిష పరిచయమునకు నర్మదాపురుకుత్సీయమున నాయికా నాయకుల పాణిగ్రహణ సందర్భమున నీ క్రింది పద్యములను దిలకింపుడు. (117 పే)

గీ. "కరము కరమున జేర్చ నుంగరములిచటఁ
దనరు కర్కటలగ్న జాతకుఁడ నైన
నాకు గురు శుక్రు లిద్ద రనారతంబు
భాగ్య కోణంబునను జేయు భంగి గాఁగ."

ఇట్లే, ప్రచండ చాణక్యనాటకము జ్యోతిశ్చక్ర పరిశీలనము తోనే ప్రారంభమైనది. (1వ. అం.)

గీ. "రాజ్య భాగ్యాధిపతులు పరస్పరంబు
కలియ కరులైన యోగంబు కలుగు టెట్టుల?"

పంచాంగ పరిచయమునకు ప్రచండచాణక్యముననే వేశ్యమాత తన వయస్సును గూర్చి క్రిందటి శివరాత్రికి యింతటి వయస్సని చెప్పుచుండగా "గోవింద ద్వాదశి కనరాదా? అని కొన్ని సంవత్సరముల కొకమారు వచ్చు తిథిని సూచించును (126 పే)

వైద్యక పరిచయమునకు వనవాస రాఘవమున

గీ. "విషము సంజీవి చేయదే భేషజంబు"

అని శుద్ధిపరుపబడిన రసవిష గంధకాముల ప్రయోగము నుపహరించును. (5వ. అం.)

అట్లే రాధాకృష్ణ నాటకమునందు సత్యభామా గర్వభంజనమును గూర్చి పలుకుచు గర్వప్రాయశ్చిత్తము ఆ గర్వమునకు లేత దశలో జరుగకూడదను దాని కుదాహరణముగ నారదునిచే

"అంతరకుసుమము క్రమముగా పెరిగి, కననికారంధ్రమంతయు వ్యాపించి, దృష్టిని సంపూర్ణముగ బాధచేసినగాని దానికి శస్త్రచికిత్స చేయకూడదు." అను Cataract operation గూర్చిన సిద్ధాంతము నలవోకగా పలికించును. (5వ. అం)

జ్యోతిష పరిచయమునకును, లోకజ్ఞతకును బుద్ధబోధసుధలో కొన్ని వస్తువులు కొత్తవి శ్రేష్ఠములయ్యెను, మరికొన్ని పాతవి గ్రహించవలసినవనియు చెప్పుచు,

"పుచ్చుకోలేది కేవల్బ్రన్ని పోలుపుగాంచు నన్నారు.(1వ.అం)

శిక్షా పరిచయమునకు (phonetics) రాధాకృష్ణ అయిదవ యంకమున సగుణ నిర్గుణోపాసనల తారతమ్యమును వివరించునట్లు నీ క్రింది గీతము చెప్పినారు.

గీ. "బోటి, నెఱసున్న పర్ణ సంపుటితమైన గాని
నోటను బలుకఁగా రానియటుల నిర్గుణము కేవలము
మనో నియమితోడ దలప నెవ్వరికైన సాధ్యంబుకాదు"

ఇందు గహనమైన సగుణోపాసన యావశ్యకతను స్థాపించుట యేగాక, నెఱసున్న యుదాహరణను గూర్చిన శితసూత్రము కూడ తెలుపబడినది.

ఇట్లే ఉపనిషద్ధ్యేయమగు పూర్ణమగు నీరిమునన్ను లగ్నమై క్రొత్త సంగతులను జెప్పుచున్నది. వస్తువున కుచితస్థానము శోభనకరమనియు స్థానభ్రష్టత శోభావిహీనతకు గారణమనియు నిరూపించుటకు మనవాని రాఘవమున (గవ. ఆం.)

"అంకెలందునబడి వట్టిదయ్యె సున్న
అక్షరంబయ్యె నద్ది వర్ణాళిబడుచు"

అనినారు.

వ్యాకరణ పరిచయమునకు మనవాని రాఘవమున నైదవ యంకమున హనుమంతుడు "చూడబడినది. చూడబడినది" యని గావుకేకలు వైచినాడట. అనగా దానిపై శరభునిచే నిట్లనిపించు చున్నారు.

"చూడఁబడిన దేది? తన మొగమా? నా మొగమా? అనాథ రాష్ట్రపాలనమువలె కర్తలోపించిన క్రియయా? శక్తిహీనువలెఁ గర్మణి ప్రయోగము చేసెనుగదా. ఎవనిచేతనో చెప్పనక్కఱలేదా? 'సీత నాచేత చూడఁబడినది' అని చెప్పఁగూడదా? నవ వ్యాకరణవేత్తవలె నెన్న వెదురాకు పనయేనా?" అనుచు కర్మణి ప్రయోగములోని ప్రయోక్త్ర ధార్ష్ట్యములోని దెబ్బపొడుచుటయే గాక హనుమంతుని నవ వ్యాకరణవైదుష్యమును గూడ స్మరించినారు.

ఇవిగాక, మృగయా, చిత్రలేఖన, గాన, నృత్యాదికళల పరిచ

యమును వెలువరించు నవ్యాంగ్లేయముల నుదాహరణము లను గ్రంథ విస్తరభీతిచే వదలినాను.

శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు ఆంగ్లమున పట్టభద్రులేగాక సుశిక్షితులైన విజ్ఞానశీలురగుట వలన ఆంగ్ల సాంప్రదాయములను కొన్నిటిని తమ రచనలయందు సుప్రయుక్తముగా కొరలించినారు. ఇట్టివానిలో జాతీయత (Idiom) పరిచయమునకు కల్యాణరాఘవమున మూడవయంకమున రాజశ్రీతుల నడవడిని దిద్దుచు ఈ క్రింది పద్యమును చెప్పినారు.

సీ. "ఎదుట బడనిచ్చు జాలు నిం కేమి యనుచు
దుడుకు దుడుకున నెల్ల వస్తువుల ముక్కుదూర్చి
విఘ్నగ్రమున మూల జేర్చి దింగుల
దడబడలు సేయ ననులకోకదరు తుదకు

'Do not poke your nose in everything' అను ఆంగ్ల జాతీయత కిది తెనుగుసేత. వేరొకచో బుద్ధబోధసుధలో ద్వితీయాంకమున
"కుమ్మరి పురుగు 'పుస్తకక్రిమి' యటంచు"
అని 'Bookworm' నకు తెనుగు కావించినారు.

నర్మదా పురుకుత్సీయమున ప్రథమ యంకమున 'Lull before the storm' అనుదానికి 'తుపాను రాబోవుటకు ముందు ప్రశాంతత' అనినారు.

రాధాకృష్ణ మూడవయంకమునందు 'Like poles repal అను నయస్కాంతశక్తి కుదాహరణముగ రాధామధుర విరువురు స్త్రీలే యగుటవలన నొకరినొకరు ఆకర్షించలేకపోయిరని చెప్పుదు
"విద్యుద్యుక్తి వస్తువు వెలయ నొకట
జాతిశక్తి గనుడు, దాని సరస చేర్చు

బడిన నది దూరమాభంగి వనిత మధుర
విడిచి తొలగ, వదృష్టవంతుడను నేను.

అనినారు.

వీరి ప్రకీర్ణ వ్యాసములలో నొక సందర్భమున " 'సైనేటిలా', 'శాసిలీగా' యనుచు గణితశాస్త్రజ్ఞులు కొట్టుకొనిపోవుచుండుట లేదా? బార్బరా, సిలారెంట్ అని తర్కశాస్త్రజ్ఞులు కాలక్షేపము చేయుడం లేదా ?" యనుచు పాశ్చాత్య గణితశాస్త్రమునకును అరిస్టాటిల్ వర్ప రచిన తార్కిక శుద్ధరూపములనుగూర్చి ప్రసంగించి తమ విజ్ఞతను ప్రకటించినారు.

ఇవి గాక, లోకపరిచయమును, వస్తులక్షణ వివేచనకును నొక యుదాహరణము నిచ్చుచున్నాను.

ప్రచండచాణక్యమున నైదవయంకమున:

చతురిక- స్త్రీల యంతఃకరణము జల్లెడ వంటిదనుచూ.

సునంద- రహస్యము లోపల నిలవబడదనియా ? అల్పమైనవి జారి
పోవునుగాని గొప్పవి నిలుచునని చెప్పలేకపోతివా ?

చతురిక- "సలిచిన మేలో యవి పరిత్యజింపదగినవే" యని యూరకుండెను.

శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు సూక్ష్మదృష్టితో పరిశీలించి వర్ణించిన విజ్ఞానము సర్వతోముఖమైనది. రాచనగళ్లలో ఎవ్వరెట్లు ప్రవర్తింతురో, ప్రత్యేకముగా రాజానువర్తులై వారి యాంతరంగిక భావములను దాసదాసీజనులెట్లు ప్రకటించుచుందురో ప్రత్యేకముగా ననుభవించినట్లు వ్రాసినారు. వీరమతి నాటకమున "బొమ్మిడాయ పులుసులో గలిపిన నమ్మిడి వత్సనాభి యార్గురు మహారాజులను చంపుటకు సరిపోవునే" యని విషప్రయోగ విషయమును గూడ వర్ణించి యున్నారు. 'అప్రయోజకుడగు కవివల ప్రధానపాత్రను జంపెదవా యేమి' యని కథాకథన కౌశలమునకు

సంబంధించిన మూలసూత్రమును తెల్పినారు. ఏలైనపుడెల్ల, కుకవుల యప్రయోజకతను అసమర్థతను వెక్కిరించుచునే యుందురు. బాలల స్త్రీల లోలత్వము, చాపల్యము మొదలగు గుణములను వెక్కిరించినారు.

వనవాసరాఘవమున, "ఉన్నదున్నట్లు చెప్పిన నది కవిత్వమెట్ల గును, అది చరిత్రయగును" అని కవిత్వమునకును, చరిత్రకును గల ప్రధాన భేదమును వివరించినారు.

ఇట్లిన్ని యేని యుదాహరణములను విపులీకరింపవచ్చును. అందలి సారస్యమును వివరింపబూనినచో నది పెద్దగ్రంథమే కాగలదు. ఆధునిక వర్ధమాన కవులకు నవశ్యాధ్యయనీయము కృతులలో నీ కరిచయము చారుత్వ మొక్కటి.

— • —

పానుగంటివారి ప్రతిభా వ్యుత్పత్తులు

శ్రీమతి వేదుల మీనాక్షీదేవి.

బ్రహ్మశ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారిని గురించి నేడిక్కడ జరుగుచున్న శత జయంత్యుత్సవ సందర్భమున నీ పరిషత్సభలో పాల్గొను అవకాశము నాకు లభించుట నా అదృష్టము. 1929-వ సంవత్సర ప్రాంతమున కాఁబోలు పంతులుగారు తమ కుమార్తెయైన శారద రమణమ్మగారిని విశాఖపట్టణములోని క్వీన్ మేరీస్ హైస్కూలులో చేర్పించుటకు స్వయముగావచ్చినపుడు వారి దర్శనభాగ్యము నాకుఁగలిగినది. అంతకుముందే హాస్యరసప్రధానమైన కంఠాభరణ నాటకమును చదివి యున్నాము. ఆ సంవత్సరమే పాఠశాల సంవత్సరోత్సవ సందర్భమున వీరి రాధాకృష్ణనాటకము ప్రదర్శించినాము. ఈ రెండునాటకములకు కర్తఅయిన శ్రీ పంతులు గారిని చూచినప్పుడు మా కెంతో సంతోషము కలిగినది. క్రమ క్రమముగా వీరు రచించిన సాక్షి ఉపన్యాసములను, నాటకములను కూడ చదివినాను.

ఆ కాలపుఁ గవిపండితులలోవలెనే శ్రీ పంతులుగారిలో కూడ సర్వజ్ఞత్వము వెల్లివిరియుచుండెను. గ్రేట్ విక్టోరియన్స్ అని పేరు పొందిన ఆంగ్లేయకవులలోఁ గల ప్రధానలక్షణములన్నియు ఈ యిరువదవ శతాబ్దపు ప్రథమభాగమున వెలసిన పండిత ప్రకాండులలో నుండెడివి. సింహాద్రియమని పేరుపొందిన పానుగంటి నరసింహారావు గారు, కూచి నరసింహంగారు; మా తాతగారైన చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు; కందుకూరి వీరేశలింగంపంతులుగారు వేఱుకోవకుఁ జెందినప్పటికి గిడుగు రామమూర్తిపంతులుగారు, గురజాడ అప్పారావు గారు మొదలైనవారిట్టి ఉద్దండులలో చేరినవారే.

సర్వ సమర్థులైన ఆ కాలమునాఁటి నాటకకర్తలలోఁగల కొన్ని ముఖ్యలక్షణములను వర్ణించి ఆ యా లక్షణములు శ్రీ పాను

గంటివారిలో సంపూర్ణముగఁ గలవని నిరూపించుటయే నా ప్రసంగములోని ముఖ్యోద్దేశము. అట్టి లక్షణములలో మొదటిది : సమగ్రమైన పాండిత్యము. శ్రీ పంతులుగారు ఆంగ్లములో పట్టభద్రులు. ఆంధ్రభాషలో పారంగతులు. సంస్కృతభాషలో వ్యవహారదక్షత కలవారు. ఈ విషయము వారి రచనలయందంతటను గనఁబడుచునే యుండును.

పాత్రచిత్రణములోనేమి, కథాకల్పనలోనేమి, సంభాషణలలోనేమి, సన్నివేశములలోనేమి, వీరు షేక్స్పియరు మహాకవిని దలఁపించుచుందురు. కంఠాభరణములోని తబ్బిబ్బులు మిడ్‌సమ్మర్‌నైట్స్‌లోని తబ్బిబ్బులను గుర్తుచేయును. సరస్వతి నాటకములోని తికమకలు ట్వెల్త్‌నైట్‌లోని, అన్నాచెల్లెళ్ళ మారువేషములను జ్ఞాపకముచేయును. వీరి సైంధవము, పూర్ణిమ మొదలగు నాటకములలోని యితివృత్తములు షేక్స్పియరుమహాకవి విషాదాంతనాటకములను బోలియుండును. అయినను వీనిలో నేదియు దేనికిని భాషాంతరీకరణము కాదు. షేక్స్పియర్ మహాకవివలెనే నరసింహారావుగారు కూడ సామ్రాజ్యాధిపతులు మొదలుకొని శ్మశానపాలకులవరకును, అసూర్యంపశ్యల మొదలు అంటరాని అన్నుల మిన్నలవరకును అన్నిపాత్రములను వారివారి పరిస్థితులకు, చిత్తప్రవృత్తులకు అనుగుణముగా చిత్రించినారు.

ఈ పండితుల రెండవలక్షణము భాషాదక్షత. ఉపమాన పరంపరలో, దృష్టాంత సమూహములలో, వివిధశబ్ద విన్యాసములలో, ఎక్కడనో మారుమూలనున్న వేదాంతపరిభాష మొదలుకొని పీఠ భాగవతముల ముత్తాయిపులవరకు శ్రీ పానుగంటివారు వాడని పదము లేదు. పాణినీయ వ్యాకరణములోని 'కాల' వంటి మారుమూలనున్న సూత్రముల మొదలుకొని గ్రిమ్మాగారి భాషాచరిత్ర

పఠకులకుఁగల అన్నిసాంకేతిక పదములను ఆయా సందర్భములకు తగి నట్లుగా ప్రయోగించినారు. సమాసకల్పనలలో అద్భుతకల్పను చేర్చెడు పదములను అతికి చిన్నపిల్లలు మెకానోసెట్టుతో వేలంవేలు రూపములు కల్పించినట్లుగా కల్పించినారు. ఉదాహరణకు

"నిరాఘాట కవనధారా పాకీణుడు."

"దినమణి సిందూర తిలక లలితాలిక ఫలక."

దీపావళి నానూనువల 'అర్థనాశక' 'శబ్దాడంబరము.'

'నిత్యమందాగ్ని శాస్త్ర నయూలబ్ధకీర్తుల స్వప్నపరిపాటీ విధి తుల్యుఁడు' మొదలగునవి.

శ్రీపానుగంటివారి అపరిమితమైన ప్రపంచ జ్ఞానమునకును, శాస్త్రపారంగతత్వమునకును సాక్షి ఉపన్యాసములలోని లెక్క-కు మిక్కిలినైన విషయములే సాక్షి. ఈ ఉపన్యాసము లాంధ్రలోకము నట్టోఁత లూఁగించినవి.

వంశపారంపర్యముగా జీవులకు లక్షణములు సంక్రమించునా? లేక పరిసరముల ప్రభావమా? అను విషయముపై సమగ్రమైన చర్చలించినున్నవి. పరిణామవాదము (ఇవల్యూషన్) దశావతార తత్త్వమును సమన్వయించి ఉన్మత్తుని ఉపన్యాసములోఁ జెప్పినారు. మనస్తత్త్వశాస్త్రనిగూఢ విషయములను, భాషాపరిణామ శాస్త్రములలోని గహన విషయములను చర్చించినారు.

లక్ష్మీనరసింహారావుగారిలో వేళాకోళలక్షణము వారి శబ్దవిన్యాసములో నున్నది. శబ్దగతమైన హాస్యము సర్వసామాన్యము. ఒక్కొక్క-చోట వ్యంగ్యముకూడ హాస్యమునఁ గనఁబడుచుండుట కలదు. కొన్ని చోట్ల నివి వ్యక్తులను సంబంధించినట్లు కనఁబడినను వారు సంఘము లోని యాయాభాగములకు ప్రతినిధులే కాని, ప్రత్యేక వ్యక్తులు కారు.

అది వారి నియమము. ఈ నియమము సాక్షిసంఘ నిబంధనావళి యందు మనకుఁ గనఁబడును.

శ్రీ పిఠాపురము మహారాజావారి ఆస్థాన నాటక కర్తగా శ్రీ పానుగంటివారు వ్యవహరించినవారు. వారి రచనలను వారిముఖమున వినుట మహారాజావారికి మిగుల నిష్టము. నరసింహారావుగారు తమ రచనలను వినుపించుచుండఁగా వారియుభయుల నవ్వులతో నా రాజమందిరము మ్రోగిపోవుచుండెడిది.

అటు ఆస్థానపండితులు వేంకట రామకృష్ణకవుల యష్టావధాన, శతావధానములతో రాజభవనము అపర వాగ్దేవీమందిరమువలె, కవితోద్యానమువలె కలకలలాడుచు, గమగమలాడుచు శోభాయమానమై యుండెడిది.

మహదానందకరమైన ఆదినములంతరించినవి. అపరభోజుఁడు, ఆశ్రితజనపోషకుఁడు, కవి తల్లజుఁడు ఆమహారాజ లేడు. ఆ మహాకవులును లేరు. ఆసారస్వత రసాస్వాదన చేసి ఆనందించిన ఆ ప్రజలలోని వారందఱు లేరైరి. అక్కడక్కడ అరుదుగ మిగిలినారు.

శ్రీ పానుగంటివారు పలుబడి రసవత్తరములగు నాటకములను వ్రాసినారు. వీరికి "ఆంధ్రషేక్స్పియరు" అను బిరుదుకలదు. రాధాకృష్ణ, పట్టభంగరాఘవము, నర్మదాపురుకుత్సీయము మొదలగునవి పౌరాణికములు. ప్రచండచాణక్యము, చూడామణి మొదలగునవి చారిత్రికములు. ఇవిగాక మాలతీమాల, జాతిస్తంభము, కంఠాభరణము మొదలగునవి కల్పితములు.

రాధాకృష్ణ, పట్టభంగరాఘవము, (పాదుక), కంఠాభరణము ప్రసిద్ధిగాంచినవి.

రాధాకృష్ణ భక్తిరసప్రధానమగు నాటకము. కవిగారి గాఢమగు దైవభక్తిని ఈనాటకమున మనము చూడగలము. మత సాంప్రదాయములకై అభిమానముగల వ్యక్తి యీకవి.

కంఠాభరణము మొదటినుండి చివరవఱకు హాస్యరసమే. వివిధ ప్రవృత్తులుగల వ్యక్తులు. అన్నియు సన్నివేశములే కదా! పరమ ఛాందసుఁడు, మూర్ఖుఁడు, వివేకశూన్యుఁడు నగు సోమావధాని ప్రముఖమైన పాత్ర. అన్నియు నసందర్భపుమాటలే! తప్పుల తడకలే కదా! పిచ్చి రామశాస్త్రిపాత్ర యొక్క విశేషము. రామశాస్త్రి విద్యావంతుఁడు, గుణవంతుఁడు. కిట్టనివారెవరో చేతబడిచేయుటచే అతనిమతి చలించి నట్లాతని మాటలవలనఁ దెలియుచున్నది. అతఁడు పీనుఁగు నెటుఁ దిరుగుడు రకరకములగు విజ్ఞానవిషయముల నేకరువుపెట్టును. దురాచారములను దుమ్మెత్తిపోయును. దుష్టులను దెప్పాడుచుండును.

"కవులుగారివారి కవిత్వము మాకవిత్వము ఒకటా కే. వారికి యతి లేదు. మాకు మతి లేదు. వారికి ప్రాసము లేదు. మాకు ధ్యాసము లేదు. వారికి గుణము లేదు. మాకు గణము లేదు. వారికి అర్థము లేదు. మాకు పర్థము లేదు" ఇట్టి రామశాస్త్రి మాటలివి.

సుబ్బలక్ష్మి రామశాస్త్రి చెవిని పట్టుకొనివచ్చును అతఁడు మొఱ్ఱోనుచు "మహాభారతమునకు కర్ణపర్వమే ఆరంభము. ఇది శల్యపర్వమువఱకును బోవుచున్నది. ఈ స్త్రీపర్వమే పెటిసికొట్టిన మొదల మాకు స్వర్గారోహణపర్వమే" అని అనెను.

ఇట్టిమాట లెవరికి నవ్వు పుట్టింపకుండును?

"వీణకువలె చెవులు మెలిపెట్టినకొలఁది శ్రుతి హెచ్చుచున్నది" అని రాధాకృష్ణనాటకమున శారదునిచెవి పట్టుకొనిన లలిత చమత్కరించెను.

హాస్యరసమే శ్రీ పానుగంటివారి రచనలన్నిట నెక్కుడుగా కానఁబడుచుండును. 'నదీనాం సాగరోగతిః' అనునట్లు వీరి రచనలలోని వివిధ హాస్యరసలక్షణములు కంఠాభరణమునఁ గూడినవి.

సంఘమునందలి దురాచారములను, వ్యక్తుల దుష్టత్వములను,

దురన్యాయములను రూపుమాపుటకు పూనుకొని గొప్పకృషిని జరిపి నవులకు ప్రత్యక్షసాక్షి వీరిసాక్షి. వారి సాక్ష్యుపన్యాసములు సరసములై, హాస్యరసమిళితములై, రసవత్తరములై, చక్కని శిల్పచిత్రిని కలిగి పాఠకులకుఁ జవిడిపోలేని కుతూహలమును కల్గించును. ఈరచనలు ఏకాలమునను చదువఁదగినవి. త్రికాలాబాధ్యములైన విషయములిందు పొందుపఱుపఁబడినవి.

సాక్ష్యుపన్యాసములలో పానుగంటివారు తా మవలంబించిన నిబంధనలను సాక్షిసంఘనిబంధనావళిగా రూపొందించినారు. ఆనాఁడు భారతదేశము పరపరిపాలనలోనున్నది. అందువలన వారి నిబంధనావళియందు తదనుకూలముగ రచింపఁబడినది.

నిబంధనలు:

1. సభారంభమున చక్రవర్తిగారికిని, వారి కుటుంబమునకును ఆయురారోగ్యములకై దైవమును ప్రార్థించుట.

2. రాజకీయవిషయములు మాట్లాడుట, వ్రాయుట పనికిరాదు

3. దేనిని విమర్శించినప్పుడు వ్యక్తుల పేర్ల నుదహరింపరాదు. ఒకవేళ అట్లు చేయవలసిన అవసరము కలిగినచో కల్పితనామములను వాడవలెను.

4. సభ్యులలో ఏదైనవివాదము సంభవించినచో తిట్లలోనికిని కొట్లాటలలోనికిఁ దిగరాదు. ఒకవేళ రక్తస్రావము వంటిది సంభవించినచో కోర్టులవఱకు పోరాదు.

సాక్షిసంఘ నిబంధనావళి యిట్టిదగుటచే సభ్యులతో ఈసాక్షి సంఘము స్థాపింపఁబడినది. సాక్షి- ప్రధానపాత్రి. ఇతని పేరట నే సంఘము స్థాపింపఁబడినది. ఈయన గొప్పతనము ఆ గ్రంథాంతము మనకు కనబడును. ప్రజలను సమావేశపరచి సభలు జరిపించుట, పత్రికాప్రకటనలు చేయుట మొదలగునవి ఈతని ముఖ్యకృత్యములు.

అందఱకూ సలహాదారు. జంఘాల శాస్త్రి- ఈతను, నీతని యుపన్యాసములు ఆంధ్రులకు పరిచితములే. గొప్ప వాగ్ధాటిగలవాడు. గంటల తరబడి గుక్కెడునీళ్ళైన త్రాగకుండ నుపన్యసించగల సమర్థుడు.

కాలాచార్యులు: ఇతడు సత్యాన్వేషి. ఆ అన్వేషణలో ఆతడు స్త్రీపురుషవివక్షతనుగూడ పరిగణించక కనబడిన వారి నెల్లసస్తార్థము చేయిచాచుచుండును. ఎడమచెయ్యి నిత్యము చాచియేయుండు ననుటలో నతిశయోక్తి లేదు. నిర్ధనుడు చందాయీయలేదు. సెట్టి సభ్యుడు.

వాణీదాసు:- కవి సోమరి ఆదికవి నన్నయ మొదలు నవ్యకవి నానాసాహెబువరకును దూషించువాడు. శ్లేషకవిత్వమనిన నితడు ప్రాణమిచ్చును. నువ్వుగింజమీద నూరుపద్యము లల్లగలడు.

బొబ్బయ్యసెట్టి: సాక్షీ సభాధ్యక్షుడు. ఆరితేరిన వ్యాపారి.

శ్రీ పానుగంటివారు హృదయంగమముగా పద్యము లల్ల గలరు. గీతముల నొక్కవగా వాడుట వీరి యలవాటు. వీరి పద్యములు సాధారణముగా ఉపమానభూయిష్ఠములు.

"ద్రోహియగు ప్రీతిభావంబు ద్రోహమాప
గంటకమున నుంపగవలెగాక స్వేచ్ఛ
విడిన నందరకును హాని పడగజేయు
బోనునుండి విడువబడు పులినిబోలి"

(ప్రచండ చాణక్యము)

"రాధయను సుధామధురాక్షరములు చెవిని
బడినవెంటనె మనసంత వ్యధను జెంద
నొక్కమాటుగ దటుకున జుక్కరాల
రప్పునను వెల్గు నమవసరాత్రి పోలె."

(రాధాకృష్ణ)

హాస్యముగా, హేళనపద్యములను అవలీలగా, చమత్కార ముగా వ్రాయుటలో పానుగంటివారు దిట్ట, కంఠాభరణమున సుబ్బి సెట్టిని పొగడుచూ భట్రాజసోదరు లిరువురు చెప్పినపద్యములు.

"బమ్మండవు పెరదాతల
మమ్మండవు శత్రువులకు మహితజ్వాలా
చిమ్మండవు కవివర్యుల
సొమ్మండవు మేటిసుగుణ పుట్టీ! సెట్టీ!"

"కాలేజిపుత్రీన బారిస్టారు
లిట్రికవి చెప్పగలరె యిలలో నరవిన్
భట్రాజు మాంసకవితకు
యెట్రి వపుచాను కవిత యాంధ్రులలోన్"

ఆ సోదరులకు పావులాయిచ్చినని (మొదట బేరమాడుకోన వారు పద్యములలో యిద్దావెడ్డా తిట్టుటవలన) సుబ్బిసెట్టి వెంక టప్పయ్యతో చెప్పినాడు. ఆ సోదరులలో పెద్దవాడు "రెండు పావల్య ములైన దయసేయు" మని కోరినాడు. అనిసెట్టమ్మగారికి కోపము వచ్చినది.

"అన్నా! రెండవకల్ప- తేల యిలలోనన్నా! కవిత్వాన పె
ద్దన్నా! ధాతునీ బుద్ధిశాలికిని ప్రేండ్రావాను అక్కన్న మా
దన్నా! సద్గుణమున్న కీర్తిభరచన్నా! అన్న! భట్రాజరా
మన్నా! మాటలువిన్న! కోపమున సున్నా! యన్న!
మొన్నాశకున్.

అని మందలించినాడు. ఇట్టిపద్యములు వ్రాయుటకూడ కష్టమే!...

వీరి ప్రకృష్ట కావ్యమున శిక్షణ, నన్నయగారలను ప్రత్యేక ము గానించుకొనినారు. భాషావిషయకములగు, మతవిషయకములగు అనేక సంగతులను వారితో చెప్పించినారు. ఉదాహరణకు ఒకటి,

రెండు యీక్రింద వివరించుచున్నాను. వారు 'నేను' అని ఆ సంభాషణమున పేర్కొనినారు. నేను నట్లే వ్రాయుచున్నాను.

"నేను- పూర్వము నియోగి, వైదిక వైరములు రాజకార్యములందేగాని యిక్కడు పారస్పరికకార్యములందుగూడ బ్రాకినవి. ఈమునకే మీవలన కలిగినవి.

నన్నయ- అయ్యయ్యో! మాకట్టి భేదము లేదే!

నేను- మీకు లేనిది మీతరువాత వారికుండగూడదా? మీకించుగాగమయతి యున్నదా? టీసీక, కొట్టికయని ప్రయోగించి యెఱుగుదురా? రేఫశకట రేఫములకు మైత్రి మీరంతగా సంగీకరించితిరా? ఇప్పటివారది పాటించుచున్నారా? లేదా? అట్లే మతములోగూడ మీకు లేనిభేదము లిప్పుడు కలిగినవి. వైదికుడైన నన్నయగారిని, నియోగియని పిలుచుటకు నియోగులు దేవులాడుచున్నారు. ఇట్లుచేయుట మీయందు భక్తిచేతనే యగును ... నియోగులలో నిరతురకుత్సులైన నను వైదికుడైన నన్నయభట్టుగారిని సామాన్యకవియని తూలనాడుచున్నారు ... నాయభిప్రాయము మీకు స్పష్టమైనదా? లేదా?

తిక్కన- తెలిసినది. వైదికుఁడొనర్చిన గ్రంథమును నియోగి రచించినదనియు, నియోగిచేసిన గ్రంథమును వైదికుఁడొనర్చెననియు, నికముందు చెప్పుదురేమో యని.

నన్న- అదెట్లు సాధ్యమగును?

తిక్క- తాళపత్రగ్రంథములలో గ్రంథకర్తృ వంశావతార పద్యషట్కమును లాగివేయుట యీ యింద్రజాలమునకు ప్రథమావస్థ.

నేను- ఏమువారనవలదు. అందఱిలోను వైరములు ప్రబలముగానున్నవి. దినదిన ప్రవర్ధమానములై యున్నవి. కమ్మలాట, గ్రుద్దులాటలత్వ కేఁటుకనిలేదు.

తిక్కన- ఇది మిగుల శోచనీయముకదా ? మాధుర్యమేమి ? నియోగులేమి ? వైష్ణవులేమి ? వైదికులేమి ? అందఱుకూడ వైదిక మతావలంబులే కదా ? ... నా కాలమున నిట్లే యుండెనా ?

నేను- నవ్యకవిత్వమని సరిక్రొత్తకవిత్వము బయలుదేరినది.

తిక్కన- అది యెక్కడనుండి వచ్చినది ?

నేను- అది తూర్పుగాలితో వచ్చిన తుపాను. (గురజాడ గిడుగు రామమూర్తి పంతులుగారు) ఏమి చెప్పుదును తాతగారూ ! యతులు లేవు. ప్రాసలు లేవు. సంధులు లేవు. ఛందస్సు లేదు. శబ్దశుద్ధి లేదు- చిట్టిచిట్టి పాటలు- పొట్టిపొట్టి పల్లవులు- పోనీ, గానమర్యాదను జూతమన్న తాళముధ్వస్తము; రాగము సంకరము.

ఉదా:- చెంబుపై చుక్క అక్కున జారిపడగ

చిలుక పలుకుచు దిశలతో నేకమయ్యె.

తిక్క- ఏలాగు ? ఏలాగు ? దీనికర్థమున్నదా ?

నేను- ఇందులోనున్న సొగసే అది. చెంబు- అనగా ఘటము. ఘటమనగా నీశరీరము. చుక్కయనునప్పుడు తేజస్స్వంతమైన పరమాత్మ. చెంబుపై చుక్క రక్కున జారిపడగ ననగా మనుజునకు భగవత్కటాక్షము కలిగినప్పుడనియర్థము. చిలుక పలుకుచు దిశలతో నేకమయ్యెననగా భక్తిచే నార్ద్రమైన జీవాత్మ పరమాత్మతో నైక్యమయ్యెనని భావము."

ఈవిధముగ నేదియో కలగాని, జాబు వచ్చినదనిగాని సాకుగా తీసుకొని సారస్వతములోని మంచిచెడ్డలు; సాంఘిక దురాచార, మత న్యాయములు; వివిధమతముల విషయములు; ఒకటేమిటి ? వారు తీసుకొనని సమస్యలేదు. వారు నిర్వచించని నీతిలేదు. వైద్యుడు "దుష్టాంగంబు ఖండించి" నట్లు అన్నిటగల కుళ్లును ఖండించి ప్రక్షాళనము చేసినారు.

ఒకప్పుడు పిఠాపురము మహారాజావారి ఆస్థానమున ఆస్థాన వైణికవిద్వాంసులైన సంగమేశ్వరశాస్త్రిగారి వీణాగానము జరిగి నప్పుడు శ్రీ నరసింహారావుగారు విని మహారాజావారి నుద్దేశించి ఒక సీసపద్యమును వ్రాసినారట.

సీ॥ స్వజనుల నేరీతి బరిపాలన మొనర్తు
వారిత్రు నెవ్వని నాచరింతు,
వాదాయమున నెంత యర్థార్థికిచ్చిన
నెపటుచేసిన భృత్యు నెవగణింతు
నవని పాలన మేది యార్జించినాడవు
కవిత, గానంబు నేబగిది వింతు,
వెల్గుగా పృథుభాగ్య విశాల్యగానుంటి
నాత్మ సంస్థల కేమంటువయ్య,
తే॥ గీ॥ "సరిగ, ధని, సగమ, పనిని సరిగ, గరిమ,
మరిమరిగ, పాపసనిగని, సపసరి" యను
వీణ కాని, 'మా' వెన్కనే వీణవరుస
లేదా? 'సి' వెన్క 'మా', మార్గ మేదిసీ!

చమత్కారమై, అత్యద్భుతమై, ప్రాచీనకవిత్వపు పద్ధతియందు నిగ్గువంటిపద్యము! పై నాలుగుపాదములలోగల నెనిమిది ప్రశ్నలకు క్రమాలంకారమున సరిగమపదనిస లలో చెప్పినారు. వీణకు 'మా' తరువాత 'సి' (ఆరోహణలో) వచ్చును. కాని మహారాజావారి విషయమునమాత్రము 'సి' (మహారాజవారి) వెన్క 'మా' (లక్ష్మీదేవి) అనుసరించి యుండునట!

మహారాజావారిపట్లవీరికిగల అనన్యసామాన్యమైనభక్తి,గౌరవములను నింతకన్న వేరుదాహరణ మక్కరలేదు.

శ్రీ పానుగంటివారి రచనలనుగురించి యీవిధముగ చెప్పు

జూచినచో మరల వారి రచనలను వ్రాయుటయే కాగలదు. సముద్రమున కెదురీదుటయే కాగలదు.

ఒక హాస్యమా? చమత్కారమా? శైలియా? వేదాంతమా? రసమా? కవిత్వమా? సమయస్ఫూర్తియా? సర్వజ్ఞత్వమా ? రచనా విశేషమా ? విమర్శనాత్మకదృష్టియా ? ఉపమానములా ? సమాసములా ? పాత్రచిత్రణమా ? సంభాషణమా ? సన్నివేశములా ? పాండిత్యమా? ప్రకృతి పరిశీలనమా ? స్వయంప్రతిభయా? ... ఎన్నని చెప్పుదుము? ఇంతకన్న వీటియన్నిటి రూపకల్పనమే (శ్రీ) పానుగంటివారు అనుట మంచిది! తగినది!

శ్రీ పానుగంటివారి నాటకములకు చాలవరకు శ్రీ కూచి నరసింహముగారే 'నాందీప్రస్తావనము'ను వ్రాసినారు. ఇందు స్వోత్కర్ష కొంత యుండునుగనుక వీరిపద్ధతి నవలంబించియుండుట గమనార్హము

ఇంతటి మహనీయుని కృషిని ప్రభుత్వము గుర్తించినది. ఈ నాడు శతజయంత్యుత్సవములు దేశమందంతటను (తెలుగువారున్న ప్రాంతములయందు) జరుపబడినవి. ఇది మిక్కిలి సంతోషింపదగినది. ఈకారణముగనైన ఆంధ్రలోకమువారు వారి రచనలను చూచు భాగ్యము కలిగినందుల కత్యంతానందముగ నున్నది.

షేక్స్పియరుమహాకవి నాటకములన్నియు ఒకే సంపుటమున లభించుచున్నవి. అట్లే శ్రీ పానుగంటివారి నాటకములను ఒకేసంపుటముగా ప్రచురించిన పాఠకుల కందుబాటులో నుండును. శ్రీయుతులు వీరేశలింగము, చిలకమర్తి, తిరుపతివేంకటకవుల కిట్టి సంపుటములు షష్టిపూర్తి సందర్భమున వెలసినవి. వీరు కొంతకాలము ఉపాధ్యాయులుగా నుండుటవలన వారి శిష్యగణము ఈ మహత్కార్యమును నిర్వర్తించినది. పానుగంటివారు నాటకకర్తయేగాని, చెప్పుకోదగినంత

కాల ముపాధ్యాయవృత్తిలో లేరు. అందువలన యీభారమువహించు శిష్యులు లేరు. ఇట్టి పరిస్థితులలో ప్రజాసంస్థయనదగిన సాహిత్య అకాడమీవారు యీభారమును వహించవలసి యున్నది.

శ్రీ పానుగంటివారుచేసిన భాషాసేవకు, తద్వారాచేసిన సాంఘికసేవకు అశేషాంధ్రులు ఋణపడియున్నారు. ఆమహనీయునికి ఆమహాకవి! యీసందర్భమున మాభక్తిప్రాంజలుల నిదే సమర్పించుకొనుచున్నాము.

—•—

పానుగంటివారి పాదుకా పట్టాభిషేకనాటకము.

శ్రీ కామఋషి సత్యనారాయణశర్మ

నాటకరచనలో సిద్ధహస్తులైన శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు వాల్మీకి రామాయణము ననుసరించి అందలి కథను నాలుగు భాగములుగా విభజించి నాటకములుగా రచియించినారు. శ్రీరామజననము, గాధేయుని సవన పరిరక్షణము, తాటకాసుర సంహారము, సీతాకళ్యాణము వఱకుగల కథను కళ్యాణరాఘవమను పేరున ఒక నాటకమును, అయోధ్యాకాండయందలి కథను పట్టభంగరాఘవమను, పాదుకాపట్టాభిషేకము నా రెండవ నాటకమును, అరణ్య కిష్కింధ, సుందరకాండములందలి కథాంశములను వనవాసరాఘవమని మూఁడవనాటకముగాను, యుద్ధకాండ మందలి కథాంశమును విజయరాఘవమని నాలుగవనాటకముగాను రచించిరి. ఇందు పాదుకా పట్టాభిషేకము ఆంధ్రదేశమందలి పలుతావులలో ప్రదర్శింపఁబడి విశేష ప్రచారము, ప్రఖ్యాతిపొందినది. ఇది ఏడంకముల నాటకము. ఇందు మొత్తము ఇరువది పాత్రలుగలవు. అందు అయిదు స్త్రీపాత్రలు. వీరియభిప్రాయముల ననుసరించి నాటకములందు తేటగీతమును సీసమును మాత్రమే వాడియున్నారు. వృత్తములు నాటకములలో ప్రయోగార్హమైనవి కావని నిర్ధారించియున్నారు. సంభాషణలు ఒక్కొక్కచోట్ల సుదీర్ఘముగా నుండును. సాధారణముగా రంగస్థలమున కనుగుణముగా ఏ కవి రచియించిన నాటకమునైనను సంస్కరించుటపరిపాటి. వీరిరచనలలో స్వగతములు- అపవారించిన సంభాషణలు కూడఁగలవు. అవి నటకుని చాతుర్యమునుబట్టి రంజింపఁజేయ వలసియుండును. ఇవిగాక వీరినాటకములలో విష్కంభముల కొక ప్రత్యేకతగలదు. అవి పాత్రలకుఁగాక విస్పష్టమునకు- ముందురాఁబోవు అంశములను సూచించుటకు ప్రేక్షకులకు కథాసందర్భము సుబోధకమొనర్చుటకు చాల నుపయోగకారిగా నుండును. అద్దంకి

శ్రీరామమూర్తిగారి దశరథ పాత్రకు వన్నె దెచ్చినది పంతులుగారి-శేఖరీయమనుటలో సందేహము లేదు.

ప్రథమాంకమున దశరథుడు- వసిష్ఠ, సుమంత్రులతో రామ పట్టాభిషేకమును త్వరితగతిని జరుపవలసిన యావశ్యకతను గురించి సమాలోచన జరుపును. దశరథునకు పుత్రశోకార్తిచే మృతిఁబొంద నున్న శాపము, కైకను వివాహము చేసికొన్నప్పుడు, ఆమెకు కలిగిన సంతానమునకు రాజ్యమిచ్చెదనని చేసిన వాగ్దానము, మిక్కిలి మనో వైకల్యమును గలిగించినవి. ఈ మనోవేదనను వెలిబుచ్చుటకై కుల గురువగు వసిష్ఠునితో తన జాతకచర్యను ముచ్చటించుచు వివరించును. ఇది పంతులుగారి రచనలోని ప్రత్యేకత.

గీ॥ మూఁడవగ్రహంబు మారకంబునకుఁ దగిన
దండులో మొండియైన ఘాతుకగ్రహంబు
నంతరము వచ్చె; దీని సాహచర్యమునను
నిశ్చయముగ మారకమది నిజపుగాదె.

దశరథ మహారాజునకు జాతకమున వ్యయస్థానమందున్న కుజుని మహాదశలో కేత్వంతరము వచ్చినది. ఇదిమారక యోగము మూఁడవ గ్రహము ఆయన మూఁడవభార్యకైక. కఠినహృదయయగు మంథరయే మొండియైన ఘాతుకగ్రహము. దీనిసాహచర్యమునఁదనకు మారకము కలుగనున్నదని శ్లేష. ఇదిగాక భయంకర స్వప్నములు, దుశ్శకునములు ఆయనను నిరంతరము కలతపెట్టుచున్నవి.

గీ॥ పుత్రశోకంబుచే మృతి బొందు శాప
మున్న దెప్పుడేమి కానున్నదో యెఱుంగ
తలఁబరువుఁ దీర్చ రాముని, నందకాఖ్య
వన నివాసము నిశ్చయ పఱచుకొంటి.

తలబరువు రాముని శేర్చి, తాను వానప్రస్థుఁడగుట యాతని

వాంఛితము కాని "రాముని దండకాఖ్యవనవాసము నిశ్చయమగు చున్నాంటివని ధ్వని కల్పించి భవిష్యత్తును సూచించుట కవి ప్రతిభను సూచించును.

అనంతర మొకవిష్కంభము- ఇందు విజయశర్మ, సోమనాథుఁ డను ఇరువురు విప్రులు రేపుజరుగఁబోవు రామపట్టాభిషేకమహోత్సవ విశేషములుగూర్చి ముచ్చటించుకొనుచుందురు. ఇవిచాల సహజముగాను సంఘటింపఁబడినవి.

సాధారణముగా జమీందారీ ప్రాంతములలో కట్టుగానుం డున్న వారిలో చాలమంది పై పోషణములోనుండి వారిచర్యలను స్తుతించుచుందురు. కాని 'రాజాశ్రయముల' బొందఁజాలనివారు, వారి చర్యలలోని దోషములను నెన్నుచుండుట పలుతావులందు చూచుచుందుము- ఇట్లే సోమనాథుడు విజయశర్మ చెవిలో నిట్లనును.

"దశరథుడు దుర్మార్గుడు- ఇతని రాజ్యము గోస్తనీ నదీప్రవాహమువలె నెంతదీర్ఘమైనా యంత వక్రమైనది, ఇతని పాలనమున్న జనులకు విసుపుగానున్నది. (60 వేలేండ్ల పాలన) అసలే వలితిపాట- అందుపైఁ దెల్లవారినదాఁక నొక్కటేపాటయగుచో వినువారి కెటులుండునో జనులకా తిరుసనున్నదని ప్రజాభిప్రాయమును గుసగుస లాడుకొందురు. సుముహూర్తమువ్యవధిగా నుంచినందులకొక శంక చేయును.

దేశదేశములనుండి బ్రాహ్మణులు రాజన్యులువచ్చిన మొదల వారివిషయమై విశేషధనవ్యయమగునని, ఎవ్వరు రాకుండ నింతనిరవకాశముగా ముహూర్త మేర్పాటుచేసినారని. లగ్నమును శని చూచుచుండుట వలన ముహూర్తమేమియు బాగుగా లేదని మఱియొక శంకచూపును.

విజ:—అట్టిబలహీనమైన ముహూర్తమును వశిష్ఠుఁడేల నిర్ణయించెను?

సోమ:—అతఁడేమి చేయగలఁడు భూపతుల ముహూర్తములు

దుష్టసతులఁ గోరికలవలెఁ దలఁచుకొన్నపుడే సమకూర్పవలసినవి గదా ! అనుచు ఇందలి స్వభావోక్తిగమనింపఁ దగినది

ఇంక రెండవయంకమున మంథర ప్రవేశముకానున్నది. అందుకు సూచనగా మంథర నిట్లు వర్ణించును.

అది కూర్మముపై మందరాద్రి నిలచె
మున్ను, కాలము వ్యత్యయంబుగ వెలంగ
నిపుడు మందరోపరి కూర్మ సృష్టిమొక్క-
ననగదగె వక్రబుద్ధి లాంఛనమగును.

వాల్మీకిరామాయణమందు గూడ మంథరపాత్రయే చిత్రముగా వర్ణింపబడియుండుట కవితులకు సువిదితమేగదా !

రెండవ యంకమున తెఱతొలగగానే కైకేయి యంతఃపుర ప్రాంగణమున మంథర ప్రవేశించును - అది రాత్రిసమయము రామ పట్టాభిషేకమునకై చేయబడిన నగరాలంకారములను వాద్యఘోష లను ఆమె వినును ఆమె మనస్సున కోలాహల ముత్పన్నమగును.

“ ఈయుత్సుకతేమి? ఈకలకలతేమి ?- ఈ గుడ్డపుబండ్ల కిరకిర లేమి ? ఆయేనుగుల ఘుణఘుణలేమి ఆద్భుత్యమును తన వింత ధోరణిలో వికటముగవర్ణించును. పరిచారికల వలన రామపట్టాభిషేక వార్తను చెవులబడినకొలది ఆమె అసూయాగ్నిప్రజ్వరిల్లును రామ పట్టాభిషేకవార్తను విన్నపురంధ్రీమణులు దీపముల వెలిగించుచుం దురు. అదిచూచిమంథర- “ఏమిది కొంపలుగాలి నట్లా వెలుతురేమి? నేనుగూడ నొకవింతయగ్ని నిక్కడే ముట్టించెదను. వీరు ముట్టించిన యగ్ని తెల్లవారు సరికారునుగాని నేనంటించిన చిచ్చు రేయుంబవళ్ళు విచ్ఛిన్నముగ సంవత్సరములకొలది మండును. వీరి వహ్నివత్తులను చమురునే గాల్చునుగాని నావహ్ని పురమును, పురజనులనూ, భూపాలుని, సర్వాంగకముగా సర్వాత్మకముగా దహియింపఁజేయును.

అని కైక మందిరమునకు బోవును. ఈవాక్యములు పంతులుగారి లేఖినికిగల వాడిని స్పష్టపరచును. కైకను మంథరచేయు దుర్బోధ చేయుటలో ఈయంకమందలి సంభాషణాచాతుర్యము మిక్కిలి రసవంతముగా నడచినది. అందు సవతిమత్సరము, భర్తపై అకారణ నిందారోపణలు పలువిధములుగా నుత్పాదించి కైకను సిద్ధపరచి వరములడుగుటకు దగిన మనోనిబ్బరమును కలిగించి క్రోధగృహమున బ్రవేశింపచేయుటలో మంథరపాత్రము అద్వితీయముగా బోషింపఁబడినది.

తృతీయాంకమున దశరథుడు ఆనాటి రాత్రి కైకేయిమందిరమున కరిగి ఆమెను ప్రసన్నురాలిని గావించుకొనుటలో విఫల మనోరథుఁడై పట్టభంగమునకు ఒడబడవలసినవాఁడగుటలో కరుణరసము కట్టలు త్రెంచుకొని ప్రవహించినట్లు చిత్రింపబడినది. కైకేయి శయన గృహము నిర్మానుష్యముగానున్నది. దశరథుఁడా మందిరము నిట్లు వర్ణించును.

గీ॥ విద్యలేని ముఖములాగు, విదయమైన
మనసటులు, లజ్జలేని సంభాషణంబు
వలెను, సుభగతలేని యవ్వనముఁబోలె,
చెలువలేని, యిచ్చోటు నిశ్రీకమయ్యె.

గీ॥ కమ్ర మధుకోశమున కీగ కాటు, స్వర్ణ
కేతకికి ముండ్లపోటు, సంస్మిత చంద
నలినికుఁ బురుగు రాటు, పొందదగిన
బోట సత్కృపకుఁ జాఱుకుమాట వ్రేటు.

ఈ ఉపమానములు 'అభినవ కాళిదాస బిరుదమును సార్థక పరచుచున్నవిగదా! అనంతర మహారాజకూనామణి కోపగృహ ప్రాంగణమునకువచ్చి బలాత్కారముగ సూనపేటిక నేలపాలు గావించిన ప్రసవములగాంచి

గీ॥ సెలఁత లలితమ్ము లేఁత లావిమ్ము సేలఁగొల్పెఁ
జెలికి కోపము నాపైన, రికమీఁదు
గలిగె, నింద్రియములోలు రకారణముగ
నిటుల కరమప్రాజ్ఞులను బాధింతురిగాదె.

ఇత్యాదిగా మనసునందనుకొని, గూనిదాసి తనప్రియురాలితో నేమితంత్రము పెట్టెనదో యని భయపడుచు

గీ॥ నవరసామోదమైన యీగా నాతికొటకు
గూనుదాసిని గూడను గూనకట్టు
కొనగవలసె; నుద్గ్రంథంబు కొటకు చంకఁ
బెట్టబడిన కత్తెరకాళ్ళ పీటబోలె.

(కత్తెరకాళ్ళపీట – వ్యాసపీఠము) ఇందలి ఉపమానశోభ గమనార్హము.

గీ॥ తాన్మవధూ భర్తలఖిలాధికారులన్న
మాటలేకాని, లోలోని పోటులన్ని
మొనతోకొలుగంగవచ్చు? నారెపుకు నగరు
నందుగల దాసులకు దాసులగుటనిజము.

ఇందలి స్వభావోక్తి ఎంత సమంజసమో గ్రహింతురుగాక?

తుదకామె కోపగృహమున బ్రవేశించి పామువలె బుసలు కొట్టుచున్న, నాముద్దులభార్య కోపశాంతికై దోహదక్రియలను అనునయవాక్యముల నారంభించును. ఆమె అందులకు ప్రత్యుత్తరముగా నెత్తిపొడుపుమాటలు, దెప్పిపొడుపులతో ఇచ్చువన్న మాట తిరిగినట్లు సందారోపణమున కుపక్రమించును. కొంతసంభాషణజరిగిన పిమ్మట–

సీ॥ చిడిమున బొగ్గారు చెక్కుటద్దములపై
జిలిబిలి చిరునవ్వు లొలయువాఁడు
కాళ్ళగజ్జెలు గల్లుగల్లు మనంగ సం
దడికను ల్బల్లగాఁ దిరుగువాఁడు

బుడిబుడినడుపుల పూర్వభూపాల గా
ధల వినుచుండు ముచ్చో బలుకువాఁడు
రానువా! ముద్దియరా! యన్న నగిచి గం
తిడుచు హాయిగఁ గౌఁగలించువాఁడు

నట్టి పదునాలుగేఁడుల బొట్టినెట్టి
లసురభీకర వనసీమ కంపువాఁడ
ననుచు నేడ్చితి నెప్పుడో యపుడు, మఱల
నిపుడు నీమూలమున నట్టు లేడ్చుచుంటి.

పంతులుగారి పద్యరచనలోఁగల లాలిత్యమునకు చక్కని యుదాహరణముగా జెప్పఁదగిన పద్యమిది. తెలుగునాట మిక్కిలి ప్రచారముగల పద్యము గూడ నిదియే. పదునాలుగేఁడుల (బొట్టి)- అసురభీకరవనసీమ కంపుట- ఇది గాధేయుని సవన రక్షణమునాటి మాటలైనను- రాజోవు పదునాలుగేఁడుల వనవాసమునకు సూచకములు- తుదకు రామునిపై నొట్టుపెట్టుకొని కోరినవరముల నీయఁగలనని వాగ్దానము చేయుట- వరములడుగుట- రాజు మూర్ఛితుఁడగుట- విలపించుట- తుదకా రామునకు కబురంపి దశరథుని మనోరథముగా కైక తానుకోరిన వరములసంగతి రామునకు జెప్పుట- రాముఁ డామోదించుటతో తెరపడును.

చతుర్థాంకమున ధనుర్ధరుఁడైన రాముఁడు- ఖడ్గహస్తుఁడైన క్రోధమూర్తి లక్ష్మణుఁడును ప్రవేశింతురు. లక్ష్మణుని క్రోధోద్రేకమును శ్రీరాముఁడు తన శాంతవచనములతో నుపశమింపఁజేయును. ఎన్నివిధముల వారించినను వినక తనతో వచ్చెదమని పట్టుబట్టిన సీతాలక్ష్మణులను తనతో వనవాసమునకు రా నంగీకరించును. శ్రీరామునకు లోకాపవాదనిందయును దుస్సహమైనది

గీ॥ వెళ్లె రాముఁడు యువనతి పీనశోక
భీకరపలాశ పాండ్రాటవీ ప్రదేశ
మునకు నాతోను గొనిపోను వెనుక నేమి
ముప్పువచ్చునోయని జనుల్ముచ్చటింత్రు.

ఇందు భవిష్యత్తులో రామున్కు సీతాపహరణసంఘటన మా సూచన గావింపబడినది. పంచమాంకమున కౌసల్యాదశరథులు సీతారామలక్ష్మణులను వనవాసమునకంపుట మిక్కిలి కరుణరసాత్మకముగా చిత్రించినారు. తనతో నరణ్యమునకు దీసికొనిపొమ్మని కోరిన తల్లితో శ్రీరాముఁడు పతిసేవకై నిలుచుట నుండకతప్పదని తల్లి నోడఁబరచును. దుష్టశిక్షణమునకు, శిష్టరక్షణమునకు శ్రీరాముని మనము విడువకతప్పదని వశిష్ఠుఁ డాతని నోదార్చును. దశరథుఁడు శ్రీరాముని కౌఁగలించుకొని

గీ॥ అమిత వనితలో లుండఁగనైన నాకు
నేకపత్నీవ్రతుఁడ వుద్భవించి ఘోర
భవమహాపాశ పరిబద్ధ భావుఁడైన
నాకు భవదూరుఁడవు పుట్టినావు తండ్రి.

గీ॥ ఇట్టి బిడ్డని చేత దరించవలెక
యాఁడుదానికై నిను విడనాడుకొంటి
గర్మఫలమునకు సమితాధికతను జూపి
భక్తిఁ బోషించుకొనని యప్రాజ్ఞువలెను.

ఇందు కర్మమార్గముకంటె భక్తిమార్గ ముత్కృష్టమైనదని చెప్పుటలో నిచ్చిన యుపమానము నిరుపమాన మైనదిగదా !

వశిష్ఠుఁడు సుమిత్రాత్యాగము నిట్లు ప్రశంసించుచు.

గీ॥ కనిన సుతునికై సవతిబిడ్డను వనమున
కనిపెనైక; సవతిబిడ్డకై కనిన సు

తని వనికనిపెను సుమిత్రి తుల్య హీన
చరితసీ పతి గాని కూడ సాధ్యమగునె.

కడసారిగా శ్రీరాముఁడు నమస్కరింప దశరథుఁడిట్లు దీవించును.

సీ॥ సర్వ మంగళగుణ సంపూర్ణుఁడగు నిన్ను
నరుఁడు దేవునిగాఁగ నరయుఁగాత!
రామనామము భవ స్తోమభంజన దివ్య
తారకనామమై తనరుఁగాత!
పసిగొంపలును లేని పల్లెలైనను రామ
భజనమందిర మొండు వరలుఁగాత!
కవులెల్ల నీదివ్య కథ సన్కీర్తుల
గొనియాడి ముక్తిఁగైకొందురుగాత!

గీ॥ ఎట్టివారికయు శ్రీరామ చుట్టబడక
వారియబడకుండు గావుత! రామ వాక్య
మనిన దిరుగనిదని యర్థ మగునుగాత!
రామ ! రామ ! రామ ! రామ ! రామ ! రామ !

ఈ పద్యమందలి భావనాశైశద్యమెంత యుదాత్తమో, ఎంత జనశ్రోత్రిక యనుకూలమగు భావనమో, పఠితులు గ్రహింతురుగాక. షష్ఠాంకమున భరతుఁడు కైకేయిని వర్జించుట- తండ్రి మరణవార్త- రాముని అరణ్యగమనమును, కైక గడుసేష్ఠగా కుమారున కెరింగించెను. తా నెన్నఁడు నుకోరని ఈరాజ్యప్రాప్తికై, రాజవంశమున కంతకూ నిట్టి ఇక్కట్టు తెచ్చిపెట్టిన తనతల్లి చర్యను మహోగ్రుఁడై నిరసించినాఁడు. ఈ రాజ్యసంపాదనతంత్రమున తాను నిర్దోషినని కౌశల్యావశిష్ఠుల కడ నెన్నియో యొట్టుల బెట్టుకొని చెప్పుకొనును. తండ్రిగారి ఉత్తరక్రియల యనంతరము చతురంగబలసమేతుఁడై తల్లులతో, వశిష్ఠాదులతో వనములకేగి శ్రీరాముని మరలనయోధ్యకు

రప్పింపదలచుకొన్న తన యభీష్టమును వశిష్ఠాదుల కెఱుకపరచును సప్తమాంకమున భరతుడు చిత్రకూటపర్వతప్రాంతమున శ్రీరాముని దర్శించును. చతురంగసేనాసమేతుడైన భరతునిరాకకు దూరమున నుండి చూచినలక్ష్మణుడు తన సహజస్వభావమునుబట్టి భరతుడు తమపై దండయాత్రకు వచ్చుచున్నాడని శ్రీరామునకు నివేదించును. అందులకు శ్రీరాము డాతని నివారించి-

క॥ భరతుని నిందించినను, రాజ్యపదవిగోమ్ర
టించు నా శోకనారి నీ వాడు నెడల
భరతుతోఁ జెప్పి యీరాజ్య పదమునీను
నతనిచే గట్టబెట్టింతునయ్య నిజము

అని శ్రీరాముఁడనగ నేఁబిూదాస్యముకంటె నాకు రాజ్యమెక్కు-వది కాదని చెప్పి తన యజ్ఞానప్రసంగమునకు క్షమార్పణ కోరును. శ్రీరామ భారతసమాగమము ప్రేక్షకులమనములు కరగించును. శ్రీరాముడు పితృవియోగదుఃఖమును తల్లులతో, సోదరులతోఁ దలపించుకొని తృప్తినొందును. రాజ్యభారము వహింపుమ్మని భరతుడు శ్రీరాముడు పరిపరివిధముల బ్రార్థించును. అందులకు శ్రీరాముడిట్లు బదులు చెప్పును.

సీ॥ స్థిరమైన నడవడి నరులకందరకును
వలయును, రాజ్యచాపల్యమునను
నే దండ్రిమాటను నిరసింప లోకులు
పరిహసింపరె ? రామువంటికొడుకు
భరత సౌమిత్రులవంటి తమ్ములు, సీత
వంటిభార్యయు, లేరు వసుధయందు
ముందుయుగములఁ బురుషులు తలలూప
వలదె? యారీతివారు నడచు

కోనవలెనె? కష్టసుఖములనుభవింప శాశ్వ
తములె? పదునాలుగేండ్లు దాట తిరిగి
రావె? ధరను బాలింపవె? దాని నంత
నటకు దయనీవు పాలింపవలదె? తండ్రి!

అని ప్రబోధించి భరతుని అభ్యర్థనముపై తన పాదుకలను చిహ్నముగా నీయ నంగీకరించును. పదునాలుగేండ్లు గడచిన యుత్తర క్షణమున రానిచో తా నగ్నిప్రవేశము చేయగలనన్న తన నిశ్చయమును భరతుడు శ్రీరాముని కెరిగించును.

సీ॥ ధరణి యీతిబాధలు లేక తనరుగాక
ప్రజల యన్యోన్యవైరము లణగుగాక
కవిత రాజపోషణమున గ్రాలుగాక
రాజ్యపాలనమున రాజు నెగడుగాక.

ఇది శ్రీ పంతులుగారు ప్రతి నాటకాంతమునను స్వస్తివాక్యముగా వ్రాయు పద్యము.

రసవత్తరమైన రామాయణకథను ఇంతటి ఉదాత్తముగా భావపోషణము గావించి పాత్రలను పోషించిన పంతులుగారి నాటకరచనాప్రతిభ అనన్యసామాన్యము. వాల్మీకి యుపమానశోభను గ్రహించి కాళిదాసు మహాకవి యాగలిగె నని పెద్దల యభిప్రాయము. అట్లు కాళిదాసుని ఛాయలలో ఉపమానములను లెక్కకు మిక్కిలిగా పంతులుగారు వ్రాసినను, అవి స్వతంత్రమై, సుబోధకమై, సరసమై కథాంశమునకు, ప్రకృతకాలమునకు అనుగుణ్యమై కవితను పరవశ మొనర్చునట నిస్సంశయము. ఇంత మహోన్నత కవితల రచించిన కవి అమరుడు. ఆయన తన కావ్యశరీరమున చిరంజీవి. ఆయన రచనలను సంస్మరించుకొనుటవలన మనము ధన్యులము. ఆయన శతజయంతిని జరుపుకొని కవిఋణము తీర్చుకొనుటతో ఆంధ్రలోక ధన్యమైనది.

— • —

శ్రీ పానుగంటివారి గద్య వాఙ్మయము.

శ్రీ జగావల్లభుల పురుషోత్తము.

పాఠకులను పద్యముచే మెప్పించుటకంటె గద్యముచే మెప్పించుట కష్టము. పద్యములో గణయతిప్రాసల సహాయ్యమున నడకసొగసు సహజముగనే యేర్పడును; దానివలన పాఠకహృదయావర్జనము సులభముగ సిద్ధించును. గద్యములో నీగుణములు పూర్తిగా రచయితృనైపుణ్యైకసాధ్యములు, అందువలన నొక్కసారి చదివిన పాఠకుని హృదయమున హత్తుకొనిపోవు శ్రీ పానుగంటివారి గద్యమువంటి గద్యము లోకోత్తర ప్రతిభాశాలికిగాని సాధ్యముగాదు. పద్యముల నడకనుబట్టి యవి కంఠస్థములగుట సర్వభాషాసిద్ధము. అట్టిభాగ్యము గద్యరచనమునకును శ్రీలక్ష్మీనరసింహారావు పంతులుగారి గద్యములోనుండి పదులకొలదియు నూరులకొలదియు బంక్తులనొప్పజెప్పగలవారి నెందరినో నేను జూచియున్నాను. ఇట్లు కంఠస్థీకరణ సౌభాగ్యముగల గద్యవిశేషము నాంధ్రభాషలో మరెచ్చటను గానము. గద్యనికషముపై దమవన్నెను బానుగంటివారు సర్వోత్కృష్టముగా నావిష్కరించుకొనిరి.

అధునికయుగము వ్యవహారయుగము, ఇందులకు గద్యమెంతయో యనుకూలమైనది. చిన్నకథలు, నవలలు, జీవిత చరిత్రములు, విమర్శనములు, చారిత్రిక భౌగోళికాది వ్యాసములు, రాజకీయ వివాదములు—మున్నగువానితో బంధురమైన యాధునిక సారస్వత జీవన విధానమంతయు నీపాటికి మనదేశములో నెంతయో యుత్కృష్టమైన, హృద్యమైన గద్యమును వెలయింపజేసి యుండవలసినది. కాని నేటి మనగద్యవాఙ్మయ స్థితియత్యంతము శోచనీయముగనున్నది. అనేక విషయములలో నాంగ్లేయుల ననుకరించువారు గూడ వారి గద్యలోని పాటవమాధుర్యోదారతలను మనభాషలోనికి తీసికొని వచ్చుటకు యత్నింపలేదు; యత్నించినను సఫలులు కాలేదు. సఫలత నొందిన యిద్దరి ముగ్గురిలో శ్రీ పంతులుగారగ్రగణ్యులు.

కార్లైలు, రస్కిన్, అడిసన్, స్టీలుమున్నగువారి గద్యరచనము సరిఁ బ్రక్కను నిలఁబడఁగల యర్హతగల తెలుఁగు గద్యము వీరిదే కాని యితరులది కాదు.

ఈవిషయమునఁ దెలుఁగు వాఙ్మయమున శ్రీపంతులుగారి స్థాన మద్వితీయము. బి. ఏ. తరగతిలోఁగాని భాషాప్రవీణ కక్ష్యలలోఁగాని పాఠ్యములుగానుండఁదగిన గద్యరచనములు తెలుఁగులో నున్నవాయని వెదకుచోనవి వారివాఙ్మయములోనే కన్పట్టును.

లక్ష్మీనరసింహారావుగారు సాధించిన మఱొక యసాధారణ కార్యము. ఆదోషమును, పరిష్కృతమయిన గ్రాంథిక భాషను సర్వజన సులభముగా బ్రయోగించి, సామాన్య జనోపయోగ్యముగుటకై భాష గ్రాంథికతను గోల్పోవలయునను నపోహయును భటాపంచలు చేసినారు, ఈయుగములో విజ్ఞానము సర్వజనవ్యాప్తి నొందించుటకై భాషను నీచస్థితికి దింపనక్కఱలేదని పంతులుగారు క్రియారూపమున నిరూపించినారు.

దండియున్నగు నలంకారికులు చెప్పిన కావ్య ప్రయోజనములలో ముఖ్యములయిన వ్యవహారజ్ఞానము, నిర్వృతి, యుపదేశము పంతులు గారి గద్యవాఙ్మయములో మిక్కుటముగా సాధింపఁబడినవి. లోకము లోని వివిధరీతుల మానవప్రకృతులను వారు విపులముగా చిత్రించి సమాజములోని లోపములను క్షాళించి మాథ్యూ ఆర్నాల్డ్ నిర్వచించిన "జీవితవిమర్శనమే సాహిత్యము(Literatuae is the criticism of life) ప్రమాణముచే మాన్యతనొందఁగల యుత్తమ సాహిత్యమును బుష్కలముగా వెలయించఁజేసినారు.

—•—

అభినవ కాళిదాస—పానుగంటి లక్ష్మీనరసింహరావు

శ్రీ ఓలేటి సుబ్బరాయశాస్త్రి.

మహాకవులెందఱో తమ రచనలచేత శాశ్వతకీర్తి నార్జించియుండఁగా "ద్విత్రాఃపంచకవయః" అను వాక్యమున్మత్తప్రలాపము వలె నర్థరహితము కాకతప్పదు. కాని యీవాక్యమే యుద్దేశముతోఁ బ్రయుక్తమైనదో దానిని గమనించు వారికది సార్థకమయితీరును. "నానృషిఃకురుతే కావ్యమ్" అనియు, "కవిః క్రాంతదర్శీ" యనియు నేవేవో చెప్పుటవలన సత్యప్రదర్శనమే పరమగమ్యమయిన సృష్టి తత్త్వాన్వేషకుఁడు కవియనుట తెగియుండును అట్టివల్లత్వ్యము నాధారముగాఁగొని మహోద్దేశములను సాధించు వ్యక్తులు కొలఁదిగానే యుందురనుట నగ్నసత్యము. సంస్కృత భాషావిషయములోఁ గాళిదాసునకుఁ బూర్వులెందఱో మహాకవులు వెలసినను కాళిదాసు వ్యాస వాల్మీకులనే కవులుగా పరిగణించినట్లుతోఁచును. "మందః కవియశః ప్రార్థీ గమిష్యామ్యుపహాస్యతామ్" అనుచోట రామాయణరచనము చేత వాల్మీకి కెట్టి యశస్సు సంభవించినదో అట్టి యశస్సు తనకు రఘువంశ రచనముచేత కావలయునను కోరికయున్నట్లు ప్రకటించు కొనినాఁడు. సంస్కృతవాఙ్మయ ప్రపంచమున గౌరీశంకర శిఖరమనఁదగు వాల్మీకిని దలఁచునపుడు కాళిదాసుని కలము వెనుకాడకతప్పదు. కవిత్వమనఁగ నెంతబాధ్యతతో నిర్వహింపవలసిన మహోద్యోగమో కాళిదాసునకుఁ దెలిసినంతగా ఇతరులకుఁ దెలియుట కవకాశము తక్కువ. కావ్యరచనకార్యము నూఁదముట్టుగఁ దరచిన కొలఁది నగాధమయిన మహాసముద్రమువలె గోచరించియుండును. అది కవియగు వాల్మీకితోఁ దులఁదూఁగ నిచ్చగలుగుటలోఁ దప్పులేదుగాని యాశిఖరమునంతు కొనఁగలిగినా లేదా యనునది సత్యప్రదర్శనమే. పరమ గమ్యమయి కావ్యతత్త్వాన్వేషకుఁడయిన విమర్శకుఁడు తేల్చవలసి

యుండును. "పురాకవీనాంగణనా ప్రసంగే—" యను శ్లోకము కాళిదాసునకు వ్యాసవాల్మీకుల తరువాత సంస్కృత వాఙ్మయములో నెట్టిస్థానమున్నదో నిరూపింపసమర్థమయియున్నది. శ్రవ్యకావ్యప్రపంచములో వ్యాసవాల్మీకులు సాధించిన యద్భుతసిద్ధుల నందుకొనుటయేగాక దృశ్యకావ్య శిల్పనిర్మాణములో నున్నత స్థాయినందుకొన్నాడని యానాటి పండితలోకము తలంచెనని చెప్పసందేహముండదు" నాటకరచనమున కాళిదాసునికలదు అధికోత్సాహములో ముందంజ వేసినది" అని విమర్శకుల నిర్ణయము. సరస్వతి యపరావతారుండుగా గణింపబడు కాళిదాసులోనున్న ప్రతిభ నెందఱెన్నివిధములుగాఁ బ్రకటించినను అసమగ్రముగనే పరిగణితమగును. "కవితా కళకు శిఖరము నాటకరచనము. అపురూపమైన ఎన్నో శక్తులు మేళగించిననే గాని ఇది అసాధ్యమయిన నిర్మాణనైపుణ్యము, పాత్రీకరణకౌశలము రసపోషణ సామర్థ్యము సంభాషణ కల్పనాచాతుర్యము, పద్యరచనా పాటవము మున్నగు వివిధాంగములలో నొక్కొక్కదానిలో కృతహస్తుడు కావలయును. కాగా వ్యవసాయాత్మికమగు బుద్ధితో సాధనచేయుటవలన సహజప్రతిభాశాలికి నేవేళయందైన నుత్తమ సిద్ధిలభించినప్పుడే గణనకెక్కును ప్రపంచమునందలి నాటకరచయితలలో నుత్తమశ్రేణికిఁ జెందినవాడు కాళిదాసు. అతనిలోని యనన్యసామాన్య లక్షణముల నన్నిటిని వివరించుటకొరకు పండితమండలి యెంతోకాలము కృషిసల్పినను సమగ్రముగ వివరింపసమర్థము కాజాలదు.

శ్రవ్యదృశ్యకావ్యములలో తారతమ్య పరీక్షచేయుచో దృశ్యకావ్యనిర్మాణము కష్టసాధ్యమనక తప్పదు. అట్టిదృశ్యకావ్యములలోఁ గాళిదాసుచూపిన శేముషీవిశేషమును మాత్రమే యాధారముగా జేసికొని "అభినవ కాళిదాసు బిరుదమునందిన పానుగంటిని గుఱించి యొకటి రెండు విషయములు మాత్రమే వ్రాయుచున్నాము సాహసమున,

నాకవిత్వమునకును నవ్యాజభక్తిగా గుర్తింపఁజేసికొంటి. సమగ్రమయిన వివరణములతో నాకమహాగ్రంథము రచియింపఁజేసి యావత్ప్రపంచమున నిట్టికవికిఁదగుసత్కృతి చిహ్నము నేర్పఱుపఁజాలిన మనకృతజ్ఞతను వెల్లడించుకొనినట్లగును. అట్టిదే నాటికేని తటస్థింపదో? ఆంధ్రులు ధన్యులు. ఆంధ్రభాష ధన్య. ఆంధ్రకవి అమరుఁడు. వాల్మీకి వరవడి కాళిదాసునికున్నట్లు కాళిదాసుని కలిమి పానుగంటి కబ్బెనని చెప్పఁజాలుటయు—(అది కూడ నాటకరచనను బట్టియే) అందులో నాలంకారికుల నియమములను అనుకరించుటయు, నలంకారముల నెంత స్వభావసిద్ధముగ నట్టిపట్టుల వాడఁజాలునో వివరించుటయుఁ బ్రధానమయ్యెను, ఎన్నియో నాటకములు రచించిన కవియొక్కయొక-నాటకముఁ దీసికొనినను గ్రంథము వ్యాసము పెరుగునను భీతితో నొక ఉపమాలంకారమును మాత్రమే తీసికొని "ఉపమా కాళిదాసస్య" యను సూక్తియాధారముగ కాళిదాసనిపట్ల నెట్లు వరిపజేసెనో సంగ్రహముగ వివరించుటచేయుకృషి. "ఉపమా కాళిదాసస్య" అని వినాను పల్కురోగాని నిక్కముగ నుపమాలంకారముచే నాతఁడు సాధించు ప్రయోజనములగణ్యములు. ఉపమాలంకారముచేతఁ బద్యములపూర్వమయిన సౌందర్యము ఉజ్జ్వలకాంతి చే కూర్పవచ్చును ఇతఁభాషావిరచనమునకు సౌందర్య ప్రతిపాదనమునకు నెంతయో తోడ్పడును. వాచ్యముగ వర్ణించిచెప్పనక్కఱ లేకుండగ నెన్నియో భావములు ధ్వనితములగునట్లుగా నీయలంకారమును నిపుణముగా వాడిన పట్టుల నేకములున్నవి. ఇందుమతీ స్వయంవరార్థము వచ్చుచెందిన రాజపుత్రులను చెలికత్తె చూపుచు వారి వారి ప్రత్యేకతలు వర్ణించు సందర్భమున నుపమాలంకారముల నెన్నియో రీతుల వివరించుట ప్రత్యేకముగ గమనింపఁ దగియున్నది. అందును "కాంచైన వేణి గ్రహణేనియుక్తా రాజాంతికం రాజసుతానినాయ సమీరణో

ర్లేవ తరంగరేఖా పద్మాంతరం మానసరాజహంసీవ'' అను శ్లోకములో పూర్ణోపమ ప్రారంభమునకు నపూర్వసౌందర్యము సంపాదించుట గమనార్హము. నవీనా గోత్రా తరంగరేఖా మానసరాజహంసీం పద్మాంతరమివ, వేత్రగ్రహా నేనియుక్తా రాజకులా త్వాం రాజాంతరం నినాయ'' యనుటలో నెన్ని భావములున్నవో యూహింపవలయునే గాని వివరింప నసాధ్యములు. ఇంతయేల? ''వాగర్థావివసంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ'' అను రఘువంశ ప్రథమశ్లోకములో ఉపమాలంకారమును దీసివేయుచో నీపద్యమునకు శిరస్సు లేకపోవును. అట్లోకమునం బడిపోవు తక్కిన భాగమునొక్కసారిగా నాకసమున కెత్తుచుండునది యుపమాలంకారమే. కేవల శివభక్తుడని తలంచుటకే పద్యమును గూడ పలువురుదాహరించుచున్నారు. అది యెంతవరకు సత్యమో విచారింపవలసియున్నది. కాని యాశ్లోకములో ''పార్వతీపరమేశ్వరౌ''అనుస్థలమున ''పార్వతీ,పరమేశ్వరౌ''యనునట్లుగనే పార్వతీప,రమేశ్వరౌ''అని విడదీసి శివకేశవులను స్తుతించినాడాయని తలంచుటవకాశము లేకపోలేదు. ఇట్టివెన్నో యుపమాలంకారము లీతని దృశ్యకావ్యములనుండి కూడ నుదాహరింపవచ్చును కాని ప్రకృతము పానుగంటికవిని గురించి కొంత ముచ్చటించుట యవసరమని దానిని వివరింప దలంచ లేదు.

పానుగంటికవి నర్మదాపురుకుత్సీయము, సారంగధర చరిత్ర ప్రచండ చాణక్యము, పాదుకాపట్టాభిషేకము మున్నగు నాటకములు లెక్కకు మిక్కిలి రచించి కవిలోకములలో గణుతకెక్కెననుట వివాదాంశము కాదు. అభినవ కాళిదాస యనునది కవి యుత్తమస్థానమును బ్రసాదించి పైకెత్తుచున్నదా. లేక తగ్గించుచున్నదాయని శంకించువారుందురని తెలిసియు నుపమాలంకారమును మాత్రమే దీసికొని యీ కవియొక్కస్థానమును నెన్నించుట యన్యాయమే యగును. ఐనను

రాధాకృష్ణనాటకమును మాత్రమే తీసికొనియుదాహరణము లిచ్చుటచేతనింక నితరనాటకములలో నెట్టి యుపమాలంకారము లున్నవో పరికింపవలయునను కుతూహలము కలుగుచో నప్పుడా పంక్తియున్నట్టి కాఁగలదని తలంతును. తెలిసినదానినుండి తెలియనిదానినిగుర్తించుట కెన్నియో యుపమానములు నిత్యకృత్యములలో మనమువాడు పట్లుగా సహజముగా నెన్నియో యుపమాలంకారములీ కవివాడుట ప్రత్యేకముగ మనము గమనింపవచ్చును. పాఠకలోకమునకు వివరణమును చేయలేదనియాగ్రహము కల్గుటకంటెనుగ్రహమే కలుగునను భావముతో నీక్రింద నుదాహరింతును తినఁబోవువారికిఁగూడ రుచి తెల్పవలయునా?

" కృష్ణుఁడు:—గీ॥ భవ్యధగాములతికఁ గూడు జ్వాలవలెను,
జ్వాలికను వెంబడించెడి వాయువవలె,
వాయులహరిని వెన్నాడు పరిమళంబు
గతిని కృష్ణుండు రాధనుఁగతిని నేను"

"శారదుఁడు:—రాధకు మధుర కృష్ణునివలెఁ గానుపించుటకొక కారణమున్నది—వెనుకనున్న తైలమును ముందున్న దీపిక పీల్చుకొను పటులు పురోభాగమునన్న మధుర పశ్చాద్భాగమున నున్న నీకృష్ణత్వము నాకర్షించుకొనుచున్నది."

"శారదుఁడు:—నామిత్రునికి దూయవారపు బ్రాహ్మణునికి వలె నెక్కడను, నిగుడను, దీపప్రభను గాంచిన పల్లివలె రాధ బాధపడలేక యాతఁడిచ్చుటకుఁ గాలుకొలఁది చాటినాడు"

"తరళ—అమ్మా! తొందరపడకుము. మగవారి ప్రేమము నీటిపై నురుగు వంటిది. పట్టిచూడకున్నంత వఱకే పైబండారము"

కృష్ణు—సత్యభామ కోపశాంతిని గోరుచున్నది.

"శార—(అపహాసించి) సత్యభామ గేదెమూడ జాతిలోనిది.

పాలెక్కువ వదలి చూడను కోతుల హగోపాలునివలె ననురాగమును తమగ గనబఱచి యూకొంకను బూనుచేయుచున్నారు."

"కృష్ణుడు:-(తనలో) తరుణి కోపంబునకు వడి తగ్గవలెను
నన్న దీయోవళాంతి వా క్యాః వ్యథమె
పూర్ణ వేగాధిశావగా పూర్వమునకుఁ
బెట్టసాహసించిన యానకట్టవోలె."

"కృష్ణుడు:- (నవ్వుచు) నీమెడలోని సూత్రమువంక నేవరుచూచు చున్నారు.

సూత్రమునక్కైవ సందేశ స్థూలమగుచు
క్రిక్కిటియు నీకుచద్వగవ రొయిక్కయంత
రముద నెట్టులో నామాపులిమికి యహహా
క్రిమ్మరఁగ జేవు ఊతిలోఁ గవ్వలటుల."

"కృష్ణుడు:- కోపము విచిత్రరూపము కోపమునకుఁ
గనులుఁ గర్ణములు దయాకలన లేవు
సర్వమును గబళింపంగ జాలు నోరొ
కంటె యజగరమునకు వలెఁ గలదుగాదె"

"పొగమొక్కలోఁ నోటిమూతవలె," నత్తగుల్లవలె నతిమంద స్థితిని గలిగియున్నది "కన్నులతో ముందు వైపునకుఁ జూచుచుఁ, గాళ్లతో వెనుకకు నడచు పీతవలె బతుకులు దేలుము "సేయుమంటి రాధ యర సరసానాథుని పాలి కవితాకన్యవలెనే యయ్యెనో?" ఇదినాలె పురుగు వలె స్త్రీపురుషస్వభావములు గూడ కలిగినది గాదుగద? "అదేమి" గాడిదవలెఁ గాళ్లకుఁ జెకుముకి యూ చేమిరా?, "నిన్నుకృష్ణ విడువక యమ్మవారి ఘటమును వలె నెత్తినై నెక్కించుకొని యూరంతయు నీనాథుని గంతులు వేయుచుందువా!" తొండ ముదిరి యూసరవెల్లి యగునటులు పత్న్యనురాగము ముదిరి భక్తి

యగుచున్నదా? "అలిదిప్పలవలె నేత్రములున్నయామె," పతిబాధం
బడలేని పతివలె భర్తృశిఖామణి నీటిలో నేలమునుంగను? భర్తయు-
పదేశము బ్రాహ్మణవ్యవసాయమువలె నిష్ఫలము" వంటిసహజో-
పమలతోం దనరుకులం లోకానుభవమును శాస్త్రానుభవమును వివరిం-
చుటలో నీమహాశయుండొక కాళిదాసునే గాక యింకను మహాకవుల-
ననుకరించి యనుసరించి, యనుభవించి రసికలోకమున కమితోత్సా-
హము కల్గించుట చేత నీకవి యాంధ్రవాఙ్మయముపై నొక చెఱగని
ముద్రవైచి ధన్యుండైనాఁడు అకవినిబోలు వారెవ్వరొకరిద్దరున్నారన
జాలును. "అబలకను రాగము అపురాగముదపాకు కంటె నధికోన్న-
తకరము, చెవిలో నీసడికును శెవిలిని యాధ్వనిశృంగారగము మఱియొక
వస్తువని భ్రమింపదా" వంటి రచన సామాన్యకవి కలమునుండి రానే
రదుగదా?" లుబ్ధునితో స్నేహము సొమ్ము పెట్టినపలకే, వైష్ణవునితో
స్నేహము వంటయింటివరకే; "అత్మనుగ్రహించి దేహము వదలి
వేయుటలో దక్షిణను మొలను ముడిచి తాంబూలమును త్యజించెను
వైటికునివలెనే చేసితివి" మొదలగు నవి కుప్పతిప్పలు సంతిర్పణామై-
నతరువాత వెళ్ళిన బ్రాహ్మణున కెంతపనాయనమో నీకువింత జరుగం
దలచియున్నది. "లలితా నీవును నేనును గుడ్లగూబల వలె నీయాఱు
మాసములును దొడ్డలలో నుండవలసినదేకద" వంటివెన్నిమాపిన
నుత్ప్రస్తి కలుగునా? అకవి గ్రంథములన్నియు నందఱికందుబాటులో
నుండునట్లు చేయుదో నదియే చాలును.

శ్రీ పానుగంటివారి ప్రతిభ

శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి.

శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారిని ప్రేక్షక కళా పరిపూర్ణునిగా సారస్వత గగనవీధిని శాశ్వతముగా నెలకొల్పినది యనన్యదుర్లభమగు నాయన ప్రతిభయే, యని యందఱు నంగీకరింతురు. అంగీకరింపవలసినదే. ప్రతిభ యనఁగా నేమియో తెలిసికొన్నచో - ఆప్రతిభచే పానుగంటివారి సారస్వతమున కబ్బిన వైశిష్ట్యము తెలియుట కొకదారి దొరుకును.

అంతఃకరణ చతుష్టయమునందు సంకల్ప వికల్పాత్మకము 'మనస్సు' అనియు, నిశ్చయాత్మక 'బుద్ధి' యనియు, ఇట్లు చిత్తమునకును, అహంకారమునకును శాస్త్రజ్ఞులు వేర్వేఱు లక్షణముల నేర్పఱచి, అందు బుద్ధిని గూర్చి ప్రత్యేకముగా విభాగించి చెప్పినారు. ఏ పదార్థమునందైనను, లోఁతుపాఁతులు బాగుగాఁ దెలిసికొని, మంచిచెడ్డలను నిశ్చయించునది బుద్ధియనియు, ఆబుద్ధికూడ వినినదిగాని, చూచినదిగాని ధరించునది అనఁగా:- మఱువనిది 'మేధ' యనియు, అట్టి ధారణ గలిగి నవనవోన్మేషము అనఁగా:- ఎప్పటికప్పుడు నూతనవికాసము గల యాబుద్ధినే 'ప్రతిభ' యనియు, చెప్పినారు. అట్టి ప్రతిభ కలుగుటకు జన్మాంతర సుకృతవిశేషమే కారణముగాని నేఁడేదో యత్నము లొనర్చి సాధించు సాధనాంతరము లిప్పటిలో లే"వని ఖండితముగా నాపెద్దలు చెప్పివైచిరి.

పరమాణువు మొదలు పరబ్రహ్మము దాఁకఁగల పదార్థకోటి నంతయుఁ బరీక్షించి, యందలి పరమరహస్యములను గ్రహించి, వానిలోని గుణమును గుణముగా, దోషమును దోషముగా నద్దమునందువలెఁ జూపింపఁగల యీ ప్రతిభకు, వాతావరణముగాని, వాసస్థానముగాని హేతువులనుట పొసఁగని మాట. ఎన్నియో విధములఁ బరీక్షించిన యీ ప్రతిభకు హేతువు జన్మాంతరీయ పుణ్యవిశేష మొక్కటే

యని యొకయువిద్వదభిమత మంగీకరింపక తప్పినది కాదన్నమాట. లోకోత్తరమగు నాప్రతిభ కగ్రస్థాన మొసఁగిచ్చుట యెందులకు? అదియెప్పుడు నగ్రస్థానమందలిదైనప్పుడు ? ఆప్రతిభయే కవితాలత బీజమఁట.

సరే! అట్టిలోకోత్తరమగు ప్రతిభ యుండవచ్చును. ఆప్రతిభచే నూహించిన విశేషములను వెల్లడించుటకు వాక్కుగూడ నుండవలదా? వాక్కుకలిగినను, నీరసమైనచో దానినెవరు విందురు ? విని యెవరు గౌరవింతురు ? కావున నావాక్కు సరసమును నిపుణమును గావలెను. రసజ్ఞతయు నైపుణ్యమును గలిగినదే యనుకొందము. లోకమెట్లున్నదో తెలిసికొని యట్టిరసవంతము నిపుణము నగు వాక్కును వెలువరింపవలెనే కాని తోఁచినయట్లు మాటాడిన వ్యర్థమగుటయే కాదు. ఛీ ఛీ లుతప్పవు. కాన లోకజ్ఞతతో పాటు నిర్మలమైన అనఁగా:- అవకతవకకు అసందర్భము కానట్టి- తప్పుత్రోవను బట్టనట్టి, శాస్త్రజ్ఞానము మఱియు నావశ్యకము నింతపరికరము గలప్రతిభ యెవరికి లభించునో వాఁడె నిజమైన కవియఁట. ఈ మాటనే రాజశేఖరుఁడు తనకావ్యమీమాంసయందు "ప్రతిభా వ్యుత్పత్తిమాంశ్చ కవిః" అని సూత్రించెను. సరే! యివి లభించినవే యనుకొందము. అట్టివాఁడింటనే కూర్చుండి మూఁగనోము పట్టిన నేమగును? నిరంతరాభ్యాసము లేకున్నచోఁ గవిత్వమునకు మూలకారణమగు ప్రతిభ తుప్పుపట్టి యెందులకును గాకుండఁబోవును. ఆకవితాబీజము నీరు లేని మడియందు నాటిన విత్తనమగును. ఆనిరంతరాభ్యాసమున కెంతటి యవకాశము కలుగవలెను ? సంసారచింతలు లేక యోగివలె నిశ్చలమనస్కుఁడు గావలెనఁట! ఇంతటి సకలావకాశము లెంతటివానికి లభింపవలెను? అట్టివాఁడెవ్వఁడైన నుండునా ? అనుసందేహము కలుగవచ్చునుగదా! కాని యట్టివాఁ డెవ్వఁడో, యెక్కడనో కాని పుట్టకున్నచో శాస్త్రజ్ఞ

ట్టిలక్షణము నేల సూత్రించుదు? నేఁడును పుట్టవచ్చును. పుట్టినను బ్రదికి బట్టకట్టవలెఁగదా!

కాని నూతేండ్లనాఁడు— పీఠాపురమున నేకపుణ్యమూర్తి, అట్టినిర్మలమగు శాస్త్రరహస్య వేత్తృతతో, నిశ్చలదీక్షతో, నిరుపమానమగు నిపుణతతో, నిష్కళంకచరిత్రముతో, నిరాడంబరజీవనముతో, నాంధ్రమాతకు ముద్దుబిడ్డయై పుట్టి, దోసతోలవంటికుటుంబము, నిఖిలజగమంతను నిత్యానందసింధువున నోలలాడించు వాఙ్మయసృష్టితో నజరామరమూర్తియై నాఁడు.'' ఆతఁడే మనపానుగంటి పంతులు. ఆమహనీయుని కలమునకు, ఆతనివాక్కునకు, సద్దులేదు కదా? ఎంతవిజ్ఞానము! ఎంతధారణాశక్తి! ఎంతసూక్ష్మగ్రాహిత్వము! ఎంతవాఙ్నైపుణ్యము! ఎంతమార్దవము! ఎంతతీవ్రత! ఎంతధర్మప్రబోధము! ఎంతహాస్యరససంమేళనము! ఎన్నివిధములరచనలు? ఎంతటి నానాస్వభావసృష్టి! ఆయనమాటలలోనే చెప్పవలసినయెడల ఎంతపెంకితనము! ఎంతనిర్లక్ష్యభావము! గుణమును, దోషమును వెల్లడించుటలో నెంతనిర్భయము! అహా! యనిపించునే ఎవరికి? కనులున్న వారికి, చెవులున్నవారికి, మతియున్నవారికి.

ఆయన స్మారక పొగడుచున్నా ననుకొందురేమో! అకళంకకీర్తి కీర్తన మాయనను పొగడుటకా? లేక తెగడుటకా? ఆయన యాంధ్రవాఙ్మయమునకుఁ జేసిన బహుముఖసేవను వెల్లడించుటకా? గ్రాంథికాంధ్రభాషారక్షణమునకై ప్రతిపక్షులను మొగమోటక తూర్పారఁబట్టుటలోఁ జూపిన కటుత్వమును కాదు. కౌర్యమునే కప్పిపుచ్చుటకా? తనవాఙ్మయామృతకిరణములచేఁ బండిత పామర విభేదము లేక యావదాంధ్రుల హృదయతాపములను బోఁగొట్టి షోడశకళాపరిపూర్ణుడై శారదాపథమున దివ్యజ్యోతియై వెలుఁగు నామహితుని శాశ్వతకీర్తిమూర్తిని ధ్యానించుటకా? ఇరువదేండ్ల

శరీరము సన్నముగాఁ బొడుగుగాఁ, బట్టతలతో తెల్లనిమీసాలతో, నలిగిపోయిన జుట్టుతో, ముదిసి, యస్తమించిన యాయన పాంచభౌతిక దేహమును దలచుకొనుటకా? ఒక్కటికాదు. మన నిందాస్తుతుల కాయన యతీతుఁడు. ఆయనవాఙ్మయమున ఇన్నితప్పులున్నవని జమాఖర్చులతో చిట్టావర్జాల జేరీజువేసి చూపిన పండితులను ఎంత భ్రాంతిపడినారని యొక్కచిఱునవ్వు నవ్వినేకాని తనకలమాఁపెనా? తనయభీష్టగ్రంథకర్తృత్వముండిదిగదా ? ఆయన రచనమాఁపెనా ?-

కావున నాసారస్వతమూర్తిని దలంచుకొని, మొదలు పులక రింపఁ, జిత్తము ద్రవింప, వెచ్చనివో, చల్లనివో, యశ్రువులతో నాయనకుఁ దర్పణమునర్చి, భక్తిపూర్వకముగా రెండుచేతులు శిర మునఁ జోడించి మోడ్చి యొక్క మ్రొక్కు మ్రొక్కెదము. అంతే, అంతే! మనము కాదుగదా? మనకు మీఁదటితరము లెన్నియైనను, నేవిధమునైనను, నామహాత్మునిఋణమును దీర్చుకోఁగలదా? లేదు. ఆంధ్రులంద ఱాయన కధమర్ణులే !

ఇంతగాఁ జెప్పి యాయనముద్దుబిడ్డయై, ధ్రువతారయైన యా యన సారస్వతమును గూర్చి నాలుగుమాటలు ముచ్చటించుకొన కున్న నాంధ్రసరస్వతి కెంత యపచారము చేసిన వార మగుదుము? ఆయనసారస్వతము నాటకప్రపంచమున కొక రత్నదీపము. ఆయన సారస్వతము గద్యప్రపంచమునకుఁ గనుబొమలాను పచ్చకర్పూరపుఁ గాటుకరేఖ. అన్ని దేశములను, అన్ని కాలములను, అన్నిమనస్తత్వము లను జూపఁగల యైంద్రజాలిక మీఁథము. పండితుఁడు పామరుఁడను నంతరము లేకుండ, నాయన రచనలందలి సుకుమార, సుకుమారతర, సుకుమారతమహాస్యమునకు, కఠిన, కఠినతర, కఠినతమ హాస్యమున కు, లొంగిపోవలసినదే, పొంగిపోవలసినదే, జోహారు లర్పింపవలసి నదే! కారణము? ఆహాస్యము గాలికిఁ బోవునదిగాకుండుటకు, ఆహాస్య

మునందెంతటి విజ్ఞానము ! ఎంతటిలోఁ తగుచినయు విమర్శనము ! ఎన్నెన్ని శాస్త్రీయ సంప్రదాయములు ! ఎంతటిలోకజ్ఞత ! ఎంత వ్యంగ్యము ! -

నర్మదాపురుకుత్సీయమున :- రాజు నర్మదపై విరహార్తుఁడై యుండు ఘట్టమున - విరహమని యితరులకుఁ దెలియదు. వ్యాధి యనుకొని వైద్యులు చికిత్సకై యత్నించుచుండు సందర్భమున నర్మదయే వైద్యునివేషముతోఁ బ్రవేశించుచు, పురుషవేషముతో వైద్యుఁడుగా వచ్చిన నర్మదను జూచి విదూషకుఁడు "అయ్యా! మీ పేరేమి యనును. ఆమె "అమృతహస్తుఁడు" అనును. "మీరు వైద్యులు గాన నడిగెదను. పెరుఁగుతోఁటకూరలోని పెరుఁగు, ఆవుపెరుఁగా ? గేదె పెరుఁగా?" అని ప్రశ్నింప - నామె నవ్వుచు పెరుఁగుతోఁటకూర యన్నంతమాత్రమున అందు పెరుఁగుండునా ? అని పలుక - విదూషకుఁడు "మీ అమృతహస్తనామము కూడ నట్టిది కాదుగదా!" అనును. కొంటెతనమున కడిగినట్లు పైకిఁ గనఁబడునే కాని యాదెంతవిమర్శన మున్నదో! పెరుగుతోఁటకూరయందుఁ బెరుఁగు లేదు. ఎన్నిమాటలు పైభాగములు కోయుచున్నను పెరుఁగుచుండు మొక్కయే కాని (యాతోటకూర) తఱఁగి పోవునది కాదు. అను నిజమైన యర్థమును వ్యంగ్యమొనర్చుట యొకటి. వైద్యుఁ డగువానికి నెల్ల రోగౌషధుల గుణదోషములు కరతలామలకములై యుండవలెనను వ్యంగ్యమొకటి. మఱియు వైద్యులు, కవులు, ఇతరవిద్యావంతులు పెట్టుకొను బిరుదనామములు బూటకములు కాని సార్థకములు కావను వ్యంగ్యమొకటి. ఆహా ! సంభాషణమున నిన్నివ్యంగ్యములును విద్యుత్తులవలె సూక్ష్మదృష్టికి దళుకు తళుకుమని కనబడుచుండునుగదా ?

వైద్యుఁడుగా నర్మదరాజునొద్దకు వెళ్ళి "నీవ్యాధినివృత్తి కుదర్చెద" నవఁగా, రాజు "నీవు కుదిర్చినచో నారాజ్యమిచ్చివైచె

దను" అనెను. తోడనే విదూషకుఁడు "సిక్కాకుళ-రాష్ట్రములే యిచ్చె దవు. కాని నేను రెండు రాష్ట్రము లిచ్చెదను" అనెను. రాజు నవ్వుచు "నీకు రాష్ట్రము లెక్కడవి?" అనఁగా విదూషకుఁడు "ఔరేను. దుంప రాష్ట్రము, కళింగరాష్ట్రము" అనెను. పరిశీలించ నీహాస్యము నం దెంత యౌచిత్యము కలదో! నిజముగా రాష్ట్రమే వైద్యునకిచ్చిన యెడ నీవలె వాఁడు పాలింపఁజాలఁ, డని యొకధ్వని. అతనికి మం దులలోనిదే కావలసినది. దుంపరాష్ట్రము, కళింగరాష్ట్రముగాని నీ రాష్ట్రము లతని కెందులకు ? అది వైద్యసంబంధమగుధ్వని యొకటి. నీ విచ్చెదనన్నది బూటకమే. ఈయుఁబోవు సమయమున కిప్పటి యీ మాట లుండవని మఱొకధ్వని. ఈరీతి నీ హాస్యవాక్యము పరిశీలించి నను పంతులుగారి రచనలలో వ్యంగ్యము హెచ్చుగాఁగోచరించుచునే యుండును.

రాధాకృష్ణనాటకమున- ప్రాతఃకాలముననే వచ్చిన యొక మధ్యమపాత్రను విదూషకుఁడు "ఏమిరా! శేషవర్జ్యమువలెఁ బొద్దు టనే సిద్ధమైతివి" అనెను. ఏమి యుపమానము. శేషవర్జ్యము పొద్దు టనే కాని తరువాత రాదుగదా! ఒకొకటి రాత్రితుదిగడియలందుఁ బ్రారంభమై, మఱునాఁటిపొద్దుటికి యొకటి రెండు గడియలదాఁ కనో, విఘడియలదాఁకనో శేషించి యుండును. కావున నది పొద్దుట రావలసినదే కదా! అట్టి వాఁడును వచ్చెను. అంతమాత్రమే కాదు. వర్జింపఁదగినది వర్జ్యము. అది విషఘటికలు కావున నాల్గు ఘటికల కాలము విసర్జింపఁదగినది, అని జ్యోతిష సంప్రదాయము. అట్లే నీవును కృష్ణదర్శనార్థము వచ్చినను, నీవు విసర్జింపఁదగినవాఁడవుగాని గ్రా హ్యుఁడవు కావు సుమా! అను వ్యంగ్యము కలదు. ఇట్టి శాస్త్రము మార్గమున హాస్యరసమునకు బొదిగి జ్యోతిశ్శాస్త్రసంప్రదాయ మెం తగాఁ బోషింపఁబడినదో! ఈరీతిగా నన్నియుని పానుగంటివారి నాటక

ప్రపంచమునుండి యుద్ధరించి చూపఁగలము? ఆ యుపమానములే వేలు. ఆరాధనయే వేలు. శేషవర్జ్యమువంటి యుపమానము కాళిదాసునకైనను స్ఫురించునా? అనిపించునే! ఏమిప్రతిభ! ఆ నాటకములందు నుపమాలంకారములు లేనిపద్యమొక్కటియు నుండదుగదా! ఆయుపమ లన్నియు నిరుపమలు. అభూతములును.

నాటకముల విషయమున మెచ్చిన క్రింది విషయము లను గొనినచో, పదరచనా విషయములను నాట్యోపన్యాసములను. రెండే రెండు విషయము లనుకొందము. అవి యుపన్యాసములా? వ్యాసములా? అని పెద్దప్రశ్న. పరిశీలింప నా యా రెండు సంపుటములును వ్యాసములే కాని యుపన్యాసములు కావు. ఆ వ్యాసములైనను గాగితముపైఁ గాపీయింగు పెన్సిలుతోఁ దుడుపు అనునది లేకుండ ధారావాహినిగాఁ జిన్నచిన్న యక్షరములతో వ్రాసి, దిద్దుఅని, సాపుఅని లేకుండ నెను వెంటనే ముద్రణమున కంపఁబడినవే. ఒక్కచిత్రము. ఆరంభముననే "జంఘాలశాస్త్రి యిట్లుపన్యసించెను." అను వాక్యము కంటఁబడఁగానే అదియంతయు నుపన్యాసమే యనిపించును. ఆవ్యాసములందును ఉపన్యాసత్వము స్ఫురించునట్లు జంఘాలశాస్త్రికి ఏసభ్యుఁడో ప్రశ్నించినట్లు, అతఁడుచితముగ సమాధానము చెప్పినట్లు, కొందరతాతని మాటలకు భేష్ భేష్ అని, మెచ్చుకొనినట్లు, కొందఱు ఛీ ఛీ యనినట్లు, చప్పట్లు కొట్టినట్లు నుండుటచేఁ బాఠకుల కదియంతయు జంఘాలశాస్త్రి సభావేదికపై నిలిచి యుపన్యసించుచున్నాఁడనియే యనిపించును. కాని, 'సాక్షి' యీయుపన్యాసమునంతయు నిది యథాతథముగా వ్రాసినట్లుగాని, యిదియంతయు పానుగంటివారి బంగారుపిచ్చుకగూటి యల్లికయని కాని స్ఫురింపనే స్ఫురింపదుగదా స్ఫురించుట యెందులకు? పంతులుగారే వచ్చి యిదియన్నియు నేను వ్రాసినవే యని చెప్పఁగను నకే! "నీవెఁపవమ్యా! జంఘాలశాస్త్రి

యుపన్యసించు వారిని సంగ్రహించి నీపేరు పెట్టుకొందువా? అని తిరస్కరించి, పాగసంపు చదువరులుగూడ నుండకపోవరని నమ్మెదను. అది ఆయన ప్రతిభావిశేషము అది ఆయన చేసిన మెస్మెరిజము.

సాక్షిసంపుటమునందలి యుపన్యాసమో, వ్యాసమో యేదియైనమొకటి కానిండు. అందింకొక విచిత్రమగు స్వాతంత్ర్యముకలదు. కాదు ప్రశ్నోత్తరయుండరా? అదియే కానిండు. సామాన్యముగా వ్యాసములకైనను, ఉపన్యాసములకైనను, ఉపోద్ఘాతోపసంహారముల కైక్యము ముఖ్యముగదా! సాక్ష్యుపన్యాసములలోఁ జెక్కుటయుండు ఉపోద్ఘాత మొకటి, నడిమివిషయ మొకటి, ఉపసంహారము మఱొకటి యుండును. కాని యీశాఖాచంక్రమణమే కవితకును స్ఫురింపకుండునట్లు సందర్భము కలియు నన్నివేశములతో విషయాంతరమునకుఁ దెచ్చి మధ్యమందు చక్కి వేయును. ఆహా యనిపించును.

పాచకమహాసభ:- అనఁగా వంటలవారిసభ. అగ్రాసనాధిపతి గొంక 'రంధనకళాకంఠి.' అతఁడు పాకశాస్త్రముయొక్క పరిస్థితిఁ నారంభించి, రసశబ్దమునకు రుచియనియు, శృంగారాది రసమనియు నర్థములుండుటచే, తనువిమర్శనము చేయనియు, కవికి తొమ్మిది రసములు కావలసి వచ్చెననియు, నారంభించి, కవిత్వ విమర్శనమునకు దిగి, వీరరసప్రధానమగు వేణీసంహారనాటకమునందలి రెండవ యంక ములోని భానుమతీదుర్యోధనుల శృంగారమును ప్రారంభించుచు నొక విచిత్ర విమర్శనము చేయును.

వంట చతుష్షష్టికళలలోనిదని వచనకళాప్రశంస చేయుచు లలితకళగా ఖ్యాతికెక్కిన చిత్రకళను, అందు రాజ్యవాలు శిల్పమును విమర్శించును. తుట్టతుదిని వంటవారు కొన్ని తీర్మానములుచేయుదురు. వారి దురవస్థ రసము లాదిగాఁ సూచించుట యొక్కటే కాదు. నేఁడు సామాన్యముగా జరుగుసభలలోఁ దుట్టతుదను నిరుపయోగములును,

నిష్ఫలములు నగు తీర్మానములు చేయు వ్యాపారము నపహసించుటయు ధ్వనించును. తుదకు సభ్యురాండ్రలో నొకతె మెడలోని యాభరణము నెవ్వరో తెంపుకొనఁగా సభయంతయు గల్లంతై చెదరి పోఁగా సభముగియును. అంతటి శాఖాచంక్రమణ మున్నను నైక్యము చెదరిపోవనట్టి యతి నిపుణముగా నాయన ప్రతిభ యనిచెప్పఁ గలదు.

ఏ విషయము నెత్తికొన్నను హాస్యమయుని ప్రతిభ సాక్షి మునుండి ప్రేక్షకలోకము మీఁది యతిస్తుఁ బోవలసినదే. ఎట్టి రహస్యాదిరహస్యమునైనను గ్రద్దచూపుకంటె సునిశితమగు చూపుతోఁ జూచి బుద్ధికందించవలసినదే. అందిచ్చిన దానికి హాస్యరసముతోఁ జన్నెలువన్నెలు కల్పించి వ్రాసి చూపినట్లు కనులున్నవారికిని, కంఠమూఁదినట్లు చెవులున్నవారికిని వినిపించవలసినదే.

అనంత ప్రతిభాసంపన్నులగు పానుగంటివారి సాక్షి 'సర్వలోకబంధువు' అనుకొని యానందించవలెనే కాని యావద్విషయము నందును కేవలము త్రికృతార్థులగు బుద్ధిమంతులెందరైన నవకాశమునుము కేమో కాని నావంటి వారికసాధ్యమని యున్నదున్నట్లు మనవి చేసికొనుచున్నాను.

ఇఁక నొక్క విషయము చెప్పవలసియున్నది. అది యీయన రచనలలోని భాషను గూర్చినది. ఆయన పిరగ్రాంథికవాది. గ్రాంథికభాషావాదముపై నాయన చేసిన దాడులు సాక్షి వ్యాసములందు స్వల్పమే కాని విమర్శకుల విమర్శనములందును, ప్రతీకోపన్యాసములందును జూడఁ దగినది. పండిత్యాలోచనమాపరచక- తెనుఁగు పలుకుబడి కొదిలిన దేదైన పరిశీలించి చదువఁగా రెండుభాషలయం దాయన లేఖినికి గల స్వాతంత్ర్యము వ్యక్తమగును. ఉచితమైనది పానుగంటి వారి సొమ్ము గదా? ఔచిత్యమును నిర్ణయింపఁజేసి యనను కొన్ని

కొన్ని విషయములను తలస్పర్శముగా విమర్శించి చెప్పవలసివచ్చి నప్పుడు ముందుగా నందలి యనౌచిత్యమునుగూర్చి వివరించి చెప్పక తప్పనిదాయెనని సూచింపనిదే యాయన కలము విషయమునఁ బ్రకా శింపదు. అట్టి నిష్కళంక చిత్రదాంకితుఁ డింకొకఁడు లేఁడనిన నతిశయోక్తి కానేరదు.

పానుగంటివారి వాఙ్మయమునకు నామాటలు 'స్థాలీపులాక మాలు. ఎందఱు మేధావులెన్ని దృక్కోణములనుండి యెంతయో నిశిత ముగ, ఎన్నియో యేండ్లు పరిశీలించినను, నా సారస్వతసాగరమున ననకలంకనిధి యెన్నియో మణులు శేషించియే యుండును- నావంటి వాఁడీ యల్పకాలమున నెట్లు వెల్లడింపఁగలఁడు? కావున నాయన లార! ఆయన రచనకు మూలకందమగు తత్ప్రతిభను దలచికొని, ఆయనకీర్తిమూర్తికొకటి నమోవాకము చెప్పి సెలవుతీసికొందును.

— • —

పానుగంటివారితోడి నా స్వల్ప స్వానుభవము

(శ్రీ బందారు తమ్మయ్య.)

1929 సంవత్సరమునకో 1930 సంవత్సరమునకో గాని నేనొకనాఁడు అమలాపురములోని బజారురోడ్డుమీఁద నేనొక బహిరంగసభ జరుగుచుండెను. ఎవరో యానాము బాబుగారైన వ్యక్తి సభాధ్యక్షత వహించి యుపన్యసించుచుండెను. అప్పుడు నేనచ్చట రికార్డు అసిస్టెంటుగాఁ బనిచేయుచుంటిని. ఏదో పనిమీఁదఁ బోవుచున్న నేనా యుపన్యసించువారు పిఠాపుర సంస్థాన కవీశ్వరులు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారని తెలిసి సభలోనికేఁగి కూర్చుంటిని. పంతులుగారి నంతకుముందెన్నఁడు చూచియెఱుఁగను. వారి నాటకములలో నర్మదాపురుకుత్సీయము, కంఠాభరణము, ప్రచండచాణక్యము మాత్రమంతకు ముందు చదివియుంటిని. ఆరోజులలో ఆంధ్రపత్రిక సారస్వతానుబంధములో ప్రతివారము ప్రకటితమగుచుండిన "సాక్షి" యుపన్యాసములు కొన్ని చదివియుంటిని. అందువలననే వారి ప్రతిభాప్రాభవములను గుర్తించి వారియెడ విశేష గౌరవభావము గలిగియుంటిని. పంతులువారి యుపన్యాసానంతరము, సభాధ్యక్షుల యాదేశముపయి నేనప్పుడు పంతులుగారి శక్తియుక్తులు గుణించియు, వారికవితలకే పండితమండలిచేఁ బ్రశంసితములయిన "ఆంధ్ర షేక్స్పియరు" "అభినవ కాళిదాస" బిరుదములు, వహించుటకుఁగల వారియర్హతను గూర్చియుఁ గొంత ప్రసంగించితిని. ఆకాలముననే "రఘువంశ రసము" అను పేర కాళిదాస రఘువంశ మహాకావ్యమునకు నేనొనర్చిన గద్యానువాదము ప్రథమభాగముగ ముద్రితమయి వెలువడినది. పంతులుగారు, వారిమిత్రులు శ్రీపాలెపు వేంకటసూర్యగోపాలముగారి యింట బసచేసి యున్నారని తెలిసి మాఱునాఁడు మధ్యాహ్నము మూఁడుగంటల సమయమునఁ వారి సందర్శించి నా గ్రంథము ప్రతినొకటి యొసఁగి దానిని సావధానముగఁ జదివి అభినవకాళిదాసులగు మీరు మీ యమూల్యాభిప్రాయము ననుగ్రహింపవలెనని ప్రార్థించితిని. గ్రంథమును గైకొన్నం

తటనే ముఖపత్రముపైనున్న గ్రంథనామమును జూచి పంతులుగారు ముహూర్తము కనులనద్దికొని నాకాశ్చర్యము కలిగించిరి. వారు శ్రీరామ భక్తవరులని నేనదివరకు వినిని దానికిది ప్రత్యక్షప్రమాణముగ గోచరించెను. గ్రంథమును బూర్తిగఁ జదివి తమ యభిప్రాయమును సాధ్యమయినంత త్వరలోనే వ్రాసి పంపెదమని యిప్పుడు వారు సెలవిచ్చిరి. తరువాతఁ గొన్ని మాసములు గడిచెను. ఉత్తరమేమియు లేనందున జ్ఞాపకార్థము మఱియొకలేఖ వారికి వ్రాసితిని. నాకిఁ బ్రత్యుత్తరముగాఁ గార్యాంతరములచే గ్రంథమంతయు సాంతముగఁ జదువుట పూర్తికాలేదని, ప్రస్తుతము ఇందుమతీస్వయంవర ఘట్టము చదువుచుంటిమని, నా వ్రాత బాగనుండనందున మిక్కిలి సంతసించుచుంటిమని తెలియఁ బఱచిరి. నేను మరల వారికి వ్రాయలేదు వారు సమగ్రాభిప్రాయము వ్రాసి పంపను లేదు. అనంతరము కొలఁది దినములకు నేను అమలాపురమునుండి కాకినాడ కలెక్టరాఫీసునకు బదిలీయైతిని. అటు తరువాత 1920 సంవత్సరము సెప్టెంబరు నెలలోఁ బిఠాపురములో ఆంధ్ర సాహిత్యపరిషత్తు వార్షికోత్సవసభ శ్రీ చిన్నాప్రగడ భానుమూర్తి గారి యధ్యక్షతను జరిగెను. ఆసభలో "శ్రీభాభిరామకర్తృత్వము" అను వ్యాసమును జదువుటకయి పోయియుంటిని. ఆసభయందంతయు ముందే యధిష్ఠించియున్న శ్రీనరసింహారావుపంతులు, కూచి నరసింహము పంతులుగారల ప్రక్క నే నాసీనుండుట తటస్థించెను. పంతులుగారు నన్నుఁజూడఁగనే నేనమలాపురమునందే యుంటినని యభిప్రాయముతోఁ గాఁబోలు "తా మిక్కడను దయచేసితిరి". అని ప్రశ్నించిరి. కొంతకాలముక్రిందట కాకినాడకలెక్టరాఫీసునకు ట్రాన్స్ఫరయితిననియు కాకినాడనుండి యిప్పుడే వచ్చియుంటిననియు మనవి చేసితిని. కాకినాడలోనుండియు పిఠాపురమునకు నా రాకపోకలుండునని సందర్భోచితముగఁ బలికిరి. త్వరలో వచ్చి దర్శనము చేయుదునని మనవి చేసితిని. ఒకసారి పిఠాపురమువచ్చిన నాగ్రంథవిషయమై సాక్షాత్తుగా కొంతవ్రాయనభిలాషమున్నట్లు సూచించిరి. కాని రాజకీయములయిన పని తొందరలవలన నెప్పటికప్పుడే నేను వారిని మరల దర్శింపఁజాలనయితిని. పిఠాపురము సభలోనే వారు వారి తుదిదర్శనము.

గ్రంథస్వీకారము : సమీక్ష

(శ్రీ బండారు తమ్మయ్య)

1. మాధవవర్మ- మైలమభీమ, కోన, పుటలు 108+18, వెల 2-4-0. కర్త; - నాట్యాచార్య శ్రీ దుప్పూరి జగన్నాథశర్మ గారు రామచంద్రపురము, తూర్పుగోదావరిజిల్లా.

శ్రీ విజయనగర సంస్థాన పరిపాలకులు పూసపాటి వారికి మూలపురుషులయిన మాధవవర్మ నామకులకొకరియు, తద్వంశమున జనించిన మహావీరపురుషుఁడు మైలమ భీమనయొకరియు చరిత్రలకుఁ జెందిన పరిశోధక చారిత్రక గ్రంథమిది. సుప్రసిద్ధ పరిశోధకులు శ్రీ జగన్నాథశర్మగారు చిరకాలమునుండి గావించిన విపుల పరిశోధన ఫలితముగ నిది సంతరింపఁబడినది. ఆంధ్ర వాఙ్మయమున విశేషముగ వ్యాప్తమయిన పలు చాటుపద్యములను, పూసపాటిరాజులలో పూర్వులు కొందఱు రచించిన కృష్ణవిజయము, ఉషాభ్యుదయము అను కావ్యములు, విజయనగర రాజుల కంకితముగా రచింపఁబడిన సరస భూపాలరాజీయము, రామకృష్ణార్యున రూపనారాయణీయము, రాజపుత్రతేజఃపుంజము, తదితరగ్రంథములు, శాసనములు బహుళ పరిశ్రమతో పరిశోధించి శ్రీ శర్మగారు దీనిని కూర్చినారు. గ్రంథమందెచటఁ జూచినను వీరి విపులపరిశోధన వ్యక్తమగుచుండును. పూసపాటివారు విష్ణుకుండిన వంశజులు- వీరిలో మొదటి మాధవవర్మ క్రీ. శ. 455 రెండవ మాధవవర్మ. క్రీ. శ. 456-483, మూఁడవ మాధవవర్మ. జనాశ్రయ బిరుదాంకితుఁడు క్రీ. శ. 516-6 1 ప్రాంతమునను బరిపాలించినవారు. మూఁడవ మాధవవర్మ బెజవాడ కనకదుర్గకు భక్తుఁడయి యామె యనుగ్రహమునఁ గనకవృష్టిని, గజహయాదిక సైన్యసమృద్ధిని బడసి విశేష మహిమాన్వితుఁడయి బెజవాడ రాజధానిగాఁ బరిపాలించినవాఁడు. ఇతఁడు విద్వాంసుఁడు, విద్యాపోషకుఁడునయి జనాశ్రయ ఛందోవిచితియను లక్షణగ్రంథమును

సంస్కృతమును రచించినవాఁడు. ఈగ్రంథము ఆంధ్రభాషలో వేములవాడ భీమకవికృతముగాఁ బ్రకటితమయిన కవిజనాశ్రయచ్ఛందమునకు మూలమని శ్రీ శర్మగారి ప్రతిపాదనము. కాఁగా నీగ్రంథము మాధవవర్మ, జనాశ్రయమహారాజ-జనాశ్రయోల్లాసము, కవి జనాశ్రయోల్లాసము అను రెండు భాగలుముగా విభక్తమయినది. కవిజనాశ్రయకర్త వేములవాడ భీమనయని కొందఱు; కోమటి రేచనయని కొందఱుతలంతురు. ఉభయులరచనములు మిళితమయియే ప్రస్తుతము కవిజనాశ్రయమను పేరితోఁ బ్రకటితమయిన గ్రంథ మున్నదని కొందఱమతము. గోకర్ణచ్ఛందమను గ్రంథము కవిజనాశ్రయము నొకటే యని కొందఱమతము. గోకర్ణచ్ఛందము కవిజనాశ్రయము వేర్వేఱు గ్రంథములని, కవిజనాశ్రయము రేచనకృతమయినను భీమనకృతమైనను దానికిమూలాధారము మూఁడవ మాధవశర్మ జనాశ్రయమహారాజ సంస్కృతమునరచించిన గ్రంథమే యని శ్రీ శర్మగారి మతము. వీనినిగూర్చిన చర్చ లీగ్రంథమునఁ జాల భాగము నాక్రమించినవి- మైలమభీమన, వీరభీమన నొక్కఁడేయని యూహింతు వేములవాడభీమన క్షాత్రియుఁడనికూడ శర్మగారు వివరించిరి. నేఁడు పూసపాటి, అడ్డూరి; అల్లూరి; ఇందుకూరి; కంకమరాజు; గణపతిరాజు; చేకూరి; నంద్యాల; బుద్ధరాజు; బెజవాడ అని పది వేర్వేఱు గృహనామములతో వెలయు నాంధ్ర క్షత్రియ కుటుంబములన్నియుఁ బూసపాటిశాఖకుఁ జెందినవేయనికూడ నిందుఁ జర్చింపఁబడినది. మొత్తముమీఁద ఆంధ్రదేశ క్షత్రియచరిత్రకు సంబంధించిన యుత్తమ గ్రంథముగా దీనిని గణింపఁదగును. ఆంధ్రులెల్లరు నాదరింపఁదగినది. తొమ్మిదిపుటలలో శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు వ్రాసిన పీఠిక. శ్రీవాత్సవ, పండిత పెనుమత్స సత్యనారాయణరాజు; మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి; చిలుకూరు లక్ష్మీకాంతమ్మ

మున్నగు పండితులొసంగిన సదభిప్రాయములుగూడ నిందు ముద్రితము లయినవి. కొలఁది పరిమితిలో బహువిషయము లీగ్రంథమున గ్రథిత ములగుటచే సావధానముగ సవిమర్శముగఁ జూచిననేగాని యందలి విషయములను బాగుగా నవగాహనచేసికొనుట కష్టము.

సిద్ధమైనదియనుటకు 'సిద్ధమున్నది' మున్నగు విలక్షణప్రయోగ ములందందుఁగలవు. అచ్చుతప్పు లెక్కువగా దొరలినవి. చివరను చేర్చిన సవరణలపట్టిక సమగ్రముగాఁ దోఁపదు.

2. కొగంటి దుర్గామల్లికార్జునరావు సాహిత్యసేవ సంచిక. క్రౌనుపుటలు 88+4 వెల 2-0-0; ప్రకాశకులు భారతీసమితి చిలకలూరుపేట, సంపాదకులు షేకు అలీ బి.ఏ. తెలుఁగుపండితులు యద్దనపూడి హైస్కూలు "భారతీసమితి" అను పేర శ్రీ జాస్తి వేంకటనరసయ్యగారు అధ్యక్షులుగ, శ్రీ కొగంటి దుర్గా మల్లికార్జునరావుగారు ప్రధానకార్యదర్శిగ స్థాపించిన సారస్వతసంస్థ. చాల వత్సరములనుండి కళాకారులకు; పండితులకు; కవులకు సన్మానములు గావించుటయే ప్రధానలక్ష్యముగా గుడివాడతాలూకా పామఱ్ఱు గ్రామములోఁ గావించుచున్న సేవ ఆంధ్రసోదరులకు సువిదితము. వారిరువురు రచించిన గ్రంథముల సమీక్ష ఈ పత్రికలోఁ జదివిన పాఠకులకుఁ గూడ నిది వ్యక్తమే - శ్రీ దుర్గా మల్లికార్జునరావుగారికి 1934 మార్చి 20 తో షష్టిపూర్తి యైనది. దానిని పురస్కరించుకొని ఆ తేదీని మొట్టమొదట చిలకలూరిపేటలోను; తరువాత క్రిందటి విజయదశమినాఁడు బాపట్లలో నింకొకటియు వీరి షష్టిపూర్తి సన్మాన సభలు జరిగినవి. చిలకలూరిపేటలో జరిగిన షష్టిపూర్తిసన్మాన సభాసందర్భమున వెలువడినసంచికయే యిది. సంపాదకులు షేకు అలీగారు, వేంకటనరసయ్యగారి శిష్యులు. ఆంధ్రదేశమందలి వివిధప్రాంతముల నుండి పలువురు పండితులు,కవులు,అభిమానులు శ్రీ మల్లికార్జునరావు

గారి నిస్వార్థ సారస్వత సేవనుగూర్చియు వారి ప్రయత్నములవలన జరగిన కవిపండిత కళాకారసన్మానములగూర్చియు వ్రాసిపంపిన పద్యములు, గద్యవ్యాసములు, ఈసంచికయందుఁ జేరినవి. సంఖ్యలో నవి రమారమి 41 యున్నవి. ఇందు తెలుఁగులెంక శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు "చాఁగుకే" అను శీర్షికతో వ్రాసిపంపిన పద్యములు; బండారు తమ్మయ్యగారి "ఆశీః పంచరత్నోపహారము" జాస్తి వెంకటనరసయ్యగారు 'పంచరత్నాని' అని తెలుఁగు వివరణముతో వ్రాసిన సంస్కృతశ్లోక పంచకము. ప్రథమ ద్వితీయ, తృతీయస్థానముల నాక్రమించినవి. 17–32 పుటలలో శ్రీ కృత్తివెంటి వేంకటేశ్వరరావుగారు వ్రాసిన వ్యాసము. శ్రీ మల్లికార్జునరావుగారి జీవితవిషయముల సంగ్రహముగ వ్యక్తమొనర్చుచున్నది. అది యెల్లరు నవశ్యము పఠింపఁదగినది. గుడివాడలోఁగూడ 14–2–65 తేదీని మఱియొక సన్మానసభ జరిగినదని, అందుకు సంబంధించిన మఱొక సంచిక వెలువడఁగలదని తెలియుచున్నది. శ్రీ మల్లికార్జునరావుగారి లోధిక సారస్వతసేవ, కవిపండిత సన్మానములు గావించుచు మఱొక షష్టిపూర్తి జరుపుకొనుటకు పరమేశ్వరుఁడు ప్రసాదింపఁగాత మని ప్రార్థించుచున్నాము.

8. కెన్నడీస్మృతి (ప్రథమభాగము) :- క్రౌనుపుటలు 24 వెల 0–8–0. సంపాదకులు: శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావుగారు కార్యదర్శి భారతీసమితి, పాముఱ్ఱు, కృష్ణాజిల్లా.

అమెరికా రిపబ్లికు అధ్యక్షుఁడుగా తానున్న స్వల్పకాలములో జాను కెనడీమహాశయుఁడు శాంతికాముఁగా ప్రపంచమునకుఁ గావించిన సేవయుజరామరమయి దిగంత విశ్రాంతకీర్తి నందియున్నది. భారత దేశముపట్ల శ్రీ కెనడీగారికిగల సానుభూతియు పారము అతివాదులగు హంతకులు కొందఱు గావించినహత్యకు లోనయి యీ మహాపురు

షుండకాలదుర్మరణమునొందిన వార్త: ప్రపంచమునంతటిని దుఃఖసాగరమున ముంచినది. మన ప్రధాని పండిత నెహ్రూ నిలువున నీఱయి పోయినాఁడనే దుఃఖవార్తకు. వీరి స్మృతిచిహ్నముగ భారతీయసమితి పై సంచికను ప్రథమభాగముగఁ బ్రకటించినది. భారతీయసమితి వారి కోరిక ననుసరించి "అమరజీవి కెన్నడీగీతము" జోహారు, పోరాటం, కెన్నడీ కెనడీ; అయ్యో కెన్నడీ; కెన్నడి అస్తమయం; పోయితివా! చెరిగి పోని కలత; అమరజీవి శ్రీ కెన్నడీ స్మృతి; కాలం కలం విరిగి పోయింది" అను పేర్లతో కీర్తికలతోఁ బదునార్వురు యువకవులు వ్రాసిపంపిన గేయములిందు ముద్రితములు. గేయములన్నియుఁ గరుణ రస మొలికించుచున్నవి. ఉద్వేగము; ఆవేదన; అన్నిటఁ బ్రస్ఫుటమగుచున్నవి.

మచ్చునకుఁ గొన్ని పాదములు:—

ఏనాటికీ చెరిగిపోనికలత; శాంతిప్రియుల చల్లని గుండెల్లో పెల్లుబి
కినచల్లారనిమంట
చరిత్రమొులవనిపల్లె సీమల్లో నేడు గడ్డకరశైలం కంపించింది
మనిషిలో మారుమూల కాపురంచేస్తున్న కక్కసిని
ముక్కలుచేయాలని బాకులా నిలిచింది
నీచావుతో సమసిన సమస్య లెన్ని ?
చంపిన ఆసాల్లట్లు కట్టుకొన్న దేమిటి? చేతులెత్తి పిలిచే చైతన్యం
నీవు లేవని నిట్టూర్చింది. (శ్రీ) బద్దం భాస్కర రెడ్డి రచించిన చెరిగి
పోని కలతనుండి.

శ్రీ బి. వి. నరసింహారావు B.A.B Ed. గారు వ్రాసిన తొలి
మాట సరసముగా నున్నది.

4. శ్రీ త్రిలోకేశ్వర చరిత్రము వచనము, ద్వితీయముద్రణము
పుటలు (89+6) వెల 0-8-0.

కర్త:- శ్రీ శ్రీ॥ మద్దులపల్లి గురుబ్రహ్మశర్మగారు. నరసరావుపేట. ప్రతులు దొరకు చోటు (ప్రకాశకులు: జి. వి. సూర్యరావు బి ఏ.) మేనేజరు కోటప్పకొండ దేవస్థానము, నరసరావుపేట.

విధి విరామములెఱుంగని కవనవ్యవసాయము చేయుచు కొలువులో నుండియు సహజ భాషాభిమానము వలన సారస్వత సేవ గావించిన కొందఱి యుద్యోగులలో మిత్రులు శ్రీ మద్దులపల్లి గురుబ్రహ్మశర్మగారొకరు. వీరికి చారిత్రిక పరిశోధనాసక్తి మెండు. కోటప్పకొండయను నీ త్రికోటీశ్వర క్షేత్ర చరిత్రముగాక కొండవీటి సామ్రాజ్యము, నరసారావుపేట చరిత్రము మున్నగు చారిత్రిక గ్రంథములను వ్రాసినారు. కొండవీటి చరిత్రము, శ్రీ కృష్ణవేణీమాహాత్మ్యము అను పద్యకావ్యములు, మఱికొన్ని నాటకములు, హరికథలు కూడ వీరు రచించిరి. కీ. శే. జయంతి రామయ్యపంతులు గారికి కూడ శాసనాదిక సామగ్రి సేకరణమునందు వీరు సాయపడుచుండెడివారు. వీరు నరసారావుపేట తాలూకా హెడ్డుగుమాస్తాగా చాలకాలము పనిచేసి రిటైరయినారు. ఈ గ్రంథము పదునొకండు ప్రకరణములుగా విభక్తమయినది. దక్షయజ్ఞమున సతీదేవి యోగాగ్నిచే దగ్ధమయి, మరల హిమవంతునింట పార్వతియై తపమొనర్చి శివుని యర్ధాంగి గాకపూర్వము మధ్యకాలములో శివుడు బ్రహ్మచర్యము నవలంబించి దక్షిణామూర్త్యవతారమున దపమొనరించుచు మునులకు నుపదేశమొనర్చి తరింపజేసిన పరమ పవిత్రక్షేత్రము. త్రికోటీశ్వరము (నేటి కోటప్పకొండ) అని స్థలపురాణము. ఇది నరసారావుపేటకు దక్షిణమున నాలుమైళ్ళ దూరమున, ఎల్లమంద, కొండకావూరు అను గ్రామముల మధ్యనున్నది. ఈ కొండశిఖరమునందు మూడు కూటములుండుటచే దానికి త్రికూటాచలమను వ్యవహార మేర్పడినది. ఈ కొండ పయిభాగమున ప్రాత కోటీశ్వరాలయము, దానికి మఱికొంత దిగువను నూతన కోటీశ్వరాల

యము, దాని దెంతనే ఆనందవల్లి (యను భక్తురాలు) గొల్లభామ గుడియుఁ గలవు. ఇది బ్రహ్మచారియగు దక్షిణామూర్తి క్షేత్రమగుటచేఁ కల్యాణోత్సవమును ధ్వజస్తంభము నిచటనుండవు. శివుఁడు కోరేసాలంకయ్య యనుపేరనై పునకు గొల్లభామకుఁ శివైక్యమును ప్రసాదించిన క్షేత్రమిది. స్థలపురాణములు, గాథలు, శాసనములు, సత్తెనపల్లి తాలూకా కోసూరువాస్తవ్యులు శ్రీ కొప్పరాజు నరసింహకవిగారు రచించిన శ్రీ త్రికూటాచల మాహాత్మ్యముఅను మూఁడాశ్వాసముల పద్యకావ్యము మున్నగువానిని పరిశీలించి శ్రీ గురుబ్రహ్మశర్మగారీ చరిత్రగ్రంథమును గూర్చిరి. మహాశివరాత్రి కిచ్చట గొప్ప తీర్థము జరుగును. కోటప్పకొండతీర్థమునకుఁ గోటి ప్రభలు (చిన్నవి పెద్దవి) వచ్చుననుట సుప్రసిద్ధి. లక్షలకొలఁది ప్రజలిచ్చటమూఁగి, పాపవినాశన నామకతీర్థమునఁ గ్రుంకులిడి కోటీశ్వరస్వామిని సేవించి తరింతురు. ఈ క్షేత్రమునకు సంబంధించిన పెక్కువిషయములకీగ్రంథము కరతలామలకమువంటిది. శివరాత్రికి విచ్చేయు వివిధవర్ణముల భక్తుల వసతులకయి ఆయావర్ణస్థులు వెలయించిన మందిరములు, ధర్మసంస్థలయొక్క వివరములుగూడ నిందున్నవి. అందఱును పఠింపఁదగినకృతి. కృతికర్త, క్షేత్ర ధర్మకర్త, శ్రీమల్రాజా వేంకట నరసింహారావు బహద్దరు జమీందారు గారలయొక్క, ఈ క్షేత్రమందలి తొమ్మిది ప్రధాన దృశ్యములయొక్కయుఁ జిత్రపటములిందుఁ జేరినవి.

5. మహేశశతకము:- డెమి. పుటలు 28 వెల 0-60 (108 సీసపద్యములు). కర్త :- డాక్టరు మానేపల్లి కుమారస్వామిగారు. ఆయుర్వేదవైద్యులు, నరసాపురము, పశ్చిమ గోదావరిజిల్లా.

కృతికర్త మొదటినివాసస్థలము పశ్చిమగోదావరిజిల్లాలోని క్షీరారామము (నేఁటి పాలకొల్లు) అనుటచేఁగాఁబోలు నచ్చట వెలసిన రామలింగేశ్వరస్వామి కంకితముగా "శ్రితజనోల్లాస. క్షీరపురీశ"

నివాస రామలింగేశను జనని(గహామహేశ" అను మకుటముతో నీ శతకమును రచించిరి. వీరు రజకసంఘమునకుఁ జెందినవారని తెలియు చున్నది. వంశ పారంపర్యముగ వీరిపెద్దలు. శివపూజాపరాయణులు- వీరు నిర్వ్యాజమైన శివభక్తిపరులు. జంగమవర్తనుఁడు, వీర శైవమతోద్ధారకుఁడగు బసవేశ్వరుని భక్తిస్వర్ణభాండారమునకు నికషోపలమువంటివాఁడు నని ప్రసిద్ధిపడసిన నిష్ఠురవాదియగు మడివాలు మాచయ్య యంశ వీరియందును గొంత గోచరించును. నిజమైన భక్తునకు భగవంతునియెడ భక్తితోపాటు. భయసంకోచరహిత మయిన చనువుకూడనుండును. అందుచేతనే పౌరాణికగాథలను బట్టి తెలియులోపములను దోషములను బురస్కరించికొని భట్టించి నిందాస్తుతులు గావించుట వీరి పద్యములలోఁ గానవచ్చుచుండును. వరాహ నరసింహశతకకర్త గోకులపాటి కూర్మనాథకవి, ఆంధ్రనాయక శతకకర్త కాసుల పురుషోత్తమకవి యీకోవకుఁ జెందినవారు. శ్రీ కుమారస్వామిగారు కూడ నట్టివారిగనే కనుపట్టును. మచ్చున కీక్రింది పద్యములు చూడుఁడు.

సీ॥ నాకు నీ నడవడి నచ్చకయున్నది
యీ గొప్పదనము నీ కెట్లువచ్చె
ప్రీతిసోమవారను వ్రత నియతిం దిర్గ
సీమంతినికిని నిచ్చితివి ధవుని
సిగ్గొంచ నిలబెట్టి సిల్గిన మదనుని
రతికి నతనుఁ జేసి యతుకఁదగునె
దక్షునిఁదలఁగొట్టి తగగొఱ్ఱెతలఁ బెట్టి
వేదవతికినిచ్చు వేసమేల
యిట్టివ్యత్యాసములు సేయ నేమికలదు
ఈ తుణాన సమాధాన మిచ్చికదలు (ప 45)

సీ. అల జగన్మోహిని నరపి కౌఁగిటఁబట్టి
 పదిమందిలో సిగ్గు పడఁగనేల
దారుకావన కాంతల రమించియు వారి
 పతులతో వైరంబు పడయనేల
కాశిలో శౌండిక కాంతతోఁ గ్రీడించి
 తద్భర్తకడలుచు దాఁగనేల
వేలాపురంబున బాలరిముదితను
దివిరి చీవాట్లను దినఁగనేల
తిరిగియుమతోడ కయ్యంబు నెఱపనేల
తిన్నగా నుండలేక యింగా తిక్కలేల. (వ 46)

సీ. చెప్పనేటికి నీవు సేయుటబద్ధమా
 బాపనదాసితోఁ గాఁపురంబు
పట్టిదానిని నెత్తిపైఁ బెట్టుకొంటివి
 కల్లగాదిది జగమెల్ల నెఱుఁగు
నీతిగ దానితో నేకాంతమాడవే
 యెవ్వరెఱుంగని దీవిసయమున
అనుమానమునుపది యముపుత్రి ముందునే
కొండదిగ్గాని నీకూర్మిరాణి
యురయ సమశక్తి స్వభావము పందునీకు
వర్తనముపాటి యాఁగదా వసుధలోన.

ఇట్లు లీ శతకమంతయు, నిందాస్తుతులలో కూర్పఁబడినదని తెలంపవలదు. భక్తిభరితములు, లోకనీతి బోధకములు నగు పద్యము లెన్నియోని నింపఁగలవు. చెప్పినపాదముతోనే మరలమరల తక్కిన పాదములనుగూడ రచించుట యిందుఁ దఱచుగాఁ గానఁగును. అది

కేవలము పునరుక్తిగాక విషయమును నొక్కి నొక్కి చెప్పుటకే యని యూహింపఁదగును. కొన్ని యుదాహరణములు.

సీ॥ స్త్రీయంత్రముగఁగాదె సృష్టిసర్వము చిత్రి
ముగఁ గల్గుచుండె నద్భుతముఁ జెంద
స్త్రీయంత్రముగఁగాదె సృష్టిసర్వమ్ముచు
శోషింపఁ బడెడి సమ్మోదముఁ బొంద (ప 53)
చెదరనీయక నాదు చిత్తంబు హత్తించి
నీవిగాద నించుక నిలుకడఁజాల
చెదరనీయక నాదు చిత్తంబు హత్తించి
నీవిగాద నిసుమంత నిలుకడఁజాల (ప 61)

శైలియందు ధారాళత జగి బిగి గలవు. పద్యములు గురుస్తుతి, భగవద్భక్తి, మతభక్తి లోకజ్ఞత అను శీర్షికల క్రింద విభక్తమయినవి. అందందు కొన్ని దోషములు కానవగును కొన్ని దృష్టాంతములు.

భవదీయ యంఘ్రిల పాత్రిపుగల్గిన నాకు భయము కలద (ప 54)
ఇటవిసంధి తగదు:-
తిన్నగా యుండలేక (ప 42) తలఁపు వచ్చినప్పుడు (ప 96)
మరితములఁడి యమ్మనకు యత్నాగము చేయఁదగదు

విషయలోలము (ప 57) స్త్రీ స్వతంత్రము చెల్లదప్పుడు; విశేష్య విశేషణ విభేదము పాటింపఁబడలేదు! లోలత లేక లౌల్యము, స్వతంత్రత లేక స్వాతంత్ర్యము" అని యుండఁదగును.

బ్రతిమాలు (ప 48) బతిమాలు అనునది శిష్టరూపము. అర్ధానుస్వారశకటరేఫములు సరిగా పాటింపఁబడలేదు. అచ్చుతప్పులు ఎక్కువగఁ దొరలినవి. కవితోద్ధార కవితాసంపద నాకాంక్షింతుము.

(6) మా అమ్మ (పార్వతీ ప్రీతి వృత్త పద్యశతకము) డెమ్మీ పుటలు 24+24 వెల 0-12-0 కర్త శ్రీ కత్తాలిమూర్తి కవిగారు

(7) పద్యముకుందమాల :- క్రౌను పుటలు 33 వెల 0-8-0 కర్త వీరే

(8) శ్రీరామ నీలాశతకము :— క్రౌను పుటలు 36 వెల తెలియదు

కర్త శ్రీ వాకపల్లి సూర్యనారాయణ నాయుడుగారు, టిటాఘురు ప్రకాశకులు :— ఆంధ్రసాహితీ పరిచారసభ కల్వీర్ లేను 1-4 శాల్యపూరు పోస్టు 24 పరగణాల జిల్లా పశ్చిమబెంగాలు.

(6) జగజ్జననియగు పార్వతిని గూర్చి "మా యమ్మ" యను నామాంతరముతో గూర్చిన శతకమిది. పార్వతి నను మకుటముతో నిది. రచింపబడుటచే, ఉత్పల చంపక, మత్తేభ, శార్దూలములే గాక మఱికొన్ని యితర వృత్తములు గూడ నీ రచనమునందు జేయుటకు అవకాశము కలిగినది. కర్త శ్రీమూర్తి కవిగారు శ్రీకాకుళము జిల్లా పరిసన్న పేట వాస్తవ్యులు, దేవాంగకులజులు శివభక్తులు వీరి 'లింగసన్నాంధిమశతకము'' వింతకుమున్నే పత్రికలలో సమీక్షింపబడినది. వీరి కవిత ధారాళమై, విస్పష్టమై, శబ్దాలంకార శోభితమై భక్తి బంధురమై పూర్వ పరిబంధకవుల పోకడలు గలిగి యుండిన కవి హృదయంగమముగ విలసిల్లు చుండును పరిస్థితము ఏను కలకత్తా ప్రాంతమున జీవితముగడుపుచున్నందున ఆ ప్రాంతమందలి మాంధ్రకవులను, నేతృవులను పోషించుట కేర్పడిన "ఆంధ్రసాహితీ పరిచారసంఘము" అను పారస్వత సంస్థ దీనిని ప్రకటించి లోకోపకార మొనర్చి యున్నది. ఆ సంస్థను విద్వత్కవులు శ్రీ విశ్వనాథకవిగారధ్యక్షులు. వారి సమున్యమునకు మా జోహారులు ఈ శతకమును ఫలశ్రుతితో

గలిపి 109 పద్యములున్నవి. కవిగారి కవితాగురులు శ్రీ విద్వాన్ గజ్జె సాంబమూర్తిశాస్త్రి, వేంకట సుబ్బారావు, దీపాల పిచ్చయ్యశాస్త్రి, బాడాల రామయ్యయ్య, నోరి నరసింహశాస్త్రి మున్నగు పండితులొసంగిన సదభిప్రాయములు, శ్రీ విశ్వనాథకవిగారు రచించిన సిందూర లేఖ, "ప్రీతిశాస్త్ర" యను పేరితోఁ గావించిన సమీక్ష యాకృతిక మాల్యాలంకారములుగనున్నవి.

మచ్చునకుఁ గొన్ని పద్యములు

సీ. మానవులు పెట్టిపెట్టి, కమలము చెక్కుగీలల పుట్టిపుట్టి మ
గానుభవ మెట్టిమెట్టి, బడికుట్టాటలను కట్టికట్టి తోలా
దనములు కొట్టికొట్టి, బడదారులయుముల మొట్టిమొట్టినిన్
దమపడగనారు శక్యమగునా! మతిచేతనగాక పార్వతీ! (ప 12)

శా॥ దుర్గా పూర్వసుపర్వ గర్వహరణోద్యోగైక సంసర్గ, భూ
వర్గ ప్రోద్ధరణ ప్రియాళి కరసైసర్గా, ప్రదత్తాతిథి
న్యార్గస్థాపక యాజ్ఞవల్క్య భృగుశాండిల్య వ్యాసరైభ్యాంగిరో
గర్గాత్రి ప్రముఖాపవర్గ సహాభర్గా! కావుమా! పార్వతీ (ప 29)

ఉత్సాహము భూమిపార వికర దైత్య బాహుశేఖ రక్తినీ
వాహినీకృతదిశ పీఠ ద్రవ్య రక్తిన్, మహోగ్రవి
ద్రోహి వాహినీ సమూహ దుర్మద ప్రణాశనో
త్సాహ వృత్తమును గుతంబు నీకుఁ బార్వతీ (ప 58)

(7) శ్రీరంగ క్షేత్రపాలకుఁడు కులశేఖర మహారాజు సంస్కృతమున రచించిన "ముకుందమాల" భక్తిస్తోత్రములలోఁ బ్రశస్తస్థానము వహించియుండుట సుప్రసిద్ధము. దీని కాంధ్రమున పాదములు విష్ణుభక్తులు రచించినవి యింతకు మున్నే కొన్ని యున్నవి. ముకుంద ప్రియుండగు శివుని భజించు భక్తులు రచించిరని యాదేయని చెప్పవచ్చును. శివ భక్తిశ్రేష్ఠులగు శ్రీ త్రిపురారి కవిగారాచిత్యమును గుర్తించి యీ కృతిరచనము గావించుట మా భాగ్యము సహృదయ సుందరమగు వీరి కవిత గూడ యీపాదమునందును సౌష్ఠవముతో విలసిల్లుచున్నది. మచ్చునకు రెండు మూలశ్లోకములు తదనువాదములు

దివివాభువివామమాస్తువాసో నరకేవానరకాన్తక ప్రకామమ్
అవధీరిత శారదారవిన్దౌ చరణౌ తే మరణేపి చిన్తయామి

చ. నరకవిరోధి! నాయునికి నాకవసుంధర యందొ లేక శ్రీ
కర నరకంబునందొ యగుఁగాక వసంత కుఁ జింత లేదు నీ
శరదరవింద సాదృశిల పద్మరజ ద్వయముఁ జింతనంబునా
మరణపువేళ యందును నగాధన ! యొప్పిన నుబ్బుకున్ మదిన్ (ప3)

"ఇదం శరీరం పరిణామ పేశలం పతత్యవశ్యం శ్లథసంధిజర్జరమ్
కిమౌషధైః క్లిశ్యసి మూఢదుర్మతే !
నిరామయం కృష్ణరసాయనం పిబ

ఉ. బాహువులూడి లేదు; ముదిమాయముచే చెలపంద్దు; సంధిబం
ధోహములూరి బాధపడు; దుర్బలమైన శరీరమట్టి యీ
దేహము మూర్ఖ! మందులచె దీటికి మాటికిఁ గష్టమందెదు
శ్రీహరినామతోడ వైష్ణవరసాయనమాను మనామయార్థివై (ప81)

(3) "శ్రీమదనసాంద్ర శ్రీరఘురామచంద్ర" అను మకుటముతో మనోహరమగు తేటగీతులతో రచింపఁబడినది యీ శతకము. విశ్వనాథకవిగారు కృతికర్త నాశీర్వదించుచుఁ గావించిన యామోదము, కవిగారు వివిధ పద్యములలోఁ గావించిన దేవతాస్తుతులు మున్ముందుఁ గలవు. శైలి సరళముగ ధారాళముగ సాగినది, మచ్చునకు మూఁడు పద్యములు

(1) త్రాహి యనఁగ వచ్చెదనని తలఁచి తలఁచి
నాటలేని నా పాలిటి మేటిదొరవు నీవని కలవరించితి నేనుమిగుల

(2) శబరి యెంగిలి భుజియించి సంతసిల్లి । మాతృసామ్రాజ్య
మొసఁగనార్పి రక్షణంబు నీయఁగ రత్నమగుపని యెంచి తీర (ప 10)

(3) పాడుతలఁపుల వేళలో వచ్చుచుండు । నిన్ను ధ్యానించునట్టి
మనోనియతిఁ జెడఁగ సిగ్గింప నాకొసఁగు నేకాగ్రబుద్ధి (ప 89)

— • —

(9) A Descriptive Catalogue of the Telugu Manuscripts in the Andhra Historical Research Society Rajahmundry.

ఆంధ్రచారిత్రకమండలి వారు సేకరించిన మూఁడువందల తాళపత్ర గ్రంథవివరము లిందు క్రోడీకరింపఁబడినవి. కీర్తిశేషులు చిలుకూరి నారాయణరావుగారు, గిడుగు రామమూర్తి పంతులుగారు సంపాదించిన వ్రాఁతప్రతులు, వారు మండలి వారికిచ్చిన తర్వాత నవి జాగ్రత్తతో భద్రపరుపఁబడి, వానివాని వివరములు భారత ప్రభుత్వమువారి ధనసహాయముతో నీగ్రంథములో ముద్రింపఁబడినవి. వీనిలో పెక్కుగ్రంథము లిదివఱకే ముద్రితములైనవి. అముద్రితములైన వ్రాత ప్రతులు గ్రంథవివరణ పట్టికలో సూచింపఁబడినచోఁ బరిశోధకుల కెక్కువ నుపయోగముగానుండి యుండును. ఎన్ని తాళపత్రములు దొరికినవని గ్రంథసంకలన సంపాదకులు వ్రాసి, వానినన్నిటిని రెండవముద్రణమునందు వివరించుకొందుమని సెలవిచ్చియున్నారు. ఈ ప్రచురణము మండలి వారివద్ద నున్న వివిధగ్రంథముల వ్రాతప్రతుల యునికి తెలిసికొన భాషాపరిశోధకులకు సహకారి కాఁగలదు. తెలుఁగుప్రబంధములు పురాణములు ఎక్కువగానున్నవి. వీనితోనున్న శివయోగసారము సంస్కరించి, వీనిని మాత్రము ప్రత్యేకముగ ప్రకటించినచో నాంధ్రభాషకు మహోపకారము కాఁగలదు.

ఇట్టి సంకలనముగానించి, గ్రంథమును ప్రకటించిన మండలి వారును, సంపాదకులగు శ్రీ సుబ్బారావుగారును ప్రశంసనీయులు.

ఈశ్వరదత్తు.

వ్యాఖ్యానమ్ :—

అత్ర నృత్యంతి నిత్య మిత్యనేన వర్షాకాలం వినాపి సార్వకాలం సేంద్రచాపజలదభ్రాంతి రితి భ్రాంతిమదలంకారో వ్యజ్యతే.

పదగతం స్వతస్సిద్ధార్థశక్తిమూలకవస్తునాలంకారధ్వని ముదాహరతి. భూపాలై రితి. శ్రీసూర్యరాయాధిపం దిదృక్షుభి ర్ద్రష్టుమిచ్ఛుభిః బహుభి ర్భూపాలై స్సమం. "సాకం సత్రా సమం సహే" త్యమరః. సమాయాతాః పురాంతికే సంఘీభూయ స్థితా ఇతి శేషః. ధాతురసై ర్గైరికాదిరాగద్రవ్యైః. "ధాతవో గైరికాదయః" ఇతి కోశాత్. అభిరంజితతనూన్ మదేభవ్రజాన్ దృష్ట్వా వనే తత్సమీపవనే భ్రాంతన్మేచకసంకులా అంచితచంద్రకసంకులాః లక్షణయా బర్హసంకులా ఇత్యర్థః. "మేచకశ్చంద్రకే ధ్వాంత" ఇతి రత్నమాలాయాం. ఘనిభుజో మయూరాః. కేకాభినీతాంతరా స్సంతః నిత్యం నృత్యంతి రోచయతి. అత్రేతి. ధాతురసాభిరంజితమదగజదర్శనరూపవస్తునా తేషు సేంద్రచాపజలదభ్రాంతి రవగమ్యత ఇతి బోధ్యమ్.

వాక్యగత స్స యథా

శ్లో. సూర్యరాయేంద్ర ! తే సౌమ్య
వంశే చాపల తోదితా
సేయం న సహతే రాజ
మండల స్యోన్నతస్థితిమ్.

వ్యాఖ్యానమ్ :—

అత్ర విరోధాభాసో వ్యజ్యతే. వాక్యగతం స్వతస్సిద్ధార్థశక్తిమూలకవస్తునాలంకారధ్వని ముదాహరతి. సూర్యరాయేంద్రేతి. హే సూర్యరాయేంద్ర! తే తవ చాపలతా ధనుర్లతా సౌమ్యవంశే సోమదేవతాకవేణుకుంజే సాధువంశేఽపిచేతి. ఉదితా జాతా సేయం

రాజమండలస్య రాజసమూహస్య సోమమండలస్య చ ఉన్నతస్థితి మౌన్నత్యం న సహతే. సౌమ్యవంశజాతస్య చంద్రమండలౌన్నత్యా సహనం విరుద్ధం. వైరిరాజమండలోత్కర్ష మసహత ఇతి పరిహారః. కౌమారజయతి. అత్రేతి. రాజమండలమహౌన్నత్యాసహనరూపవస్తునా విరోధాభాసో వ్యజ్యతే.

పదగత స్వతస్సిద్ధార్థశక్తిమూలకాలంకారే ణాలంకారధ్వని ర్యథా స్రగ్ధరావృత్తమ్:—

స్నిగ్ధా ముత్సృష్టశోభా మధిసరల మమిత్రావలోకప్రసంగా
ద్దీప్తిప్రాగ్భారశుంభద్ధరిమణివిలసత్సప్తకీభూషితాంగీ
ముద్దామోద్యన్నితంబాం చరమగిరిశిలాచక్రపాశ్చాత్యసీమా
ముల్లాస్యాలీవరక్తో విలసతి తరుణ స్సూర్యరాయప్రతాపః.

వ్యాఖ్యానమ్ :—

అత్ర సమాసోక్త్యలంకారేణ స్నిగ్ధోద్యన్నితంబారక్తతరుణ పదై రుభయానురూప్యప్రతీతే స్సమాలంకారో వ్యజ్యతే.

పదగతం స్వతస్సిద్ధార్థశక్తిమూలాలంకారే ణాలంకారధ్వని ముదాహరతి. స్నిగ్ధా మితి. తరుణోఽభినవో యువా చ. "తరుణోఽభినవే యూనేతి" విశ్వః. సూర్యరాయప్రతాపః స్నిగ్ధాం సాంద్రాం మసృణాం చ "త్రిషు స్నిగ్ధం తు మసృణే సాంద్రే క్లీబం తు తేజసీతి" శబ్దార్ణవే. అధిసరళం సరళవనమధ్యే అమిత్రావలోకప్రసంగాత్ సూర్య లోకప్రసంగాభావాత్ అప్రియావలోకనగోష్ఠేశ్చ ఉత్సృష్టశోభాం త్యక్తప్రకాశాం విసృష్టశృంగారచేష్టాం చ దీప్తిప్రాగ్భారేణ కాంత్యతిశయేన శుంభద్భిః హరిమణిభి రింద్రనీలై ర్విలసంత్యా సప్తక్యా సప్తకీభూతయా భువా ఉషితాని సహితాని అంగా న్యవయవా యస్యాం తాం ఇంద్రనీలమణిమయకాంచీభూషితాంగీం చ. "సప్తకీ

మేఖలా కాంచీ" త్యమరః. ఉద్దామోద్యన్నితంబాం "నితంబ స్త్రీకట్యాః పశ్చాత్ప్రపేఠ్యాద్రికటకే కటౌ" ఇత్యుభయత్రాపి రత్నమాలా. చరమగిరే రస్తాద్రేః పాశ్చాత్యసీమాం అతీవోల్లాస్య రక్తోఽమ్బరోత్తరుణ శ్చ విలసతి. యోజయతి అత్రేతి. అత్ర ప్రస్తుతచరమగిరిపాశ్చాత్యసీమావర్ణనేన అప్రస్తుతకామినీవృత్తాంతప్రతీతిమూలకసమాసోక్తేః తరుణాదీనా ముభయానురూప్యప్రతీతే స్సమాలంకారో వ్యజ్యతే.

వాక్యగత స్స యథా

శ్లో. శ్రీసూర్యరాయవసుధాపతి రేవ నిత్యమ్
భూనాయకేషు సకలైః కవిభి ర్నిషేవ్యః
కల్పద్రు రేవ నిఖిలే ష్వపి పాదపేషు
దేవై రభీక్ష్ణ మఖిలై రభిపాదనీయః.

వ్యాఖ్యానమ్ :—

అత్ర ప్రతివస్తూపమాలంకారే ణోపమాలంకారధ్వనిః. వాక్యగతస్వతస్సిద్ధార్థశక్తిమూలకాలంకారే ణాలంకారధ్వని ముదాహరతి. శ్రీసూర్యరాయేతి యోజయతి. అత్రేతి. అత్ర ఏకస్యైవ నిషేవ్యత్వస్య ఉపమానోపమేయగతత్వేన నిషేవ్యాభిపాదనీయపదద్వయే నోపాదానోపాదానా త్ప్రతివస్తూపమాయా స్సురాణాం కవీనాం చ వేంకటమహీపతిసూర్యరాయమహారాజకల్పద్రుమయో శ్చౌపమ్య ధ్వని రిత్యవగంతవ్యమ్.

పదగతస్వతస్సిద్ధార్థశక్తిమూలకాలంకారేణ వస్తుధ్వని ర్యథా

శ్లో. శ్రీసూర్యరాయేంద్రజయధ్వజాగ్ర
భాగస్థగేంద్రం ద్రుతభీమాత్రమేవ
రాజ్ఞాం రిపూణాం బహుధా భవంతి
ప్రస్ఫీతనిశ్వాససమీరణౌఘాః.

వ్యాఖ్యానమ్ :—

అత్ర ఖగేంద్రధ్వజశ్రవణమాత్రేణ రిపునృపదైన్యపిసునవిశ్వాససపరంపరావిర్భావకథనా దత్యంతాతిశయోక్తి రలంకారః. తేన శ్రుతిమాత్ర ఏవేతి సాక్షాద్దర్శనం చేత్కథం భవతి వా. న జ్ఞాయత ఇతి వస్తు వ్యజ్యతే.

పదగతస్వతస్సిద్ధార్థశక్తిమూలకాలంకారేణ వస్తుధ్వని ముదాహరతి. శ్రీసూర్యరాయేంద్రేతి. శ్రీసూర్యరాయేంద్రస్య జయధ్వజాగ్రే జాగ్రతః ఖగేంద్రస్య గరుత్మతః యోజయతి అత్రేతి.

వాక్యగత స్స యథా

శ్లో. శ్రీసూర్యరాయేంద్రకృపాణధారా
కళిందకన్యేవ కఠోరవేగా
పరం తు మాద్యద్బలభద్రబాహోః
విజృంభవృత్తే రసహిష్ణు రాస్తే.

వ్యాఖ్యానమ్ :—

అత్ర వ్యతిరేకాలంకారేణ సూర్యరాయసార్వభౌమకరవాలధారాయా యమునాపేక్షయా సముత్కర్షో వ్యజ్యతే.

వాక్యగత ముదాహరతి. శ్రీసూర్యరాయేంద్రేతి. కఠోరవేగా తీవ్రవేగా గంభీరప్రవాహా చ "వేగః ప్రవాహ కింపాకజవా" ఇతి రత్నమాలా. పరం తు విశేష స్తు మాద్యద్బలభద్రాయా బాహోః భుజాయా విజృంభవృత్తేర్విజృంభణస్య అసహిష్ణు రస్యత్ర మాద్యద్బలభద్రస్య బలరామస్య యోజయతి. అత్రేతి.

కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలాః ప్రాగుక్తరీత్యా
చతుర్విధాః; తేషాం పదవాక్యగతత్వేన ద్వైవిధ్యేఽష్టవిధాః

అథ కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలాన్ విభజతే. కవీతి. ప్రాగు

క్త్రీత్యా వస్త్వలంకారభావేన పున స్తా న్విభజతే తేషా మితి.

తత్ర పదగతకవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలకవస్తుధ్వని ర్యథా

శ్లో. స్వాంకం సమారోప్య యయా చిరాయ
సంరక్షితా స్సర్వలతా శ్చ తాసు
శ్రీసూర్యరాయేంద్రభుజాలతైకా
తా మేవ ధాత్రీ ముచితం బిభర్తి.

వ్యాఖ్యానమ్ .—

అత్ర నిర్విశేషరక్షితా స్వపి ప్రజాసు మహాపురుషాశ్రయిణ్యా ఏవ పున స్స్వరక్షకధాత్రీభరణం యుక్త మితి వస్తు ఉచిత మితి పదే నావగమ్యతే.

పదగత ముదాహరతి. స్వాంక మితి. సర్వలతాః యయా ధాత్ర్యా స్వాంకం నిజప్రదేశం చిరాయ సమారోప్య సంరక్షితాః. తాసు లతాసు మధ్యే శ్రీసూర్యరాయేంద్రభుజాలతా ఏకైవ తాం స్వపోషకధాత్రీం భువ ముపమాతరం చ "ధాత్రీ స్యా దుపమాతాపి క్షితి రప్యామలక్యపి" త్యమరః. బిభర్తి ఉచిత మేవ యోజయతి అత్రేతి,

వాక్యగత స్స యథా

శ్లో. ప్రగల్భరిష్టిస్తుతముష్టిబంధో
ధనుర్ధరేచ్ఛానుగుణప్రకోష్ఠః
కఠోరవక్షోజసఖిభి రర్థ్యమ్
వక్షో వహన్ భ్రాజతి సూర్యరాయః.

వ్యాఖ్యానమ్ :—

అత్ర ముష్టిబంధప్రకోష్ఠవక్షస్స్థలే వ్వతిస్థైర్యం వస్తు వ్యజ్యతే. వాక్యగత ముదాహరతి. ప్రగల్భేతి. ప్రగల్భరిష్టినా ప్రౌఢాసినా స్తుతో

ముష్టిబంధ స్సంగ్రాహో యస్య సః. "ముష్టిబంధ స్తు సంగ్రాహ" ఇత్యమరః. ధనుషః ధరాధరణం తత్రేచ్ఛా యా అనుగుణః ఉచితః ప్రకోష్ఠః కూర్పరాధః ప్రదేశో యస్య సః. "స్యాత్కఫోణి స్తు కూర్పరః అస్యోపరి ప్రగండ స్స్యాత్ప్రకోష్ఠ స్తస్య చాప్యధ" ఇత్యమరః కఠోరా కఠినా వక్షోజా స్తనా యాసాం తాభి స్సఖీభిః ప్రియాభి రర్థ్యం ప్రార్థనీయం యద్వా కఠినాభిః ప్రౌఢాభి ర్వక్షోజసఖీభిః రాజకాంతాభిః నను "బాహూ రాజన్యః కృత" ఇతి శ్రుతే రాజ్ఞాం బ్రహ్మణో బాహుజత్వా త్కథం తేషాం వక్షోజత్వ మితిచే దుచ్యతే. "బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రాశ్చ ద్విజసత్తమ! పాదోరువక్షస్థలతో ముఖత శ్చ సముద్గతా" ఇతి పాదోరువక్షస్థలతో ముఖత శ్చేతి బ్రాహ్మణాదీనాం ప్రాతిలోమ్యేన సంబంధ ఇతి విష్ణుపురాణే ప్రథమాంశే షష్ఠాధ్యాయే. రాజ్ఞాం వక్షఃప్రభవత్వ ముక్త మితి వక్షో వక్షస్థలం వహ న్భ్రాజతి. శోభయతి అత్రేతి. ముష్టిబంధాదీనాం స్థైర్యం చ "వక్ష శ్చ మణిబంధ శ్చ ముష్టి శ్చ నృపతే స్థిరా" ఇత్యుక్తత్వాత్.

పదగతః కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలక వస్తు నాలంకారధ్వని ర్యథా

శ్లో. దృష్టుం వేంకటసూర్యరాయవిభు ముగ్రావేశయా విస్మృతా
ధర్తుం హార మహోగ్రకే పథిచరం త్యాత్మాన మాలోక్య చ
కన్యా శ్చ ద్ధసితాంచదుజ్జ్వలదృశో హాసప్రభాభాసిత
ప్రోత్తుంగస్తనయుగ్మదత్తనయనా కాచి ద్ధృతం నందతి.

వ్యాఖ్యానమ్ :—

అత్ర దృతం నందతి త్యనేన కన్యాశ్చ త్సమీపగతాయాః ప్రౌఢాయా శోభితః ప్రహసితరుచా యత్నంచిన్నైవ నిజోత్తుంగ

వక్షోజమండలధార్యముక్తావళిలాభప్రతీతేః ప్రహర్షణాలంకారో వ్యజ్యతే. ఉదాహరతి ద్రష్టు మితి. ఉగ్రా వేశయా గాఢోత్కంఠయా యోజయతి అత్రేతి.

వాక్యగత స్స యథా

శ్లో. కైరవే ష్వివ సితాంబుజే ష్వహో
సూర్యరాయవిభుకీర్తికాంతయః
సంప్రసార్య కుతుకా త్పదా సుధా
వారిరాశి మభితో ఽభిజాగ్రతి.

వ్యాఖ్యానమ్ :—

అత్ర మీలనాలంకారో వ్యజ్యతే వాక్యగత ముదాహరతి కైరవే ష్వితి. కైరవేషు కుముదే ష్వివ "సితే కుముదకైరవే" ఇత్య మరః. సితాంబుజేషు పుండరీకేషు "పుండరీకం సితాంభోజ" మిత్య మరః. సుధావారిరాశి మభితః; అభితః పరిత ఇత్యాదినా ద్వితీయా యోజయతి అత్రేతి. కీర్తీనాం జగద్వ్యాపనరూపవస్తునా ఉత్కృష్ట కీర్తికాంత్యా నికృష్టకైరవాదినిగూహనా న్మీలనాలంకారో వ్యజ్యత ఇతి.

పదగతకవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తిమూలాలంకారే ణాలంకారధ్వని ర్యథా

శ్లో. కీర్తిం వేంకటసూర్యరాయనృపతే! వ్యాప్తాం మహీం సర్వతః
జానానాలలనా స్త్రిలోకమభిత స్స్వర్వాహినీం వాహినీమ్
సంక్షీభూయ కటిస్థలిప్రవిలసత్కుంభం హి ముగ్ధాః పరమ్
నీవీరుద్ధపటాంచలం ప్రముదితా శ్శీఘ్రం వలంతేఽధికమ్.

వ్యాఖ్యానమ్ :—

అత్ర జానానా ఇతి పదేన భ్రాంతిమదలంకారేణ కీర్తిమందాకిన్యో రౌపమ్యధ్వనిః.

ఉదాహరతి కీర్తి మితి. హే సూర్యరాయనృప! మహీం
సర్వతః వ్యాప్తాం తే తవ కీర్తిం త్ర్యవయవో లోక స్త్రిలోకః. శాక
పార్థివాదిత్వా న్మధ్యమపదలోపీ సమాసః. లోకత్రయసముదా
యో౽త్ర త్రిలోకపదేన వివక్షితః. అన్యథా తద్ధితార్థేత్యాదినా
సమాహారసమాసే అకారాంతోత్తరపదత్వేన స్త్రీత్వే ద్విగో
రితీకారే త్రిలోకీతి స్యాత్. అత ఏవ ద్విగో ర్లు గనపత్య ఇత్యత్ర
త్ర్యవయవా విద్యా తా మధీతే వేత్తి వా త్రైవిద్యః. న తు తిస్రో
విద్యా అధీత ఇతి. అత్ర ప్రత్యయనిమిత్త స్తద్ధితార్థేత్యాదినా సమాసః.
అత ఏవ అణ్ప్రత్యయస్య లుగభావ ఇత్యాహ భగవాన్ భాష్యకారః.
తా మభితః "అభితః పరితః" ఇత్యాదినా ద్వితీయా. స్వర్వాహినీం
మందాకినీం వాహినీం నదీం జానానా అత ఏవ ముగ్ధా లలనా
స్సంఘీభూయ కటిస్థలీషు విలసంతః కుంభా భాండా యస్మిన్ కర్మణి
యద్యథా భవతి తథా. పర మత్యంతం నీవీబద్ధః పటాంచలో యస్మి
న్కర్మణి యద్యథా భవతి తథా ప్రముదితా స్సత్య శ్శ్రమం లపంతే
సంగమయతి. అత్రేతి.

వాక్యగత స్స యథా

శ్లో. జేతు ర్వేంకటసూర్యరాయనృపతే ర్ధారాధరశ్యామలామ్
చంచత్ఖడ్గలతాం ప్రణుత్తగజకాకాలీభముక్తాఫలామ్
పశ్యంతః పరిపంథిభూవరభటా స్సంగ్రామకేళ్యుద్భటామ్
దంష్ట్రాకోటికరాళవక్త్రకుహరాం కాళీం స్మరం త్యుద్భ్రమామ్.

వ్యాఖ్యానమ్ :-

అత్ర స్మరణాలంకారేణ ఉపమా ధ్వన్యతే. వాక్యగత ముదా
హరతి జేతు రితి. జేతు ర్జిష్ణోః "జేతా జిష్ణు శ్చ జిత్వర" ఇత్యమరః.
వేంకటసూర్యరాయనృపతేః ధారాధరో జలధర ఇవ శ్యామలాం

మధురసామోదంబు మధుపాళిఁ గలంచె
సరసుల కోఁగి విరసత జనించె
నివరథ్యవితతిధావన మందత వహించె
సలిలచరస్ఫూర్తి సన్నగించెఁ
గీ. పక్షివితతి తరుచ్ఛాయఁ బవ్వళించెఁ
బ్రాణితతి నెల్ల నాతపవ్యథను నొందెఁ
నదులు గిరులును బడియలకడ వసించె
నవనిమండలి వేసవి యాక్రమించె. 5

కం. భ్రమరభ్రమసంభ్రమవి
భ్రమకరమాళీయములు సుమనఃప్రాగ్రంబుల్
ప్రమదావతంసలీలా
ప్రమదావహములు శిరీషపదములు మెఱసెన్. 6

చ. సరసిజగంధి యొక్క జలశాల జనాళికి దప్పి తీర్పఁగా
సరసుఁ దొరంగు పద్మముఖదప్పదనఁ గన్గొని యూర్ధ్వదృష్టియై
కరము వనల్చి నీరు తమకంబునఁ ద్రావఁగ నప్పులంతి యా
పురుషునిఁ జూచు ప్రేమ జలము ల్దనుధార నొసంగ నయ్యెడన్. 7

మ. జలపూరాతివిహారమున్ సుమవనీసంచారమున్ జందనా
చలసంభూతసమీరముల్ హిమలవాంభశ్చంద్రికాసారము
న్విలసత్పంజరకీరము న్గదళికావిర్భూతకర్పూరముం
దలఁపన్ భోగులకుం బ్రమోద మొసఁగెన్ ధాత్రిస్థలి న్వేసవిన్.

శా. కాంతారత్నము లయ్యెడన్ గనిరి తత్కాంతారకాంతావనీ
కాంతాక్రాంతతరంగరంగదమలాబ్జాళీమిళద్భాస్వరభా
త్యంతాకృష్టమిళిందఝాంకరణగానానందసంధాయకా
క్రాంతభ్రాంతిహరాంబుమాధ్వీకసుధాసారంబుఁ గాసారమున్. 9

సీ. కాదంబకాదంబకాదంబరుచిరంబు
ధీవరధీవరాధిష్ఠితంబు
భ్రమరవిభ్రమరవిభ్రమరవిద్యాంకంబు
గురుసత్వగురుసత్వపరివృతంబు
సారససారససారసద్వినుతంబు
చక్రాంగచక్రాంగసౌష్ఠవంబు
పానీయపానీయపానీయవిభవంబు
వనకోకవనకోకసదయుతంబు
గీ. రాజిల్లవాలకచ్ఛపరాజిలంబు
సమకరద్వంద్వవీచికాసమకరంబు
మధురకైరవనిస్సరన్మధురసంబు
సారమగు చెంచ వటికాసారవరము. 10

కం. సారసముఖు లయ్యెడఁ గా
సారముదరి విడిచి జిలుఁగుఁజలువులకోడన్
వారివిహారము సలిపిరి
వారివిహారాంగరుచులు వశమే పొగడన్. 11

కం. ఉత్పలములు మా నయనము
లుత్పలములకన్న నన్న నోహో యివిగో
మత్పదములు పంకజరుచి
మత్పదములు చూడు మనుచు మది ముద మొదవన్. 12

మ. అలులం జై కొనఁ దోలుచుం గమలపత్రాంబుచ్ఛటల్ గ్రోలుచుం
గలువ ల్గైకొన వ్రాలుచు న్సముదచక్ర శ్రేణిపైఁ దూలుచున్
జలపూరంబునఁ దేలుచుం గరుణహర్షప్రాప్తిచేఁ గ్రాలుచున్
సలిలక్రీడ యొనర్చి రిందుముఖు లుత్సాహంబుతో నయ్యెడన్. 13

సీ. కాలకో నీమీఁద వాల న న్నంటకు
మని దూరమున నీఁదులాడి యాడి
వారిక ద్గవ మూయఁ జేరియున్నలతాంగి
నామ దోయిట నీట ముంచి విడిచి
పిల్వఁ బిల్వఁగ రాని పిల్లఁగ్రోల్వలఁ బూని
విసరి దగ్గఱఁ జేర వెఱచి నిలిచి
కరపద్మకలితకంకణఝుణంఝుణలచేఁ
గలహంసములతోడఁ గల నొవరిచి
గీ. చండకరకాండఖండితపుండరీక
తండములఁ దెండు చెండాడి గండుమీలఁ
గేల గీలించి తేలించి నీల ముంచి
నెలఁత యంభోవిహారంబు సలిపె గెలమి. 14

ఉ. లీల జలంబులం బ్రతిఫలించి కనుంగొన నొప్పుచున్న యా
లోలకనీనికాళులవిలోచనము ల్గని బాల తూర్పు మ
త్తాళిసమేతకైరవము లంచుఁ గలంచిన నోర్కు ప్రోడ మే
ల్మేలని నవ్వెఁ జూపరులు మెచ్చ వినోదము గాఁగ నత్తఱిన్.
కం. శ్రీలలితశ్రుతిసీమలఁ
గ్రాలెడుకనుదోయిసిడఁ గని వేఁటకపి
లాలికచ దలఁచె పీనుల
నీలోత్పలయుగళి దగిలె నిజముగ ననుచున్. 16

మ. తనుసంసిక్తసితాంశుకాన్వితులతో ధారాళవార్యాహమో
మానలీలాలకజాలకాస్యములతో నంసద్వయాప్రాంతకం
పనిగూఢోరుపయోధరద్వయములతోఁ బ్రవ్యక్తరూపాంగులై
తనుమధ్యల్ పయి కెక్కె యూషరసిచెంత న్నిల్చి మోదంబునన్.

కం. గడగడ నడుములు వడఁకఁగఁ
తడిపావడ లొడల నంటఁ దిరుగఁబలు నెఱికె
ల్దడఁబడఁగఁ గడఁకఁ బసపు
మెఱుఁగులఁ దడిఁ దుడుచుకొనుచు మహిళోత్సుకులై. 18

మ. పులకాంకూరము లుద్భవింపఁగ నవాంభోజాతపత్రేక్షణల్
వలిపంబు ల్సవరించి పాపట్లను జేవ నేర్మిఁ గైసేసి శ్రీ
తిలకం గస్తురినామముల్ నొసల నేపే ల్సయఁగా దిద్ది కెం
దలిరుం గైదువుకోదుఁ గొల్చుటకు నుద్యత్ప్రీతి సంధిల్లఁగన్. 19

ఉ. పొన్నలనీడఁ బోరనునఁ బోదియు చెంగట మావిచేరువన్
గ్రొన్నవకల్మిఁ జెన్నలరు గొజ్జఁగిపూఁబొదరిల్లు చేరి యా
కన్నెలు కమ్మదమ్మిరలు ఘుర్మగణంబులు గ్రోలుచుండ సం
పన్నలినేశనాత్మజప్రభావము భావమునం దలంచుచున్. 20

సీ. సిరిగన్నసురపొన్నవిరులఁ దిన్నెఁ జేసి
జగతి గొజ్జఁగినీరు చల్లి యలికి
రంగుగాఁ బుప్పొడి రంగవల్లి ఘటించి
కలువపూసింగంపుగద్దె నిలిపి
కనకంబుచే మరుఁ గావించి యందుంచి
వనదేవి నభిషేచనం బొనర్చి
నానావిధప్రసూనంబులఁ బూజించి
భ్రమరాళి ధూపధూమముగఁ జొనిపి
గీ. కిసలయంబుల దీపము ల్వెస నొనర్చి
పరిపచేళిమవిపలత్ఫలరసంబు
భావభవునకుఁ బ్రీతి నర్పణము చేసి
ముందఱ వసించి మ్రొక్కుచు ముగ్ధ లపుడు. 21

వ. ఇట్లు నుతు లొనర్చి రంత. 22

గీ. వందనము మార యిందిరావరకుమార
దండము మనోజ పద్మగంధవసుతేజ
శరణు భవమార శంబరాసురవిదార
వతి యనర్ఘ్యయ రతిపతీధృతిసహాయ. 23

గీ. ఆత్మభవుఁడ వజుఁడ వసమాంబకుఁడ వీవు
గాన నిన్నుఁ గొల్వఁగలిగె మాకు
మాఁగుము త్రిలోకమూర్తి యహో సప్పరం
జ్యోతిహృదయసరసిఁ జూచుమహిమ. 24

కం. అని యారతి వ్యాగిలో
చన లనుపమవాక్ప్రసూనజాలంబులచే
మనసిజు నగ్గించుచు న
గ్గిన యానందాంబురాశిఁ దేలిరి కడఁకన్. 25

మ. యువతీవారము చేరి కొల్వఁగ మహోద్యోగంబుతో పట్లు వా
పవదక్త్రాలలనావతంసము ప్రియేచ్ఛ పన్నార్థారాధనో
త్సవము ల్సేయఁగఁ జూచి తజ్జనిఁ బుత్సాహంబుతోఁ బెండ్లి నై
భవ మిక్కన్య కొసర్తు నే నని దృఢప్రారంభుఁ డయ్యె న్మదిన్.

వ. అంత. 27

గీ. చెలువు మీఱంగ శృంగారశేఖరుండు
నపుడు వాసవదత్తాస్వయంవరమున
కవనిఁ గల రాజులను బిల్వ ననిచి కుసుమ
పురముఁ గ్రొసేయవలె నవఁ బురమునందు. 28

ఉ. కట్టిరి మేలుకట్లుఁ గటికెంబములున్ జలపూర్ణకుంభము
లట్టము చేసి ద్వారములఁ దావిరి గోడలఁ బొలసున్నము
బెట్టిరి మట్టుమీఱఁ బురవీథులఁ బౌరులు సంభ్రమంబుతోఁ
బట్టపురాణికట్టి శుభవాచాఁగూడ నటంచు వేడుకన్. 29

సీ. కస్తూరితోఁ గూర్చి కలయంపి చల్లిరి
హిమవారి వజ్రకుట్టిమములందుఁ
తెలఁగి జవ్వాదిచే వలికి ముత్తెపుముగ్గు
లిడిరి మేలిమిచాయగడపలందు
మణితోరణము లభ్రమణితోరణము సేయఁ
గట్టిరి శృంగాటకములయందుఁ
దలపురందరధనుర్ధామధ్వజంబులు
నిలిపిరి రాజమందిరములందు
గీ. భుగభుగాయితఘారఘనస్ఫురితవిలస
దగరుధూపంబు లలరంద నెగడఁజేసి
రమలమణిహారస్రగ్వాతాయనములయందుఁ
బ్రభువరాజ్ఞానుమతిచేతఁ బౌరు లంత. 30

కం. హయ కుంజర రథ యుతులై
రయమునఁ జనుదెంచి రఖిలరాజకుమారుల్
ప్రియమున వాసవదత్తా
స్వయంవరమహోత్సవంబు సాగినమొదల్గ. 31

సీ. ఆంధ్ర ఘూర్జర కరూశ శాంగ వంగ వరాట
కోసల కుంతల క్షోణిపతులుఁ
కురు విదర్భ కళింగ కొంకణ టెంకణ
మగధ బర్బర లాట మనుజపతులు
సౌరాష్ట్ర మాళవ శక సింధు నేపాళ
కేరళ కర్ణాట భూరమణులు
సౌవీర మత్స్య పాంచాల ద్రవిడ మద్ర
కేకయ చోళ ధాత్రీకళత్రు

గీ. లలితబలయుతులై చమూపతులు గొలువఁ
ప్రాభవము మీఱఁ గుసుమపురంబుఁ జేర
చలితరయంబునఁ జనుదేర నపుడు ప్రేమ
చెంగలించంగ శృంగారశేఖరుండు. 32

సీ. తురగరింఖాసముద్ధూతధాత్రీపరా
గములు పురంబెల్లఁ గప్పికొనఁగ
గిరిశృంగనిభమదద్విరదబృంహితములు
ఘనఘనస్వనములకరణిఁ దనర
వీరకాహళశంఖభేరికారావము
లుబ్బనభోవీథుల బోరుకలఁగఁ
కింకిణీటంకారసంకులధ్వజయుత
స్యందనంబులు జనానంద మొసఁగ

గీ. నెదురుగాఁ జని మది ముద మొదవ నృపులఁ
దనమహాగారమునకుఁ దెచ్చి కనకమంచ
సంస్థితులఁ జేసి యత్యంతసంభ్రమమునఁ
బరిజనంబులు గొలువ వైభవము మీఱ. 33

మ. కొలువై యిట్లు నృపాలశేఖరుఁడు కోర్కుల్ మీఱ ధాత్రీజనం
బులతో సైనికముఖ్యవారలును సమ్మోదంబుతో మేదలో
వెలికిం బోయి తదాజ్ఞఁ జెల్లుటయుఁ దత్ప్రాసాదమార్గంబునం
గలకంఠీమణిరాశి తేలపడె బంగారందియల్ మ్రోయుటన్. 34

కం. జనయిత్రి తనను నృపనం
దనులవిధం బెఱుకపఱుపఁ దగు నౌశప్రౌఢాం
గనఁ జేరఁ గళావతి యనఁ
జనుదానిం బనుచుటయును సంరంభమునన్. 35

సీ. చనుదోయిభర మానఁజాలనిదంటాన
          గడగడ వడఁకెడుకౌను వడఁక
రాకానిశాకరశ్రీకరాస్యంబున
          దరహాసచంద్రికాస్ఫురణ మెఱయ
మరుచేత నారజాలు కిరుసుకత్తి యనంగ
          జంఘాలమై కీలుజడ నటింప
గురునితంబద్వయీభరమనోహరయాన
          మునకు నోడి మదేభములు దలంకఁ

గీ. పదయుగంబున జాళువాపావ లమర
మదనమంజరి మొదలైన సుదతులెల్లఁ
బసిఁడిబెత్తలచే బరాబరులు సేయఁ
దనజనకునాజ్ఞ వాసవదత్త వచ్చె. 86

ఉ. వచ్చి పసిండిమేడ వెలివాకిటఁ గాంచనమంచపీఠిపై
వచ్చిగు రాజుఁబోఁడి సకియల్ ధరియింపఁగ నుండఁ జూచి తా
రచ్చెరువంది రాకొమరు లాచెలువం బనిమేషదృష్టులై
యుత్సరభావ మొప్పఁగఁ బ్రియంబునఁ జూచుచునుండి రయ్యెడన్.

సీ. మదనకృపాణి యీవాసినీమణివేణి
          మారుసింగిణి లివిఁటారిబొమలు
భావజతూపు లీపద్మాక్షిచూపులు
          రతిపతికీర్తి యీయతివనవ్వు
వెడవిల్తుముకుర మీవిరిబోఁడిచెక్కులు
          వలరాజుశంఖ మీబాలికగళము
కాముదుర్గంబు లీకలకంఠికుచములు
          మరునిరథాంగ మీమగువపిఱుఁదు

ఆంధ్రసాహిత్యపరిషత్తు.

అధ్యక్షులు

విమర్శకాగ్రేసర, ఐతిహాసిక సమ్రాట్

శ్రీ బండారు తమ్మయ్య

ప్రధాన కార్యదర్శి, కోశాధికారి

[illegible]

శ్రీ దంటు భాస్కరరావు

సహాయ కార్యదర్శి

శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి

కార్యనిర్వాహకవర్గ సభ్యులు

1. శ్రీ కోరా శివనాథశాస్త్రి
2. శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రి (బాలవ్యాస)
3. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి
   (వ్యాకరణ విద్యాప్రవీణ, భాషాప్రవీణ)
4. శ్రీ శాకరపత్తి కృష్ణశాస్త్రి (కవిమూర్ధన్య, బోధకవిచంద్ర)
5. శ్రీ కుందూరి ఈశ్వరదత్తు
6. శ్రీ జయంతి బుచ్చిరామశర్మ
7. డాక్టరు శ్రీ ఇవటూరి జోగారావు (యం. బి. బి. యస్.,)
8. శ్రీ చిరుకోలు కోటేశ్వరరావు
9. శ్రీ దామెర రాజగోపాలరావు, బి. ఏ.
10. శ్రీ వేదుల రామచంద్రకీర్తి, ఎమ్. ఏ. (ఆనర్సు)
11. శ్రీ ఓలేటి సుబ్బరాయశాస్త్రి (ఉభయభాషాప్రవీణ)
12. శ్రీ గావలి శ్రీరామమూర్తి, బి. ఎ. బి. ఎల్.

పత్రికా సంపాదకుడు

శ్రీ కుందూరి ఈశ్వరదత్తు

ఆంధ్ర సాహిత్య పరిషత్ప్రచురణములు

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

5వ సంపుటము	రు. 15—00
6వ సంపుటము	15—00
7వ సంపుటము	15—00

1—4 సంపుటములు పునర్ముద్రణములు గావింపబడనున్నవి.

ప్రతియొక్కటికి వెల రు 15 లు

కవిజనాశ్రయము

వేములవాడ భీమకవి విరచితము.

పెక్కు పాఠభేదములతోఁ గూడిన వెనుకటి విషయ మంతయుఁ గలిగి తిరిగి తృతీయముద్రణ పీఠికతో ముద్రితమైనది వెల రు 1—50.

మాధ్యమిక కారికలు

బౌద్ధాచార్య నాగార్జున ప్రణీతము. కొల్లూరు సోమశేఖర శాస్త్రి విరచిత సుబోధినీవ్యాఖ్యాసహితము మూల్యము రు. 2—50

ఆంధ్రసాహిత్యపరిషత్తు,

కాకినాడ.

Printed by J. Gopalam, B.A. L.T., at Republic Pess, Kakinada.

Edited by **K. ISWARADUTT**

Published by Andhra Sahitya Parishat, Kakinada.